అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

ARUNATARA

సంపుటి: 44 సంచిక: 6 , హైదరాబాద్ 326 జూలై, 2016 పేజీలు: 68 వెల: రు. 20



"కొన్ని రాత్రులలా ఆలోచిస్తూ ఉంటాను
నేను నా మృత్యువును ఎలా కలుస్తానా అని
అప్పుడు నాకు గుర్తొస్తుంది
నేనొక కశ్మీరీనని
మృత్యువు నావద్దకు బుల్లెట్ రూపంలో వస్తుందని

-ఫరా బషీర్

3 జూలై 2016న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విరసం ఆవిర్భావ దినం సందర్భంగా జరిగిన సభ దృశ్యాలు





జులై 4న నెల్లూరులో విరసం 46వ ఆవిర్భావ దినం సందర్భంగా జరిగిన సభ దృశ్యాలు

జూన్ 19న గుంటూరులో జరిగిన ఆలూరి భుజంగరావు 3వ వర్ధంతి సభ దృశ్యాలు



KLVA101M189

అరుణతార
సాహిత్యసాంస్కృతిక మాసపత్రిక

326

సంపుటి : 44 ◆ సంచిక : 6 ◆ జూలై, 2016 వెల : రు. 20/-

విరసం

ఎడిటర్
దువ్వూరి వెంకట రామక్రిష్ణారావు

రచనలు, విరాళాలు
పంపించాల్సిన చిరునామ:
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి,
హైదరాబాద్ - 500 040.

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు

కార్యాలయం:
12-15-963, మాణికేశ్వరినగర్,
ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, తార్నాకా,
హైదరాబాద్-500007.

సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.

డి. టి. పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి, డి. వైజయంతి

కవర్ డిజైన్ : పి. వరలక్ష్మి,
ఆర్. భాగ్యలక్ష్మి

ఫొటోలు : క్రాంతి, కె. బాల్‌రెడ్డి,
విరసం మిత్రులు

Like Page://viplava rachayitala
sangham arunatara

facebook ://viplava rachayitala
sangham virasam

Virasam website :
www.virasam.org,
www.virasam.in
www.arunatara.in

సంపాదక లేఖ..

గత ఏడాది డిసెంబర్‌కు దండకారణ్య క్రాంతికారీ జనతన సర్కార్ ఏర్పడి పదేళ్లు. అంతక ముందున్న గ్రామ రాజ్య కమిటీలు వర్గపోరాట అభివృద్ధి క్రమంలో క్రాంతికారీ జన సర్కార్లుగా అభివృద్ధి చెందాయి. దండకారణ్య నైసర్గిక పరిస్థితులకు అనుగుణంగా, ప్రజాస్వామ్యానికి అసలైన అర్థంలో ఈ ప్రజా ప్రభుత్వం నడుస్తున్నది. ప్రజల క్రియాశీల, చైతన్యవంతమైన భాగస్వామ్యంతో, వాళ్ల దైనందిన జీవిత అవసరాలు తీర్చే విప్లవకర అభివృద్ధి నమూనాతో కొనసాగుతున్నది. ప్రజలకు సరైన భావాలు పరిచయం చేస్తే అవి ఎలాంటి భౌతికశక్తిగా మారుతాయో దండకారణ్యమే గొప్ప ఉదాహరణ. ప్రాచీన జీవన మూలాలున్న ఆదివాసులు మావోయిస్టు రాజకీయ ఆచరణలోకి వచ్చే క్రమంలో ప్రగతిశీలమైన నూతన వ్యవస్థను నిర్మిస్తున్నారు. అంధ విశ్వాసాలను మెల్లమెల్లగా వదులుకుంటూ శాస్త్రీయ చింతనను అలవర్చుకుంటున్నారు. వ్యవసాయంలో నూతన పోకడలు అనుసరిస్తూ ఉత్పత్తిని పెంచుతున్నారు. నూతన సంస్థలను నిర్మించుకొని నిర్వహించుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. ఇదంతా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి నిదర్శనం. కేవలం అంత మాత్రమే కాదు. ఉత్పత్తి సంబంధాల్లో మార్పు దిశగా సాగుతున్నారు. పాత సాంఘిక బంధనాల విముక్తి కోసం పెనుగులాడుతున్నారు. వాటి నుంచి బయటికి వస్తూ అభివృద్ధికరమైన సామాజిక, సాంస్కృతిక సంబంధాల కోసం కృషి చేస్తున్నారు.

ఇదంతా ఇంకుడు గుంతలు తవ్వుకోవడం లాంటిది కాదు. స్వచ్ఛ భారత్ పేరుతో వీధులు శుభ్రం చేయడం కాదు. చెరువుల్లో పూడిక తీసే మిషన్ కాకతీయతో అవినీతికి అలుగు కట్టడం కాదు. స్మార్ట్ సిటీల పేరుతో మురికివాడలు పెంచడం కానే కాదు. అన్నిటికీ మించి ప్రజలను ఓటర్లుగా, లబ్దిదారులుగా, మార్కెట్లో వినియోగదారుగా మార్చడం అసలే కాదు. చరిత్ర రంగస్థలం మీదికి వచ్చిన అత్యద్భుత ప్రజాస్వామ్య భావనను, దాని ప్రక్రియలను, వాటి అసలైన అర్థాన్ని పెట్టుబడి, సామ్రాజ్యవాదం నాశనం చేశాక వర్గపోరాటం ద్వారానే విప్లవ ప్రజాస్వామ్యం సాధ్యమని నిరూపిస్తున్న అరుదైన ఉదాహరణ. ఎన్నికల సమయాల్లో, చట్టసభల్లో నిత్యం పార్లమెంటరీ పార్టీల మధ్య అభివృద్ధి ఒక వివాదాస్పద అంశంగా మారిపోయింది. అధికారంలోకి రావడానికి ఒక్కో పాలక పార్టీ ఒక్కో అభివృద్ధి కార్యక్రమాన్ని ముందుకు తెస్తోంది. రూపంలో, సారంలో కూడా అవన్నీ బూర్జువా అభివృద్ధి విధానంలో భాగమే. వాటి మధ్య ఏ కొంచెం తేడా లేదు. విప్లవం ద్వారా అసలైన ప్రజాధికారాన్ని సాధించే మావోయిస్టు ఉద్యమంలోనే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఉన్నదని నిరూపించడమే దండకారణ్య విశిష్టత. ఉత్పత్తి వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొని వస్తున్న ప్రజలు దానికి అనుగుణమైన పాలనా వ్యవస్థను కూడా నిర్మించుకుంటున్నారు. అదే క్రాంతికారీ జనతన సర్కార్. అది ప్రాథమిక దశలో ఉన్న ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య రాజ్యం.

ప్రత్యామ్నాయం ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రజాయుద్ధం ద్వారానే సాధ్యం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రతి ఐదేళ్లకోసారి ప్రత్యామ్నాయాల చర్చ జరుగుతుంటుంది. అధికారంలో లేని పార్టీలు నిత్యమూ తామే ప్రత్యామ్నాయమని చెప్పుకుంటుంటాయి. ముప్పై అయిదేళ్ల పోరాట చరిత్ర ఉన్న దండకారణ్యంలో కనీసం గత పదేళ్లలో జనతన సర్కార్ సాధించిన వికాసాన్ని, మిగతా దేశంలో అన్ని బూర్జువా పార్టీలు సాధిస్తున్న 'అభివృద్ధి'ని ఎవరైనా నిష్పాక్షికంగా అధ్యయనం చేస్తే ప్రత్యామ్నాయమంటే ఏమిటో తప్పక తెలుస్తుంది. అంతే కాదు.. విప్లవ యుద్ధంలోనే ప్రత్యామ్నాయం ఉన్నదని కూడా బోధపడుతుంది. శ్రామిక ప్రజలు బూర్జువా రాజ్యంలోకి వెళ్లడం కాదు, దాన్ని ధ్వంసం చేసి తమదైన కొత్త రాజ్యాన్ని

(మిగతా 9వ పేజీలో...)

3

అరుణతార నిర్వహణ, శాశ్వత నిధుల కోసం మా ప్రకటన చూసి-వై.వి. రమణారావు-ఖమ్మం, రూ.5,000/-, ప్రాణహిత-ఆదిలాబాద్ రూ.5,000/-, ఎ.గోపాలరావు-టివి నటులు-హైదరాబాదు, రూ.1,000/-, వివిన మూర్తి-బెంగళూరు, రూ.10,000/-, డి.నర్సింహ్మారెడ్డి-హైదరాబాద్, రూ.5,000/-, ఇమామ్-అనంతపురం, రూ.1,000/-, ఎం.గంగాధర్-హనుమకొండ, రూ.5,000/-, కె.సి. వెంకటేశ్వర్లు-మహబూబ్‌నగర్, రూ.8,000/-, పి.విష్ణు-హైదరాబాదు, రూ.5,000/-, వి.వి.వేగేశ్వరరావు, పంట-నిజామాబాద్, రూ.10,000/-, వై.రాఘవేందరరావు-హైదరాబాదు, రూ.3,000/-, వి.గోపిచంద్-హైదరాబాద్, రూ.5,000/-, జయంతు బాబూరావు-చినతాండ్రపాడు, రూ.5,000/-, ఎం.లలితకుమారి-విజయవాడ, రూ.5,000/-, హర్షఠాకూర్-ముంబాయి, రూ.15,000/-, అమేయ-భువనగిరి, రూ.5,000/- విరాళంగా ఇచ్చారు. వారికి ఉద్యమాభినందనలు. - సం.

సంపాదకీయాలు (5-6)

పాట అంజయ్య - **పాణి**

దుఃఖమూ నేరమైన చోట - **పి.వరలక్ష్మి**

కవిత్వం (7-9)

అది ఊహా చిత్రం గాదు - **ఉదయమిత్ర**

నేను కూడా - **ఇబ్రహీం ముచ్చెర్ల**

జీవో 69 - **మహమూద్**

నిప్పులు చిమ్ముతూనే ఉంటాం - **రమేష్ గోండ్యాల**

కథలు (10-20)

నూతన మానవుడు - **షహీదా**

పడమట ఉదయించే సూర్యుడు - **వి. శాంతి ప్రబోధ**

పుస్తక సమీక్ష (21)

కరుణ కథ - **మాతంగి**

వ్యాసాలు (22-31)

విద్యార్థి ఉద్యమాలు (1966-75) - **వరవరరావు**

ఆ రోజులు... తెలంగాణాలో వీచిన కొత్త గాలి.... కొన్ని జ్ఞాపకాలు - **తుషార్‌కాంత్**

చలసాని చెప్పిన పాఠం (32-36)

తెలుగు కవిత్వం ఎప్పుడూ పురిటి నొప్పులు పడుతూనే ఉంది

నివేదిక (36)

విరసం ఆవిర్భావ దినం సందర్భంగా జూలై 4న నెల్లూరులో సభ

నివాళి (37)

అమరజీవి - **అడుసుమిల్లి కమల**

పుస్తక సమీక్ష (38)

చదవాల్సిన నవల నల్లమల - **కృష్ణాబాయి**

సాహిత్య వ్యాసం (39-48)

వరవరరావు కవిత్వంలో అభివ్యక్తి, వస్తు వైవిధ్యం - **బివిఎస్ రాములు**

వ్యాసాలు (48-57)

రాబోయే చారిత్రిక సందర్భాలను ఇలా చూద్దాం - **పాణి**

బ్రెగ్జిట్‌తో తీవ్రం కానున్న ఈయూ సంక్షోభం - **ఎ. నర్సింహా రెడ్డి**

కృష్ణా జల వివాదంలో న్యాయానికి చోటు లేదా? - **పాణి**

వ్యాసం (58-60)

రోహిత్ ఆశయ సాధనకు ఏం చేయాలి? డా.జిలుకర శ్రీనివాస్ వ్యాసానికి జవాబు

సీరియల్ (61-63)

మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం - 10 - ఫ్రాన్సిస్ వీన్, అనువాదం : **ముక్తవరం పార్థసారథి**

మా వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణల సూచి (64-66)

గమనిక : మిత్రులారా, కామ్రేడ్స్! అరుణతార డిటిపి, డిజైనింగ్, ప్రింటింగ్, పోస్టింగ్, రవాణా ఇలా అన్ని ఖర్చులు చాలా పెరిగిపోయాయి. అనివార్య పరిస్థితులలో విడి ప్రతి వెలను ఫిబ్రవరి 2016 సంచిక నుంచి రూ. 20 కు పెంచవలసి వచ్చింది. ఇది గమనించగలరు. ఎప్పటిలానే మీ ఆదరాభిమానాలను, సహకారాన్ని ఆశిస్తున్నాం. అలాగే ఫిబ్రవరి 2016 సంచిక నుంచి అరుణతార సంచికల క్రమాన్ని సంపుటి 44 గాను సంచిక 1 గాను సరిచేసాం. ఈ విషయాన్ని గమనించగలరు. - సం.

అరుణతార చదవండి!	విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
చదివించండి!	రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
చందాదారులు కండి!	ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

అరుణతార చందాదారులకు విజ్ఞప్తి!

ఏ కారణం చేతనైనా మీకు అరుణతార అందకపోతే పిన్‌కోడ్‌తో సహా మీ చిరునామాను మరోసారి **8500809250** మొబైల్ నంబర్‌కు మెసేజ్ పెట్టగలరు. గమనిక : ఈ నెంబర్ కేవలం మెసేజ్‌ల కొరకు మాత్రమే! - సం.

పాట అంజయ్య

పాణి

గూడ అంజయ్య తెలంగాణ ప్రజా వాగ్గేయ సంప్రదాయంలో సదా గుర్తుండిపోతారు. ఆయన పాటలు తెలంగాణ నిర్దిష్ట సామాజిక స్థితి నుంచి పెల్లుబికాయి. ఆ స్థితిలో చలనం తేవడానికి సాగిన ప్రజా పోరాటాల్లోంచి ఆయన పాటలు ఊటలూరాయి. అందువల్లే తెలంగాణలో సాగిన ప్రజా పోరాటాల నేపథ్యంలో ఆయన పాటల విశ్లేషణ రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ అవుతుంది.

పోరాటం నుంచి పాట పుట్టి తిరిగి పోరాటాన్ని రగిల్చే కొలిమిగా మారడం, అందులోని నిప్పురవ్వలు నేలంతా ఎగజిమ్మడం అనే అద్భుతంలో తెలంగాణ కళాకారులెందరో భాగం. అందులో కళాకారులుగా వాళ్ల ప్రతిభ ఉన్నది. దాన్ని పదునెక్కించిన ప్రజా సంచలనాల పాత్ర ఉన్నది. ఈ రెంటి సమ్మేళనం గూడ అంజయ్య. అందుకే ఆయన పాటల్లో అంతటి శక్తి ఉంటుంది. భూస్వామ్య సమాజంలోని దుర్మార్గాల గురించిన ఆలోచన, ఆచరణ రెంటినీ అందించే పాటలు ఎన్నో ఆయన రాశారు. అవి తెలంగాణ మాత్రమే పలికే పాటలు.

విప్లవ ప్రజా సాంస్కృతిక రంగానికి అవసరమైన నుడికారాన్ని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే సెట్ చేసింది. అక్కడి నుంచి ఒక విప్లవాత్మకమైన అద్భుత కొనసాగింపునకు దారులు వేసిన వారిలో అంజయ్య ఒకరు. కళా సాహిత్యాలకు, సమాజానికి... దాన్ని మార్చే ప్రజా పోరాటాలకు ఎలాంటి సంబంధం ఉంటుందో విప్పి చెప్పగల సజీవ ఉదాహరణల్లాంటి పాటలు ఆయన రాశారు. తెలంగాణ తరహా భూస్వామ్యం ఉన్న ప్రతి నేలలో ఎల్లవేళలా పాడుకొని పోరాడదగిన పాట ఊరు మనదిరా.. వాడమనదిరా. ఆయన పాటలు భూస్వామ్య సమాజంలోని దోపిడీ పీడనల పలు రూపాలను శక్తివంతంగా చిత్రించాయి. పీడిత ప్రజలకు పోరాట ఉత్తేజాన్నిచ్చాయి. అందువల్ల భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాల చరిత్రకు సాక్ష్యంగా నిలబడతాయి. వీటన్నిటిలోకి ఊరు మనదిరా.. వాడ మనదిరా అనే పాట అంజయ్యకు మకుటాయమానం. సకల ఉత్పత్తి సాధనాలకు దూరమై వెట్టి చాకిరీతో, తరతరాల సాంఘిక సంబంధాల ద్వారా దోపిడీకి గురయ్యే భూస్వామ్య సమాజంలోని పాట అది.

కట్టుబాట్లు, ఆచారాలనే మాధ్యమంలో శ్రమను దోచుకునే భూస్వామ్యం ప్రజలను తన ఆధిపత్యం కింద లోబరుచుకొనే భావజాలాన్ని కూడా ఉత్పత్తి చేస్తూ ఉంటుంది. ఉత్పత్తి సాధనాలపై అగ్రకుల భూస్వాములకు పెత్తనం ఎలా వచ్చింది? అది అలాగే ఎందుకు కొనసాగాలి? అనే ప్రశ్నలే భూస్వామ్యంలో తలెత్తవు. దానికి వ్యతిరేకంగా తెలంగాణలో శక్తివంతమైన సాంస్కృతిక ఉద్యమం నడిచింది. ఏక కాలంలో అది రాజకీయ ఉద్యమమూ, సాంస్కృతిక ఉద్యమమూ. అందువల్ల ఒక ఆలోచన, ఆందులో ఒక ప్రశ్న, దానికి సమాధానంగా పోరాటంగా మన దగ్గర ఫ్యూడల్ వ్యతిరేక విప్లవాలు సాగాయి.

అందుకే ఊరు మనది, వాడ మనది అనడంలో సంపద మీద భూస్వామ్యంలోని సంప్రదాయక అధికారంపై తిరుగులేని ప్రశ్న ఉన్నది. ఊరు మీద, వాడ మీద ప్రజాధికారాన్ని చాటుకోవడమూ ఉన్నది.

ఇన్నేళ్ల తర్వాత గూడ అంజయ్య రాసిన ఆ పాట మరోసారి వింటే ఇలా ఎంతో వైవిధ్యభరితమైన విశ్లేషణ ఇవ్వవచ్చు. ప్రజా వాగ్గేయ సంప్రదాయంలో గొప్ప సాహిత్య కళా విలువలతోసహా విప్లవోద్యమ ఆచరణకు ప్రజలను పురికొల్పే శక్తిని ఈ పాట సంతరించుకుంది. ఎందుకంటే తెలంగాణ వంటి సమాజాల్లో ఇలాంటి పాట పాడుకోవడమే ధిక్కార ఆచరణ. అంతే కాదు.. ఈ పాటలో ప్రజాధికార భావన ఉన్నందు వల్లే కావచ్చు... ఇప్పటికీ ఆ పాట సమకాలీనమనిపిస్తుంది. ఆనాటి పల్లెసీమల్లో ఎన్నో మార్పులు జరిగినా.. మౌలికంగా ప్రజల చేతిలోకి అధికారం రాలేదు. దోపిడీ తీరలేదు. రూపాలు మారిపోయి ఉండవచ్చు. ఇలాంటి ఎన్ని ప్రత్యేకతలు ఉన్నా ఈ పాట ఇప్పటికీ ఉద్వేగ గీతంగా మారుమోగుతూనే ఉంటుంది. కేవలం ఒక ఉద్యమ పాటగానే కాక సుదీర్ఘ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో ముడిపడి ఆ చరిత్ర కంఠస్వరంలో ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. భూస్వామ్య రాజకీయార్థిక, సాంఘిక వ్యవస్థల విశ్లేషణకు సాంస్కృతిక సాధనంగా పనికి వచ్చే పాటగా ఇది ఎల్లకాలాలకు నిలిచి ఉంటుంది.

ఇలాంటి పాటలెన్నో రాసిన అంజయ్య కొన్ని కథలు, ఒక నవల కూడా రాశారు. బహుశా తెలంగాణ సమాజంలో వస్తున్న మార్పులను చిత్రించడానికి వచన ప్రక్రియల అవసరాన్ని ఆయన గుర్తించినట్లుంది. పాట కంటే భిన్నమైన సాహిత్య ప్రయోజనం నెరవేర్చగల ప్రక్రియల్లోనూ కృషి చేశారు. అయితే చివరి వరకు పాట రాస్తూనే వచ్చారు. పాట ఆయన జీవన అస్తిత్వం. పాట ఆయన పేరుకు పర్యాయపదం.

దుఃఖమూ నేరమైన చోట

పి.వరలక్ష్మి

ఒక చావును దేశం వేడుక చేసుకుంటుంది. అటు వైపు ఒక దుఃఖిత సమూహం శవయాత్రకు పోటెత్తుతుంది. దశాబ్దాలుగా అది నిషిద్ధ దుఃఖం. వాళ్ళ దుఃఖానికి సంఘీభావం నేరం. అవును, మాట్లాడుతున్నది కశ్మీర్ గురించే. మాట్లాడుకోడానికి సందర్భాన్నిచ్చిన బుర్హాన్ గురించే మొదట మాట్లాడుకోవాలి. ఈలోగా 42 మంది నిరాయుధులను కాల్చి చంపుతుంది సైన్యం. నిరసనకారుల మీద పెల్లెట్ల వర్షం కురుస్తుంది. చంపకుండానే శరీరాన్ని జల్లెడ చేసే ఆయుధాలు ప్రయోగిస్తున్నారక్కడ. వంద మంది చూపు కోల్పోయి, వెయ్యి మందికి పైగా తీవ్రంగా గాయాలపాలై ఆసుపత్రులు నిండుతుంటాయి. అంబులెన్స్‌ల మీద, ఆసుపత్రుల మీదా సైన్యం దాడులు చేస్తుంది. ఇరాక్, పాలస్తీనా కోసం కవిత్వం రాసిన వాళ్ళు ఏమైపోయారు? అది సరే.. ఇదంతా రిపోర్ట్ చేస్తున్న దిన పత్రికల మీద, ప్రింటింగ్ ప్రెస్సుల మీద అర్ధరాత్రి దాడి జరుగుతుంది. పాత్రికేయులను అరెస్టులు చేస్తారు. అంతకు ముందుగానే ఇంటర్నెట్ బందై ఉంటుంది. ఫోన్లు పనిచేయకుండా చేస్తారు. భావప్రకటనా స్వేచ్ఛ గురించి ఎవరు మాట్లాడతారు?

స్వయంగా కశ్మీరీ అయిన జె.ఎన్.యూ విద్యార్థి ఉమర్ ఖలీద్ ను తమకు బుర్హాన్ అంటే ఏమిటో చెప్పినందుకు వెంటనే అరెస్టు చేయాలని సంఘపరివార్ హుంకరిస్తుంది. అసలు కశ్మీరీలకు బుర్హాన్ ఏమిటో మనకు ఎప్పటికైనా అర్థమవుతుందా? అతని ఆజాదీ, అది కూడా పాకిస్తాన్ అనుకూల ఆజాదీ భావనతో సహా మన దేశభక్తి అహం అడ్డం పడకుండా మనకు బుర్హాన్ అర్థం అవుతాడా?

పదహారేళ్ళ ప్రాయంలో తుపాకిని ముద్దాడి, ఇరవై రెండో ఏడు చావును కౌగిలించుకున్నాడతడు. అతన్ని ఇండియా తీవ్రవాది అని కాక ఇంకేమంటుంది గాని, కశ్మీర్ లోయ మాత్రం అతన్ని పోరాటయోధుడంటుంది. షహీద్ అంటుంది. అతనే కాదు, భారత ప్రభుత్వం చంపిన ప్రతి ఒక్క కశ్మీరీ 'తీవ్రవాది' అక్కడి ప్రజలకు హీరోయే. బుర్హాన్ వాని కశ్మీరీలకు హీరో ఎందుకయ్యాడని భారతదేశ మీడియా విచిత్రమైన ప్రశ్న వేస్తుంది. అతని తండ్రి అంటాడు, 'నిష్కారణంగా దావనపోయే వాడ్ని పట్టుకొని మిలిటరీ వాళ్ళు కొట్టారు, ఆత్మగౌరవంగలవాడు, ఆవేశపరుడు' అని. మిలిటరీ చేతిలో కశ్మీర్‌కు చెందిన ప్రతి ఒక్కరికీ ఇటువంటి అనుభవాలున్నాయి. నిజానికి ఇది చాలా చిన్న విషయం. అసలు విషయం భారత పాలకవర్గం చేతిలో బందీ అయిన కశ్మీర్, దాని ఆజాదీ. దురాక్రమణకు, వంచనకు, హింసకు లొంగని ఆజాదీ ఆకాంక్ష. వేలాది ప్రాణాలు తీసినా, సామూహిక అత్యాచారాలు చేసినా, మనిషి మనిషికో తుపాకి గురిపెట్టినా అణచిపెట్టలేని ఆజాదీ భావన. ఒట్టి రాళ్ళతోనే తుపాకులను ఎదిరించే తెగింపు. ఆరేళ్ళ క్రితం నిరసన ప్రదర్శనల్లో సైన్యం మీదికి రాళ్ళు విసురుతూ తూటాలకు ఒరిగిన రెండు వందల మంది యువకులు గుర్తొస్తారు. కొద్ది నెలల క్రితం సైన్యం లైంగికంగా వేధించిన బాలిక కోసం వీధుల్లోకొచ్చి చచ్చిపోయిన వాళ్ళు, ఊరికే దారిన పోతే గుళ్ళకు ఒరిగిపోయిన వారు గుర్తొస్తారు.

కశ్మీర్ భూభాగమే కావాలి, అక్కడి మనుషులు కాదు- అని ప్రవర్తించే భారతదేశం యావత్తూ, కశ్మీరీల పోరాటాన్ని పొరుగు దేశపు కుట్రగా కొట్టిపడేస్తుంది. ఇండియా దేశభక్తి కశ్మీర్ ప్రజల అణచివేతతో ముడిపడి ఉంటుంది. ఏ ప్రజాస్వామిక చర్చకూ ఆస్కారం లేదు. నిరసనల పట్లనే కాదు, శవయాత్రల పట్ల కూడా కనీసం మానవత్వం లేకుండా ప్రవర్తించిన ఉదాహరణలు కోకొల్లలు. భారతదేశంలో ఒక ముస్లిం దేశభక్తి మీద అనుమానం ఉంటుంది. ఒక కశ్మీరీ అయితే సందేహం అక్కర్లేని దేశద్రోహి, శత్రువు. అవమానాలు, అనుమానాలు, ఊళ్లన్నీ జైల్లు, హింస, అణచివేత మధ్య కనీస సంఘీభావం కరువవుతుంది.

ఇటు వంటి స్థితిలో బుర్హాన్ వంటి వాళ్ళు కశ్మీర్ ఆజాదీకి, ఆత్మగౌరవానికి వ్యక్తీకరణ అవుతారు. బుర్హాన్ అయితే అజ్ఞాత జీవితంలోనూ ముసుగు లేకుండా మీడియాలో కనపడేవాడు. సోషల్ మీడియాలో అతను ఆజాదీకి, ఆత్మగౌరవానికి ప్రతీక. చచ్చిపోయినా ఫరవాలేదు, తలెత్తుకుని నిలబడాలంటాడు. ఇటువంటి చావు స్వర్గానికి దారి వేస్తుందంటాడు. వాళ్ళకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదు అనే వాళ్ళు, ఇస్లాం ఛాందసత్వంలో పడిపోతున్నారని జాలిపడేవాళ్లు కశ్మీరీల విషయంలో ప్రజాస్వామ్యం ఎంత ఘోరంగా విఫలమైందో చూడగలరా?

ఎవరి ప్రజాస్వామ్యం ఎంతో కశ్మీర్ విషయంలో తేలి పోతుందనుకుంటాను.

తాజాగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులు కశ్మీర్ పై మీటింగ్ పెట్టారు. షరా మామూలుగా ఎబివిపి క్యాంపస్ అంతా వీరంగం ఆడింది. అది కూడా రోహిత్ మృతికి కారణమైన సుశీల్ కుమార్, బిజెపి నాయకుడైన అతని సోదరుడి నాయకత్వంలో. అమోల్ సింగ్ అనే విద్యార్థిని దొరకబుచ్చుకుని ఆసుపత్రి పాలయ్యేలా తీవ్రంగా కొట్టారు. మీటింగ్ పెట్టుకునే స్వేచ్ఛ దగ్గరి నుండి కశ్మీర్ వరకు దేశభక్తి వర్సెస్ ప్రజాస్వామ్యం చర్చ జె.ఎన్.యూ విషయంలో ఎట్లా జరిగిందో చూశాం. ప్రతిపక్షాలు మొదలుకొని వామపక్షాల వరకూ ఏం మాట్లాడారో చూశాం.

అది ఊహా చిత్రం గాదు

ఉదయమిత్ర

ఆత్యంత కట్టుదిట్టమైన భద్రతల మధ్య
నేనాతనితో మాట్లాడుతూ
ఊపిరి బిగబట్టి
రక్తంతో నోట్స్ తీసుకున్నా

గది నిండా ఉక్కపోత
కదలలేని కాలం..

మాట మాటకూ మధ్య
బాధా సప్త సముద్రాల గాథలు పలికిస్తూ
ఊపిరి ఊపిరీ మధ్య
ఊపిరి సలుపని యుద్ధం జేస్తూ
అతను మాట్లాడుతుంటే
నేను జాగ్రత్తగా గమనించా

కదలలేని ఆ మనిషి తల వైపు
కరుకు తుపాకీ గురిపెట్టబడి ఉంది

ఉలిక్కిపడడానికి
అదేమీ ఊహాచిత్రం గాదు
దేశమంతా విస్తరించిన
నిష్ఠుర నిశ్చల చిత్రం

అదిప్పుడు
నీ మీదా నా మీదా
కలలుగనే మన అందరి మీదా
గురి పెట్టబడే ఉంది
సమస్త వనరుల మీదా
సమస్త ప్రజా కళల మీదా
యుగాల సంకెళ్ళు తెగి
పెగులుకొచ్చిన పెనుకేకల మీదా
పున్నమి వెన్నెల నవ్వుల మీదా
సుర్యోదయాల మీదా చంద్రోదయాల మీదా
బతికే ప్రతి హక్కు మీదా
గురి పెట్టబడే ఉంది

ఇప్పుడు
అభివృద్ధి అంటే
ప్రజల తలల వైపు గురిపెట్టబడ్డ తుపాకీ.

(కా.సాయిబాబాకు)

నేను కూడా

ఇబ్రహీం ముచ్చెర్ల

నిద్ర పట్టదు
వడ్రంగి పిట్టలా ఒక్కటే విషయం
మనసును తొలుస్తుంది
మంచానికి నాలుగువైపులా
నిద్రను కట్టి పడేశా
తలదిండును మార్చి మార్చి వేసుకున్నా

అయినా !
పలుపు తెంచుకున్న లేగదూడలా
వాకిట్లోకి మనిషిని లాక్కొచ్చింది
మనసు మాత్రం
సాయంకాలం ఊరెనక అడవిలోకి అడుగులైన తుపాకీ భుజం
పొద్దులో కలిసిన ఆలీవ్‌గ్రీన్ యూనిఫాం వైపే లాగుతోంది

రాత్రి చిక్కబడుతున్న కొద్దీ
ఊరు మత్తుగా నిద్రపోతోంది
ఆకాశంలో చుక్కలు
మిణుగురు పురుగుల్లా
మెరుస్తు కదులుతున్నాయి

పక్కనే సెలయేటి అలల మీద
గంటకో అరగంటకో వంతెన దాటే రైళ్లు
పట్నాలని నిద్రపోనియ్యవు

కూలికెళ్ళిన అమ్మ
మధ్యాహ్నం ఇంటికి రాలేక పోయింది.
పాలకోసం ఎదురు చూసే పసి పిల్లాడిలా నేను

సాయంత్రం అడవిలో పూచిన సింధూరం
ఏమై ఉంటుందా.. అని
అటు వైపే మనసు

చీకటిని తడముతున్న తోడేళ్ళ కవాతు
కుందేళ్ళ మీద తూటాలను విసురుతుంది
చెదిరిన పక్షులు ఆర్తనాదం తుపాకీ శబ్దం
దట్టంగా కురుస్తున్న మంచు
మసక మసక వెలుతురుతో మోపులా కట్టి
ఈడ్చుకెళుతున్నారు

ఎక్కడో.. !
తల్లి పురిటి నొప్పులు మంచు పొరల్ని చీలుస్తూ
నెత్తుటి పువ్వు మట్టి మీద
ఆకలి జెండా ఎగరేసింది

రాలిన ఆకులన్నీ
ఎరుపు రంగేసుకున్నాయి
అడవి ఆలీవ్ గ్రీన్ యూనిఫాంతో చిగుర్లు తొడుగుతోంది

నేను కూడా.. .. .

జీవో 69

మహమూద్

ప్రాతినిధ్య పరిహాస
రంపపు కోతకు వేలాడిన శిథిల స్వప్నం

ద్రోహాల ముందు చూపు ముందు
అమాయకత్వమై వెలవెలబోతుంటుంది
శైథిల్యపు నైరాశ్యంలో
వెలుతురూ చీకటీ సమాంతర దరులు
పారని ప్రవాహాలకు

మోసానికి రూపం సారం బాగా
అమరుతాయి
ఎక్కడ రంధ్రం చేస్తే
జలం తరలిపోతుందో
అక్కడే పెట్టబడుతుంది
నీరు అమాయకంగా ముందుకే ఉరుకుతుంది
పల్లానికి విరుద్ధంగా
ప్రవాహం సాధ్యమని నమ్మబలికేంత
సావు తెలివితేటలు
ఎవరికుంటాయి తెలుగు ప్రాంతీయావనికపై

అది రంధ్రమో మార్గమో ఎప్పటికి
తెలియజేయబడదు
రాజకీయ తాత్విక గ్రంథాల్లో
అర్థాలు తారుమారౌతాయి
అర్థ విన్యాసం అన్ని రంధ్రాలకూ మూలం
అన్నింటిలోంచి చుక్క చుక్క జీవితం
లీక్ అవుతుంటుంది

రాత ఏ చేయి రాసినా నీళ్ళు చేరిపోతూనే ఉంటాయి
ధనిక పొలాల గర్భంలోకి
తాగుబోతుకు సారాయి మీద ఎప్పటికీ ఆశ చావనట్టు
జల ఉబలాటం బాన దేహానికి

కరువు ఉండే చోట ఉంచడానికి
పథక రచన సాఫీగా జరిగిపోతూంటే
నాయకుల జేబులు నిండుతాయి కాని
కాలువల్లోకి నీరు పారతాయా

వలసవాద రాణి విహార యాత్ర కోసం
తవ్వబడ్డ కెసి కెనాల్
కర్నూలు కడప నరాల్లో పారే అతి పెద్ద నీటి వనరుగా మిగలడమే
కథంతా విడమరుస్తుంది
ఇంత వరకూ సీమలో పారిన నీళ్ళంతా
నాగార్జున సాగర్ కుడికాలువలో పారిన నీటితో సరితూగుతుందా

కుట్రకు ఎన్నెన్ని రంగులూ ఊసరవెల్లికి ఉన్నట్టూ
ఆవిరి కాగ మిగిలిన నీళ్ళు ఏ కరవు పోగొడతాయి గోదావరి జిల్లాల
పిల్ల కాలువల్లో కూడా ఇంతకంటే
ఎక్కువ నీళ్ళే పారతాయి
రాయలసీమ ఆయకట్టు ఆత్మహత్య
కట్టుకథ కాదని అందరికీ తెలుసు
కబేళాలకు తరలిపోయే మూగజీవాల
మూగరోదనల్లా భూమి ఎండిన
వేడి నిట్టూర్పులు
ఇక్కడి ప్రతినిధులకు వినబడనీయకుండా చేసిన చాతుర్యం ఎవరిదో
వాళ్ళ వ్యాపార భాగస్వామ్యం చెప్పకనే చెబుతుంది

మా నరాల్లో పారాల్సిన నెత్తురు
మాకు తెలియకుండానే కృష్ణలోకి దిగుతాయి
దానికోసం ఓ రహస్య పత్రం సిద్ధం చేయబడుతుంది
సంతకాలదేముంది
నోట్ల కట్టలు నోరు చేసుకుంటాయి కాబట్టి
నెత్తురు రుచి మరిగిన తోడేళ్ళకు సీమ బక్క లేళ్ళ మాంసం
రుచికరమైపోయింది
వాళ్ళ వరిలో పారుతున్నది మా నెత్తురే అని
ఎవరైనా నినదించండి

భాగం అనే ప్రశ్న తలెత్తకుండా
అన్ని భాగాలూ అక్కడికే చేరిపోయాయి కదా
సాక్షాత్తు ముఖ్యమంత్రులు ఇక్కడ పుట్టి
అక్కడివారిగా చెలామణి అవుతుంటారు
ప్రాంతీయ అభిమానాన్ని డీకోడ్ చేయడం
వాళ్ళకొచ్చినట్టు ఎవరికొస్తుంది
అధికారం నిలబడే ఆర్థిక మూలాల ముందు
దశాబ్దాలుగా ఓడిపోతుంది ప్రాంతీయాభిమానం

ఎత్తు మార్పుకు చిత్తయిపోయిన చరిత్ర
శ్రీశైలం డ్యాము గేట్ల కింద దాచిపెట్టబడి చాలా కాలమయింది
854 అడుగులపైకి
ఎక్కగలిగే నీరు కృష్ణ ఏ జన్మలో పారించిందనీ పారనిచ్చారని
అంత పైకి ఎక్కాక ఒలికే చెంబుడు
నీళ్ళ కోసం సీమ సీమంతా నోరెళ్ళబెట్టి ఎదురు చూస్తుంది
వీపులోకి కరువు బాకు కసక్కున దిగబడుతుంది

రాయలు ఏలినా

వేమన పాడినా
మొల్ల మొత్తుకున్నా
విద్వాన్ కన్నీరు కవిత్వమైనా
చరిత్ర కాదు

శ్రీబాగులో ప్రారంభమై
సాగర్ శ్రీశైలంలో తవ్వబడి
69 రుద్రవీణ మరణరాగంతో
కొత్త మార్గం పట్టిసీమ దాకా
సీమపై దమనకాండ
ఓ పరిణామంగా సాగిపోతున్న
నేపథ్యం నుంచి
ఇపుడు కొత్తగా

మా చరిత్ర
69 ద్రోహం వైపు నుంచి కూడా రాయాలి
మా కరువుల చరిత్ర
కోస్తాంధ్ర నీటి దోపిడీ వైపు నుంచీ రాయాలి

పడే వర్షం
పడని వర్షం అందరికీ ఉంది
కళ్ళ ముందు నుంచి నీరు పారుతున్నా
తాకనివ్వని దరిద్రం మాత్రం మాకే ఉంది
ఇపుడు చెప్పండి కరువు ఎవరు సృష్టిస్తున్నారు
ఇది జీవోల ఎండమావులు రాలుస్తున్న క్షామం

69 లాంటి రాబందు రెక్కలు టపటపలాడుతున్నంత వరకు
చీకటి సంతకాల తెరచాటు కార్యాలలో
854 అడుగుల లోతులో
సీమ జీవితం దిగబడే ఉంటుంది
ఎన్నాళ్ళైనా

మాటలూ చేతలూ కాదు
కొత్తగా ఆయుధాలు నూరండి
ప్రతి కుట్రకీ సమాధానం అవి మాత్రమే రాస్తాయి

చరిత్రే చరిత్ర రాయదు

నిప్పులు చిమ్ముతూనే ఉంటాం

రమేష్ గోండ్యాల

ఎగుడు దిగుళ్ళను
కష్ట నష్టాలను అధిగమించి
కఠినమైన దారుల గుండా ప్రయాణించడానికి సాహసించే వారికే
వెలుగు నిచ్చే శిఖరాలను చూసే అవకాశం ఉంటుంది

గుండె లోతుల్లో భయాన్ని తొణికిస లాడించుకుంటూ
రోజు చస్తూ బతుకుతూ
చీకటికి మోకరిల్లి తలవంచి బతుకుతున్న వాడికి
వెలుగు కిరణాల జాడ ఎట్ల కనిపిస్తుంది

గడ్డిపోచలు పుష్పిస్తున్న పువ్వులను ఎగతాళి చేసి
ప్రజల నడకలో విచ్చే నవ్వుల్ని తుడ్చివేయాలని
వెన్నెలను కమ్ముతున్న మబ్బులా
తెగ ఆరాట పడుతున్నవు ఎందుకు

దు:ఖాలను దాటించి
తీరానికి చేర్చే అక్షర వనంలో
విషపు గుళికలా పెరుగుతున్న హైబ్రిడ్ మొక్కలకు
ఒట్టి భ్రమే కాని
అంతిమంగా మార్పు
అనివార్యం అవుతుంది

నువ్వు విధ్వంస వలయంలో చిక్కుకొని
ఎంత విషం చిమ్మినా
ఎంత హేళన చేసినా
దోపిడీ రహస్యాలపై
మిట్ట మధ్యాన్నపు సూర్యుడిలా
నిప్పులు చిమ్ముతూనే ఉంటాం.

(3వ పేజీ తరువాత...)

సాధించుకోవాల్సిందే అనే అవగాహనను దండకారణ్యంలోని మావోయిస్టు ఆచరణ నిజం చేస్తున్నది.

విప్లవ యుద్ధం అన్నాక బూర్జువా రాజ్యం చూస్తూ ఊరుకోదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత, ముఖ్యంగా వియత్నాం యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదం రూపొందించిన మంద్రస్థాయి యుద్ధ తంత్రాన్ని ఇవాళ దండకరణ్యమంతా, యావద్దేశమంతా భారత ప్రభుత్వం అమలు చేస్తున్నది. అన్ని రంగాల్లోని ప్రజాస్వామిక లౌకిక శక్తులను తుడిచేయడమే దీని లక్ష్యం. సైన్యాన్ని, భావజాలాన్ని, మార్కెట్ సంస్కృతిని ముప్పేటలా అన్ని రకాల పోరాటశక్తులపైకి ఉసిగొల్పుతున్నది. ముఖ్యంగా హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు విధానాలు అందులో భాగమే. వీటన్నిటి మధ్య దండకారణ్య ఆదివాసులు అనన్య త్యాగాలు చేస్తూ జనతన సర్కార్‌ను నిర్వహిస్తున్నారు.

అనేక ఆటుపోట్ల మధ్యనే జనతన సర్కార్‌కు పదేళ్ల రావడం ఒక చారిత్రక సందర్భం. పోరాట ప్రజల పక్షాన నిలబడ్డ వాళ్లకు స్ఫూర్తిదాయకం. ప్రపంచ వ్యాప్తంగానే విప్లవశక్తులు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఈ తరుణంలో ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థగా జనతన సర్కార్ కొనసాగుతుండటం అరుదైన ప్రజానుభవం. ఇది వేడుక చేసుకోవాల్సిన, విప్లవోత్తేజం పొందాల్సిన సందర్భంగా విప్లవ రచయితల సంఘం భావిస్తోంది.

నూతన మానవుడు

షహీదా

"నీకర్థం కావడానికి ఒక ఉదాహరణ చెప్తాను. మనల్ని ఇంటర్వ్యూ చేయడానికి విలేకరులు వచ్చారనుకో, అందులో నీలాంటి ఆమెనే వుందనుకుందాం కాసేపు. ఆ రోజే మన డ్యూటీల ప్రకారం ఇద్దరు మహిళా కామ్రేడ్స్‌కు వంట డ్యూటీ అనుకోకుండా పడింది. ఆ విలేకరి ఇది చూసి పార్టీలో స్త్రీలు వంట చేస్తుంటే మగవాళ్లు రాజకీయాలు నడిపిస్తున్నారు అనుకుంటుందనుకో, అది వాస్తవమవుతుందా? కంటికి కనిపించే దాని వెనుక అసలైన సత్యం శోధిస్తేనే తెలుస్తుంది కదా?"

'నీలాంటి ఆమెనే' అన్న పదాలు విన్నప్పుడు పెదాల మీద విరిసిన చిర్నవ్వును అలాగే పంటి కింద అదుముకుని మమత నిప్పును ఎగదోస్తూ కూచుంది. మంటకు అటు వైపున కూచున్న సంజీవ్ కట్టెపుల్లతో నేలని గెలుకుతూ మమత సమాధానం కోసం చూస్తున్నాడు.

"అంటే నేను శోధించకుండా నిర్ధారణలకు వస్తానంటావ్? అంతా చక్కగానే వుందని నీ పరిశోధన తెలుపుతోందా?"

"అంతా చక్కగా వుందని నేనెందుకంటాను? కానీ ఎక్కడ సమస్య వుందో అక్కడ పట్టాలంటున్నా. పైపైన విషయాల్ని తడిమో, సెకండరీ అంశాల్ని ప్రధాన పోరాటాంశాలుగా చేసో పార్టీని బాగు చేసుకోలేం అని మాత్రమే అంటున్నా."

"అంతేలే, మీరు మాట్లాడేవన్నీ చాలా ముఖ్యమైన 'రాజకీయ' అంశాలు, నేను అడిగేవన్నీ సెకండరీ, చిన్న చిన్న అంశాలు."

'మళ్లా మొదలు! మూడు రోజులవుతుంది మమత వచ్చి. వచ్చిన రోజు నుంచే మొదలుపెట్టింది పితృస్వామ్యం ఎక్కడుంది అని అన్వేషణ. లేదని ఎవరన్నారు, కానీ అన్నీ ఆ కళ్లద్దాలనుండే చూస్తోంది. ఎంత ఓపిగ్గా వుందామన్నా...' పెదాలు దాటి రాలేని సంజీవ్ భావాలు.

'ఏదైనా ఒకటి చెప్తే వుందనో, లేదో ఒక్క మాటలో చెప్పకుండా క్లాసు తీసుకోవడం బాగా అలవాటయ్యింది ఈనకు. అయినా తానేమంది? రెండు రోజులుగా అన్నలే వెళ్తున్నారు వూర్లోకి, అక్కల్నీ పంపచ్చు కదా అంది. వాళ్ల వర్క్ డివిజన్ ప్రకారం వెళ్తున్నారు అని చెప్తే కాదా, విలేకరితో పోలిక ఎందుకు? నేనేం ముందే నిర్ధారణకు రాలే కదా ....' మమత మనసులో అసంతృప్తి.

ఇద్దరూ మౌనంగా వుండడం ఇద్దరికీ నచ్చలేదు. గంట సేపటి నుంచి యిలాగే ఒకరినొకరు గెలవాలని వాదించుకుంటూ యిక్కడకొచ్చి ఆగారు. అవతలి వాళ్లే ఏమన్నా అనచ్చు కదా అని యిద్దరికీ అన్పిస్తోంది.

ఇక సంజీవే విషయం మారుస్తూ, "విజయ దగ్గర నేను చెప్పిన మందులు తీసి పెట్టుకున్నావా? రేపు సాయంత్రమే నువ్వు వెళ్లేది, హడావుడిలో మరిచిపోయేవు," అన్నాడు.

"వూ."

"కోపం వచ్చిందా?"

"వూహు," నిజమే చెప్పింది మమత.

"సీతతో పదిరోజులుంటావు కదా, తనతో చర్చించు నీ సందేహాలన్నీ, మళ్లా కలుస్తాంగా, అప్పుడు తీరిగ్గా వాదించుకుందాం," వాతావరణాన్ని తేలిక పర్చడానికి చిరునవ్వుతో అన్నాడు సంజీవ్.

మమతా నవ్వింది.

'హమ్మయ్య' అనుకున్నాడు సంజీవ్. "పడుకుంటావా?" అడిగాడు.

"నిద్ర రావట్లేదు గానీ పడుకుంటాలే."

మమత లేచి అరుణ జిల్లీ దగ్గరకు వెళ్లి పడుకుంది.

సంజీవ్ రెండు వుత్తరాలు రాసేదుంటే రాసుకున్నాడు. యాంత్రికంగా మెల్లగా లేచి తన జిల్లీలో పడుకున్నాడే గానీ బుర్ర మాత్రం మమత చుట్టే తిరుగుతోంది.

'మమతను పద్నాలుగేళ్ల వయసులో చూసి వుంటానేమో. ఈ 6, 7 ఏండ్లలో ఎంత మార్పు వచ్చేసిందో ఆమెలో. తెలివైందే గానీ ఒకలాంటి అమాయకత్వం వుండేది ఆమెలో. అది ఇప్పటికీ వుందనిపిస్తోంది. ఇంట్లో వాళ్లు, చుట్టుపక్కల వాళ్లు తమకు వరస కలిపి బనాయిస్తుండేవరకు నేనూ తప్పించుకుని తిరిగేవాడిని. నేను మాత్రం ఎంతున్నాను పదిహేను, పదహారు అంతే కదా. పదిహేడు ఏండ్లకే నేను పార్టీలోకి వచ్చేశాను. మమత చదువు కొనసాగించి కాలేజికి వచ్చి మహిళాసంఘంలో పని చేస్తోందట. పార్టీ మెంబరే. నేనేమో ఇక్కడ కమాండరునయ్యాను. పక్క పక్క ఇండ్లు కనుక మమత వాళ్ల నాన్నని 'మామ' అనడమే అలవాటు నాకు. మామని పిలిపించినప్పుడు ఆయనే అన్నాడు, "మమతకు దళాలంటే ఇష్టం, నిన్ను కూడా చూడాలంటుంది, ఒకసారి పిలిపించి మాట్లాడు," అని. "అక్కడ పార్టీనడిగి ఓ పది, పదిహేను రోజులుంటానంటే అట్లే పంపు," అని చెప్తే వచ్చిందిప్పుడు. మొదట్లో నాతోనే వుంటుంది అనుకున్నాను గానీ రాధతో మాట్లాడాక సీతతో పదిరోజులు తిరిగి వస్తదిలే, మన నల్గొండ జిల్లాలో ఈమధ్య విప్లవ మహిళా సంఘాలు పనిలో ఒక మెరుగుదల వచ్చింది కనుక అవి చూసి వస్తే ఆసక్తిగా వుండచ్చు అనుకున్నారు. రేపే సీతతో తనని పంపేది.

'నాకేమైందసలు? ఎంతో ఇష్టంగా దళాన్నీ, పార్టీనీ, నన్నూ చూద్దామని మమత వస్తే నేనెందుకిలా చేస్తున్నాను? ఎవ్వరితోనూ నాకు ఇన్నాళ్లలో ఈ పరిస్థితి ఎదురు కాలేదు. 'నాకు తెలిసినవి నేర్పడం, తెలీనివి నేర్చుకోవడం' అనేది పాటించాలని నేను పార్టీలోకి

వచ్చినప్పుడే అనుకున్నాను. ఆ సూత్రం నాకు ఇప్పటివరకూ పని చేస్తూ వచ్చింది. అందరూ నన్ను, 'చిన్న వయసైనా ఓపికమంతుడు,' అంటారని నాకు తెలుసు. అది నేను ఇప్పటివరకు ఈ సూత్రాన్ని విడవకుండా పాటించడం వల్లే అనుకుంటాను. మరి మమత దగ్గరకొచ్చేసరికి ఎందుకు 'లెక్క తప్పుతోంది?' ఈ మూడు రోజుల్లో గతంలో ఎన్నడూ వూహించలేనంత సాన్నిహిత్యం తమ మధ్య పెరిగిన మాట అయితే నిజమే. నాకు తెలీకుండానే నేను మమతనెక్కడో 'స్వంతం' అని భావిస్తున్నానా?'

హఠాత్తుగా పైకి వచ్చిన ఈ ఆలోచన సంజీవ్‌కి గమ్మత్తుగా తోచింది. 'తప్పు, తప్పు' అని మనసులోనే లెంపలేసుకుని నవ్వుకున్నాడు. 'ఇంకేం లేదు, చెవులు పిండి గోడకుర్చీ వేయిస్తుంది. ఛ..రేపైనా ఆమెతో మంచిగా మాట్లాడాలి - ఒక కొత్త కామ్రేడ్‌కి దళాల గురించి ఎలా అర్థం చేయిస్తానో అలాగే చెప్పాలి, మళ్లీ పది రోజులకు గానీ కలవదు...' పెదాల మీద చిరునవ్వుతో సంజీవ్ మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు.

'సంజీవ్ ఎంత మంచివాడు, ఎంత ఓపిగ్గా విషయాలు చెప్తాడు, నేనే అనవసరంగా విసిగిస్తున్నానా? కానీ ఎందుకో నాకు స్త్రీలకి సంబంధించిన విషయంలో ఏ కొంచెం తేడా కనిపించినా వుండబుద్ధి కాదు. ఇంట్లో అయినా, స్కూల్లో అయినా, ఇప్పుడు కాలేజీలో అయినా అంతే. నాన్న నన్ను అలాగే పెంచాడు. ఏ విషయంలోనూ మహిళలు పురుషులకు తీసిపోరు అనేది నాకు ఎంతగా చిన్నప్పటి నుండి నూరిపోశాడంటే పురుషుల నుండే కాదు మహిళల్లో కూడా ఎక్కడైనా తాము తక్కువ అనే భావం కనిపిస్తే భరించలేను నేను. ఇదెంత 'సహజగుణం' అయిపోయిందంటే ఎక్కడ యిలాంటి సమస్యలొచ్చినా అందరూ నన్నే ముందుకు తోస్తారు. నాకూ అదే అలవాటు అయిపోయింది. సంజీవ్‌కి ఇవన్నీ తెలీవుగా...ఛ రేపైనా అతనితో మంచిగా మాట్లాడాలి...చదువుకున్న అహంభావం అనుకోడు కదా..మళ్లా పదిరోజులకు గానీ కలవడు......' ఆలోచనల్లో ఎప్పుడు కన్నంటుకుందో మమతకు తెలీదు.

* * *

పదిరోజులు పదిక్షణాల్లా గడిచిపోయాయి మమతకు. సీత ఆమెకు బాగా నచ్చేసింది. సీతకు ఇరవై ఎనిమిది ఏండ్లు వుంటాయేమో. సన్నగా, పొడుగ్గా వుంటుంది. కష్టం చేసిన మనిషే అయినా చూడ్డానికి మాత్రం నాజూగ్గా కనిపిస్తూ వుంటుంది. అందుకే ఆమె అన్నేసి గంటల నడకా, మోసే బరువులూ అవీ చూసి మమత మొదట్లో ఆశ్చర్యపోయింది.

మమత ఆమె కుటుంబ నేపథ్యం గురించి అడిగినప్పుడు ఆమె ద్వారా మమతకు తెలిసిన విషయాలు ఇవీ: అమ్మా, నాన్నా వ్యవసాయ కూలీలు. వాళ్లతో పాటు ఆమే చిన్నప్పటి నుంచీ కూలికి వెళ్లేది. అందుకే బడికి పోలేదు. ఇద్దరు తమ్ముళ్లూ, ఇద్దరు చెల్లెండ్లు. ఆమే పెద్దది కనుక వాళ్ల బాధ్యతా ఆమెకే వుండేది. వూరికీ, ఆమె ఇంటికీ దళం రాకపోకలు వుండేవి. దళంలోకి రావాలనుకుని అడిగితే, వూర్లోనే మహిళాసంఘంలో చేస్తే మంచిది అని చెప్పారు. అది ఆమెకూ, పార్టీకీ కూడా ఉపయోగం అని ఒప్పించారు. అలా చాలాకాలం చేశాక, నిర్బంధం పెరిగాక దళంలోకి వచ్చేసింది. వచ్చి దాదాపు నాలుగైదు సంవత్సరాలు అవుతోంది.

అప్పుడు వూర్లో పని చేసిన అనుభవం ఇప్పుడు బాగా పనికి వస్తోందనీ, మైదాన ప్రాంత తీవ్ర నిర్బంధంలో కూడా ఒక్కతే వెళ్లి కూడా అన్ని పన్లూ చేసుకురాగల ఆత్మవిశ్వాసం కూడా వచ్చిందనీ, పార్టీ ముందుచూపు గురించి మెచ్చుకుంటూ సీత చెప్పింది. సీత పని తీరు చూశాక మమతకూ అది నిజమనిపించింది.

ఆ పదిరోజుల్లో వాళ్లు ఏడు సమావేశాలు వేయగలిగారు. వాటిలో మూడు గ్రామ మహిళాసంఘం కార్యవర్గ సమావేశాలు, మూడు మహిళాసంఘం జనరల్ బాడీ సమావేశాలు, రెండు బాలల సంఘం సమావేశాలు. ప్రతీ ఊరికీ వెళ్లే ముందు సీత మమతకు ఆ వూరికీ, పార్టీకీ ఎప్పటి నుండి సంబంధం, అక్కడ సంఘాలు ఎప్పుడు మొదలైనాయి, అవి ఎదుర్కొన్న ఒడిదుడుకులూ, ఇప్పుడు పరిస్థితి ఏంటి అనేది పరిచయం చేసేది. దాంతో మమతకు ఆ సమావేశాల్లో చర్చల్ని అర్థం చేసుకోవడం సులభమైంది. సమావేశం నడుస్తున్నప్పుడు కూడా సీతగానీ, సంఘం అధ్యక్షులూ, సభ్యులూ కూడా మమతకు అర్థం కావడానికి అవసరం అనుకున్న వివరాలు చరిత్రలోకి వెళ్లి సంక్షిప్తంగా అయినా గానీ చెప్పేవాళ్లు. తనకు అర్థం కావాలని వాళ్లంతా అంత ఓపిగ్గా, కొంత సమావేశ సమయాన్ని వదులుకుని మరీ చెప్పడం అవీ మమతను చాలా ఉత్తేజపరిచాయి. అందుకే ఆమే వారికి దీటుగా ఉండాలన్నట్టు అన్నీ శ్రద్ధగా విని, ముఖ్యమైన విషయాలు రాసుకున్నది. సమావేశాల తర్వాత ఆమెకి అనిపించిన విషయాలు కూడా మమతకు చెప్తూ వచ్చింది. సీతకూ మమతతో చర్చించడం, తను చూపే ఒకటి, రెండు కోణాలూ ఉపయోగపడ్డాయనిపించింది.

ఒక కార్యవర్గ సమావేశంలో ఒక అక్క గతంలో చురుగ్గా పని చేసి, ఇప్పుడు వస్తలేదనీ, ఆమెకు వేరే అతనితో సంబంధం ఏర్పడ్డమే అందుకు కారణం కావచ్చనీ రిపోర్టు చెప్పారు. సీత, "అది వాస్తవమేనా?" అని అడిగినప్పుడు, "మాకూ అది నిజమే అనిపిస్తోంది, వేం ఎంత ప్రయత్నించినా ఆమె మాట్లాడక తప్పుకు తిరుగుతోంద"ని చెప్పారు. చర్చ ఆమె పట్ల ఒక వ్యతిరేకతతో కొనసాగింది. సీత, "అలా ఆలోచించద్దు, తిరిగి ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేద్దాం, నేను మాట్లాడ్తాను, నాకు కలిపించండి," అని చెప్పింది. అయితే ఆ సందర్భంగా వాళ్లు వాడిన కొన్ని పదాల్ని గానీ, వారిలోని వ్యతిరేకతను గానీ సీత ప్రత్యేకించి తప్పు అని వివరించలేదు. మమత అక్కడేం మాట్లాడలేదు గానీ తర్వాత విడిగా సీతతో చర్చించింది. ఎవరైనా గానీ అలాంటి పదాలు వాడద్దనీ, అందులోనూ మహిళాసంఘం వాళ్లు మరింత జాగరూకతతో ఉండాలనీ, మనం దీనిపై ఎప్పటికీ ఎడ్యుకేట్ చేస్తుండాలనీ ఆమె అభిప్రాయం చెప్పింది. సీతకు 'నిజమే' అనిపించింది. 'ఇలాంటి విషయాల్ని నేను పెద్దగా పట్టించుకోను, అలా వుండకూడదు,' అనుకుంది.

అలాగే బాలల సంఘం సమావేశమైనప్పుడూ మమత, "అమ్మాయిలతో అబ్బాయిల ప్రవర్తన ఎలా వుంటుంది? అన్నిట్లో వాళ్లను కలుపుకొచ్చుకుంటున్నారా లేదా?" అని రకరకాల ప్రశ్నలు వేసి వారి నుంచి రాబట్టడం కూడా సీతకు మంచిగా తోచింది.

సీత కూడా ఎప్పుడూ బాలికలను తేవడంపై శ్రద్ధ పెట్టాలని చెప్పినా ఇలా రకరకాలుగా వాళ్లనే అడిగి, వాళ్లతోనే చెప్పించే పద్ధతి బాగుందనిపించింది.

మమతకైతే ఈ పదిరోజుల్లో సీత, ఇతరుల సహచర్యంలో తన ఆలోచనల్లో చాలా మార్పు వచ్చినట్టు అనిపించింది. ప్రతిక్షణం ఏదో ఒకటి నేర్చుకున్నట్టే తోచింది. ముఖ్యంగా 'వర్గ దృక్పథం' అంటే ఏంటో గతంకంటే స్పష్టత వచ్చినట్టనిపించింది. ఇక మిగతా విషయాల్లో మమతకు అన్నిటికంటే బాగా అనిపించిన విషయం - సీత చెప్పే విషయాల్నీ, పనుల్నీ అక్కలు ఎంత గురుభావంతో స్వీకరిస్తున్నారో, ఈ పదిరోజుల్లో తమకు అనేక విధాలుగా సహకరించిన అన్నలూ అంతే ఇదిగా స్వీకరించడం. ఎక్కడా ఆమె మహిళ, తాము పురుషులం అనే భావమే ఎవరిలోనూ ఏ కోశానా కనిపించలేదు. ఇంకా చెప్పాలంటే ఆమె అక్క కాబట్టి, రిస్క్ తీసుకుని తిరుగుతోంది కాబట్టి ఇంకా జాగ్రత్తగా కాపాడుకోవాలనేదే ఒక శాతం ఎక్కువ కనిపించింది. దళంలో మహిళా నాయకత్వాన్ని స్వీకరించడం మమతకు పెద్ద ఆశ్చర్యం వేయలేదు, అలా లేకుంటే ఆశ్చర్యపోయేదేమో. కానీ వూరు అన్నలు ఇంతగా మహిళా నాయకత్వాన్ని ఆమోదించడం మాత్రం మమతకు సంతోషం కలిగించింది.

'సంజీవ్‌కి తప్పకుండా ఈ విషయం చెప్పాలి,' అనుకుంది.

పదిరోజులకు పైగా ఇరవైనాలుగ్గంటలూ ప్రతి పనీ, ప్రతి ఆలోచనా కలిసే చేయటంతో సీతకూ, మమతకూ మధ్య జీవితంలో ఇద్దరిలో ఎవరు ఎక్కడ వున్నా మరిచిపోలేని ఆత్మీయబంధం ఏర్పడిపోయింది. చివరికొచ్చేసరికి సీత ఏం మాట్లాడబోతోందో మమతకి అర్థమైపోవడం, మమత అనబోయేది సీత చెప్పేయడం దాకా వచ్చింది.

సీతతో తనని పంపినందుకు రాధక్కనూ, సంజీవ్‌నూ ఎన్నిసార్లు ఇష్టంగా తలచుకుందో మమత!

విడిపోయే రోజు కళ్లనీళ్లు ఒకటే తక్కువ. సీత మమతను సంజీవ్ దగ్గరకు తీసుకెళ్లే వాళ్లకు అప్పగించి ఆమె పని మీద ఆమె వెళ్లిపోయింది. తనను తీసుకెళ్లడానికి వచ్చిన సంఘం అన్నలతో మమత బయల్దేరింది. వాళ్లు రెండు రాత్రుళ్లు చాలా దూరాలే నడిపించినా మమతకసలేం అర్థం కాలేదు ఆ కష్టం. ఆ పదిరోజుల అనుభవాలూ, సీతతో మాటలూ, మధ్యలో సంజీవ్ గురించిన ఆలోచనలూ...వేరే లోకంలో వున్నట్టే వుంది తప్ప భూమ్మీద వున్నట్టూ, ఆమెకు కాళ్లు నెప్పెడుతున్నట్టూ కూడా అర్థం కాని అలౌకిక ఆనందాన్ని అనుభవించింది! ఎప్పుడెప్పుడు ముందు సంజీవ్‌తోనూ, తర్వాత బైట తన దోస్తులతోనూ ఇవన్నీ చెప్పాలా అని వువ్విళ్లూరుతోంది.

* * *

మమత సంజీవ్ వాళ్లను కలిసి అప్పుడే రెండు రోజులైపోయాయి గానీ సంజీవ్ మమతకు దొరకనే లేదు. చేతులు కలిపి యోగక్షేమాలు అడిగి వెళిపోయాడంటే ఇక దొరకనే లేదు. రాధక్క సరేసరి. ఇద్దరూ మమతకు, "నీవు తిరిగేసి వచ్చిన దాని మీద రాసి ఇవ్వు," అని మాత్రం చెప్పారు. 'నేనేం రాస్తాను?' అని మమత గునిసింది గానీ వాళ్లు కనిపించినప్పుడల్లా, "రాశావా?" అని తప్ప ఇంకేం మాట్లాడకపోవడంతో మమత బలవంతంగా కాయితాలు ముందేసుకుని కూచుంది. కానీ ఏం రాయాలో తెలీనట్టు అనిపించింది. 'ఇలాంటివి అనుభవం లేక పోవడం అందుకు ప్రధాన కారణం,' అని తనకు తానే చెప్పుకుని సంతృప్తి పడింది.

ఇక తను వెళిపోవాలి కనుక వున్న కాస్త సమయంలో అందరితో హాయిగా వుండాలనిపించింది మమతకు. కాయితాలు ఎత్తి అవతల పడేసి వంట డ్యూటీ వేయించుకుంది. మిగతా టైంలో పాటలు రాసుకుంది, కొన్ని పాటల బాణీలు నేర్చుకుంది. కబుర్లు చెప్పింది, చెప్పించుకుంది. ఇక సంజీవ్, రాధలతో మాట్లాడాలనే ఆశ సంపూర్ణంగా వదిలేసుకున్నాక ప్రశాంతపడి, అందరితో అనుభూతుల్ని మూట గట్టుకుని, మర్నాటి ప్రయాణానికి అన్నీ తయారు చేసేసుకుని త్వరగానే నిద్రపోయింది.

* * *

"మమతా, మమతా," జ్యోతి కుదిపి లేపుతుంటే 'ఇప్పుడే పడుకున్నా కదా, అప్పుడే తెల్లారిందా?' అనుకుంటూ లేచింది.

"టైమెంత?"

"తొమ్మిది."

అప్పుడు చూసింది. సంజీవ్ నిల్చుని వున్నాడు.

"మమతా, నేను రేపు తెల్లారే వెళిపోవాలి."

మమత దిగ్గున లేచింది. ఇద్దరూ అంతకు ముందులాగే కిచెన్ దగ్గర మంట కాడ ఎదురెదురుగా కూచున్నారు.

"రాశావా?"

" "

"భలే వున్నావ్. ఇక్కడ మా కామ్రేడ్స్‌కి అంటే రాత సమస్య గానీ నీకేంటి?"

"ఏమో, నాకేం రాయాలో తెలీలేదు."

"నువ్వేమో ఏవో చాలా రాసుకున్నావనీ, చాలా చర్చించావనీ సీత మాకు రాస్తే నువ్వేంటి?"

"సీత రాసిందా?" మమతకు సీత గుర్తుకు రాగానే సంతోషంతో పెదాల మీద తళుక్కున చిరునవ్వు.

ఒక్కసారిగా నవ్వుతో వెలిగిన తన ముఖాన్ని ముచ్చటగా చూస్తూ, "వూ, అందుకే కదా నేనూ, రాధ నీ వెంట పడింది."

"లేకుంటే పడకపోదువా?"

"వూహు," అని ఆగి మమతకేసి చూశాడు. కోపం వచ్చిందా లేదా అన్నట్టు. మమతకు అర్థమై ఏం అనలేదు.

"లేకున్నా అడిగేవాళ్లమేమో గానీ వెంటపడేవాళ్లం అయితే కాదు."

"ఇంకేం రాసిందేం?"

"రాసిందిలే నువ్వు తనని చాలా తిప్పలు పెట్టావని."

అది అబద్ధం అని ఇద్దరికీ తెలును కనుక ఇద్దరూ నవ్వుకున్నారు.

"నీకు థాంక్స్ చెప్పాలి సంజీవ్!"

ఎందుకన్నట్టు చూశాడు.

"సీతలాంటి దోస్తు దొరికింది."

"అవును, నాతో వుంటే మనకి కొట్టుకోవడమే సరిపోయేది, అయినా సీతంటే యిక్కడ అందరికీ ఎంతో ప్రేమ, గౌరవం. బాగా క్లోజ్ అయినట్టున్నారుగా, ఇంతకీ తన సహచరుడి గురించి చెప్పిందా? ఆయనింకా ఇంటికాడే వున్నాడు తెలుసా?"

"నిజమా? అవునేంటీ ఇన్ని రోజులున్నా నేను ఆమె వ్యక్తిగత జీవితం గురించి అడిగిందే లేదు. ఎంతసేపూ పార్టీ, దళం, మహిళా సంఘం అని తప్ప ఇంకేం మాట్లాడుకున్నట్టే లేదు," నొచ్చుకుంటున్నట్టుగా అంది మమత.

"సీత తనంతట తను ఎలాగూ చెప్పి ఉండేది కాదులే. ఇద్దరూ సంఘంలోనే చేసేవారు. నిర్బంధం వచ్చాక అక్కడే వుంటే దక్కించుకోలేం అని దళంలోకి రమ్మన్నాం. సీత వచ్చింది గానీ ఆయన రాలే. అలాగే జాగ్రత్తలు తీసుకుంటూ వుంటున్నాడు. ఎప్పుడో ఎగిరిపోతాడు అని మాకు భయంగానే వుంటుంది. సీత కూడా చాలా ప్రయత్నం చేసింది. ఇన్ని సంవత్సరాలకు ఇప్పుడు ఒప్పుకున్నాడట వస్తానని. సీత అటే వెళ్లింది ఆయన దగ్గరకు."

"వాళ్లిద్దరూ ఎలా వుంటారు? బాగుంటారా? సీత ఆయనకంటే పైస్థాయిలో వుందని ఏమన్నా యిబ్బంది పడతాడా?"

"ఆయనకు అలా అయితే లేకపోవచ్చు. ఇద్దరూ బాగుంటారు. ఒకవేళ దళంలోకి వచ్చాక అలా ఏమన్నా వున్నా సీత ఆయన్ని చక్కగా బాగు చేస్తుంది, అందులో ఏం సందేహం లేదు - అంత ఓపిక."

వెంటనే కలిగిన సందేహాన్ని అడగాలా? వద్దా? అని సంశయించింది మమత.

ఏదో అడగబోయి ఆగిందని సంజీవ్‌కి అర్థమైంది.

"ఏంటి?"

" "

"ఏంటి పదిరోజుల్లో ఇంత మార్పా? 'మమత' మాట్లాడ్డానికి సందేహించడమా?!"

"మళ్లీ ఏ విలేకరి ఉదాహరణ ఇస్తావోనని."

సంజీవ్ ఒక్కక్షణం ఖంగు తిన్నాడు.

"ఛ, అస్సలు అలా అనుకోవద్దు, సారీ, నేను అన్నది నిన్ను మాట్లాడనివ్వద్దని కాదు కదా," విలవిల్లాడాడు.

"ఏంటో మహిళల విషయంలో నాకు కొన్ని వెంటనే వస్తాయంతే. చెప్తానా చెప్పనా అనేది అవతలివాళ్లను బట్టి వుంటుంది గానీ ఆలోచన అయితే ఆగదు..." అంది మమత ఇంకా దయదలచకుండానే.

"అయిపోయింది నా పని. ఇలా అన్నావంటే నీకు నేను ఎలా కనిపిస్తున్నానో అర్థమైంది. ఇంతకంటే శిక్ష, అవమానం మరొకటి వుండదు నాకు."

అప్పుడిక దిగి వచ్చి, "మరీ అంత దిగులుపడకులే. అలా అనుకుంటే యిదీ చెప్పేదాన్ని కాదుగా," అంది.

"మరైతే చెప్పు."

"అహ,...సీత ఓపిగ్గా నాలుగైదు ఏళ్లుగా ఆయన్ని ఒప్పించి దళాల్లోకి తేవడానికి ప్రయత్నించింది కదా, అక్క స్థానంలో అన్నలుంటే అంత ఓపిగ్గా వుంటున్నారా అని."

"వూ...చరిత్రలోకెళ్దామా?"

"ఓహో..ఎంత అనుభవం వుందేం, చూస్తే చిన్నవాడిలా వున్నావు?"

"చెప్తారుగా సీనియర్లు."

"సరే."

"మొదట్లో దళాల్లోకి ముఖ్యంగా మైదాన ప్రాంతాల్లో అన్నలే ఎక్కువగా వచ్చారు. వాళ్లకి కొందరికి ఇంటికాడ పెళ్లిళ్లయినా అందరు అక్కలూ దళాల్లోకి రాని స్థితి వుండింది. ఉద్యమం పెరిగాక కూడా కొందరికి ఇలాంటి స్థితి ఎదురైంది. అప్పుడు కొందరు అన్నలు తొందరపడి ఆ సంబంధాన్ని వదులుకోడానికి ప్రయత్నించిందీ వుండిందట. తర్వాత ఆ అక్కలు కొందరు రావడానికి సిద్ధపడ్డారు. ఒకోసారి పేరున్న పార్టీ నాయకుడి భార్య కాబట్టి ఆ అక్కకు ఇతన్ని వదిలిపెట్టి వేరే పెళ్లి చేసుకోవాలన్నా సమస్యే అయ్యిందట. అలాంటప్పుడు వీళ్లే మాట్లాడి పెళ్లి చేసిన సంఘటనలు కూడా వున్నాయంటారు. కొంతమంది అన్నలు చాలా ఓపిగ్గా ప్రయత్నించిందీ వున్నదంటారు. ఇదంతా చూసి పార్టీ ఒక నిబంధన చేసింది. 'సహచరులు ఇంటి వద్ద ఉన్నప్పుడు' అని వుంటది గానీ అది 99 శాతం భార్యలు ఇంటి వద్ద వున్నప్పుడు అనే అర్థం, సీత లాంటి కేసులు అరుదు గానే వున్నాయి."

"ఇంతకీ ఏంటా నిబంధన?"

"అదే చెప్తున్నా. సాధ్యమైనంత వరకూ ఆమెతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవద్దు. ఆమె ఇంటి దగ్గర ఉంటూ కూడా సహకరించినంత కాలం వివాహబంధం కొనసాగించాలి. ఆమె ససేమిరా అని విడాకులిస్తానంటే, ఇక ఏ మాత్రం కలవనంటేనే విడాకులు ఇవ్వాలి. కచ్చితంగా విడాకులు తీసుకోకుండా మరో పెళ్లి ఆలోచన చేస్తే పార్టీలో అది తప్పు, శిక్షార్హం."

"ఇది చరిత్ర అన్నావు కదా, వర్తమానం ఏంటి?"

"మనం ఇప్పుడు 2001 లో వున్నాం. ఇప్పటి స్థితి ఏంటంటే చాలావరకూ ఇలాంటి జంటలు లేవు, మెజారిటీ కామ్రేడ్స్ పెళ్లిళ్లు కాకుండానే రిక్రూట్ అవుతున్నారు. ఎక్కడైనా ఇలాంటి కేసులు వున్నా పార్టీ నిబంధన ప్రకారమే అమలవుతోంది. ప్రయత్నం చేసినప్పుడు అలాంటి అక్కలు రిక్రూట్ అయ్యి పని చేస్తున్నదీ, కొందరు అక్కలైతే అమరులయ్యిందీ కూడా కళ్లెదురుగా ఒక ఉదాహరణగా, ఆదర్శంగా వుంది కనుక కూడా అసలెవరూ అలా ఆలోచించేదే లేదు."

"ఉంటే పార్టీ వూరుకోదు."

"అంతే కదా, ఏమైనా అసలు లేవులే, నేను వచ్చాక అయితే నాకు తెలిసి ఒక్కటి కూడా లేదు. ఇవన్నీ నేను కూడా వినడమే."

"కానీ నిజంగా రారనుకున్న అక్కలు రావడం, పార్టీలో పని చేయడం, ఎంత గొప్ప విషయం కదా!"

"కాదా. అందులోనూ చాలామంది పిల్లలున్నవాళ్లు, అలాగే తమ భర్తల్ని తీసుకుపోవాలని కంకణం కట్టుకుండినవాళ్లూ కూడా. వాళ్లు అంతగా మారడం అంటే ఉద్యమ ప్రభావమే."

"సహచరుల ప్రభావం?"

"అదిక ప్రాథమికం కదా భార్యభర్తల సంబంధంలో. ఆ పునాది వుంది కనుకనే ఉద్యమం గురించి వాళ్లు ఆలోచించారు. కానీ రావడానికి ఒప్పించింది ఉద్యమమే అనాలి."

"నిజంగా ముందు తొందరపడి వేరే ఆలోచనలు చేసినవాళ్లు తర్వాత భార్య రావడానికి సిద్ధపడింది అని తెలిశాక ఎలా ఫీలై వుండచ్చు?"

"వాళ్లు ఎలా ఫీలయ్యారో గానీ నాకైతే అది తల్చుకుంటేనే ఒకలాగా అన్పిస్తది. సహచరులుగా వాళ్లు ఆ అక్కల అంతరంగాన్ని ఏం అర్థం చేసుకున్నట్టు? పార్టీ బలవంతపు కాపురాల కంటే విడాకులు నయమని చెప్పినా, ప్రేమ లేని బంధం నిలవదని చెప్పినా దానర్థం ఇది కాదు కదా? ఆమె సిద్ధపడనప్పుడు యాంత్రికంగా అలాగే ఈన వుండిపోవాలని అనడం లేదు. కానీ సరైన ప్రయత్నం చేయకుండానే? అందులోనూ మనలాంటి వెనుకబడిన సమాజంలో స్త్రీల సున్నితమైన పరిస్థితి చూసినప్పుడు. నిజంగా చెప్పాలంటే వాళ్లు అలాంటి ఆలోచనలు చేసినా ఆ అక్కలు క్షమించి వాళ్లతో కలిసి వుండినారంటే వాళ్లెంతో ఉన్నతంగా అన్పిస్తారు నాకైతే."

"అందులో వెనకబాటుతనం కూడా వుండచ్చుగా."

"వుండచ్చు. కానీ అది ఒక మేరకే. అందరిలోనూ లేకపోవచ్చు కూడా. ప్రేమ వుంటుంది. క్షమాగుణం, తప్పుల్ని సరిదిద్దగల మానసిక ఔన్నత్యం...ఇవన్నీ లేకుండా కాపురం ఎలా సాధ్యం అసలు? కాదా మమతా?"

నిజాయితీ ఉట్టిపడ్తున్న కళ్లతో సంజీవ్ తనకేసి సూటిగా చూస్తూ అడిగిన ప్రశ్నకు మమత అప్రతిభురాలైంది. ఆ అక్కల పట్ల లోతైన సంజీవ్ స్పందన, ఆ విశాలమైన కళ్లలో కన్పించిన ఆవేదన మమతని కదిలించాయి.

మమత తలూపింది. మమత ఏమన్నా సమాధానం చెప్పేలోగానే సంజీవ్ మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"ఇదనే కాదు మమతా, చాలా విషయాల్లో నాకు అన్పిస్తూ వుంటుంది, అన్నలకంటే అక్కలే చాలా విషయాల్లో ఉన్నతంగా ఆలోచిస్తారని. అది పార్టీ రాజకీయాల వల్లే కాక సమాజంలో నిరంతరం స్త్రీలంటే నిస్వార్థంగా వుండాలని నూరిపోయడం వల్ల కూడానా అని కూడా అన్పిస్తుంది ఒకోసారి. అందుకే అన్నలకంటే అక్కలు తొందరగా కమ్యునిస్టు నిస్వార్థాన్ని అర్థం చేసుకుంటారా అని కూడా అన్పించేస్తూ వుంటుంది కొన్ని సంఘటనలు చూస్తుంటే. అలాగని నేను మన దేశంలోని వెనుకబడిన సమాజంలో, ఇంకా వెనుకబడి వున్న స్త్రీలలో వుండే సంకుచితత్వాన్నీ, ఆత్మన్యూనతా భావాన్నీ లేవని అనడం లేదు. అవి లేనట్టుగా పార్టీలోని స్త్రీలందరినీ రొమాంటిసైజ్ చేసి ఉన్నతంగా చిత్రీకరించాలనీ కాదు. ఎందుకంటే ఈ లోపాలున్నాయని గుర్తించకుంటే పార్టీ విశ్లేషణ లెక్క తప్పినట్లే, వాళ్లకి సహాయమూ చేయలేం. కానీ నేను వాస్తవంగా పార్టీలోకి వచ్చినప్పటి నుండి మెజారిటీగా చూసింది చెప్తున్నా, మినహాయింపులు దేనికైనా వుంటాయి గానీ. ఎన్నెన్ని ఉదాహరణల్లో అక్కలే చాలా బాగా ఆలోచించినదీ, స్పందించినదీ నాకు కనిపించింది.

అంతే కాదు, పార్టీలో అక్కలు ఎన్ని విషయాల్లో కొట్లాడాల్సి వచ్చిందో, చిన్నవీ, పెద్దవీ ఎన్నో. వాళ్లలోనూ ఆత్మన్యూనతా భావం ఎన్నో రూపాల్లో వుండేది. కొన్నిసార్లు వాస్తవంగా లేనప్పుడు కూడా పితృస్వామ్యం కళ్లద్దాలతో చూడ్డమూ వుండేది. ఇలా ఎన్నో రకాల భావాల ఘర్షణ వల్లా, ఎంతమంది కృషితోనో ఇప్పటికిలా వున్నాం. కమ్యునిజం వరకూ కనీసం సోషలిజం వరకూ ఈ ఘర్షణ తప్పదు నిజమే గానీ ఆ క్షణాల్లో అక్కలు అనుభవించే మానసిక బాధను మాత్రం తీసేయలేం కదా అనిపిస్తది నాకు. మమతా! చందమామ కేసి వేలు చూపిస్తే చందమామను కాక వేలిని చూసేవాడు మూర్ఖుడు అని చైనా సామెతట. ఇంతకీ నీకు నేను చూపించే చందమామ కనిపిస్తోందా?"

"లేదులే, నేను చందమామనే చూసే ప్రయత్నం చేస్తున్నా గానీ ఈ చీకటి ఒకలాంటి దిగులు మేఘాన్ని కమ్మి వెలుతురును మసకబారుస్తోంది."

"దిగులుపడ్డం ఒక మేరకు మంచిదే, దిగులు పడకపోతే దాన్ని మార్చాలనే కోరిక అంత బలంగా వ్యక్తం కాదేమో?"

"కావొచ్చు", అని ఒక్క క్షణం ఆగి, "కానీ సంజీవ్! నువ్వింత స్త్రీ పక్షపాతివని నేను అనుకోలే సుమా."

"స్త్రీ పక్షపాతిని కాదు మమతా, వాస్తవవాదిని అంటే కమ్యునిస్టుని అనుకో. వాస్తవం నిన్ను ఎప్పుడైనా గానీ స్త్రీ పక్షపాతిగానే నిలుపుతుంది."

"నీలో ఇంత మార్పు, ఆవేశం ఎలా అసలు?" అంతు బట్టని ఏదో ప్రశ్నని అడిగినట్టుగా అడిగింది.

"ఆవేశం అంటావా? సరే, అలాగే అనుకుందాం. మార్పు అంటే...నీకు తెలుసు..మామ..అదే మీ నాన్న..ప్రభావం నా మీద చిన్నప్పటి నుంచి తెలీకుండానే పడింది. ఆయన ఆడపిల్లల్ని ఏ మాత్రం తేడా చూడకపోవడం, ఎవరైనా చూసినా సహించకపోవడం... ఆయన చదవమని ఇచ్చిన సాహిత్యం...అన్నీ ఒక ప్రభావం. ఒకసారి గుర్తుందా? మేం క్రికెట్ ఆడుతుంటే నువ్వూ ఆడతానంటే మగపిల్లలం అందరం వద్దనేశాం. అప్పుడు మామ మాకు క్లాసు తీసుకున్నాడు..."

"అంతకంటే ఘోరంగా నువ్వోసారి ఆడవాళ్లు ప్యాంట్, షర్ట్ వేసుకుంటే నాకు నచ్చదు అన్నావు. అప్పుడు నేను నీ మీద పడి కరిచినంత పని చేశాను..నిన్ను ఎవరు అడిగారోయ్ అంటూ..గుర్తుందా?"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఏంటో అప్పుడు అలా వున్నాను. ఇప్పుడసలు పొడుగు జుట్లూ, కాళ్లకడ్డం పడే బట్టలూ, నగలు దిగేసుకున్న ఆడవాళ్లను చూస్తేనే జాలేస్తుంది."

"కారణం - పార్టీలోకి రావడమేనా?" మళ్లీ తనడిగిన ప్రశ్నను గుర్తు చేస్తూ.

"ఒక మనిషిలో మార్పు కలగడానికి సమాజంలో మార్పులకున్నట్టే కారణాలు అనేకం వుండచ్చేమో. కానీ వాటి, వాటి పాత్రను బట్టి ప్రాధాన్యతలు వుండచ్చు. కొన్నిటికి కీలకమైన మలుపు తిప్పే పాత్ర వుండచ్చు."

"అంటే?"

"అంటే, ఇప్పుడు అనుకున్నదే తీసుకుంటే క్రాపులూ, ప్యాంట్ షర్టులూ అలవాటు కావడానికి విప్లవం అవసరం లేదు. సమాజంలో పెట్టుబడిదారీ సంబంధాలు పెరగడం వల్ల వచ్చే మార్పులు పురుషుల్ని ఈ మార్పులకు అలవాటు చేయచ్చు. ఇందాక చెప్పిన క్రికెట్ ఆడ్డం లాంటివాటికి సంస్కరణ భావాలు సరిపోతాయి. అయితే ఒక విప్లవకారుడు కావడం వల్ల ఈ మార్పుల్ని మరింత శాస్త్రీయంగా అర్థం చేసుకుని ఆహ్వానిస్తాడు. అందులో విపరీతం ఏమన్నా వుంటే వ్యతిరేకిస్తాడు. స్త్రీల స్వేచ్ఛను ఎత్తిపడ్తూనే ఫ్యాషన్ల పేరుతో జరుగుతున్నదాన్నీ, క్రికెట్ చుట్టూ జరుగుతున్నదాన్నీ వ్యతిరేకిస్తాడు. అంటే స్వేచ్ఛను కేవలం దానిగానే కాక అది ఏ ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది అని కూడా చూస్తాడు. పెట్టుబడిదారీ భావాలు గానీ, సంస్కరణభావాలు గానీ ఇవ్వలేని స్త్రీల విముక్తి గురించిన సరైన శాస్త్రీయమైన భావనను ఇవ్వగలిగేది మాత్రం మార్క్సిజమే కదా. విప్లవంలో స్త్రీల పాత్రను గుర్తించలేం ఇది లేకుంటే. నాకైనా మొదట్లో అంతే."

"సరే అదొక విషయం అనుకో. పార్టీలో చేరాక నీలో మార్పు వచ్చిందా, లేదా? అది కదా నేనడిగింది."

మమత ఆత్రుత చూసి సంజీవ్‌కి నవ్వొచ్చింది. అప్పటికీ ఇంకా సూటిగా సమాధానం చెప్పకుండా,

"నీకేమనిపిస్తోంది?" అని అడిగాడు.

"చాలా వుందనిపిస్తోంది. అదేంటో చెప్పలేను గానీ చాలా విషయాల్లో కూడా మార్పు. స్త్రీల విషయంలో అనే కాదు."

"ఊఁ - నిజమే. నా ఒక్కని గురించే చెప్పాలంటే మామ ప్రభావం వల్ల స్త్రీల పట్ల తక్కువ భావం నాకు పార్టీలోకి రాకముందే పోయింది. ఇక మొత్తంగా ఇంటిలో, సమాజంలో, స్కూల్లో ఇతరుల నుంచీ, వివిధ రకాలుగా అందిన జ్ఞానం నుంచీ నేను స్వీకరించిన సంస్కారం వల్ల స్త్రీని భోగవస్తువుగా చూడ్డం అనేది ఎన్నడూ లేదు. కానీ సమాజ మార్పులో స్త్రీల పాత్రను గుర్తించడంలో మాత్రం నాలో సీరియస్ లోపం వుండింది. అది మాత్రం నాకు పార్టీలోకి వచ్చాకే పోయింది."

"మహిళా పరస్పెక్టివ్ క్లాసు విన్నాకా?" టక్కున అడిగింది మమత.

సంజీవ్ వెంటనే సమాధానం ఇవ్వలేదు. ఆలోచించు కుంటున్నట్టుగా ఆగాడు. చలికి దగ్గరకు తీసుకుని కూచున్నాడేమో కాళ్లు పట్టేసినట్టు అయినాయి. వాటిని కొద్దిగా వదులు చేసుకుని మళ్లీ మొదలుపెట్టాడు. మమత కూడా శాలువా మరింతగా చెవుల మీదకు లాక్కుని మంట సెగకు కాళ్లు వెనక్కి తీసుకుని సర్దుకుని కూచుంది.

"ఊఁ.. క్లాసు వల్లే అనలేను గానీ క్లాసు కూడా అనచ్చు. ముఖ్యంగా పార్టీలో, సైన్యంలో, సంఘాల్లో, మిలీషియాలో అంతటా అక్కల్నీ, వాళ్ల ఆచరణనీ చూశాక నాలో మార్పు వచ్చింది. అది కూడా నాకు తెలీకుండానే మెల్లగా వచ్చింది. అదో క్రమం అనొచ్చు. ఆ - ఒకటి మాత్రం చెప్పగలను...నాలో ఈ మార్పు వచ్చిందని స్పష్టంగా గుర్తించింది మాత్రం క్లాసు విన్నాకే."

"చాలా ఆసక్తిగా వుంది. ఇంకా చెప్పు. ఇంకా చెప్పు..."

మోకాళ్ల చుట్టూ చేతులు కట్టుకుని చలికి ముడుచుకుంటూ, మెరుస్తున్న కళ్లతో ఇలా అడిగిన మమతను చూస్తుంటే చిన్నప్పటి మమత గుర్తొచ్చింది సంజీవ్‌కి.

"చాలా చెప్పాల్సి వస్తుంది. ఒక రోజా, రెండు రోజులా, సంవత్సరాలు," వూరించాలని అనుకోకపోయినా వూరించినట్టే అన్నాడు సంజీవ్.

"ఎంతో కొంత చెప్పు. లేకుంటే నాకు నిద్ర పట్టదు."

"ఎలాగూ నిద్ర పట్టదులే. రేపు వెళ్లిపోవాలని ఏవో ఆలోచించుకుంటూ మెలకువగానే వుంటావు."

"ఏం కాదు. చక్కగా ముసుగు తన్ని వెచ్చగా పడుకున్న నన్ను నువ్వే లేపావు..డైవర్టు చేయకు..చెప్పంటే," గోముగా, ఒకలాంటి అసహనంతోనూ అంది.

"సరే వివరాలు వదిలేసి షార్ట్‌కట్‌లో చెప్తా..ఏంటో ఎలా చెప్పాలో! మొదట్లో అసలు అక్కలు వున్నారా, లేదా, వాళ్లేం చేస్తున్నారు, ఏం చేయట్లేదు ఏం పట్టేది కాదు నాకు. నేను, నా పనీ, నా 'మగ' కామ్రేడ్లతో పనిలో భాగంగా ఏర్పడే దోస్తానాలు, నా చదువు...ఇలాగే వుండేది. అక్కలు కూడా వుండడం అనేది ఒక రోజువారీ వాస్తవమే తప్ప నా ఆలోచనల్లో వాళ్ల ఉనికిని గుర్తించింది గానీ, వాళ్ల గురించి ఆలోచించింది గానీ ఎన్నడూ లేదు. ప్రేమ, పెళ్లి లాంటి విషయాల మీదా ధ్యాస లేదు కనుక లేక అలాంటి భావాలు కలగగల వ్యక్తులు నాకు తారసపడలేదు కనుక...ఇది ఇట్నుంచి అటూ, లేక అట్నుంచి ఇటూ ఎట్లయినా అయి వుండచ్చు గానీ, మొత్తానికి నేను ఆ విధంగా కూడా మహిళల పట్ల దృష్టి పెట్టింది లేదు. కానీ రోజులు గడుస్తున్న కొద్దీ విప్లవంలో వాళ్లు చేస్తున్న పనులూ, అందుకోసం వాళ్లు అధిగమిస్తున్న ఇబ్బందులూ, రోజువారీగా ప్రతిక్షణం చేసే త్యాగాలు మొదలుకొని ప్రాణత్యాగాల వరకూ వాళ్లలోని నిస్వార్థం, ఎదుర్కొంటున్న నిర్బంధం...ఇవన్నీ ప్రభావం వేయసాగాయి. నాకు తెలీకుండానే వాళ్లని గమనించడం, వాళ్ల పట్ల గౌరవం పెంచుకోవడం జరుగుతూ వచ్చాయి."

ఆలోచనలు కూడదీసుకోవడానికన్నట్టు సంజీవ్ ఆగాడు. రాధ సరిగ్గా అప్పుడే ఆటు వచ్చింది. అప్పటివరకూ ఆమె కూడా టెంట్‌లో చిన్న లైట్ పెట్టుకుని చదువుకుంటూనే వుండింది. పడుకునే ముందు ఇలా వచ్చింది. 'రేపు చాలా నడవాలి. పడుకోకూడదూ ఇక' అని సంజీవ్‌తో అందామనుకుని వాళ్ల దగ్గరకు వచ్చింది. కానీ వాళ్లిద్దరినీ చూశాక ఆ మాట ఎందుకో అనబుద్ధి కాలేదు. 'అడవిలో టెక్నికల్ సమస్య లేదుగా, మాట్లాడుకోనీలే' అనుకుంది. చేతులు కావుకుని 'పడుకుంటానిక' అని చెప్పి వెళిపోయింది.

రాధ వెళ్లినవైపు చూస్తూ, "రాధ కూడా నీతో రేపు మాట్లాడ్తదిలే," అన్నాడు సముదాయిస్తున్నట్లుగా.

"మంచిదే. అక్క నుంచి తన అనుభవాలు తెలుసుకోవాలి."

"అంత టైం వుండకపోవచ్చు. ఆమె నాలా అమాయకంగా అడిగినవన్నీ చెప్తూ కూచుంటుందనుకున్నావా. నీ నుంచే ఎక్కువ రాబడ్తుంది. చూసుకో."

"అవును పాపం చాలా అమాయకుడివి! అక్కను కొన్నైనా అడగాల్సిందే ఎలాగైనా."

"మీ ఇష్టం తల్లీ, మధ్యలో నేను చెప్పడం ఎందుకూ?"

"అదీ, అలా వుండు, 'మా మధ్య' నువ్వెందుకు మరి?"

"అమ్మో, సర్రుమని వస్తుందేం నీకు, మీరు, మేము అని."

"అంతా 'మీరు' చేసిందే కదా తరతరాలుగా."

"సరే, సరే, ఒప్పుకున్నాలే గానీ, ఇంకేంటి?"

"ఇంకేంటి ఏంటి? నువ్వే మాట్లాడుతూ ఆపావ్."

"ఇంకేం చెప్పను. నా లోపలున్నదంతా ఎలా వివరించాలి? మహిళ లేని విప్లవం గెలవబోదు అని మనం నినాదం ఇస్తాం కదా నాకైతే మహిళ లేని విప్లవం విప్లవమే కాదు అనిపిస్తుందిప్పుడు. అక్కల దృఢమైన, అంతే మృదువైన స్పర్శ విప్లవంలో భాగం కాకుంటే విప్లవం ఇంత అందంగా వుండిందేదా? అలా లేకపోవడం అనే వూహే ఎంత భయం గొల్పుతుందో!" ఒక్కసారిగా తల విదుల్చుకున్నాడు సంజీవ్.

మమతకు ఒళ్లు గగుర్పొడిచింది. హఠాత్తుగా తమ చుట్టూ గాలి సహా అంతా స్థంభించిపోయినట్టూ, ఆ ప్రగాఢ నిశ్శబ్దంలో మంట చిటపటలు, ఆకులపై పడుతున్న మంచు బిందువుల చిరుసవ్వడి కూడా స్పష్టంగా వినిపిస్తున్నట్టూ తోచింది.

"చిన్న విషయాలు అన్పించేవే ఒకోసారి గాఢమైన ముద్రనేస్తాయేమో. నేనింకా దళ సభ్యుడిగా వున్నప్పుడు మాతో సునీత అని ఒక సభ్యురాలు వుండేది. రైతాంగ కామ్రేడ్. ఆమెకు నెలవారీ నెప్పి బాగా వచ్చేది. మెలికలు తిరిగిపోయేది, కానీ తగ్గగానే మాతో పోటీ వడేది, కొంతమంది అన్నలే ఆమెతో పోటీపడలేకపోయేవారు పనుల్లో. ఏమిటీమె పట్టుదల అని ఆశ్చర్యం వేసేది. బహుశా నేను అక్కల ఉనికిని గుర్తించడం మొదలుపెట్టింది అప్పటి నుంచే అనుకుంటా. ఎన్‌కౌంటర్లలో, మేం చేసే దాడుల్లో కూడా వాళ్లు ఒకోసారి చూపే సాహసం, చొరవ, నిబ్బరం చూస్తే అబ్బురంగా తోచేది. నా కళ్లముందు ఒరిగిపోయిన అన్నలూ, అక్కలూ కూడా వున్నారు. చావు సమీపించినప్పుడు కూడా వాళ్లలో కనిపించిన దృఢత్వం ఎప్పటికీ మర్చిపోలేని మరో ముద్ర. ఒకసారి మేం హౌస్ షెల్టర్‌లో వున్నప్పుడు శత్రువు మమ్మల్ని చుట్టుముట్టాడు, మన దక్షిణ తెలంగాణలో మెదక్‌లో అప్పటికే చాలా దళాల్ని ఇలా కోల్పోవడంతో దళాన్ని కాపాడలేం అనే ఆందోళనతో నా బుర్ర కాసేపు పని చేయడం మానేసింది. యుద్ధంలో అవెంత కీలకమైన క్షణాలు! అప్పుడు మా డిప్యూటీగా వున్న అక్కే చొరవగా దాన్ని బ్రేక్ చేసి దూసుకుపోయి మాకూ దారి కల్పించింది, గాయపడింది కూడా. ఇలా ఒక విషయం అని కాదు, ఒక మనిషని కాదు, ఒక సంఘటన అని కాదు, ఇక ప్రజలే ఉక్కుకోట అన్నట్టు గ్రామాల్లో అక్కలు చేసే చిన్నా, పెద్దా పనులనైతే రోజుల తరబడి చెప్పుకోవచ్చు."

మమతకి చిన్నప్పటి సంజీవ్ గుర్తొచ్చాడు. 'నిజమే సంజీవ్ ఇదంతా చెప్తుంటే ఇప్పుడు గుర్తుకొస్తోంది అంతా. అతనసలు అమ్మాయిల ఉనికినే గుర్తించనట్టు వుండేవాడు. మిగతా సంజీవ్ స్నేహితులు గానీ, క్లాస్‌మేట్స్ గానీ వయసులో వుండే ఆకర్షణలతో తమకేసి చూసేవారు గానీ సంజీవ్‌లో అలాంటివేం వుండేవి కావు. అలా వుంటే అది నాలాంటి టీనేజి అమ్మాయిల దృష్టికి రాకపోవడం అనే సమస్యే లేదు. అతను అన్నట్టు అమ్మాయిలు అక్కడ లేనట్టే వుండేవాడు. కానీ ఇప్పుడు సంజీవ్ నాకేసి గానీ, అక్కల కేసి గానీ చూసే చూపులో ఒక తోటి మానవిని సంపూర్ణమైన విశ్వాసంతో, గౌరవించినట్టుగా చూసే ఒక భావం కనిపిస్తోంది. ఎక్కువ చేయడమూ లేదు, తక్కువ చేయడమూ లేదు, కేవలం ఒక సమానత్వ భావం..అంతే!

'ఆ - అదీ సంగతి. సంజీవ్ చేయి కలిపే పద్ధతి తనకెందుకంతగా నచ్చిందో ఇప్పుడు అర్థమౌతోంది, అంటీ ముట్టనట్లు కాకుండా సూటిగా కళ్లలోకి చూస్తూ 'మనిద్దరం విప్లవంలో సహచరులం, కామ్రేడ్సిమి' అన్నట్టు ఇచ్చే ఆప్యాయతతో కూడిన కరచాలనం అది. నేను ఇప్పటివరకూ సంజీవ్ పెద్ద చేతిలో తన చిన్న చేయి ఒదిగిపోయి అలా మంచిగా తోచిందేమో అనుకున్నాను. కానీ అది కాదు, ఇదే.'

కొంతమంది అన్నలు వేళ్లు తాకీ తాకనట్టు చేతులు కలిపితే మమతకు అస్సలు నచ్చేది కాదు. 'మేం పురుషులం, మీరు స్త్రీలు అని మర్చిపోరా ఏంటి వీళ్లు,' అని మనసులో విసుక్కుంది కూడా.

ఇలా అనుకునే వరకూ వూర్లల్లో అన్నలు సీతతో వుండిన తీరు గురించి తను సంజీవ్‌కి చెప్పాలనుకున్నానని గుర్తొచ్చి అదే విషయం చెప్పింది మమత.

వెంటనే ఏదో చెప్పబోయి, "చాలా మాట్లాడేస్తున్నానా? బోర్ కొట్టడం లేదు కదా?" అన్నాడు.

"దీనికి సమాధానం అవసరమంటావా?" లేశమాత్రంగా విసుగు ధ్వనించింది మమత గొంతులో.

సంజీవ్ నవ్వి, "నాకేమనిపిస్తుందంటే ప్రజలు తమను నడిపించే నాయకత్వాన్ని కోరుకుంటారు. అది స్త్రీలైనా గానీ, పురుషులైనా గానీ. ఆ నాయకత్వం అందుతుందనుకున్నప్పుడు వాళ్లు సంతోషంగా వారిని ఆమోదిస్తారు. మొత్తంగా పార్టీ తమ సమస్యల పరిష్కారానికి ప్రాతినిధ్యం వహిస్తుందని వారికి తెలుసు కనుక పార్టీ వ్యక్తులనగానే ముందు వారు ఆమోదిస్తారు ఒక స్థాయిలో. అయితే తమ రోజువారీ ఆచరణ ద్వారా ఆ వ్యక్తులు వారికి సరైన మార్గదర్శకత్వం వహిస్తూ వారి విశ్వాసాన్ని చూరగొనాల్సి వస్తుంది. సీత అలా చేయడం వల్లే నీకదంతా కనిపించింది. ఎక్కడన్నా మొదట పితృస్వామ్య భావజాలం వల్ల మహిళా నాయకత్వాన్ని ఆమోదించకపోయినా, అది వీళ్ల ఆచరణను చూశాక పటాపంచలు అయిపోతుంది. ఒకవేళ ఆ పాత్ర నిర్వహించలేకపోతే అక్క అయినా, అన్న అయినా వాళ్లు బైటకి ఎలా వున్నా మనసులో మాత్రం ఆమోదించలేరు. అక్కల విషయంలో ఆ అనామోదం పితృస్వామ్యం రూపంలో కూడా ఒకోసారి వ్యక్తం కావచ్చు, ఇది జనరల్‌గా జరిగేది. అంటే దీన్ని అక్కల ఆచరణతో ఎదుర్కోవచ్చు. అలా కాక పితృస్వామ్యం నరనరాన జీర్ణించుకుపోయి అకారణంగా అక్కలంటేనే చిన్న చూపుతో వ్యవహరించే వాళ్లు గ్రామాల్లోనూ, పార్టీలోనూ వుంటే వాళ్లతో హోరాహోరీ పోరాటమే ఇక. కానీ ఇప్పుడు మరీ అంతగా వ్యవహరించేవాళ్లు ఎవరూ లేరులే, వుంటే పురాతన మానవుడిలా చూస్తారు అంతా."

పురాతన మానవుడనే మాటకు మమతకి నవ్వొచ్చింది.

"మొత్తానికి ఏది అడిగినా నీకు క్లాసులు తీసుకోవడం బానే

వచ్చింది," అంది ఆటపట్టిస్తూ.

"ఇదే చూడు, వాగిచ్చేదంతా వాగించి మళ్లీ నేను క్లాసు తీసుకున్నానంటున్నావు."

"లేదులే, వూరికే అన్నాను. ఇంకా చెప్పు."

"మామ నీకు కథలు చదివి వినిపించి బాగా చెడగొట్టాడు, వూరికే ఏదో ఒకటి చెప్పమని అడుగుతూ వుంటావు."

"పోనీలే చెడిపోయినందుకే ఇలా యిక్కడ వున్నాను గానీ, ఇందాకేదో చెప్తుంటే నేనే ఇటు తీసుకొచ్చేశాను వూరు అన్నల గురించి చెప్పి."

"దారిలోనే వున్నాంలే, పక్కకు పోలే గానీ, ఇంకొక్క విషయం నాకు చాలాసార్లు ఒంటరిగా వుండి ఆలోచించుకున్నప్పుడు అనిప్తది. అన్నలంతా మారుతున్నారు మమతా, ఇంకా సరిగ్గా చెప్పాలంటే అక్కలు వాళ్లని మారుస్తున్నారు...అదీ తమని తాము మార్చుకోవడం ద్వారా అనిపిస్తుంది. సరిగా చెప్తున్నానా..అర్థమౌతోందా ఏం చెప్తున్నానో?"

"ఊఁ, వూ, ఆపకు."

సంజీవ్ కొన్ని క్షణాలు ఏం మాట్లాడలేదు. చీకటిలోకి సుదీర్ఘంగా చూస్తూ, తాను అక్కడ లేనట్టుగా ఏదో లోకంలోకి వెళ్లిపోయినట్టుగా కూచున్నాడు.

"అది ఒక మనిషో, ఒక చర్యో, ఒక సంఘటనో చేస్తున్న మార్పో, ఒక కాలంలో జరిగి ఆగిపోతున్న మార్పో కూడా కాదు. అది నిరంతరంగా, మొత్తంగా ఒక సామాజిక ఆచరణ వల్ల వస్తున్న మార్పు. ఒక సమూహంగా మొత్తంగా విప్లవక్యాంపులోని అక్కలందరి చర్యల సమాహారంగా వస్తున్న మార్పు. వాళ్లలా పని చేయకుంటే ఎన్ని మహిళా పరస్పెక్టివ్ క్లాసులు విన్నా మాలాంటి వాళ్లం దాన్ని గుర్తించే వాళ్లం కాదేమో. ఇంకో రహస్యం చెప్పనా? మా అక్కల్లో చాలామందికి తాము ఈ మార్పును తెస్తున్నాం అనేదీ, అన్నలకు తాము ఈ మార్పులకు గురవుతున్నామనీ కూడా రోజువారీగా తెలీదు, ఆ స్పృహ వుండదు. అదో క్రమంగా సాగి ఏ ఐదేండ్లకో చేసే సమీక్షల్లో ఏదో ఒక గుణాత్మక రూపంలో వ్యక్తం అవుతూ వుంటుంది. మహిళా రిక్రూట్‌మెంటు పెరగడమో, నాయకత్వంలో మహిళలు పైస్థాయిలో ఎక్కువ కావడమో లాంటి ఏవో చాలా మార్పులు. వాటి వెనుక ఇంత ఘర్షణ వుందనేది మేమే మర్చిపోతుంటాం, సంఖ్యల వెనక సత్యాలు ఎప్పుడో ఇలా తడుముకుంటే గానీ గుర్తుకు రావు," అన్నాడు మెల్లగా కూడబలుక్కుంటున్నట్టుగా ఆగి, ఆగి ఒక్కొక్క మాటా కూర్చుకుంటూ.

సంజీవ్ ఆగినప్పుడల్లా ఏ మాట వినకుండా పోతానో అన్నట్టు ముందుకు వంగి ఒళ్లంతా చెవులు చేసుకున్నట్టుగా వింటున్న మమతకు మెల్లగా ఏదో తరంగం శరీరమంతా వెచ్చగా పాకినట్టు అనిపించింది. సీతాకోకచిలుకల గుంపు ఎగిరినట్టుగా ఎన్నో భావాలు తలనిండా ఎగురుతూ...వాటన్నిటినీ ప్రశాంతంగా మనసు నిండుగా పరుచుకోవాలన్నట్టూ..కదిలితే ఎక్కడ ఏది ఎగిరి పోతుందో అని భయపడ్తున్నట్టూ అట్లే కదలకుండా కూచుంది.

మనసు లోతుల్లోంచి భావాల్ని పెకిలించి మాటలుగా పేర్చినందుకేమో సంజీవ్‌కి ఒకలాంటి అలుపు కలిగింది. తేరుకోడానికన్నట్టుగా తనూ మౌనంగా కూచున్నాడు. ఇద్దరూ యెంతసేపు అలా కూర్చున్నారో రాము వచ్చే వరకూ వాళ్లకి స్పృహ కూడా లేదు. మంట చప్పగా చల్లారిపోయింది.

క్యాంపు సెంట్రీ రాము ఇద్దరూ మౌనంగా అలా కూచోడం చూసి దగ్గరకొచ్చాడు.

సంజీవ్ రాముకేసి చిరునవ్వుతో చూశాడు.

"బాగా చలి పెడ్తుంది కదా," అన్నాడు రాము మంటని ఎగదోసి కాళ్లూ, చేతులూ కాపుకుంటూ.

మమత అప్పుడే కలలోంచి మేలుకున్నట్టుగా 'వూ' అని రాముతో అని, సంజీవ్‌కేసి ఎవరో కొత్త మనిషిని చూసినట్టుగా చూసింది.

"ఇకంతే కదా, పడుకుందామా, తెల్లారి లేచి ఆయనకు వుత్తరం కూడా రాయాలి, అస్సలు వీలు కాలే ఇప్పటివరకూ," అన్నాడు సంజీవ్.

ఆయనకు అంటే నాన్నకి అని అర్థమైంది మమతకు. రాము వున్నాడని అలా అన్నాడని అర్థం చేసుకుంది.

తలూపి లేచింది. ఇద్దరూ లేచి వెళుతుంటే రాము కూడా మంట దగ్గర నుంచి కదిలాడు. సంజీవ్ మమతతో పాటు జ్యోతి పడుకున్న టెంట్ దాకా వచ్చాడు.

"ఇంతకీ...రిపోర్టు రాస్తావుగా, రేపు ఇక ఎలాగూ కుదరదు గానీ వెళ్లాకైనా రాసి పంపు, మామకి కాంటాక్టు వుందిలే."

"వదలరన్న మాట."

"నువ్వు వదిలావా నన్ను, అన్నీ బైట పెట్టించలే, నేనెందుకు వదులుతా."

మమత నవ్వులో చిరుగర్వం మెరిసి మాయమైంది.

'మళ్లెప్పుడు కలుస్తామో' అనే భావన ఇద్దరికీ కలిగినా ఎవరూ దాన్ని బైటకు వ్యక్తం చేయలేదు. ఒక్క క్షణం మమత ముఖంలోకి సంజీవ్ దేన్నో వెదుకుతున్నట్టుగా తదేకంగా చూశాడు. కానీ తనకేసి సూటిగా వెన్నెల్లో మెరుస్తున్న చిరునవ్వుతో నిర్మలంగా చూస్తున్న రెండు కళ్లు తప్ప అతనికి ఇంకేం కనిపించలేదు. కళ్లు తిప్పుకుని వెనుతిరిగాడు.

తలొంచుకుని వెనక్కి తిరిగి వెళ్లిపోతున్న సంజీవ్‌ని చూస్తూ, 'రిపోర్టు ఏమో గానీ, రూపొందుతున్న నూతన మానవుడి గురించి మాత్రం రాయగలిగితే బాగుండు, ఎప్పటికైనా రాయగల్గుతానో, రాయొస్తదా' అనుకుంటూ టెంట్ గుంజనానుకుని అట్లే నుంచుంది మమత.

మమత తను కనుమరుగయ్యే వరకూ అలాగే నిల్చుని చూస్తుంది అని సంజీవ్ మనసుకి ఎలాగో అర్థమైంది. మళ్లొకసారి వెనక్కి తిరిగి చూడాలనే బలమైన కోరిక వూపింది గానీ అణుచుకున్నాడు. వెనక్కి పరుగెట్టుకుని వెళ్లి, "నేనింకా మారాలి మమతా, ఎందుకోగానీ, నన్నెప్పుడూ ప్రశ్నించే నీ సహాయం అందుకు కావాలనిపిస్తుంది. నేను విప్లవకారుడ్ని కావాలనే ఒక్క విషయం తప్ప ఇంతకంటే స్పష్టంగా నా మనసుకు తోచిన విషయం మరొకటి లేదు. నన్ను మార్చుకుంటావా మరి?" అని అడిగేయాలనిపించింది.

పడమట ఉదయించే సూర్యుడు

వి. శాంతి ప్రబోధ

నా గాలికి నా మట్టికి నా ఊరికి చేరువవుతున్న కొద్దీ పులకరింత నా తనువంతా వ్యాపిస్తూ.. శరీరం దూదిపింజలా తేలికైపోతోంది. ఎంత వడివడిగా వేసినా నా అడుగులు నెమ్మదిన్చినట్లుగా.. నా ఇంటిదారి దూరం పెరిగిపోయినట్లుగా.. ఏమిటలా.. అంతలోనే అదిమిపెట్టిన సందేహాలు మళ్ళీ మళ్ళీ పొడుచుకొస్తూ.. నా వాళ్ళు నన్ను గుర్తిస్తారా.. దాదాపు పదిహేనేళ్లపైనే అయింది చూసి.. ఎటుపోతున్నాడో కూడా తెలియకుండా.. పోయి పోయి.. ఇప్పటికి ఇన్నాళ్ళకి ఇన్నేళ్ళకి తనవారికి చేరువ కాబోతున్నాడు. వాళ్ళంతా తనని మరచి పోయారేమో.. అమ్మ కన్నీరు ఇంకిపోయేలా ఏడ్చి ఉంటుంది. నాన్న మనసులో మెలిపెట్టే బాధని నుదుటి మడతల్లోనో బుర్ర మీసాల్లోనో దాచేసి అమ్మని ఓదార్చి ఉంటాడు. అసలు ఏమయ్యాననుకున్నారో.. ఆలోచనల్లోనే ఊళ్ళోకి అడుగుపెట్టేశాడు సురేష్

గంపెడు పిల్లలకోడిలా సందడి సందడిగా ఆప్యాయత అభిమానం కలబోసిన ప్రేమపూర్వక పలకరింపులూ, పరాచికాలూ, ఆత్మీయకలయికలూ, ఎంతో నిండుగా సవ్వడి చేసే పిల్లల కేరింతలు, లేగదూడల అంబా అరుపులూ, పిచ్చుకల కువకువలూ, కోయిల పాటలూ, పక్కగా పారే సెలయేటి గలగలలూ, పచ్చని పొలాల మీదుగా వీచే పైరగాలి.., ఇళ్ళముందు ఆహ్వానం పలికే బంతీ చేమంతులు, మల్లె-మందారాలు, గులాబీల గుబాళింపులు కంటికింపుగా హరివిల్లులా కదలాడే తన పల్లె స్వాగతించే క్షణాలకోసం తపించి పోయిన సురేష్ మూగనోము పట్టినట్లున్న ఊరిని చూసి ఆశ్చర్యపోతూ.. ఈ సాయం సంధ్యా సమయంలో వడివడిగా ఇళ్ళకు చేరే కూలీ మహిళలు, రైతులు, పశువులు ఏరీ.. ఎక్కడ..? రకరకాల సందేహాలు మదిలోంచి తొలుచుకొస్తుంటే చుట్టూ పరికిస్తూ నడుస్తున్నాడు సురేష్

పూరిపాకల స్థానంలో డాబా ఇళ్ళు అక్కడక్కడా. చాలా ఇళ్ళు పాడుబడ్డట్టుగా. ఆ పచ్చదనం ఆ నిండుదనమే లేదు. కళాకాంతి విహీనంగా.. ఒక్క మాటలో చెప్పాలంటే వల్లకాడులా అగుపిస్తూ.. పెంటకుప్పలపై కాళ్ళతో కెలికి ఆహారం అన్వేషించే కోళ్ళు.. చెట్లపై చేరే పక్షుల కిలకిలారావాలు.. ప్రకృతిలో మమేకమైన ఆ క్షణాలు గుర్తుకొస్తుంటే సావాసగాళ్ళేవరన్నా కన్పిస్తారేమోనని చుట్టూ పరికిస్తూనే తన ఇంటి ఆనవాళ్ళకోసం ప్రయత్నిస్తున్నాడు. నీళ్ళు మోసే అమ్మలు, అవ్వలు, అక్కలు చెల్లెళ్ళు ఎవరూ కన్పించరేం.. ఆలోచిస్తూ నాలుగడుగులేశాడోలేదో మంచినీటి బోరింగ్ దగ్గర రంగువెలసిన ప్లాస్టిక్ బిందెలతో ఇద్దరు మహిళలు. ఒకావిడ వెళ్తూ, మరొకావిడ పంపుకొడుతూ.. మిలమిలలాడే ఇత్తడి బిందెలు, తళతళలాడే స్టీలు బిందెలు, వెండిలా మెరిసే సీమెండి బిందెలు కళ్ళలో మెదులుతుండగా.. కళ్ళు చికిలించి చూస్తున్నవారిని గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు. ఎండిపోయినట్లున్న బక్క పలచటి అవ్వను చూస్తుంటే బాగా ఎరిగిన పోలికల్లాగే... పోల్చుకోడానికి అతని మెదడు వేగంగా కదులుతోంది. ప్చ్.. లాభం లేదు. ఆమె నీళ్ళ బిందెతో వెళ్లి పోయింది

ఊరు మొదట్లోనే బోరింగ్ దగ్గరలోనే తన ఇల్లు. కాని ఆనాటి నా ఇంటి ఆనవాళ్ళేవీ.. లేవే.. ఎలా గుర్తించను? ఇల్లు డాబాగా మారిందనుకున్నా వెనకదోడ్లో ఉండే మామిడి, తాటి, ఎదర ఉండే కొబ్బరి చెట్లేవని వెతికాయి అతని కళ్ళు. ఊళ్లో అసలు తాటిమానే కనిపించలేదు. అక్కడక్కడా తలలు విరిగిన కొబ్బరి చెట్లు అనాథల్లాగా.. గత జీవితానికి మూగసాక్షిగా నిలిచినట్లుగా ఉన్న ఊరిని చూసి అతని మనసు మూగగా రోదిస్తోంది. ఇంటర్నెట్ సహాయంతో వెతికి వెతికి చివరికి తన ఊరు చిరునామా తెల్సుకోగలిగాడు. పైస పైసా కూడబెట్టుకుని ఎంతో ఆత్రుతతో, ఉత్సాహంతో వచ్చాడు తన వారికోసం. హృదయం అయిన వారి కోసం తహ తహ లాడిపోతోంది. కానీ ఏ ఆధారంతో గుర్తించను

అతని జీవితంలో ఎన్నడూ ఎరగని, తట్టుకోలేనంతటి భావసంచలనంతో మనసు లోపల సుళ్లు తిరుగుతున్న ఈ మాటల్ని 'ఎప్పటికైనా మమతతో అనగలనా, ఆమె నన్ను స్వీకరిస్తుందా?' అని సందేహిస్తూ నడుస్తుంటే మమత నుంచి అతనిని దూరంగా తీసుకెళ్లే ప్రతి అడుగూ భారంగా పడుతున్నట్టుగా సంజీవ్‌కి తోచింది.

("పితృస్వామ్యంపై అందరం పోరాడినా, ఆ పోరాటానికి నాయకత్వం మాత్రం మీదే (అక్కలదే) వుండాలి," అని స్పష్టంగా చెప్పి ప్రోత్సహించిన కామ్రేడ్ శ్యామన్న (నల్లా ఆదిరెడ్డి, కేంద్రకమిటీ సభ్యుడు) నుండి, చేయి కలపడంలోనే మాలో వానవిల్లును విరియించగల్గిన కామ్రేడ్ సంజీవ్ (దామోదర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యుడు), "అక్కల నాయకత్వంలో పని చేసే అవకాశం కలగడం నా అదృష్టం," అని పొంగిపోయిన 'మేరా దిల్ కా టుక్‌డా' కామ్రేడ్ ప్రసన్న వరకూ ఎందరో, ఎందరో 'నూతన మానవుల'కు.

కా.ప్రసన్న (వెంకటయ్య) అమరత్వం - 24.05.2009)

మహిళా పర్‌స్పెక్టివ్ - మహిళా సమస్యపై మునుపటి సిపిఐ (ఎం.ఎల్.) (పీపుల్స్‌వార్) రూపొందించిన డాక్యుమెంటు. *2004*లో సిపిఐ (మావోయిస్టు) ఏర్పడ్డాక దీనిని ఐక్య పార్టీ డాక్యుమెంటుగా తిరిగి రూపొందించారు.

నా ఇంటిని. తల్లిదండ్రులనైనా గుర్తించగలనా.. ఈ పదిహేనేళ్ళల్లో గుర్తించలేనంతగా మారిపోతారా మనుషులు..? అనుకుంటుండగా.. భూమికి జానెడు బెత్తెడు లేని నీవు, పొట్టి నిక్కర్లు వేసుకుని తిరిగే నీవు తాటిచెట్టులా ఎదగలా.. ప్రశ్నించింది అతని మనసు.

సురేష్ కి అర్థమైపోయింది తన ఇల్లు గుర్తించడం కష్టమని. మరో బిందె నీళ్ళ కోసం వస్తున్న ఇందాకటి అవ్వకెదురెళ్ళి బుస్సా రాఘవులు ఇల్లు ఏదని అడిగాడు. ఆవిడ అలా అతని వైపే కళ్ళార్పకుండా చూస్తోంది. దీర్ఘంగా చూస్తోంది. పడమటి అరుణకిరణాలు ఆకళ్ళ మీద పడ్డాయేమో కళ్ళు చిట్లిస్తూ.. ఎవరు బాబూ అడిగింది బావిలోంచి వచ్చినట్లున్న గొంతు సవరించుకుంటూ. అడుగులో అడుగువేస్తూ ఆమె దగ్గరగా వెళ్లి మళ్ళీఅడిగాడు. 'ఎందుకు బాబూ' అంటూ తన ఇంటికేసి కదిలిందామె.

ఆమె వెనకే అడుగులేస్తున్న సురేష్ ని చూసిన మరో స్త్రీ 'ఇంతకీ మీరెవరు బాబూ.. ప్రశ్నించింది.

'నేను రాఘవులు కొడుకుని' ఉద్వేగంగా చెప్పాడు.

"ఎవరూ.." అవ్వ గొంతులో ఉత్కంట, ఆశ్చర్యం. 'ఆ.. రాఘవులు కొడుకువా.. అంటే.. "తను విన్నది నిజమా అని సందేహం ఆమెలో.

'అవును నేను బుస్సా రాఘవులు పెద్ద కొడుకుని...'అతని మాటలు పూర్తి కాకుండానే అవ్వ సురేష్ దగ్గరకి వచ్చి చూస్తోంది. మసకమసకగా అగుపిస్తున్న అతని చేతులు పట్టుకుని నలిపేస్తూ.. 'పెద్దోడా.. 'అంటూ ఏడవడం మొదలు పెట్టింది. ఆవిడ ఎందుకు ఏడుస్తోందో..అర్థం కాక అయోమయంలో.. అతను. ఆమె స్పర్శ అతన్ని కదిలిస్తోంది..

'ఎందుకేడుస్తావే.. లేదు రాడనుకున్న కొడుకు చెట్టంతై నిలువెత్తు బంగారంలా నిన్నెతుక్కుంటూ వస్తే ఏడుస్తావేమే..?' సముదాయిస్తోంది మరో స్త్రీ.

'కన్న కొడుకు కళ్ళ ముందుకొస్తే గుర్తించలేని గుడ్డి దాన్నయ్యానే..' మరో సారి రాగం తీస్తూ కళ్లొత్తుకుంది. కొడుకు ఒళ్ళంతా ప్రేమగా తడుముతోంది ఆమె. అవును, అది తన తల్లి స్పర్శే. అంటే.. అమ్మ.. అమ్మ అంత ముసలిదై పోయిందా..నిండు పున్నమిలా వెలిగే అమ్మ మొహంలో రెండు కొండల మధ్యనుండి ఉదయించే సూర్యుడిలా వెలిగే బొట్టు.. ఏది? కొడిగడుతున్న దీపంలా ఉన్న ఈమె తన తల్లి.. అతని కళ్ళు ఒప్పుకోవడం లేదు. కానీ ఆ స్పర్శలోని వెచ్చదనం అమ్మ అనే చెబుతోంది. సగం జీవితం చూడని అమ్మ అంత ముసలైందా.. తలెత్తే ప్రశ్నలని అదిమి 'అమ్మా 'అంటూ తల్లిని అల్లుకుపోయాడు సురేష్

'నాయనా ఉన్నావా.. బాగున్నావా.. నా బంగారు తండ్రీ ఈ ముసలి తల్లిని వెతుక్కుంటూ వచ్చావా.. ఏమై పోయావురా బంగారు తండ్రీ 'అంటూన్న ఆమె మొహంలో అమావాస్యనాడు పూర్ణచంద్రుడు వచ్చినట్లుగా.. వెలుగు. ఏళ్ల తరబడి దాగిన దుఃఖం కట్టలు తెంచుకుని కళ్ళలోంచి జలపాతంలా దుముకుతుండగా.. జమిలిగా ఎగిసి పడుతున్న దుఖాన్ని సంతోషాన్ని కొంగుచాటున బంధించి గుండెల్లో దాచుకుంటూ కొడుకు చేయి అందుకుని లోనకి నడిచింది. గడపలోంచి లోపలికి అడుగుపెట్టుంటే కనపడిందా ఫోటో.. ఎప్పుడో వేసిన మాసిన దండ వేలాడుతూ. అది నాన్నది. అవును నాన్నదే. అంటే.. నాన్న లేడా.. అతని హృదయంలో మేఘాలు కమ్ముకుంటూ.. ఇద్దరి మధ్య మౌనం.. ఆ మౌనంలోనే.. ఆ స్పర్శతోనే ఏళ్ల తరబడిన ఎన్నెన్నోవిషయాలు మాట్లాడేసుకున్నారు.

* * *

అమ్మమ్మ వాళ్ళ ఇంటినానుకునే యన్టిపిసి ప్రహరీ గోడ. ఆ గోడ కట్టక ముందు అక్కడికి వచ్చే రకరకాల పరికరాల్ని, యంత్రాలని, వాటిని తెచ్చే 20 చక్రాల లారీల్ని ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టో.. కళ్ళప్పగించో చూసే వాళ్ళం. ఒక్కోసారి వాటి వెనకే పరుగెత్తడం చాలా సరదాగా ఉండేది. వాటిని చూడడం కోసమే సెలవొస్తే చాలు అమ్మమ్మ ఇంటికి వెళ్ళిపోయేవాడిని. అమ్మమ్మ ఊళ్లో చూసిన వాటి గురించి స్కూల్లో మిత్రులకి చిలువలు పలువలు చేసి ఎంతో గొప్పగా చెప్పేవాడు. ఎప్పటిలాగే అమ్మమ్మ ఇంటికి వచ్చినప్పుడు 20 చక్రాల లారీ ఎక్కబోతే అప్పటికే అది కదిలింది. మామ ఎక్కడినుంచి చూశాడో పట్టుకుని తన్నాడు కర్రతో. నేను చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయా.. ఆ 20 చక్రాల లారీ పైనే. ఎక్కడికి వెళ్తున్నానో తెలియకుండా బయలుదేరా. మొదట అంతా గమ్మత్తుగా అనిపించినా తర్వాత భాష తెలియక ఇంటికి వచ్చే మార్గాలు లేక ఎంత బాధపడ్డాడో.. అయినవారికోసం ఎంత బెంగపడ్డాడో..ఎంత నరకం అనుభవించాడో.. చెప్పి అమ్మను మరింత బాధ పెట్టలేననుకుంటూ తల్లి వొడిలో తలపెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు సురేష్. ఇన్ని సంవత్సరాలు కోల్పోయిన అమ్మ వొడి వెచ్చదనాన్ని అనుభవిస్తున్నాడతను.

ఒక క్షణం కళ్ళు మూస్తే కనుల ముందు ప్రత్యక్షమైన కొడుకు ఎక్కడ మాయమైపోతాడోనన్న భయం ఆమెలో.. అసలు ఇది కలా నిజమా కొడుకు తల నిమురుతూ.. మనేద తీర్చుకుంటూ.. ఒకరికొకరు ఓదార్పు పొందుతూ..

సురేష్ రాక తెలిసి ఊర్లో ఉన్న నలుగురూ జమయ్యారు. ఎవర్ని చూసినా ఒంట్లో సత్తువంతా ఎవరో పైపేసి లాగేసినట్లుగా కనిపిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి పొలం యన్టిపిసి కింద పోయింది. యాష్ పాండ్ కోసం ఊళ్లో చాలా మంది వరి పొలాలు, మెరక పొలాలు యన్టిపిసి తీసేసుకుంది. ఎప్పుడూ చూడనంత డబ్బు వస్తుందన్న ఆశతో బంగారం పండే భూముల్ని ఎర్రోల్లమై ఇచ్చేశాం. ఒకళ్ళకొకళ్ళు సాయం చేసుకుంటూ చేసే వ్యవసాయదారులమంతా కూలీలైపోయాం. ఇప్పుడు చేతులు పిసుక్కుంటే ఏం లాభం? పొగ.. బూడిద.. జబ్బులు.. సమాధులూ.. 'మొహమాటానికి పోయి ముండ కడుపు తెచ్చుకుందట' అట్లా ఉంది మా యవ్వారం.. బిచ్చమేసినట్టు చిల్లరమల్లరగా ఇచ్చిన సొమ్ము ఎటోయిందో.. ఇంటింటికీ ఉద్యోగమిస్తామని కంపెనీ పెట్టకముందు చెప్పారా.. ఏదీ? ఊరికొక కోక ఇస్తే ఇంటికొక ఈక అన్నట్టు.. ఏంజేత్తాం? గొర్రె కసాయిని నమ్మినట్టు నమ్మాం. ఎవురు తీసుకున్న గోతిలో వాళ్ళే పడతారంటే ఇదే మరీ.. తలోమాట చెప్తున్నారు జనం. అంతా కలగాపులగంగా.

పవర్ ప్లాంట్ లో కూలీగా చేరిన నాన్న పనినుండి సైకిల్ పై

ఇంటికి వస్తూనే పడిపోయి లేవనేలేదనీ. యాష్ పాండ్ స్లర్రిలో ఇచ్చే ఎక్కువ కూలీకి ఆశపడి పనికెళ్లిన తమ్ముల్లిద్దరి ప్రాణాలే కాదు ఇంకొందరి ప్రాణాలు గాల్లో కలసిపోయాయంటే అది ఎన్టిపిసి విసర్జించే విష వాయువుల వల్లేనని తెలిసి విస్తుపోయాడు సురేష్. అంటే, వాళ్ళు తీసింది ఆక్సైడ్, మెర్క్యురీ.. అయుండొచ్చు. విమానాలకి పూత వేయడానికి వాడతారు. యాష్ లో రేడియో ధార్మికత ఎక్కువ. లెడ్, బ్రోమైడ్ వంటి విషపదార్థాలు శరీరంలోకి వెళ్లి విష ప్రభావం చూపుతాయి. ఎదుగుదల లేకుండా చేసే మిన్మిటా డిసీజ్ వస్తుంది. ఆ బూడిద కుప్పల్లో బూడిద ఎగిరొచ్చి ఊరి మీద వాలుతుంది. ఇళ్ళల్లో కళ్ళల్లో పడుతుంది. కంటి నల్లగుడ్డు నెమ్మదిగా రంగు వెలిసిపోతుంది. చూపు మసకవారుతుంది. గ్రీన్ క్లైమేట్ పత్రికలో చదివిన విషయాలు సురేష్ మదిలో మెదిలాయి. అందుకే అమ్మకి చూపు తగ్గిపోయిందేమో అనుకుంటుండగా..

ఆ యాష్ కొందరు లారీల్తో పట్టుకుపోయి సిమెంటులో కల్తీ చేసి అమ్ముకుంటారు... కంపెనీ వదిలే వ్యర్థాల వల్ల భూగర్భ జలం అంతా పాడయిపోయింది. తాగడానికి నీళ్ళు లేక నానా యాతన పడతన్నాం. కంపెనీ వోళ్లని సాయమడిగితే లేదు పొమ్మన్నారు. ఉద్యోగాలివ్వకపోతే పోయారు. కనీసం గొంతు తడుపుకోడానికి నీళ్ళు ఇవ్వొచ్చుగా... లేదు, బతిమాలాం.. పెద్ద పెద్దాళ్ళని కలిశాం. ఓట్ల కొచ్చిన వాళ్ళని నిలదీశాం. ప్చ్.. ఏం లాభం లా.. ఉన్నకొద్దిపాటి భూమి పాడయిపోయి.. పంటలు పోయి.. చివరికి మా జీవితాలే పోయి కాటికి చేరువయి అంటూ ప్రవాహంలా చెప్పుకుపోతున్నారు ఎవరికి వాళ్ళు. 'అందరూ ఎవరి మట్టుకు వాళ్ళు చెప్పుకుంటూ పోతే వినేవాళ్ళ బుర్రలోకి ఏవెక్కుతుందీ.. అంతా ఆపండెహే.. 'కసిరి 'ఒరే నాగా చదువుకున్నోడివి నువ్వు చెప్పరా' పెద్దరికంగా అంది ఒకావిడ ఆ యువకుడికేసి చూస్తూ. ఆ యువకుడు కొంచెం బిడియంగా ఉన్నా గర్వపడ్డాడు.

'మన దీపమని ముద్దులాడితే మూతి కాలకుండా ఉంటుందా..?' అంటూ వచ్చాడు కాళ్ళు విల్లులాగా తిరిగిపోయి మూడో కాలుతో నడుస్తున్న ఓ పెద్దాయన. వస్తూనే 'మీకసలు బుద్దుందా.. బిడ్డడు ఇన్నేళ్ళకి మననెతుక్కుంటూ వాకిట్లోకొస్తే.. ఈ మాటలా వాడికి చెప్పేది. ఎప్పుడు తిన్నాడో ఏమో ఆ పని చూడండి' అంటూ గదిమాడు.

అదేమీ వినిపించుకోని ఒకావిడ 'ఎంకి పెళ్లి సుబ్బిచావు కొచ్చినట్టుంది. ఏ మొక్క పెట్టినా ముడుచుకు పోయి ముద్దల్లాగా అవుతాంటే ఏమ్జేత్తాం. మనుషులకేనా, గేదలకీ గర్భసంచి రోగాలే.. 'తన ధోరణిలో అంటూ నిట్టూర్చింది. అందుకేనేమో ఇంటి దొడ్లో టమాటానో వంకాయో ఏదోకటి లేకుండా బోసిగా బావురు మంటూ ఉంది అనుకున్నాడు సురేష్ చుట్టూ పరికిస్తూ.. గంపల గంపల టమాటా కోయడం, ఇంటిముందు ఉండే చేతిపంపు నీళ్ళు కొబ్బరి నీళ్ళలా ఉండేవని అనడం, పొరుగూరు వాళ్ళు వచ్చి పట్టుకెళ్ళడం గుర్తొచ్చి బాధగా నిట్టూర్చాడు సురేష్.

'కంపెనీ ఊరికి దూరంగా ఉన్నా బాగుండేది'. అన్నాడు నాగ. 'ఊరు ఎప్పట్నించో ఉంది. కంపెనీ మధ్యలో పుట్టుకొచ్చింది. కంపెనీ వల్ల మన బాధలు చెప్తే మనల్నే పొమ్మంటుంది. ఊళ్ళో కళ్ళు తెరిచే పిల్లలు కరువయిపోతున్నారు. అమ్మ కడుపులోనే కరిగిపోతున్నారు. పుట్టినవాళ్ళు దక్కడం లేదు. దక్కినా ఎదగడంలేదు. ఏవని చెప్పేదీ... 'ముక్కు నలుముకుంటూ సాగదిసింది ఒకావిడ.

నీ చెల్లికి పెళ్ళయి పదేళ్ళయినా ఇప్పటివరకూ పిల్లలే పుట్టలేదు. మొదట్లో గర్భం వచ్చినా బిడ్డ ఎదగలేదని అబార్షన్ చేసేసారుగా.. చెప్పుకొచ్చింది మరోకావిడ. రెండు పిలకలు వేసుకుని అన్నా అన్నా అంటూ వెంట తిరిగిన నా చెల్లి ఎలా ఉందో.. సురేష్‌లో అలజడిని అడ్డుకుంటూ వచ్చి చేరుతున్నాయి వాళ్ళ మాటలు.

గర్భసంచి రోగాలు.. హార్మోన్ల సమస్యలు. ఒళ్ళంతా తెల్ల మచ్చలు, కళ్ళు కనబడడం లేదని కళ్ళ డాక్టర్ దగ్గరకు వెళ్తే కాన్సర్ డాక్టర్ దగ్గరకి వెళ్ళమంటున్నారు. ఆ డాక్టర్ బ్రెయిన్ ట్యూమర్ అని చెప్పడం మామూలయింది ఈ ఊళ్ళో. ప్లాంటు వేడికి పక్షులన్నీపోయాయి. అవి ఎక్కడా కనిపించట్లా..నక్కల ఊళలూ.. అడవిపందుల జాడలూ లేవు పద్దెనిమిదేళ్ళ వయస్సు యువకుడు నాగ చెప్పుకుపోతున్నాడు. అవునన్నట్లు మిగతా వాళ్ళు తలలూపుతూ.. అవునంటూనో మధ్యలో తామూ ఒక మాట కలుపుతూనో.. వాళ్ళ మొహాల్లో విషాద ఛాయలు అలుముకుంటూ.

పొమ్మనలేక పొగపెట్టారుగా.. నాలాంటి వాళ్ళం ఇక్కడ ఉండలేక పట్నం వెళ్లి పోయాం. కలో గంజో తాగి బతకొచ్చని. ఇగో ఈ ముసలాళ్ళు కదలమంటే కదల్రే కదలరు. నిష్టూరంగా అని ఇక్కడ జనం ఏడుస్తుంటే అక్కడ కంపెనీ లాభాల పండుగ చేసుకుంటోంది ఉద్రేకంగా చెప్పుకు పోతున్నాడు నాగ.

ఆ యువకుడి నుదిటిపై ఉన్న చింతగింజంత నల్లటి మచ్చనే చూస్తూ 'నువ్వు అంజి తమ్ముడివా.. 'సంశయంగా అడిగాడు సురేష్. ఇన్నేళ్ళయినా బాగానే గుర్తుపట్టావే అన్న ఆశ్చర్యం వాళ్ళలో.

'అవునన్నా, భలే గుర్తుపట్టావ్. నేను నీ ఫ్రెండ్ అంజి తమ్ముడినని నేనే పరిచయం చేసుకుందామనుకున్నా. ఇన్నేళ్ళ తర్వాత నువ్వు గుర్తుపట్టలేవనీ.. 'చిరునవ్వుతో అని చిన్న విరామమం ఇచ్చి కళ్ళలో సుడులు తిరుగుతున్న నీటిని ఆపే ప్రయత్నం చేస్తున్నాడతను.

'వాడినీ కంపెనీ ఎత్తుకుపోయింది మీ తమ్ముళ్ళ కంటే ముందే.. 'విచారవదనంతో పెద్దాయన.

అంతలో తన కోసం కూతురు పంపిన కజ్జికాయలు, కారప్పూస ప్లేటు తెచ్చి తినమంటూ సురేష్ చేతిలో పెట్టింది ఓ స్త్రీ.

'నువ్వు తిను బాబూ,' అని అంతా పదండి. కాసేపు అబ్బాయిని విశ్రాంతి తినుకోనివ్వండి 'అంటూ అందర్నీ తరమబోయాడు పెద్దాయన.

ఫర్వాలేదు లేదు లెండి. మన ఊరిని చూడాలని, అందర్నీ కలవాలని ఎంతో ఆత్రుతతో వచ్చా. చెప్పనీయండి ఇక్కడి విషయాలు. 'గొంతు పెగిల్చిన సురేష్

'ఇంకేముంది సురేష్ బాబూ చెప్పడానికి, ఒకప్పుడు నిండుకుండ లాంటి మన ఊరు వట్టిపోయింది. ప్రపంచపు చీకట్లు పారదోలి వెలుతురులు విరజిమ్మే పవర్ ప్లాంటు మన గ్రామాన్ని

(మిగతా 28వ పేజీలో...)

కరుణ కథ

మాతంగి

తాయమ్మ కథ రాశాక కరుణకు తాయమ్మ కరుణ అనే పేరు స్థిరపడిపోయింది. సహజంగానే ఆమె కథల పుస్తకం పేరు కూడా అదే అయింది. అంతగా ఆ కథ అందరికీ గుర్తుండిపోయింది. అలాంటి కథ ఒకటి రాయడమే రచయితలకు ఒక శిక్షణ వంటిది. కథ రచనలో, దృక్పథంలో కూడా కంఠస్వరం సెట్ అవుతుంది. ఇది రాశాక కరుణ కథా రచనలో చాలా మెలకువలు కనిపిస్తాయి. ఈ సంపుటిలోని మిగతా కథలతో పోల్చి కరుణ కథా ప్రయాణాన్ని, అందులో తాయమ్మ మలుపును బాగా విశ్లేషించవచ్చు.

కరుణ తొలి కథ దగ్గరి నుంచి ఇటీవల రాసిన సహచరులు కథ దాకా చాలా విలక్షణంగా ఉంటాయి. ఆమె అజ్ఞాత విప్లవోద్యమంలో ఉన్న రోజుల్లో రాసిన కథల్లో కూడా స్త్రీల జీవితం, స్త్రీ పురుష సంబంధాలు ప్రధానంగా ఉంటూ వచ్చాయి. ఇటీవలి సహచరులు కథ కూడా విప్లవంలోని స్త్రీ పురుష సంబంధాలనే చిత్రించారు.

తాయమ్మ కథలో హృదయ విదారక విషాదం ఉంటుంది. నగటు మహిళల జీవితంలోని దు:ఖం మనల్ని వెంటాడుతుంది. పితృస్వామ్యం అనేక రూపాల్లో స్త్రీలను ఎలా చుట్టు ముట్టి ఉన్నదీ తాయమ్మ చిత్రించింది. కుటుంబ బంధనాల రాపిడిలో సొంత వ్యక్తిత్వం కోసం స్త్రీలందరూ పెనుగులాడుతుంటారు. తాయమ్మ లాంటి మహిళలు చాలా మంది ఇండ్లల్లో, ఊళ్లల్లో ఉంటారు. మనందరికీ తెలిసిన ఓ కాలంలోని సగటు మహిళ. అందుకే ఆమెతో ఎక్కువ మంది ఐడెంటిఫై అవుతారు.



తాయమ్మ కథ - మరికొన్ని కథలు
కరుణ
ప్రచురణ : విరసం, ప్రచురణ : 2009,
వెల : రూ. 60/-

కరుణ పరిచయం చేసిన మరో మహిళ కవులమ్మ. ఈమె ఎంత భిన్నమైన మహిళ అంటే 'కవులమ్మ ఆడదేనా?' అని లోకం ఈసడించుకుంటుంది. అదీ ఆమె ప్రత్యేకత. గొప్పతనం. అందుకే అత్యంత దు:ఖకరంగా ఆమెకు దగ్గరవుతాం. ఆమెను మన దగ్గరికి తీసుకుంటాం. మనందరం ఆమెను బాగా ఇష్టపడతాం.

దీనికి కరుణ కథ చెప్పే తీరు కూడా కారణం. ఆమె కథ చాలా మామూలుగా చెబుతారు. ఆత్మీయంగా చెబుతారు. అందువల్ల ఆమె పరిచయం చేసే పాత్రలు కూడా మనకు ఆత్మీయంగా తోస్తాయి. సాదాగా, సరళంగా ఇష్టంగా చదువుకునేలా కరుణ కథా రచన ఉంటుంది.

కరుణ కథల పుస్తకంలోని కథలన్నీ ఒకే స్థాయిలో లేవు. ఇది సహజమే. ఉద్యమంలో ఉంటూ సాధారణ జీవితంలోని కష్టాలు కడగళ్లను రాశారు. ముఖ్యంగా పైనే అన్నట్లు స్త్రీల జీవితాన్ని రాశారు. అలాగే బహిరంగ జీవితంలోకి వచ్చాక కూడా ఉద్యమ నేపథ్యంలో మంచి మంచి కథలు రాస్తున్నారు. ఈ సంపుటంలోని ఉద్యమ నేపథ్య కథలు మొత్తంగా ఉద్యమ కథ విస్తృతికి దోహదపడేవే. ఉద్యమ ప్రాంతంలోని పిల్లలు, సాధారణ కార్యకర్తలు, విప్లవోద్యమంలో ఎదురయ్యే అనేక అనుభవాలు ఆమె కథా ఇతివృత్తంలో ఉంటాయి. నేపథ్యంలో కనిపిస్తూ ఉంటాయి. స్థూలంగా ఈ రెండు రకాల ఇతివృత్తాల వల్ల ఆమె కథల్లో చాలా వైవిధ్యం కనిపిస్తుంది.

మామూలు జీవితంలోని అత్యంత విషాదాత్మక అనుభవాలు రాసినా అందులో నైరాశ్యం మాత్రమే ఉండదు. ఏదో ఒక ప్రశ్న, నిరసన, అసమ్మతి, తిరుగుబాటులాంటివి కనిపిస్తాయి. అవి చాలా సహజమనిపిస్తాయి. వాటితో మనకు ఏకీభావం కలుగుతుంది. పాఠకులుగా మనమూ అలాగే ఆలోచిస్తాం. అదే కరుణ కథల ప్రత్యేకత. విప్లవ దృక్పథంతో ఇలాంటి ఇతివృత్తాలను ఆమె బాగా రాశారు.

ఇటీవల రాసిన సహచరులు కథ కూడా కరుణ విస్తృతిని తెలియజేస్తుంది. గతంలో ఈ వ్యవస్థ పరిధిలో స్త్రీ పురుష సంబంధాల గురించి రాసిన కరుణ ఈ కథలో వ్యవస్థను మార్చే విప్లవోద్యమంలోని సహచర్యాన్ని చిత్రించారు. మనుషుల్లోని అవగాహనలు, చైతన్యాలను, దిద్దుబాటులను చాలా సహజంగా ఇందులో రాశారు. (అందులో ఒకటి రెండు వాక్యాలు లేకపోయి ఉంటే బాగుండేదనిపించింది. అవి నేరుగా కథా ఇతివృత్తానికి సంబంధించినవి కూడా కాదు. అందువల్ల అది పూర్తిగా వేరే చర్చ) ఇది చాలా ఆసక్తికరమైన, అవసరమైన కథ. ఇలా కరుణ స్త్రీ పురుష సంబంధాల చిత్రణలో కొనసాగింపు సాధించారు. ఇలాంటి కథలు ఎన్నో రాయగల శక్తి ఆమెకు ఉందని మనకు గట్టి నమ్మకం కలుగుతుంది.

ఆమెకు ఈ కథా దృక్పథం, రచనా పద్ధతి ఎలా పట్టుబడిందో ఐవి స్మరణలో చాలా వివరంగానే రాశారు. బహుశా అవి ఆమె కథకురాలిగా రూపుదిద్దుకున్న తొలి దినాలు. అది చదివితే ఆమె కథల్లోని పాత్రల కష్టాల వలెనే, తాయమ్మ వలెనే కరుణ కూడా చాలా కష్టపడి తనలోంచి ఓ కథకురాలిని వెలికి తీశారనిపిస్తుంది.

విద్యార్థి ఉద్యమాలు (1966-75)

(విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం నుంచి ఎమర్జెన్సీ దాకా)

వరవరరావు

తెలుగు నేల మీద ప్రజాస్వామిక విద్యార్థి ఉద్యమాలు 1966లో ప్రారంభమయ్యాయి. కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాట సంప్రదాయమున్న గడ్డమీద ఈ మాట విచిత్రంగా కనిపించవచ్చు గానీ 1951 తర్వాత మళ్లీ ప్రారంభమయ్యాయి అని చెప్పడమే ప్రస్తుతం సందర్భం. అసంకల్పితంగా కదిలిన ఈ విద్యార్థి యువజన శక్తుల వెనుక కదలించిన నాయకత్వానికి మాత్రం స్పష్టమైన నూతన ప్రజాస్వామిక విప్లవ దృక్పథమున్నది. అందుకు 1946 తర్వాత మళ్లీ ప్రేరణ సరిగ్గా ఏభై ఏళ్ల క్రితం మేడే రోజు ప్రారంభమైన జన చైనా శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం నుంచి వచ్చింది. చైనా విప్లవానికన్నా ముందు మే 4 విద్యార్థి ఉద్యమం చైనాలో సన్‌యట్ సేన్ నాయకత్వంతో ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రారంభమైతే ఈ శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం స్వయంగా మావోసెటుంగ్ మేడే, 1966వ ప్రారంభించాడు. 'ఏటికి ఎదురీదండి', 'ఆలోచించడానికి సాహసించండి', 'కేంద్రాన్ని బద్దలు కొట్టండి', అనే పిలుపుతో కార్మిక నగరమైన షాంఘై నగరానికి, షాంగై నదిని ఈది వెళ్లి చైర్మన్ మావో ప్రారంభించాడు. ఇందులో పునాదివర్గమైన శ్రామికవర్గ వర్గ ప్రయోజనముంది. ఉపరితల అంశమైన సంస్కృతిని ప్రశ్నించి, ధిక్కరించి బూర్జువా భావజాలాన్ని ఎండగట్టి విప్లవించడం ఉంది. రివిజనిజానికి వ్యతిరేకంగా పదేళ్ల మహత్తర చర్చ (1956-66) ముగిసి మళ్లీ ఎజెండా మీదికి వర్గపోరాటాన్ని తెచ్చిన మూడవ విప్లవమిది. బోల్షివిక్ విప్లవం (1917) చైనా విప్లవం (1949) తర్వాత శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని చారుమజుందార్ మూడవ విప్లవమని అందుకే అన్నాడు.

ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటే వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రారంభమైన ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం (విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు) వెనుక ఉన్న నాయకత్వంపై స్పష్టంగా ఈ విప్లవ ప్రభావం ఉన్నది. విశాఖపట్నంలో ప్రభుత్వ రంగంలో ఉక్కు కర్మాగారం వస్తే తెలుగు నేల మీద ఇంజినీరింగు చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు వస్తాయి గనుక రాష్ట్రంలోని అన్ని ఇంజినీరింగు కాలేజీలు ఇందుకు ఉద్యమ క్షేత్రాలు కావడం ఆశ్చర్యం కాదు. అట్లాగే రాష్ట్రంలో అన్నిటికన్నా ఉన్నతమైన ప్రాంతీయ ఇంజినీరింగు కాలేజీలో చదువుతున్న విద్యార్థులు ఎక్కువ మంది ఆంధ్ర ప్రాంతం వాళ్లు కావడం వల్ల కూడా ఇక్కడ మిలిటెన్సీ కనిపించడం కూడ ఆశ్చర్యం కాదు. నాయకత్వం సరిగా లేకపోతే అది ఒక ప్రాంత, సంపన్న సామాజిక వర్గాల ప్రయోజన ఉద్యమంగా ముగిసి ఉండేది. అట్లా కాకుండా అది ఒక మిలిటెంట్ ఉద్యమంగా రాష్ట్రమంతటా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలకు కూడా విస్తరించింది. (ఆ రోజుల్లో నేను పని చేస్తున్న జడ్చర్ల కాలేజి విద్యార్థులు ఆ ఊళ్లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని మిలిటెంటుగా వందల సంఖ్యలో కదిలారు.) వరంగల్ ఆర్ఇసిలో విద్యార్థులపై పోలీసు కాల్పులు జరిపితే ఇంగువ మల్లికార్జున శర్మ అనే విద్యార్థి (బి.టెక్. మూడవ సంవత్సరం) కాలు నుంచి తుపాకి గుండు దూసుకుపోయింది. రంగంలోకి దిగింది సిఆర్‌పిఎఫ్. ఎందుకంటే ఈ ఉద్యమాన్ని నడిపించినవారు కొండపల్లి సీతారామయ్య, కె.జి. సత్యమూర్తి (కాజీపేట గ్యాబ్రియల్ స్కూల్ టీచర్లు) వ్యక్తిగత కారణాలతో ఉద్యోగాలు చేస్తూ ఫాతిమానగర్ (కాజీపేట)లో స్థిరపడినవాళ్లు. తెలంగాణ సాయుధ పోరాట విరమణ పట్ల అసంతృప్తి, శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం పట్ల స్వాగత స్పందన ఉన్న విప్లవాభిమానులు. 1964లో కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సిపిఎంగా చీలినప్పటి నుంచీ ఇటువంటి ఒక అవకాశం కోసం నిరీక్షిస్తున్న ఎందరిలోనో వీళ్లూ ఉన్నారు. ఈ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమం నుంచే మొదటి విప్లవ విద్యార్థి తరం వచ్చింది. అయితే తెలుగు నేల మీద, బెంగాల్‌లో 1966 కన్నా ముందు ఇటువంటి కొన్ని ప్రయత్నాలు, సంకేతాలు కనిపిస్తాయి.

ఎంగెల్స్ చెప్పినట్లు ఇటువంటి పోరాటాలు కొన్ని అసంకల్పితంగా ప్రారంభమైనా వాటి వెనుక వర్గపోరాట చోదక శక్తులు ఉంటాయి. అవి చైనా యుద్ధ కాలం (1962)లో ఘర్షణకు లోనవుతున్నాయి. అసంతృప్తి 1951లో సాయుధ పోరాట కాలం నుంచి ఉన్నది. ఒక ప్రయత్నం వర్గపోరాటం వలెనే జరిగిన 1955 ఎన్నికల్లో జరిగింది. అసలు ఈ ఆకాంక్షల మీదనే నీళ్లు చల్లింది 1956 అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల మహాసభలో క్రుశ్చేవ్ సిద్ధాంతం. వర్గ పోరాటానికి సెలవు ప్రకటించిన సిద్ధాంతం. మావో నాయకత్వంలో గ్రేట్ డిబేట్ మొదలైంది. పులి మీద పుట్రవలె చైనా యుద్ధం కమ్యూనిస్టు శ్రేణుల్లోనూ జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టింది. 1962 బొంబాయి ఎన్నికల్లో కృష్ణమీనన్ - కృపలానీల మధ్య పోటీ నెలకొన్నపుడు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని విద్యార్థుల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలో దీని ప్రతిఫలనాలు 'అంపశయ్య' నవీన్ నవలలో స్పష్టంగా చదువుకోవచ్చు. కృష్ణమీనన్ ఫెలో ట్రావెలర్, ప్రచ్ఛన్న కమ్యూనిస్టు గనుక ఘోరంగా విఫల నాయకత్వం అందించినందువల్లనే ఇండియా ఓడిపోయిందని 'జాతీయ వాదులందరూ' కృపలానీ నాయకత్వంలో ధ్వజమెత్తారు. ఆ ఉన్మాదం నుంచి తట్టుకొని నిలిచిన కొడవటిగంటి కుటుంబరావు, కె.వి. రమణారెడ్డి, సి.విజయలక్ష్మిలలో సి.వి. రాసిన 'విషాద భారతం' 'కారు చీకటిలో కాంతిరేఖ' కావ్యాలు విద్యార్థి యువతరాన్ని

ప్రభావితం చేసాయి. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి 'నవత' కవిత్వ పత్రిక శ్రీశ్రీ గౌరవ సంపాదకుడుగా నక్షత్ర సప్తకం (శిష్టా జగన్నాథరావు) కృషితో ప్రారంభమైంది. ఇదే కాలంలో శ్రీశ్రీ 'త్రీ చీర్స్ ఫర్ మ్యాన్' ఇంగ్లీషు అనువాదం వెలువడింది. చలసాని చెప్పినట్లు కర్టెన్‌రైజర్‌గా 'రాత్రి' కవితా సంకలనాన్ని కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు వెలువరించినా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోనే అది వేకువ రేకులు విప్పింది.

చలసాని చెప్పిన కర్టెన్ రైజర్ దేనికి? 'దిగంబర కవులు'కు. విద్యార్థి యువతరాన్ని ఉగ్రూతలూగించిన దింగబర కవులు (1965-68)కి.

అప్పటికి కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. చైనా యుద్ధంపై వైఖరి ముఖ్యమైన ఒక కారణం. శ్రేణులు, ప్రజలు మాత్రం వర్గపోరాటం గురించి వైఖరి అని ఆశించారు. భ్రమ పడ్డారు. ఆశించిన నాయకత్వంలో అప్పటి సిపిఐఎం సిల్గురి డివిజన్ కార్యదర్శి చారుమజుందార్ ఉన్నాడు. ఆయన 1965లో తెరాయి దస్తావేజుల పేరుతో విప్లవ కార్యక్రమం రూపొందించే డాక్యుమెంట్లు రాయడం ప్రారంభించాడు. యుద్ధ వాతావరణాన్ని అంతర్యుద్ధంగా మార్చుకోవాలన్న లెనిన్ పిలుపును గుర్తు చేసాడు. భూమి కోసం ఆర్థిక పోరాటం. భూమిని కాపాడుకోవటానికి గెరిల్లా యుద్ధతంత్రం - స్థిరపరచుకోవడానికి రాజకీయ విముక్తి పోరాటం అవసరమని చెప్పే ఎనిమిది దస్తావేజులు ఆయన 1967 మే 'నక్సల్బరీ వసంత మేఘ గర్జన' నాటికి పూర్తి చేసాడు. అవి అక్కడ జాదవ్‌పూర్, కలకత్తా యూనివర్సిటీలు మొదలు, ఐఐటి కాన్పూరు మీదుగా, ఆంధ్రా యూనివర్సిటీ, గుంటూరు మెడికల్ కాలేజి, వరంగల్ కెఎంసి, ఆర్ఇసిల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ మీదుగా కర్నూలు మెడికల్ కాలేజ్, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ, ముఖ్యంగా ఎస్వి ఓరియంటల్ కాలేజి దాకా తొలకరి చినుకులయి విస్తరించింది.

'అవాచ్ఛాదిక మానవావిష్కరణ' కోసం 1965లో ప్రారంభమైన 'దిగంబర కవులు' హైదరాబాదీలు. అందులో ముగ్గురు (చెరబండరాజు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్) నలగొండ జిల్లా నేపథ్యం ఉన్నవాళ్లు. అప్పటికే చీలిన సిపిఐఎంలోని నాయకత్వమంతా (ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమ, శ్రీకాకుళం, గుంటూరులలో) నక్సల్బరీ వైపు మొగ్గుతున్నారు. విద్యార్థి యువజనులు మొగ్గుతున్నారు.

1966-1967 నక్సల్బరీని అందుకోవడం అందుకే సులభమైంది. వరంగల్‌లో (హనుమకొండ, కాజీపేటలను కలుపుకొని) ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అనే సంస్థ ప్రారంభమైంది. కెఎంసి, ఆర్ఇసిల నాయకత్వంలో ఆదివారాలు ప్రజా వైద్య శిబిరాలు పరిసరాలలోని పల్లెల్లో ప్రారంభించడంతో పని మొదలైంది. అప్పటికి వియత్నామ్ యుద్ధం ఉధృతం కావడం, దిగంబర కవులు రెండవ సంపుటి వెలువడడం, జడ్చర్ల నుంచి సృజన ప్రారంభం కావడం - అప్పుడది యాదృచ్ఛికమే గానీ ఇపుడు వెనక్కి తిరిగి చూస్తే అసంకల్పిత చర్య. ఒక విద్యార్థి రాసిన 'రక్త చలన సంగీత శృతి (1967 మే) గానీ, విద్యార్థుల కవిత్వం 'కొత్త చిగుళ్లు' గానీ ఈ వాతావరణంలోంచి వచ్చినవే.

అప్పటికే విశాఖపట్నంలో సాగర గ్రంథమాల ఏర్పడి, యజ్ఞం (1964) కథ వచ్చి ఉన్నది. ఎందుకంటే వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం శ్రీకాకుళ గిరిజన రైతాంగం మధ్య 'గిరిజన సహకార సంఘాలు', సంఘర్షణ సమితులు స్థాపిస్తున్నారు. వాళ్లు ఎపిటిఎఫ్ టీచర్లు. వాళ్లు, వాళ్లతో పాటు భూషణం ప్రభావం అక్కడి విద్యారంగంపై ఉన్నది. యూనివర్సిటీలో చలసాని ప్రసాద్ వంటివాళ్ల ప్రభావం ఉన్నది. విప్లవ విద్యార్థులు రూపొందుతున్నారు.

1967 నక్సల్బరీ (మే 23-25) ఆదివాసీ సంథాల్ రైతాంగ పోరాటంతో బెంగాల్‌లోనే కాదు దేశవ్యాప్తంగా విప్లవ విద్యార్థి ఉద్యమాల ప్రభాత వెల్లువ (మార్నింగ్ డెల్యూజ్) ప్రారంభమైంది. గుంటూరు మెడికల్ కాలేజీలో పిజి నేత్ర వైద్యం చేస్తున్న డాక్టర్ చాగంటి భాస్కరరావు నక్సల్బరీ సంఘీభావ కమిటీ ఏర్పాటు చేసాడు. వరంగల్‌లో ముప్పా రవీంద్రనాథ్, కొండపల్లి చంద్రశేఖర్ (ఆర్ఇసి) కావూరి రమేశ్‌బాబు (కెఎంసి) విద్యార్థి ఉద్యమాన్ని విప్లవ పథం వైపు మళ్లించారు. డాక్టర్ నాగేశ్వరరావు (కెఎంసి) ముక్కు సుబ్బారెడ్డి (ఆర్ఇసి) ఇంగువ మల్లికార్జున శర్మ, రాయల సుభాష్ చంద్రబోస్, లింగా విజయకుమార్ (ఈ ఇద్దరు ఖమ్మం కాలేజి విద్యార్థులు) ఈ కాలంలో విద్యార్థులుగా విప్లవోద్యమంలోకి వచ్చిన వాళ్లే.

దిగంబర కవులు-3, సృజన-అక్టోబర్ 1968 నాటికి అటు శ్రీకాకుళంలోను, ఇటు గోదావరి లోయలోనూ సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభమైంది. 'ట్రిగర్ మీద వేళ్లతోరా...' అనే పిలుపు లోచన్ అనే ఒక స్కూల్ టీచర్ ఇచ్చాడు. 'సహనం గాడిద లక్షణం' (లోచన్) 'ఓటమి తిరుగుబాటు కాదు' (జ్వాలాముఖి), 'నన్నెక్కనివ్వండి బోను', 'వందేమాతరమ్' (చెరబండరాజు) కవితలు ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు రాసారు. కొండపల్లి సీతారామయ్య కె.జి. సత్యమూర్తి, నీలం రామచంద్రయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు క్యాంపస్‌లలో విద్యార్థి ఉద్యమాలను నిర్మాణం చేస్తున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ సరేసరి - శ్రీకాకుళం నుంచి కొండ బాలెడి మేస్టారు సత్యం పిలుపుకు కూత వేటు దూరంలో ఉన్నది. అందుకే ఆ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షుడు పంచాది కృష్ణమూర్తి, సహచరి నిర్మలతో పాటు శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో సత్యం జతకట్టి కలకత్తాలో ఏర్పడిన సిపిఐ ఎంఎల్ పార్టీ ఆవిర్భావ సభకు 1969 ఏప్రిల్ 22న (ప్రకటన మేడే, షహీద్ మినార్ మైదాన్, కలకత్తా) వెళ్లి వస్తూ మొట్టమొదటి 'ఎన్‌కౌంటర్'లో మరొక విప్లవ విద్యార్థి నాయకుడు రమేశ్ చంద్రసాహు, పద్నాలుగేళ్ల కళాకారుడు తామాడ చినబాబు, మరో ముగ్గురితో పాటు 1969 మే 27న అమరుడయ్యాడు. ఒక చేత గన్ను, మరొక చేత పెన్ను బట్టిన కళాకారుడు సుబ్బారావు పాణిగ్రాహి, పంచాది నిర్మల, డాక్టర్ చాగంటి భాస్కరరావు, డాక్టర్ మల్లికార్జునుడు - 1969లోనే బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యారు. ఇంతటి విప్లవ విద్యార్థి ఉద్యమ నేపథ్యంలో 1970 ఫిబ్రవరిలో విశాఖ పట్నంలో శ్రీశ్రీ షష్టిపూర్తి జరిగితే 'విశాఖ విద్యార్థులు' రచయితలను మీరెటువైపు అని అడగడం అతి సహజమైన గతితార్కిక చారిత్రక సందర్భం. ఆ కరపత్రం వెనుక ఉన్న వాళ్లంతా ఆంధ్ర మెడికల్, ఇంజనీరింగ్

కాలేజి విద్యార్థులు. గుత్తికొండ బిలం సిపిఐ ఎంఎల్ ఆంధ్రా కమిటీ ఆవిర్భావ సభలో కెజి సత్యమూర్తితో పాటు పాల్గొన్న కె. చంద్రశేఖర్ ఆజాద్ కూడా శ్రీకాకుళ రైతాంగ పోరాటంలో షరీకై బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. ఆదిలాబాదు జన్నారం నుంచి వరంగల్ ఆర్ఇసి దాకా విప్లవ సాంస్కృతికోద్యమాన్ని మువ్వ రవీంద్రనాథ్‌తో పాటు నిర్మాణం చేసిన ఆర్ఇసి విద్యార్థి. కె.ఎస్. కొడుకు.

1967లో నక్సల్బరీ పోరాటం ప్రారంభం కాగానే సిపిఐఎం ఆంధ్రా కమిటీలో తీవ్రమైన ప్రభావం కనిపించి పాలకొల్లు ప్లీనంలో ఎక్కువ మంది రాష్ట్ర కమిటీ నాయకులు నక్సల్బరీ పంథాను బలపరచారు. అట్లా బయటికి వచ్చిన వారిలో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్రపుల్లారెడ్డి తర్వాత కాలంలో విప్లవ పార్టీ (ఎ) నాయకులయ్యారు. మొదట ఇటు వైపు మొగ్గిన వారిలో భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మద్దికాయల ఓంకార్, భాస్కరరావు (హైదరాబాదు)లను పుచ్చలపల్లి సుందరయ్య తనతో నిలుపుకున్నాడు. 1967లో శాసన సభకు ఎన్నికై ప్రతిపక్ష నాయకుడైన తరిమెల నాగిరెడ్డి పాలకొల్లు ప్లీనం తర్వాత శాసన సభను 'సాలెగూడు'గా అభివర్ణించి రాజీనామా చేసి నక్సల్బరీ విప్లవ ప్రచారానికి, శ్రీకాకుళ రైతాంగ పోరాట సంఘీభావానికి తెలుగు నేలంతా తిరిగాడు. ఆయన అట్లా 1968 సెప్టెంబరులో వరంగల్‌కు వచ్చిన రోజే (21 సెప్టెంబర్) ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం వరంగల్‌లో విద్యార్థి ఉద్యమం ప్రారంభమైంది. అప్పటికి వరంగల్‌లో యూనివర్సిటీ డిగ్రీ కాలేజి ఒక్కటే. వరంగల్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్. ఇంకా ఒకటి రెండు కాలేజిలైనా అవసరమైనంతగా ఆర్ట్స్ & సైన్స్ కాలేజీ మీద ఒత్తిడి పెరిగింది. ఆ ఒత్తిడి తగ్గించడానికి వరంగల్‌లో చందా కాంతయ్య తలపెట్టిన కాలేజి కోసం ఇంటర్వ్యూలు జరిగిన రోజు తెలంగాణ నుంచి అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలనే రూపంలో ఈ ఉద్యమం ప్రారంభమైంది. అంతకు ముందు కొత్తగూడెంలో ఒక ఉద్యోగస్తుడు రవీంద్రనాథ్ తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం నిరాహార దీక్ష ప్రారంభించాడు. వరంగల్ కాశయ్యగారి దొడ్డిలో భూపతి కృష్ణమూర్తిగారి నాయకత్వంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ప్రయత్నంలో ఒక సభ జరిగింది. కాని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఉద్యమంగా ఆ రోజే ఆరంభమైంది. ఆ సాయంత్రమే పోచమ్మ మైదానంలో జరిగిన బహిరంగ సభలో తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల స్ఫూర్తితో విప్లవోద్యమ నిర్మాణం కోసం పిలుపునిచ్చారు. వరంగల్‌లో 1966 నుంచి విప్లవ విద్యార్థి ఉద్యమ కృషిలో కె.ఎస్.ఎస్.ఎం.లు ఇద్దరూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరచే వైఖరి తీసుకున్నారు. వీరితో పాటు పనిచేస్తున్న కొల్లిపర నరసింహారావు, చక్కిళ్ళ ఐలయ్య కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలపరచారు. కనుక 1968 అక్టోబరు నుంచే కె.ఎస్. గైడెన్స్‌లో ఉన్న విప్లవ విద్యార్థులు, ముఖ్యంగా వరంగల్, కరీంనగర్‌లలో చదువుతున్నవాళ్లు, సికిందరాబాదు, హైదరాబాదులలో చదువుతున్న వాళ్లు ప్రత్యేకించి. శ్రీకాకుళ ప్రేరణతో పని చేస్తున్న వాళ్లు తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారు. 1968-69, 72 ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలు ప్రముఖంగా విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాద, వైద్య వృత్తుల బలంతో నడిచినవి. అంటే చదువులు, కొలువులు - స్థానికులకే దక్కాలనే ఆకాంక్షతో సాగినవి. ఆ ఉద్యమాన్ని అసమ అభివృద్ధికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంగా స్థానికంగా భూస్వామ్య వర్గానికి, సంపన్న వర్గానికి వ్యతిరేకంగా. డెల్టా జిల్లాల నుంచి వచ్చిన సంపన్న వర్గాలకు వ్యతిరేకంగా మలచి, కేంద్ర ప్రభుత్వాన్ని, రాజ్యాన్ని లక్ష్యంగా చేసుకొని నడిపే వైపు తమకు బలమున్న చోట చొరవ చూపినవాళ్లు కె.ఎస్., ఎస్.ఎం., చక్కిళ్ళ ఐలయ్య (వరంగల్‌లో) కొల్లిపర, కె.ఎస్.లు - సికిందరాబాదు, హైదరాబాదులలో.

హుజూరాబాదు జమ్మికుంట కాలేజీల్లో చదువుతూ తర్వాత కాలంలో, 'విద్యుల్లత' పత్రికను ప్రారంభించిన విద్యార్థులు నల్లా ఆదిరెడ్డి, శనిగరం వెంకటేశ్వర్లు (సాహు), బి. విజయకుమార్, గోపులింగారెడ్డి, ఉమ్మెంతుల వెంకటరెడ్డి ఇటు విప్లవ రాజకీయాలతో ఉంటూ అట్లా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోకి వచ్చిన వాళ్లే. కరీంనగర్ నుంచి మల్లోజుల కోటేశ్వరరావు (విద్యార్థి), ముప్పాళ లక్ష్మణరావు (టీచర్) వంటి వాళ్లు ఈ కోవకే చెందుతారు. ఒక విధంగా తెలంగాణలో విప్లవోద్యమంలోకి వచ్చిన తొలితరం అంతా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లే. అసమ అభివృద్ధితో పాటు వాళ్లను ప్రభావితం చేసిన అంశం శ్రీకాకుళం మీద జరుగుతున్న దాడిని, మరొక ఫ్రంట్ ఓపెన్ చేసి ఎదుర్కోవాలని. శ్రీకాకుళ రైతాంగ పోరాటాన్ని ఒక విముక్తి పోరాటంగా చూస్తున్న తెలంగాణ విద్యార్థులు, బుద్ధిజీవులు ఆ పోరాటానికి సంఘీభావం ప్రకటించడానికి, ఆ పోరాటాన్ని కాపాడుకోవడానికి, అక్కడి ఆదివాసీ రైతాంగానికి అండగా నిలబడడానికి ఉమ్మడి శత్రువైన సామ్రాజ్యవాద, భూస్వామ్య దళారీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తమ న్యాయమైన ప్రజాస్వామిక పోరాటాన్ని, స్వీయగౌరవ పోరాటాన్ని చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ ఆకాంక్షలోని ఉమ్మడి లక్ష్యాన్ని శత్రువు సరిగ్గా అంచనా వేసాడా అన్నట్లుగా శ్రీకాకుళంలో వలెనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా అతిస్వల్ప కాలంలోనే (1969-72) 370 మంది విద్యార్థి యువజనులను తుపాకి గుండ్లకు గురి చేసాడు. వారిలో అత్యధికులు విద్యార్థులు. రెండు చోట్లా ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి కన్నా ప్రజలు విపరీతంగా ద్వేషించిన శత్రువుగా హోంమంత్రి జలగం వెంగళరావు ముందుకొచ్చాడు. శ్రీశ్రీ రాసినట్లు సామ్రాజ్యవాద బానిసకొక బానిసకొక బానిసగా, రక్తం పీల్చే జలగగా ప్రజలాయనను అసహ్యించుకున్నారు. చెన్నారెడ్డి నాయకత్వంలో సాగిన ఉద్యమంలో ఆంధ్ర ఉద్యోగుల పట్ల, మధ్యతరతగి సెటిలర్ల పట్ల కూడ వ్యతిరేకత వ్యక్తమై ఆంధ్రా గోబ్యాక్, ఇడ్లీ సాంబార్ గోబ్యాక్, గోంగూర గో బ్యాక్ వంటి నినాదాలు, కొందరిని వేధించడం, అభ్యంతరకర చర్యలు, రాతలు వ్యక్తమైనప్పటికీ వరంగల్ వంటి ప్రాంతాల్లో విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన వాళ్లే విప్లవావగాహన నేపథ్యం వలన ఆ ప్రాంతం నుంచి వచ్చిన వాళ్లయ్యారు. అయితే ఇటువంటి పోరాటాలకు స్థానిక మట్టినుంచి

పుట్టుకొచ్చే నాయకత్వం వలన వచ్చే విశ్వసనీయతను గుర్తించిన ఉద్యమం వరంగల్ మిల్ కాలనీకి చెందిన కెఎంసి విద్యార్థి కొల్లూరి చిరంజీవిని నాయకత్వ స్థానంలో నిలిపింది. అట్లాగే ఆర్ఇసి నుంచి శ్రీనివాస్, పురుషోత్తం వంటి వరంగల్ స్థానికులు నాయకులయ్యారు. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికలను ఎట్లా సాపేక్ష న్యాయంతో జరిగినవని చెప్పవచ్చునో 1971లో లోక్‌సభకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలు తెలంగాణ ప్రాంతంలో అంత సాపేక్ష న్యాయంతో జరిగి పద్నాలుగింట పదకొండు స్థానాలను తెలంగాణ ప్రజా సమితి గెలుచుకున్నది. కాని టిపిఎస్ నాయకుడు మర్రి చెన్నారెడ్డి ఎన్నికల తర్వాత ఈ టిపిఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేసి ఉద్యమానికి ద్రోహం చేసి తాను మాత్రం ఉత్తర ప్రదేశ్ గవర్నర్ గిరీని ఇందిరాగాంధీ నుంచి బహుమతిగా పొందాడు. ఎమర్జెన్సీ తర్వాత ఇందిరా కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాగలిగాడు. చంద్రలత 'రేగడి విత్తులు'లో ఆధిపత్య భావజాలంతో ఈ ఉద్యమ పార్శ్వాన్ని మాత్రమే చిత్రించింది.

1968-69 విద్యా సంవత్సరం పూర్తిగా అంటే తొమ్మిది నెలలు కాలేజీలు, స్కూళ్లు అన్నీ మూతబడినాయి. అంతే కాదు వరంగల్‌లో మెడికల్ కాలేజి, పాలిటెక్నిక్ వంటివన్ని తెలంగాణ ఉద్యమకారుల కారాగారాల రూపమెత్తాయి. ఎంతో మంది విద్యార్థి నాయకులతో పాటు కె.జి. సత్యమూర్తి, చక్కిళ్ల ఐలయ్య, కాళోజీలు కూడా జైలుపాలయ్యారు.

ఇదే కాలంలో ఫ్రాన్స్‌లో డీగాల్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉజ్జ్వలమైన విద్యార్థి ఉద్యమం వచ్చింది. తారిక్ అలీ వంటి ప్యారిస్‌లో స్థిరపడిన పాకిస్థాన్‌కు చెందిన మార్క్సిస్టు మేధావి, మావోయిస్టు విద్యార్థులు మొదలుకొని జీన్‌పాల్ సార్త్ర్, సైమన్‌డిబార్రా వంటి తత్వవేత్తలు కూడా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.స్వేచ్ఛా భావనతో స్వీయగౌరవాకాంక్ష, రొట్టె కోసమే కాదు, గులాబీల కోసం కూడా అనే జీవనోత్సవం, విద్యా బోధనా విధానాన్ని విద్యార్థులే రూపొందించుకోవాలనే డిమాండు ఈ కాలంలోనే ముందు కొచ్చాయి. థాయ్‌ల్యాండ్‌లో కూడా వెల్లువ వలె విద్యార్థి ఉద్యమం వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ఎనభై దేశాలలో మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలు ఏర్పడి విప్లవాల్లో, ముఖ్యంగా విద్యార్థి యువతరం పాల్గొన్న కాలమిది. విద్యారంగం గురించి, విద్యా విధానం గురించి మావో ఎంతో విలువైన ఆలోచనలు, ప్రతిపాదనలు చేసిన కాలం కూడా ఇదే. శ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం (1966), నక్సల్బరీ (1967) శ్రీకాకుళం (1968)లు 1969 లెనిన్ శత జయంతి నాటికి ఒక నిర్మాణ రూపం తీసుకున్నవి. ఉజ్జ్వలమైన పోరాటాలు. బుద్ధిజీవులు, కవులు, కళాకారులు పాల్గొన్న తీరులో నక్సల్బరీ శ్రీకాకుళాలను, పంజాబ్, కేరళ, బోజపూర్ (బీహార్)లతో పాటు స్పెయిన్ అంతర్యుద్ధం (1936)తో పోల్చదగిన త్యాగాల, ఆదర్శాల, విలువల ఉద్యమాలు, పోరాటాలు ఇవి.

ఈ కాలమంతా శ్రీశ్రీ, ప్రతి గ్రామంలో పౌరహక్కుల సంఘాలతో పాటు నాస్తిక సంఘాలు కూడా పెట్టాలని ప్రచారం చేసాడు. చెరబండరాజు బంకించంద్ 'వందేమాతరం'లోని జాతి భావన, దేశభక్తి భావనలను వెక్కిరించే 'వందేమాతరమ్' రాసిండు. 'జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త', 'మరోసారి ఈ దేశం మోసపోగూడదు' వంటి కవితల్లో శంకరాచార్యుల వంటి మనుషుల మీద పల్లకీల్లో ఊరేగే మిథ్యావాదులను, గాంధీవంటి రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించిన రాజీవాదులను తీవ్ర ఆగ్రహంతో ఛీత్కరించాడు. సీతారాంబాగ్‌లోని హిందూ బ్రాహ్మణ్య సంప్రదాయం, ఆర్ఎస్ఎస్ శాఖల నుంచే బాల్యం మొదలైన జ్వాలాముఖి బ్రాహ్మణీయ హిందుమతాన్ని తన నిప్పులు చెరిగే ప్రసంగాలతో ఎదుర్కొన్నాడు. విప్లవ భావ ప్రచారం అనివార్యంగా బ్రాహ్మణీయ భూస్వామ్య భావజాల ప్రతిఘటనా ప్రచారం అని కూడా గుర్తించి ఉన్నత విద్యాలయాలు మొదలు, పాఠశాలల వరకు విస్తృతంగా తిరిగి ఎండగట్టిన వాళ్లు శ్రీశ్రీ, చెరబండరాజు, జ్వాలాముఖి, కె. శివారెడ్డి. ఈ నలుగురి సభలు 1968-71 మధ్యకాలంలో ప్రతి కళాశాలలో ఒక సంఘర్షణా సందర్భాలే. ఈ అన్ని సభల్లోనూ, ప్రతి ప్రజా సంఘం సభల్లోనూ మార్మోగిన గద్దర్ పాట 'సాయిబాబా సన్నాయిబాబా...'. ఎబివిపి ఒక వైపు విప్లవ విద్యార్థి నాయకత్వంలో అణగారిన వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకవైపు. మార్చ్, ఝంఝ వంటి కవితా సంకలనాలను 1971 'మార్చ్' నాటికే నిషేధించి 71 ఆగస్టు 2న జ్వాలా, నిఖిలేశ్వర్, చెరబండరాజులను పిడి చట్టం కింద అరెస్టు చేసారంటే వాళ్లు అప్పటికే తెలుగు సమాజంపై ముఖ్యంగా విద్యార్థి యువతరంపై వేసిన ప్రభావాన్ని గ్రహించవచ్చు. విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి వంటి ఛాందసవాదులు విరసంను నక్సలైటు సాహిత్య సంస్థ అని ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా, జార్జిరెడ్డి మొదలు సిరిసిల్లాలో చాంద్‌పాషా వంటి పిడిఎస్‌యు విద్యార్థి నాయకుణ్ని ఎబివిపి గూండాలు చంపేసినా విప్లవం పోల్చుకున్న హిందుత్వ శక్తులను ఆనాటి సాహిత్య విద్యారంగాలు ఎంత మిలిటెంటుగా ఎదురించాయో ఒక దాఖలానే.

అయితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో సమైక్యవాదులు విద్యార్థుల్లోని ప్రగతివాద శక్తులకు - వాళ్ల ప్రాపంచిక దృక్పథంలో విశాలాంధ్ర భావన ఉంటే వాళ్లకు అండగా ఉన్నట్లు కనిపించారు. జార్జిరెడ్డిని హత్య చేసిన ఎబివిపి ఆర్ఎస్ఎస్ వాళ్లకు అప్పటి విద్యామంత్రి పి.వి. నరసింహారావు ఆశ్రయమిచ్చాడు. (అప్పటికే పివి విశ్వనాథ 'వేయి పడగలు' హిందీలోకి అనువాదం చేసి ఉన్నాడు). బ్రహ్మానందరెడ్డి జార్జిరెడ్డికి అనుకూల వైఖరి తీసుకున్నట్లు కనిపించాడు. (అప్పటికి జార్జిరెడ్డి కాంగ్రెస్‌లోనే ఉంటూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ సోషలిస్టు శిబిరాన్ని సంఘటితం చేస్తున్న కె.వి. రఘునాథరెడ్డి అనుచరుడుగా ఉన్నాడు.) కాని జార్జిరెడ్డి ఆర్ఇసిలోని విప్లవ శక్తులతో మాట్లాడడానికి వరంగల్ దాకా సైకిల్ మీద యాత్ర చేపట్టాడు. (చేగువేరా మోటర్‌సైకిల్ యాత్రతో ప్రభావితుడై.)

విప్లవ విద్యార్థి ఉద్యమాలు ఒక సమగ్ర సమాహార దృష్టితో పునాది ఉపరితల పోరాటాలలో భూమిక నిర్వహించాయనడానికి మరొక శక్తివంతమైన ఉదాహరణ రైల్వే సమ్మె సికిందరాబాదు, కాజీపేట, గుంతకల్లు వంటి రైల్వే జంక్షన్‌లలో సూరపనేని జనార్దన్, జంపాల ప్రసాద్ వంటి విప్లవ విద్యార్థి నాయకులు విద్యార్థులను

రైల్వే కార్మికుల పోరాటాలలో ప్రవేశపెట్టి 1974 మే నెల అంతా ఎంతో మిలిటెంట్ పోరాటం నిర్వహించారు. కాజీపేట నుంచి డోర్నకల్ దాకా రైల్వే సమ్మె వెనుక చోదకశక్తులు సూరపనేని జనార్ధన్ వంటి విప్లవ విద్యార్థులే అంటే అతిశయోక్తికాదు.

ఆంధ్రా యూనివర్సిటీలో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ కాలంలో ఎస్.ఎఫ్. ప్రవేశపెట్టిన పొలిటికల్ డిబేట్ సంప్రదాయాన్ని ఆర్ఇసిలో 70లలో సూరపనేని జనార్దన్ ప్రవేశపెట్టాడు. ఆ తర్వాత కాలంలో పిడిఎస్‌యు విద్యార్థులు కూడా ఖమ్మం, ఉస్మానియా యూనివర్సిటీ వంటి పలుచోట్ల ఈ ఆరోగ్యకరమైన చర్యను ఆహ్వానించారు. సహజంగానే విప్లవ భావజాలం ఉన్న ఉపాధ్యాయ విద్యార్థులకు, ఎబివిపి, ఆర్ఎస్ఎస్ భావజాలానికి భావ సంఘర్షణ ఒక్కొక్క చోట భౌతిక సంఘర్షణకు కూడా దారి తీసేది.

ఎబివిపికి అధ్యక్ష ఉపాధ్యక్షులను యూనివర్సిటీ అధ్యాపక వర్గం నుంచి ఎన్నుకునే ఒక సంప్రదాయం ఆ రోజుల్లో ఉండేది. ఉస్మానియా ఇంజనీరింగు కాలేజీలో మాథమేటిక్స్ ప్రొఫెసర్ శేషగిరి రావు చిరకాలం ఎబివిపి బిజెపిలకు థింక్ ట్యాంక్‌గా వ్యవహరించిన ఎబివిపి అధ్యక్షుడు, అట్లే వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి ప్రిన్సిపల్‌గా పనిచేసిన బిరుదురాజు రామరాజు ఎబివిపి అధ్యక్షుడుగా వరంగల్‌లో విప్లవ శక్తులను ఉపాధ్యాయ, విద్యార్థులలో ఏరి వేసే చురుకైన పని చేసాడు. విప్లవ భావాలు గల వాళ్ల విశ్వవిద్యాలయాల్లో ఎన్నిక కాకుండా చూసాడు. ఆ తర్వాత కాలంలో హైదరాబాదుకు మారాక గణేశ్ ఉత్సవ సమితి, విశ్వహిందూ పరిషత్ సాయిబాబా భక్తి వంటి హిందుత్వ భావజాలానికి ఒక కేంద్రమయ్యాడు. 1973 నాటికే ఈయన నాయకత్వంలో బిజెపి జంగారెడ్డి వంటివాళ్ల ఆర్ఇసి అంటే రాడికల్ ఇంజనీరింగ్ కాలేజి అని, సికెఎం అంటే చారుమంజుదార్ కాలేజీ అని గోడల మీద రాయించి ప్రచారానికెత్తు కొని పోలీసు నిర్బంధాన్ని పెంచారు.

1970లో విప్లవ రచయితల సంఘంను ఏర్పాటు చేసిన వాళ్లలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు తప్ప మిగతా ఆరుగురు కళాశాలల్లోనో, పాఠశాలల్లోనో ఉపాధ్యాయులు. ఇంక విప్లవ విద్యార్థి ఉద్యమాలు నిర్మాణ రూపాలు తీసుకోవడం ప్రారంభమైంది. మొదట డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లు హైదరాబాదులో ప్రారంభమయ్యాయి. వరంగల్‌లో పిడిఎస్ తర్వాత విప్లవ విద్యార్థులుగా పెద్ద నిర్మాణ రూపం లేకుండా వందల సంఖ్యలో క్రియాశీలంగా పని ప్రారంభించారు. తిరుపతిలో ముఖ్యంగా ఎస్.వి. ప్రాచ్య కళాశాలలో త్రిపురనేని మధుసూదనరావు గైడెన్స్‌లో రాడికల్ విద్యార్థుల పేరుతో విప్లవ భావ ప్రచారం మొదలైంది.

దిగంబర కవులు మూడవ సంపుటి వెలువడి (1968) శ్రీశ్రీ షష్టిపూర్తి (ఫిబ్రవరి 1970) కూడ ముగిసాక 'దిగంబర కవులు'ను తిరుపతికి పిలిచి ఈ రాడికల్ విద్యార్థులే వీళ్లను ప్రభావితం చేసిన వాళ్లలో ఉన్నారు. వరంగల్‌లో 1968లో జరిగిన వరంగల్ జిల్లా రచయితల సభలపైన, 1968 మే నెల తర్వాత 'సృజన' పైన కెఎంసి వైద్య విద్యార్థుల ప్రభావం కూడా అటువంటిదే. ఎక్కువగా ఉపాధ్యాయులు, విద్యార్థులు (వడ్డేపల్లి సుధాకర్, సుదర్శన్ మినహా) పది మంది కలిసి తెచ్చిన 'తిరుగబడు' (జనవరి 1970) సన్నిహిత విప్లవపోరాట ప్రతిఫలనమే. 'ప్రజల్ని సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి' అని వెలువడిన 'మార్చ్' సరే సరి.

1970-72 మధ్యకాలం ఉజ్వలమైన విప్లవ విద్యార్థి ఉద్యమం నిర్మాణ రూపం తీసుకుంటున్న కాలం. ముఖ్యంగా యూనివర్సిటీలు ఉన్న చోట క్యాంపస్‌లు. లేనిచోట ఇంజనీరింగు, మెడికల్ కాలేజీలు విప్లవ విద్యార్థి ఉద్యమాలకు నెలవుగా ఉన్నాయి.

1972లో రెండు ప్రధాన సందర్భాలు వచ్చాయి. 1970 జులై 10న సత్యం, కైలాసాలు బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులయ్యాక దెబ్బ తింటూ వచ్చిన శ్రీకాకుళ రైతాంగ పోరాటానికి ఆఖరి ఊపిరి ఊదిన రాజారాం రెడ్డి (అనంతపురం ఇంజనీరింగు కాలేజీ విద్యార్థి) 72లో బూటకపు 'ఎన్‌కౌంటర్'లో అమరుడు కావడంతో శ్రీకాకుళ ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురయింది. ఖమ్మం సుబ్బారావు పాణిగ్రాహి నగర్‌లో విరసం ప్రథమ మహాసభలు (అక్టోబరు 1970) జరిగే నాటికి సత్యం, కైలాసాలు అమరులయినారు. ఇట్లా సెట్ బ్యాక్ కాలంలో విరసం (1970) జననాట్యమండలి (1972) ఏర్పడి భావ ప్రచారంతో ఆరిపోతున్న దీపం వెలుగులను పంచే ప్రయత్నం చేసినట్లుగానే విప్లవ విద్యార్థి ఉద్యమం కూడా ఉధృతంగా నిర్మాణ రూపంలోకి మారడం జార్జ్‌రెడ్డి అమరత్వంతో ఊపందుకున్నది. ఉస్మానియా ఇంజనీరింగు కాలేజి విద్యార్థి అయిన జార్జిరెడ్డిని విద్యార్థి సంఘం ఎన్నికలకు ఒక రోజు ముందు ఇంజనీరింగు కాలేజి మెట్ల మీదనే ఎబివిపి, ఆర్ఎస్ఎస్ గూండాలు కలిసి కత్తులతో 1972 ఏప్రిల్ 14న చంపేసారు. అందుకోసం ఉద్దేశపూర్వకంగానే అంబేద్కర్ జయంతి రోజును ఎంచుకున్నారు. (రివజనిస్టులు దొడ్డి కొమురయ్య అమరత్వం - 4 జూలై - రోజును శ్రీకాకుళ పోరాట వ్యతిరేక దినంగా ఎంచుకున్నట్లు.)

1972 ఏప్రిల్ 14 అట్లా విప్లవ విద్యార్థి ఉద్యమంలో ఒక రెడ్ లెటర్ డే గా మాత్రమే కాదు విప్లవ విద్యార్థి ఉద్యమానికి సామ్రాజ్యవాదంతో పాటు భూస్వామ్య బ్రాహ్మణీయ హిందూ మతోన్మాదం కూడా ప్రబల శత్రువు అనే విషయాన్ని ముందుకు తెచ్చింది. అప్పటికే వరంగల్ కెఎంసి, ఆర్ఇసిలలో విప్లవ విద్యార్థులకు, ఎబివిపి వాళ్లకు భావ సంఘర్షణలో కరపత్రాలు, సదస్సులు, సభలు, విద్యార్థి సంఘం ఎన్నికల రూపంలో మొదలై భౌతికదాడులు కూడా జరుగుతున్న కాలం. ఆర్ఇసిలో బీహార్ మొదలైన ప్రాంతాల నుంచి వచ్చిన భూమిహారుల పిల్లలు, తెలంగాణలో బ్రాహ్మణ, రెడ్డి, వెలమ, వైశ్య కుటుంబాల నుంచి, సంపన్న కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు ఎబివిపిలో చేరడం ప్రారంభమైంది. అప్పటి విద్యార్థుల తలిదండ్రులెక్కువ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా, ఏ కొద్ది మంది మాత్రమే జనసంఘ్‌లో ఉన్నా విద్యార్థుల్లో మిలిటెన్సీకి వాళ్లకు ఎబివిపియే అవసరమైంది. జార్జిరెడ్డి హత్య విద్యార్థి ఉద్యమాలను ఒక కుదుపు కుదిపింది. 'జోర్ జులుంకె టక్కర్‌మే సంఘర్ష్ హమారా నారాహై', 'జీనా హై తో మర్‌నా సీఖో', ఖదమ్ ఖదమ్ పర్ లడ్‌నా సీఖో', 'జోహమ్‌సే టక్‌రాయేగా, వహ్ మిట్టీమే మిల్‌జాయేగా' వంటి నినాదాలు, కాగడాలు (మషాల్ - షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల - లేమషాలా లేచలేగా...'

స్ఫూర్తి) పిడికిళ్లు - 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి నాపలేరు' వంటి నినాదాలు - విప్లవ విద్యార్థి సంకేతాలయ్యాయి. సబ్‌కా బరీ నక్సల్బరీ, సబ్‌కా నామ్ వియత్నామ్ - 70లలో మార్మోగిన నినాదం.

క్యాంపస్‌లలో, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో 1972-75 భావ ఘర్షణలైనా, భౌతిక ఘర్షణలయినా విప్లవ విద్యార్థులకు ఎబివిపికి మధ్యనే. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్‌యుఐ (కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంస్థ) తో ఉండేవి.

ఈ నేపథ్యంలోనే పిడిఎస్‌యు జంట నగరాలు - రాష్ట్రానికి విస్తరించే ప్రయత్నంలో 1974 అక్టోబర్‌లో సారస్వత పరిషత్ హాల్‌లో జరిగిన సదస్సులో సాయుధ పోరాటానికి మద్దతు ప్రకటించడమనే లక్ష్యంపై విభేదాలొచ్చి ఆర్ఎస్‌యు ఏర్పడింది. తిరుపతిలో ప్రచలితంగా ఉన్న రాడికల్స్ అనే మాట రాడికల్ విద్యార్థి సంఘం నామకరణానికి ప్రేరణ అయింది. ఆర్ఇసిలో ఎబివిపితో తలపడిన విద్యార్థులు, కెఎంసిలో ఎబివిపితో తలపడిన విద్యార్థులు ఆర్ఎస్‌యు నాయకత్వానికి వచ్చారు. శాస్త్రీయ విద్యావిధానం, లౌకిక ప్రజాస్వామ్య భావాలు, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు, భూమిలేని నిరుపేదలు భూస్వామ్యానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలకు మద్దతు ప్రకటించడంగా ఉండేది. 1972లో ఏర్పడిన జననాట్య మండలి స్ఫూర్తితో ఎక్కడికక్కడ జననాట్యమండలి కళా సాంస్కృతిక బృందాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి దళితవాడల్లో (అప్పటికింకా ప్రచారంలోనికి ఈ మాట రాలేదు గానీ ఎస్‌సి కాలనీలకు వెళ్లి అని గానీ మాల మాదిగ వాడలకు వెళ్లి అని గానీ పిలిచేవారు) భూపోరాటాల గురించి, వ్యవసాయ కూలీల కూలిరేట్ల గురించి ప్రచారం చేసేవాళ్లు - ముఖ్యంగా 1974లో ఆర్ఎస్‌యు ఏర్పడి 75 ఫిబ్రవరిలో ప్రథమ మహాసభలు హైదరాబాదులో జరుపుకున్న పూర్తికాలపు విప్లవోద్యమంలో వెళ్లిన సూరపనేని జనార్దన్ ఆర్ఇసి చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతు కూలీ సంఘాలు నెలకొల్పడం మొదలు, రిక్షా కార్మికులను, ఆర్ఇసిలో మెస్ వర్కర్లను కూడా సంఘాలుగా సంఘటితం చేసాడు. వరంగల్ వైపు దేశాయిపేట, పైడిపల్లి వరకు ఎక్కువగా దళితులతో వ్యవసాయకూలీ సంఘం నిర్మాణాలు చేసాడు.

వరంగల్‌లో కె.ఎస్.ఎస్.ఎం.లు విద్యార్థి ఉద్యమాలను గైడ్ చేయడం ప్రారంభించిన దగ్గర్నించి (1966 తర్వాత) అటు ఆర్ఎస్ఎస్, ఎబివిపిలు కాలేజీలల్లో బయట విప్లవాభిమానులని తామనుకున్న వారిపై దాడులు చేయించడం పెరిగింది. పరకాలకు చెందిన సురేంద్రరెడ్డి, గవిచెర్లకు చెందిన లింగాల రామచంద్రారెడ్డి, వరంగల్‌లో హైస్కూలు నుంచి నాకు క్లాస్‌మేట్‌గా ఉన్న ముక్తిలింగం, ఆర్ఇసిలో వన్నాల శ్రీరాములు ఆర్ఎస్ఎస్ ఎబివిపిలను ఆర్గనైజ్ చేసేవాళ్లు. ఆ తర్వాత కాలంలో అమెరికాలో స్థిరపడిన చాలా మంది కెఎంసి విద్యార్థులు (ముఖ్యంగా బొట్టు నరసింహారెడ్డి అని పిలుచుకునే నర్సంపేటకు చెందిన భూస్వామి కొడుకు) ముందుండి కాలేజీలోనూ, బయట కూడ దాడులు చేసేవాళ్లు. పరకాల దగ్గర చినకోడె పాక అనే గ్రామంలో 'మిత్రమండలి' సమావేశం ఏర్పాటు చేసిన సాహిత్యాభిమాని ఇంటిపై దాడి చేసి ఆయనను కొట్టారు. ఇటువంటి ఎన్నో ఉదాహరణలకు శిఖరాయమానమైనది. కాకతీయ మెడికల్ కాలేజ్ మ్యాగజైన్‌లో శ్రీశ్రీ రాసిన వ్యాసం 'తెలుగు నాటక రంగంపై లెనిన్ ప్రభావం' (లెనిన్ శత జయంతి 1969 సందర్భంగా ఒక అఖిల భారత సదస్సు కోసం శ్రీశ్రీ ఇంగ్లిషులో రాసింది) అచ్చేస్తే ఎబివిపి విద్యార్థులు ఆ కాగితాలు చించి గానీ మ్యాగజైన్ పంచాలని ప్రిన్సిపల్‌పై ఒత్తిడి చేసారు. ఒత్తిడికి ప్రిన్సిపల్ లొంగి అట్లే చేసారు. అప్పుడు సృజన ఒక మ్యాగజైన్ నుంచి శ్రీశ్రీ వ్యాసాన్ని చించేయగలరేమో కానీ, ఎన్ని హృదయాల నుంచి శ్రీశ్రీని తొలగించగలరు అని సంపాదకీయం రాసింది. శ్రీశ్రీ వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో, బి.ఎడ్. కాలేజిలో ఈ అంశంపై ప్రసంగించిన తర్వాతనే ఇంగ్లిషు వ్యాసం ఆ మ్యాగజైన్ సంపాదక వర్గ విద్యార్థుల కోరిక మేరకు వారికి ఇచ్చాడు. అట్లాగే ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ నుంచి మార్క్స్ - లెనిన్ పుస్తకాలు తీసి లైబ్రరీ ముందు ఎబివిపి పిల్లలు తగులబెట్టేవారు.

విప్లవ విద్యార్థులు కులాంతర, మతాంతర, ఆదర్శ వివాహాలను ప్రోత్సహిస్తూ ఆ సందర్భంగా సభలు ఏర్పాటు చేస్తే అధికారంలో ఉన్న కాంగ్రెస్ మొదలు కాలేజీల్లోని విద్యార్థులు, ప్రభుత్వ యంత్రాంగం, పోలీసుల సహాయంతో అడ్డుకునేవారు. సికెఎం కాలేజీ విద్యార్థి నల్లమల్లారెడ్డి సంధ్యలు ఆదర్శ వివాహం చేసుకుంటే ఆమె మైనర్ అని పోలీసు కేసు పెట్టి వివాహ ప్రకటన సభపై దాడి చేసి, అరెస్టు చేయించారు. మర్నాడు కోర్టులో మేజర్‌నని, ఇష్టపూర్వకంగా చేసుకున్నానని ఆమె చెప్పాకగానీ విడుదల చేయలేదు. నల్లమల్లారెడ్డి ప్రత్యేక తెలంగాణ జెండాను జాతీయ జెండా కంటే ఎత్తుగా సికెఎం కాలేజీలో జనవరి 26న ఎగిరేసాడని, దానికి ప్రిన్సిపల్, జిల్లా కలెక్టర్ సహకరించారని రాష్ట్రపతికి జిల్లా రాజకీయ పార్టీలన్నీ ఫిర్యాదు చేసాయి. (1973 జనవరి) అట్లే 73 ఆగస్టు 15న అధిక ధరలకు వ్యతిరేక ప్రదర్శన ర్యాలీలో అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు పాల్గొని, ఎవరూ జెండాలు తేవద్దని నియమం పెట్టుకుంటే కాంగ్రెస్ ఐఎన్‌టియుసి వాళ్లు కాంగ్రెస్ జెండాలు తెచ్చారు. అవి అందులో పాల్గొన్న విప్లవాభిమానులు తొలగిస్తే జాతీయ జెండాలను తగులబెట్టారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఆయన చర్య తీసుకోలేదని రాష్ట్రపతికి ఆయన నక్సలైటు కలెక్టరని ఆయన సికెఎం కాలేజి నక్సలైటు ప్రినిపల్ సలహాతో జిల్లాను పాలిస్తున్నాడని ఫిర్యాదు చేసారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఇటు విప్లవ విద్యార్థులు - ముఖ్యంగా తర్వాత కాలంలో ఆర్ఎస్‌యులోకి వచ్చిన వాళ్లు పాల్గొన్నట్లుగా, అటు ఎబివిపి వాళ్లు కూడా పాల్గొన్నారు. కాని ఇర్వురి మధ్యన ఎప్పుడూ ఘర్షణాయుత వాతావరణముండేది. మిగతా జాతీయ పార్టీల విద్యార్థి సంఘాలన్నీ సమైక్యవాదం వైపు ఉండేవి. సిపిఐ సిపిఎంల నుంచి కాంగ్రెస్ నుంచి కూడా ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న ఒకే ఒక్క విప్లవ విద్యార్థి గ్రూపు దాడులు, నిర్బంధాలు ఎదుర్కునే పరిస్థితి ఉండేది. ఇంత ప్రతికూల వాతావరణంలో స్థానిక ప్రజల్లో, విద్యార్థుల్లో ఉండే అభిమానం, మద్దతు వల్లనే వాళ్లు మిలిటెంటుగా పోరాడగలిగే వాళ్లు. రైల్వే సమ్మె సందర్భంగా కార్మిక రంగ పోరాటంలో వాళ్ల పాత్ర ఈ పునాదిని స్పష్టంగా రుజువు చేసింది. ఈ నేపథ్యం నుంచే 1974 అక్టోబర్‌లో హైదరాబాదులో జరిగిన పిడిఎస్‌యు సదస్సు నుంచి - ప్రణాళికలో

స్పష్టంగా విప్లవ రాజకీయ పంథాను, నూతన ప్రజాస్వామిక విప్లవానికి ప్రధాన పోరాట రూపమైన సాయుధ పోరాటాన్ని బలపరచాలనే నిర్ణయంతో బయటికి వచ్చి ఆర్ఎస్‌యు ఏర్పాటు చేశారు. 1975 ఫిబ్రవరిలో హైదరాబాదులో ప్రథమ మహాసభలు ఉత్తేజకరంగా జరుపుకున్న నాలుగు నెలలకే ఎమర్జెన్సీ వచ్చింది.

ఈ మహాసభలను శ్రీశ్రీ ప్రారంభించాడు. చెరబండరాజు, ఎంటిఖాన్ ఈ సభల్లో పాల్గొన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించగానే రాడికల్ విద్యార్థి సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకట రమణి (ఉస్మానియా సైన్స్ కాలేజి) జగన్మోహన్ రెడ్డి (కెఎంసి) ఉపాధ్యక్షుడు సి.వి. సుబ్బారావు (ఆంధ్రా యూనివర్సిటీ)లతో పాటు కొందరు కార్యవర్గ సభ్యులు కూడ అరెస్టయి రాష్ట్రంలోని వివిధ జైళ్లలో డిటెన్యూలుగా బందీలయ్యారు. కాని సూరపనేని జనార్దన్‌తో పాటు ఇంకెంతో మంది క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఆర్ఎస్‌యు విద్యార్థులు అజ్ఞాత జీవితానికి వెళ్లి ప్రజల మధ్యన పనిచేయడం ప్రారంభించారు. అందుకు స్పష్టమైన పథనిర్దేశం వాళ్లకు 1976లో 'విప్లవానికి బాట' అనే ప్రణాళిక ద్వారా ఏర్పడింది. చలసాని తరచు చెప్పేట్లుగా - ఆ తర్వాత దంతా చరిత్ర - 'గ్రామలకు తరలండి' అని వరంగల్ ఆర్ఎస్‌యు రెండవ మహాసభలు (ఫిబ్రవరి 1978)లో ఇచ్చిన పిలుపుకు రూపకల్పన గానీ, పథక రచనగానీ ఎమర్జెన్సీలోనే జరిగింది. అది శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ కాలాన్ని తలపించే ఒక భూకంపం. దాని గురించిన వివరాలు, చర్చ - మరొక మారు.

ఆనాడు విద్యార్థి ఉద్యమం ప్రజల్లో పని చేయడానికి ఆటంకంగా ఉన్న శక్తులు - స్థానికంగా, ప్రత్యక్షంగా బ్రాహ్మణీయ భూస్వామ్యం - దానికి ప్రాతినిధ్యం వహించే కాంగ్రెస్, బిజెపి పార్టీలు, మిలిటెన్సీ దృష్ట్యా విద్యార్థి రంగంలో ఏబివిపి. వీళ్లంతా ఎక్కువగా అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలం. ఆ పార్టీల సంపన్న కులాల నుంచి అప్పటికే అమెరికాకు వెళ్లే విద్యార్థులు కూడా ఇంజినీరింగు, మెడికల్ కాలేజీలలోనేఉండేవాళ్లు. కేంద్రంలో ఉన్న ఇందిరా ప్రభుత్వం రష్యా సోషల్ సామ్రాజ్యవాద అనుకూల వైఖరి తీసుకోవడం వల్ల, విప్లవ శక్తులకు 1968 జెకోస్లొవేకియాపై దాడి తర్వాత రష్యా సోషల్ సామ్రాజ్యవాదం తక్షణ ప్రత్యక్ష శత్రువుగా పరిణమించింది. కనుక విద్యార్థి రంగంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బలమున్న చోట ఎన్ఎస్‌యుఐ కూడా ఎదుర్కోవాల్సిన శక్తులుగానే ఉండేవి. తెలంగాణలో తర్వాత కాలంలో ఆర్ఎస్‌యులోకి వచ్చిన విద్యార్థులు ప్రత్యేక తెలంగాణను బలపరచడం వల్ల కూడా వీళ్ల నుంచి దాడులు ఎదుర్కోవల్సి వచ్చేది. చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ ప్రభావం వల్ల వచ్చిన నక్సల్బరీ విప్లవం, సన్నిహితంగా శ్రీకాకుళ రైతాంగ పోరాటం - మావో ఆలోచనలతో - ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరచుకున్నది గనుక - చైనా యుద్ధ కారణంగా మధ్య తరగతి బుద్ధి జీవుల్లో విద్యారంగంలో బలంగా ఉన్న జాతీయోన్మాదాన్ని ఎదుర్కోవడం కూడ ఒక కర్తవ్యంగా ఉండేది. 1965, 71 లలో పాకిస్థాన్‌తో భారత యుద్ధాలు కూడ రెచ్చగొట్టిన జాతీయోన్మాదం, ముస్లిం వ్యతిరేకతలను ఎదుర్కోవడానికి లౌకిక, ప్రజాస్వామిక, విప్లవ భావజాలాన్ని ప్రచారం చేయాల్సిన కర్తవ్యం వల్ల కూడా ప్రధానంగా విప్లవ శిబిరంలోని విద్యార్థులకు ఏబివిపి విద్యార్థులతో తీవ్రంగా తలపడాల్సి ఉండేది. ఈ అన్ని సందర్భాల్లోనూ ప్రభుత్వాల నుంచి, రాజ్యం నుంచి, వ్యవస్థ నుంచి దాడిని ఎదుర్కోవాల్సి రావడం విద్యార్థుల్లో మిలిటెన్సీని ప్రతిఘటనా శక్తిని పెంచాయి. త్యాగాలు తప్పనిసరియైనవి.

☆

(20వ పేజీ తరువాత...)

చీకటిలోకి నెట్టేసింది. కొందరు సమయాని కంటే ముందే కాటికి చేరితే ఇంకొందరు కాటికి చేరువలో.. అవిటివాళ్ళయి.. గుడ్డివాళ్ళయి.. కాన్సర్.. కిడ్నీ వ్యాధుల పీడితులై.. 'గుండెల్లోంచి పెల్లుబుకుతున్న ఆవేదనకి అడ్డుకట్ట వేసి బంధించడం కోసం కొద్దిగా ఆగి కళ్ళు వొత్తుకున్నాడతను.

ఇదా తను చూడాలని తహతహలాడి పరిగెత్తుకొచ్చిన తన ఊరు మౌనంగా రోదించింది సురేష్ హృదయం. అనాథాశ్రమంలో పెరిగి చదువుకుంటూనే పర్యావరణ కార్యకర్తగా ఎదుగిన సురేష్ కల్పక్కం అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలని దగ్గరగా చూశాడు. కొన్ని సార్లు తానూ పాల్గొన్నాడు. అతనిప్పుడు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తిరిగి వెళ్తే సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా మంచి ఉద్యోగంలో చేరి లక్షల్లో డబ్బు సంపాదిస్తాడు. తల్లిని దగ్గర పెట్టుకుని చికిత్స చేయిస్తాడు. చెల్లికీ సాయం అందించగలడు. కానీ.. తన గ్రామంలాంటి గ్రామాలూ ఇలా మండిపోవలసిన్దేనా... ఈ కారుచిచ్చు కాల్తూనే ఉండాల్సిన్దేనా.. సురేష్ ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ 'ప్రభుత్వాల, నాయకుల అవిటితనం మమ్మల్ని పనికిరాని వాళ్ళుగా మార్చేసింది 'కాళ్ళు వంకర తిరిగిన పెద్దతను అన్నాడు.

'శారీరకంగా, మానసికంగా శక్తి విహీనమైన తరం, మానసికంగా శారీరకంగా వికసించలేని స్థితి.. 'చెప్పుకుపోతున్నాడు అంజి తమ్ముడు నాగ

ఏమీ ఎరగనట్లు.. తనకేమీ పట్టనట్లు.. ప్రపంచానికేదో మేలు చేసేస్తున్నట్లు దూరంగా వెలుగులు విరజిమ్ముతున్న యన్టి పి సి కేసి చూస్తూన్న సురేష్ లో కొత్త ఆలోచనలు. కలకత్తా నుండి కచ్ వరకూ సాగరతీరంలో పవర్ ప్లాంట్లు పెడ్తామంటున్న విషయం అతని మదిలో మెదిలింది. పవర్ అవసరమే. నిత్యావసరమే.. కానీ ప్రజల సంక్షేమం కూడా ప్రభుత్వం బాధ్యతేగా.. ప్రజల్ని పెనం మీద నుంచి పొయ్యిలో పడేయడం కాదుగా..? సహజ సిద్దంగా లభించే వనరుల్ని ఎంతవాడినా తరిగిపోని ఇంధన వనరుల్ని ఎందుకు ప్రోత్సహించడం లేదు.. ఆ దిశగా సాగే పరిశోధనల్ని.. ఆ ఫలితాల్ని ప్రజలకి అందుబాటులోకి తెచ్చే యత్నం చేస్తే.. అవును, నా కార్య క్షేత్రం ఇదే.. ఇదే.. మనసులోనే అనుకున్నాడు సురేష్. పర్యావరణ కార్యకర్తగా తన అనుభవాలు అక్కడివారితో పంచుకున్నాడు.

ఆసక్తిగా అన్నీ విన్న పెద్దాయన 'నూరు గొడ్లను తిన్న రాబందుకైనా ఒకటే గాలిపెట్టు కదా..' అన్నమాట అక్కడున్నవారిని ఆలోచనలో పడేసింది.

☆

ఆ రోజులు...
తెలంగాణాలో వీచిన కొత్త గాలి.... కొన్ని జ్ఞాపకాలు

తుషార్‌కాంత్

72, మే 1 న నన్ను సిర్పూర్ (ఆదిలాబాదు జిల్లా) కోర్టులో కేసులో నిర్దోషిగ నిర్ధారించి కోర్టు నన్ను విడుదల చేసింది. ఆ కేసు గురించి మళ్లీ ఎపుడైనా రాద్దాం. హైదరాబాదులో ఒక కేంద్ర టెక్నికల్ శిక్షణ సంస్థలో అడ్మిషన్ వచ్చిందని హైదరాబాద్ చేరుకున్నాను. అది 1972. వేసవి కాలం, తార్నాకలో మా అన్న చిన్న కిరాయి రూమ్‌లో ఉంటూ ఇండో నిప్పాన్ ప్రిసిషన్ బేరింగ్ అనే కంపెనీలో డిజైను ఇంజినీర్‌గ పని చేస్తున్నాడు. నేను వచ్చినాక ఒక రూము సరిపోక విద్యానగర్‌లో రిటైర్డ్ తహసీల్దార్ గురువారెడ్డి గారి అవుట్ హౌస్లో రెండు రూమ్స్ కిరాయికి తీసుకున్నాం. జార్జ్ రెడ్డి ఒక నెల కాకముందు ఏ గల్లి చివర హాస్టల్ వద్ద హత్యకు గురైయ్యాడో ఆ గల్లి క్యాంపస్ రోడ్డు లో కలిసిన కాడ మలుపు మీద గురువా రెడ్డి ఇల్లు. గేటు బైట ఒక సిమెంటు రాక్ కట్టి ఉంది. రోజా సాయంత్రం అక్కడ కూర్చోని వచ్చే పోయే ట్రాఫిక్ వైపు అకారణంగానే చూస్తూ వుండే వాణ్ని. కొన్ని రోజుల్లోనే చుట్టు - పక్కల వుండే యువకులతో పరిచయమైంది. ల్యాండ్ లార్డ్ గురువారెడ్డి పెద్ద కొడుకు సతీష్, ఎదురింటి (అదో బంగ్లా) బూర్గుల దిలీప్, అలీ, మరికొందరి తో పాటు చివరికి దిలీప్ తమ్ముడు బూర్గుల ప్రదీప్‌లాంటి కొందరితో పిచ్చాపాటి మాట్లాడుకునే వాణ్ని. వారి నోట మొదటిసారి జార్జ్ రెడ్డి గురించి విన్న. నేనుండే అవుట్ హౌస్ కాక గురువారెడ్డిగారి ఇంటి వాకిట్లో సైడ్‌లో ఇంకొక రెండు రూములు ఉండేవి, ఒక ఫ్యామిలీ ఈస్ట్ గోదావరి నుండి వచ్చి ఆ ఇంట్లో కిరాయికున్నారు. మురళి అనే ఒక అబ్బాయి నా వయస్సు కలవాడు. నేను అడ్మిషన్ తీసుకున్న ఇన్స్టిట్యూట్‌లో నేను ఏ ఎలక్ట్రికల్ విభాగంలోఐతే చేరానో అదే బ్రాంచ్‌లో వచ్చి చేరిండు. అతనితో సహజంగానే మైత్రి కుదిరింది. ఇతడే తరువాత డీకేలో అమరుడయిన ఆనంద్. జార్జ్ తనవెంట కొందరు విద్యార్థులను సైకిల్ ర్యాలి పేరిట వరంగల్ ఆర్ ఈ సీ క్యాంపస్‌లో అపుడు హాస్టల్‌లో వుంటున్న సూరపనేని జనార్దన్ను కలువడానికి తీసుకు పోయిన విషయం కూడా అప్పుడే ప్రదీప్, సతీష్ లాంటి వారి దగ్గర తెలిసింది. తరువాత జనార్దన్‌తో అతనేం మాట్లాడిండు, జనార్దన్ కూడా ఏమన్నాడు వరంగల్‌లో అపుడు క్రియాశీలంగా వున్న మిత్రుల వద్ద తెలుసుకోగలిగిన. తనతో వచ్చిన వారికి చేగువేరా ఎలా పెరూ, బొలీవియలో అడవిదారిలో సాగిండో చెప్పి ఉత్తేజపరుస్తూనే తను మాత్రం పార్టీ (అప్పటి ఏకైక సీ పీ ఐ ఎం ఎల్) తో సంబంధాలు ఎలా సాధ్యమో తెలుసుకొనే విషయమే జనార్దన్‌తో చర్చించడానికే వెళ్లాడనేది నిర్వివాదంగా చెప్పగలను. అయితే జనార్దన్ పార్టీ సీక్రేసి పద్ధతుల గురించిన తనకున్న అవగాహన కారణంగా పార్టీ నాయకుడు కే. జీ. సత్యమూర్తి ఆక్షణంలో వరంగల్‌లో వుంటున్నప్పటికి, తన కాంటాక్ట్‌లో వున్నప్పటికీ, అండర్ గ్రౌండ్ పార్టీతో సంబంధం రావటానికి కనీసం ఆరు నెలలు పడుతుందని చెప్పి జార్జ్‌ను వట్టిచేతులతోనే సాగనపిండు. ఇలా తిరిగి వచ్చిన కొన్ని రోజులకే జార్జ్ అమరుడు కావటం, జార్జ్ తమ్ముడు సిరిల్, కూర రాజన్న లాంటి కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి పెట్టుకున్న సిపిఐ ఎం ఎల్ లో చేరిపోవటం అనే పరిణామాలు ఒకదాని తరువాత వొకటి స్వల్ప కాలంలోనే జరిగిన పరిణామాలనేది వేరే చెప్పవలసిన అవసరం లేదు.

అటు తరిమెల నాగిరెడ్డి గారి ప్రభావంతో డెమొక్రటిక్ స్టూడెంట్స్ అనే ఒక చిన్న గ్రూప్ క్యాంపస్‌లో ఒక తమిళ కుటుంబానికి చెందిన వారి నాయకత్వంలో ఫంక్షన్ అవుతుండేది. వారుండేది నల్లకుంటలో. సిరిల్, కూర రాజన్న లాంటివాళ్ళు యుజీ పోయినాక జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, మహిపాల్ రెడ్డి లాంటి మిలిటెంట్ నాయకుల చుట్టూ మరికొంతమంది విద్యార్థులు, ముఖ్యంగా క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజిలో కొంత మంది విద్యార్థులు, సైన్సు కాలేజిలోని కొంతమంది విద్యార్థినీ-విద్యార్థులు అలాగే ఆర్ట్స్ ఫ్యాకల్టీ మాస్టర్స్ చేస్తున్న కొందరు, లా కాలేజిలో చదువుతున్న ప్రవీణ్ లాంటి మరి కొందరు కలిసి చంద్ర పుల్లారెడ్డి గ్రూపు నాయకులైన నీలం రామచంద్రయ్య గారి మార్గదర్శకత్వం కింద క్యాంపస్‌లో పని చేస్తూవున్నారు. నేను అప్పటికే చారు మజుందార్ నాయకత్వంలోని సీపీ ఐ ఎం.ఎల్. రాజకీయ పంథా భారత దేశ విప్లవానికి అవసరమైన ఏకైక సరయిన పంథా అనే నిర్ధారణకు వచ్చి ఉన్నాను. 'విప్లవం అనేది రక్తపాతంతో కూడిన చర్య ... ఒక వర్గం లేదా కొన్ని వర్గాలు అధికారంలో ఉన్న మరో వర్గం లేదా వర్గాల చేతుల్లోంచి అధికారం బలవంతంగా లాక్కునే యుద్ధం' అని అర్థం చేసుకున్నాను. ఈ వర్గ యుద్ధంలో రక్తపాతం లేకుండా అధికారాన్ని హస్తగతం చేసుకోవచ్చు అని నమ్మే అమాయకత్వం కాని, ఇప్పుడే... తక్షణమే యుద్ధం వుండదని అదేదో దూర భవిష్యత్తులో సంభవించే విషయమనే ఉష్ట్ర పక్షి దృష్టి కానీ నన్ను పక్కదారి పట్టించలేకపోయింది.

లిబరేషన్ పత్రిక, అలాగే అప్పుడప్పుడే హైదరాబాదునుండి వెలువడసాగిన 'పిలుపు' పత్రిక లాంటి కామ్రేడ్ చారుమజుందార్ రాజకీయ పంథా ప్రచారం చేసే పత్రికలు ఏది ఎక్కడ దొరికినా, నేను క్యాంపస్ లో పరిచయమున్న పిడికెడు మంది పరిచితులతో పంచుకునే వాణ్ణి.

పెరుగుతున్న ధరల విషయంలో క్యాంపస్‌లో ప్రగతిశీల లెఫ్ట్ విద్యార్థులు కలిసి నిరసన తెలుపడానికి సెక్రటేరియట్ వద్ద విద్యార్థుల

ఊరేగింపు తీసుకుపోవాలనే నిర్ణయం ఈఐ అయ్యర్ అన్నాతమ్ముళ్ల దగ్గర తెలిసి వారు పిలిచినందుకే ర్యాలీ కన్నా ఒక రోజు ముందు వారింట్లో ప్లకార్డ్స్ - పోస్టర్స్ తయారు చేయడానికి వెళ్ళిన. సాయంత్రంపూట ఇంకో అయిదారుగురితో కలిసి మధ్యరాత్రి వరకు రెండు-మూడు వందల ప్లేకార్డులు తయారయినాయి. మరుసటి నాడు ఉదయం మా ఇన్స్టిట్యూట్ క్లాసులను బహిష్కరించి విద్యానగర్ కూడలి వద్ద గల హిందీ మహా విద్యాలయ దాక ఒక ఊరేగింపుగా పోయి ఆ కాలేజి విద్యార్థులను క్లాసెస్ బహిష్కరించి ఊరేగింపులో మాతో రావాలని అహ్వానించినాం. అందులో కొందరు అల్లరి చేస్తూ ఇండ్లకు వెళ్లిపోగా దాదాపు రెండువందలమంది మాతో వచ్చింద్రు. అప్పట్లో హైదరాబాదులో కల ఉస్మానియా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుండి దాదాపు పదివేల మంది విద్యార్థులు, నాన్ టీచింగ్ ఉద్యోగులు ఆ ఊరేగింపులో పాల్గొన్నారని అంచనా.

ఏది ఏమైనప్పటికీ, ఈ ఊరేగింపు సభ రూపం దాల్చి కొంతమంది నాయకులు సెక్రెటేరియట్ వద్ద రోడ్డుకు అటువైపున్న ఒక ఇరానీ హోటల్లో చాయ్ తాగుదామని నన్నాహ్వానించారు, అందులో నేటికి జ్ఞాపకమున్న పేర్లు : బూర్గుల ప్రదీప్, జెసిఎస్ ప్రసాద్, అశ్విని, వెంకట్రమణి మరి కొందరు. నాతో పరిచయం ముగిసినంక నా అడ్రెస్స్ తెలుసుకుని మర్నాడు వచ్చి కలుస్తారని చెప్పి ఆరోజు సెలవు తీసుకున్నారు.

మరుసటి రోజు వారు అంత హైయ్యర్ ఎడ్యుకేషన్ అందులోనూ పోస్ట్ గ్రాడ్యుయేట్, ఇంజినీరింగ్, సైన్సు విద్యార్థులు వస్తున్నారని విల్స్ సిగరెట్టు ప్యాకిట్లు రెండు, టీ ఏర్పాట్లు చేసి వారికోసం ఎదురు చూడసాగిన. నా వయస్సు అప్పుడే పదహారు దాటుతున్నది. వారంతా 20 -25 ప్రాయం. సీనియర్స్. వారొచ్చి చార్మినార్ ప్యాకెట్లు తీసి కాలుస్తూ మాట్లాడసాగిన్రు. ఒకరిద్దరు బీడీ కాల్చుకున్నారు. ఐతే వారు మాట్లాడిన విషయానికొస్తే తరిమల నాగిరెడ్డి మితవాద రాజకీయాలతో విసిగి వారు బయటకు వచ్చినారని నేను విద్యార్థులను పెద్దఎత్తున కదిలించినది చూసి నాతో కలిసి పని చేయాలని భావిస్తున్నారనేది చెప్పారు, వారంతా జార్జ్ సహచరులనేది కూడా స్పష్టం చేసారు. నేను చారుమజుందార్ నాయకత్వాన్ని (ఆయన అదే సంవత్సరం, ఒక నెల ముందు అమరులైనారు) సరి ఐనదిగా భావిస్తున్న విషయం చెప్పి విద్యార్థి రంగంలోనే పని చేయలనుకున్నానని స్పష్టం చేసిన. ఐతే, నాకు ఏ పార్టీ తోనూ సంబంధాలు లేవని కుడా చెప్పిన. చివరికి కలిసి పిడిఎస్ (ప్రోగ్రెస్సివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్) గా క్యాంపస్‌లో పని చేయవచ్చని నిర్ణయానికి వచ్చినం. లిబరేషన్ తదితర పత్రికలు కూడా పెట్టుకో వచ్చుని నిర్ణయం జరిగింది.

ఇంకొక వైపు నేను విప్లవ రచయితల గురించి విని వారిని ఎలాగైనా కలువాలనే ప్రయత్నం ప్రారంభించిన. క్యాంపస్‌లో అరసం వారు అభ్యుదయ విద్యార్థి కవులను ఒక గ్రూపుగా ఆర్గనైజ్ చేసి ఉన్నారు. వారి కవిసమ్మేళనాలకు ఒకటి రెండు సార్లు పోయిన. నారాయణగుడాలో ఏదో ఓ హాల్‌లో అరసానికి చెందిన దాశరథి గారి అధ్యక్షతన జరిగిన ఇలాంటి కవిసమ్మేళనంలో ఒక కవిత చదివిన. హిందీ కవిత ఇలా ఉంది :

......

ఛాయా
ఛాయా
తుం తో హమేషా హి
మేరె సాథ్ రహతీ ఆయీ హో, ఆజీవన్
పర్ జబ్ జబ్ మైనే అన్ధేరే మే రహా కర్ కాలిఖ్ సె
లడ్ నా చాహా
తుమనే ముఝే అకేలా ఛోడ్ దియా,
మేరా సాథ్ నహి దియా ...
క్యోం?

మర్నాడు ఈ కవితను ఉద్దరిస్తూ ఆంధ్రజ్యోతిలో రిపోర్ట్ వచ్చింది. నేను ఇన్స్టంట్‌గా ఉస్మానియా విద్యార్థి రచయితల సంఘం లో పాపులర్ అయిపోయిన. అరసం కార్యక్రమాలకు కూడా పిలువడం జరిగింది. అరసం కార్యాలయంలో ఒక రోజు ఓ 'గొప్ప' తెలుగు కవి గారు 'దొర కొడుకు' అనే కవిత చదివిన్రు. మేము కొంతమంది యువకులం దానిపై చర్చలో అత్యాచారానికి ప్రతీకారంకు బదులు దైన్యం విలాపమే ఉందని చెప్పి వాదించి కవి సమ్మేళనాన్ని, అరసాన్ని బహిష్కరించి బయటికి వచ్చేసినం. 'నగరంలో ఈ రోజు' కాలమ్‌లో చూస్తూ విరసం కార్యక్రమం ఉంటే వెళ్లి వారిని కలువాలని నిశ్చయించుకున్నాం. విరసానికి కార్యాలయం లాంటిది లేకపోవటమే దీనికి కారణం. కొన్ని రోజుల కృషి ఫలించి శ్రీ కృష్ణదేవరాయ లైబ్రరీ టెర్రస్‌లో ఓ శనివారం విరసం కార్యక్రమం ఉందని తెలిసి మేము ఐదారుగురం అక్కడికి చేరుకున్నాం. నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు తదితరులు కవితలు వినిపించారు. నిఖిలేశ్వర్ మా హాస్టల్ ఎదురుగా విద్యానగర్ హైదరాబాద్ ఇంప్రూవ్ మెంట్ ట్రస్ట్ ఫ్లాట్స్‌లో ఉండేవారని తెలిసింది. అలాగే చెర అంబర్ పేట్ బుర్జ్ దగ్గర అంటే మా హాస్టల్ వెనక పక్క గోడ దాటి కొంత నడిస్తే అక్కడ ఉండేవారు. రాజకీయంగా చెర నాకు సమీపమైనవాడని తెలుస్కోవడానికి ఎంతోకాలం పట్టలేదు. నిఖిలేశ్వర్‌తో జరిగే వాదనలను శ్రద్ధగా విన్నాక చెరకు చేరువైన. కాని పార్టీ సంబంధాల విషయానికి వస్తే ఈ ప్రయత్నాలు పనికి రాలేదనే చెప్పాలి. చెర నాకు పది సంవత్సరాలు సీనియర్. ఐనప్పటికీ మైత్రి కుదిరింది.

మరోవైపు 'పిలుపు' అనే పత్రిక రాజకీయంగా చాల స్పష్టత కలిగిన సెంటర్ స్ప్రెడ్ వ్యాసాలు ప్రచురిస్తుండేది ఆ రోజుల్లో. అలాంటి లైన్‌కు సంబంధించిన వ్యాసాలను హిందీలోకి తర్జుమా చేసిన. పిలుపు కార్యాలయానికి వెళ్లి ఆ సంగతి తెలియ జేసినా కూడా. తరువాత 73లో హిందీ పత్రిక ఆముఖ్‌లో అందులో ఒకటి అచ్చైనది. అక్కడే రంగనాథం, కిరణ్‌లతో పరిచయమైంది. కాని అక్కడ వారు పార్టీ కాంటాక్టు విషయంలో ఆశించిన విధంగా స్పందించలేదు. కాని పిలుపు క్యాంపస్‌లో విక్రయించే విషయంలో ఆసక్తి చూపారు. నేను స్వల్పకాలంలోనే దాదాపు 200 ప్రతులు అమ్మసాగిన.

క్యాంపస్‌లో ఏబివిపి వారితో నిత్యం కొట్లాటలు జరుగుతున్న

రోజులవి. ఒక రోజు ఆర్ట్స్ కాలేజి లాంజ్‌లో టేబిల్ టెన్నిస్ ఆడే కాడ కొట్లాట జరిగింది. నరసింహా రెడ్డి అనే అతడు రమణి బ్యాట్ అడిగితే బ్యాట్ విసిరి కొట్టిండు. రమణి కళ్ళద్దాలు పలిగి కంటి కింద గాయమైంది. రక్తం కారుతున్నది చూసి మేము రెచ్చిపోయి కుర్చీలు అందుకున్నం. కొట్లాటలో నరసింహారెడ్డి తల పగిలింది. అటుతరువాత అతనిని అందరు మతిస్థిమితం పోయినందుకు 'పిచ్చి నరసింహారెడ్డి' అని పిలువసాగిండ్రు. అనిరుద్ధ చక్రవర్తి అనే అతను ఆర్ట్స్ కాలేజిలో చదువుకునే వాడు. విద్యార్థి పరిషత్ వాళ్ళు గణపతి చవితిలో క్యాంపస్‌లో పెండాల్ పెడితే అక్కడి డయాస్ మీదినుంచి మన రాజకీయాలు చెప్పి వచ్చిండు.

ఒకరోజు సిటీ కాలేజీ అబ్బాయి రివాల్యుయేషన్ కొరకు వస్తే వెంకట్రమణి, అలాగే అనిరుద్ధ, నేనూ కలిసి అప్పుడు ఆర్ట్స్ కాలేజి బేస్మెంట్‌లో వున్న ఎగ్జాం డిపార్టుమెంటుకి వెళ్ళినం. ఇంద్రసేనా రెడ్డి అనే అతని నాయకత్వంలో దాదాపు ఇరవయి మంది లాఠీలు, హాకి స్టిక్కులు, పిజి హాస్టల్ దోమతెరలు కట్టే రాడ్లు పట్టుకుని ఆర్ట్స్ కాలేజి బస్సు స్టాండ్ వద్ద మమ్ములను చుట్టుముట్టిండ్రు. మా నలుగురిలో అనిరుద్ధ బాగా లావుగా ఉన్నాడు. అతనిని వదిలేసి మేము పారిపోతే తుక్కు తుక్కు తన్నులు తింటాడని మాకు తెలుసు. కాబట్టి ఎదిరించాలని నిశ్చయించుకున్నాం. అక్కడ జరిగిన కొట్లాటలో ఒకరికి గాయమైందని అతడే ఇంద్రసేనారెడ్డి (యితడు ప్రస్తుతం బిజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు) అని తరువాత తెలిసింది. ఆ కొట్లాట తరువాత వెంకట్రమణి ముద్దాయిగా కేసు నమోదయ్యింది. పిడిఎస్ నాయకులు అంత సిటీలో తలదాచిన్రు. అదే సాయంత్రం 'డి' 'ఈ' హాస్టళ్ల మధ్య ఘర్షణలో నేను, మధు, సుబ్రిలు చిక్కుకున్నాం. కానీ దాడికి వచ్చిన వారిని తరిమి కొట్టినం. 'డి' లో ప్రగతిశీల విద్యార్థులు, 'ఇ' లో లా కాలేజి ఏబివిపి పలుకుబడి ఉండేది. ఈస్ట్ మారేడ్‌పల్లిలో గల రమణి ఇంటికి వెళ్ళి అతని తల్లిని కలిసి తెలియజేసి మర్నాడు కోర్టులో హాజరు పరచే వరకు నేనే అతని వెంట ఉన్నాను. వేరే ఎవ్వరు మద్దత్తుకు ముందుకు రాలేదు.

ఇలా వెంకట్ రమణి రాడికల్ రాజకీయాలకు దగ్గర అయ్యాడు.

డిఎస్ మొదటి సిటీ కన్వెన్షన్ పెట్టి మమ్ములను అందుకు దూరముంచాలని జంపాల ప్రసాద్ చేత సి ఆ పార్టీవారు చాల ప్రయత్నాలు చేసారు. నా వెంట ఎవ్వరు లేరని, ఎంఎల్ ప్రజా సంఘాలను రివిజనిజంగా భావిస్తున్నానని, కనుక అసలు మాకు విద్యార్థుల్లో ఎటువంటి బేస్ లేదని కొట్టిపారేస్తూ మరోవైపు నాకు సభ్యత్వం రసీదు పుస్తకాలు అందకుండా కట్టుదిట్టం చేసారు. అయితే సిటీ కాలేజిలో సత్యమ్మ నరసింహారావు కాలేజి మూతపడినప్పుడు అక్కడి విద్యార్థులను చేర్చుకోవాలనే ఉద్యమ ఫలితంగా నరేశంతో పాటు చాల మంది మన విద్యార్థులు ఉన్నా, వారందరూ తమ ప్రభావంలో ఉన్నారని నమ్మి నరేష్ నైతే వారి ప్రతినిధిగా పెట్టుకున్నారు. కరీంనగర్ లింగా రెడ్డి ఎక్స్టర్నల్‌గా ఎం.ఏ. చేస్తుంటే అతను విరసం సిటీ కన్వీనర్‌గా ఉంటూ ఎంఎల్ రాజకీయాలతో కనబడుతున్నాడు కనుక అతడు, నేను బహిరంగంగా మరి కొందరిని మాకు చెందిన వారుగా ప్రవేశపెట్టి ఎగ్జిక్యుటివ్ కమిటీలోకి ఎలెక్ట్ చేయించుకున్నాం. ఇలా 9లో వారికి 5 సీట్లు వస్తే మాకు కూడా 4 సీట్లు వచ్చినాయి. ఇలా మా వాస్తవ బలాన్ని చూసి సాయుధ పోరాటం రాజకీయాల నుండి తమను దూరంగా చూపుకోవడానికి విద్యార్థి రంగంలో చీలికకు పునాది వేశారు... కొన్ని రోజులకే సరోజినీ హాల్‌లో జార్జ్ వర్ధంతి కూడా మేం ఘనంగా జననాట్య మండలి కార్యక్రమాలతో, వీధి భాగవతం తో (భూపాల్ రెడ్డి బక్క రైతు, నర్సింగరావు భూస్వామి పాత్రలో) జరుపుకున్నాం. రాష్ట్రంలో ఇతర చోట్ల కూడా మా బలం కానవచ్చింది. తిరుపతి, గుంటూరు, వైజాగ్, వరంగల్లు, కరీమ్ నగర్లలో మా బలం విద్యార్థి రంగంలో అనతికాలంలోనే కనపడ సాగింది.

నిజానికి 'ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ డెమొక్రటిక్ యూనియన్' అనే పేరుతో రాష్ట్ర వ్యాపితంగా విద్యార్థి సంఘం పెట్టే ఏర్పాట్లన్నీ కూడా జరిగినై. కానీ చారుమజుందార్ పంథా పేరిట అమరుడు కామ్రేడ్ సూరపనేని జనార్ధన్ లేవనెత్తిన అభ్యంతరాల వల్ల మేము వెనుకంజ వేసినం. నేను 1974 మేలో యుజి వెళ్లి గ్రామీణ ప్రాంతంలో పని ప్రారంభించటం జరిగింది. తరువాత ఆయన కన్వెన్సు అయినాక అక్టోబర్ 1974 లో తిరుపతిలో కొనసాగుతున్న పేరు 'రాడికల్' రాష్ట్ర విద్యార్థి సంఘానికి పెట్టుకుందామని CP వారు మమ్మల్ని బహిష్కరించి వేరే పిడిఎస్‌యు పెట్టుకున్న తరువాతి పరిణామంలో భాగంగా నిర్ణయమయింది. నేను యుజి వెళ్లిన తరువాత ఎమర్జెన్సీ ప్రకటించే నాటికి ఒక్క హైదరాబాద్‌లోనే 14 మంది విద్యార్థులు, అందులో చాలామంది మెడికల్ విద్యార్థులు యుజి వెళ్లారనేది ఇక్కడ గమనించాలి.

చివరికి రైలు సమ్మె గురించి. రైలు సమ్మె మొదలవ బోతున్నదనగా కొందరు విద్యార్థి నాయకులతో కొందరు కార్మికనాయకులను కలిపి ఒక పోరాట నిర్వహణ కమిటీ వేసారు. అందులో నేను, నరేష్ వున్నాము. రైలు నిలయం, సీతాఫల్ మండి లాంటి ప్రాంతాల్లో ఒక లక్ష కరపత్రాలు పార్టీ పేరిట పంచడమైంది. మిలిటెంట్ పోరాట రూపాలు ప్రయోగించడమయింది.

ఇలా తొలిదశ విద్యార్థి రంగం పని ముందుకు సాగింది. ☆

అరుణతార సాఫ్ట్ కాపీలను
www. arunatara.com సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- సం.

తెలుగు కవిత్వం ఎప్పుడూ పురిటి నొప్పులు పడుతూనే ఉంది

(2013 మే 11, 12 తేదీల్లో విరసం పోరంకిలో ఏర్పాటు చేసిన కవిత్వం వర్క్‌షాప్‌లో 'నేనూ, కవిత్వం' అనే అంశం కింద సభ్యులందరూ కవిత్వంతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. కామ్రేడ్ చలసాని ప్రసాద్ కవిత్వంతో ఆయన బాంధవ్యాన్ని చెబుతూ, తెలుగు కవిత్వంపై కొన్ని పరిశీలనలను కూడా చేశారు. కొత్త కవులకు సూచనలిచ్చారు. మధ్య మధ్యలో కవితాపాదాలు రిధమిక్‌గా పలుకుతూ, పాటలు పాడుతూ వర్క్ షాప్ కొచ్చిన యువకవులకు ఎంతో ఉత్తేజాన్నిచ్చారు. ఆ ప్రసంగ పాఠం ఇక్కడ ఇస్తున్నాం. - సంపాదక వర్గం)

నేను గొప్ప కవినేం కాదు. కానీ కవిత్వం బాగా చదువుతాను. కవిత్వం కొంత రాశాను. కానీ మొదట్నుంచీ కవిత్వమంటే చాలా ఇష్టం, ప్రేమ. అంటే తెలుగు భాష మీద ఉన్న ఇష్టం కవిత్వం మీద ఇష్టంగా మారింది. అది రూపానికి సంబంధించి. కవిత్వంలో ఉన్న సారం నా రాజకీయ జీవితం వల్ల, కమ్యూనిస్టు నేపథ్యం వల్ల విప్లవ సారాంశం దానిలోకి వచ్చింది. ఇది బ్రీఫ్‌గా నా బ్యాక్‌గ్రౌండ్. నిన్న కవిత్వం మీద చాలా చర్చ జరిగింది. కవిత్వం అంటే ఏంటంటే శ్రీశ్రీ అన్నట్లు 'కవిత్వం ఒక జబ్బు. అది పడ్డవాడికే తెలుస్తుంది'. అంటే శ్రీశ్రీగారివన్నీ అక్షర సత్యాలని కాదు. కవిత్వం లోతుపాతులు, దాని విస్తృతి, దాంతో జీవితమంతా కుస్తీపట్టాడు గనక కొన్ని సూక్తులు, ఛలోక్తులు అతన్నుండి వస్తూ ఉంటాయ్. దాన్నంతవరకే చూడాలి.

తెలుగు గురించి చెప్పాలంటే నాకు ముందు తెలుగు భాష మీద ఎక్కువ ఆసక్తి ఉంది. చిన్నయసూరి మిత్రలాభం, మిత్రభేదం చాలా ఇష్టంగా ఉండేవి. అది ప్రోజే. గ్రాంధిక ప్రోజ్. అయినా తెలుగు వాక్య నిర్మాణం, తెలుగు పదాలు బాగా ఇష్టం. పోస్టు గ్యాడ్యుయేషన్‌లో పాలిటిక్స్, ఎకనమిక్స్ చదువుకున్నా గ్ర్యాడ్యుయేట్ లెవల్ వరకే భాష మీద ఎక్కువ ఇంట్రెస్ట్ ఉండేది. ఉదాహరణకు చిన్నయసూరి దాట్లో 'కేసరి జీర్ణతృణము మేయునే. నిజకర్నకర విదారిత హస్త మస్తి మస్తిష్కమునేగాని' అని ఒక వాక్యముంది. అది గ్రాంధిక భాషే. మనం దాన్ని నెత్తినేం పెట్టుకోనక్కర్లేదు. కానీ ఆ పదాల విరుపు, ఆ మ్యూజిక్ స్టయిలు.. అట్లా చాలా ఉంటాయి మిత్రభేదంలో. మిత్రభేదంలో ఉన్నటువంటి వాక్య నిర్మాణంతో, కంటెంటుతో మనకు తేడా ఉన్నప్పటికీ చిన్నయసూరిని ఒకసారి తప్పకుండా చదవండి. కేసరి వట్టి గడ్డి మేస్తుందా మనలాగా. తన గోళ్లతో చీల్చబడినట్టి పులి మాంసాన్ని సింహం తింటుందని దానర్థం. ఎంత పొయెటిక్‌గా చెప్పాడు చూడండి. అట్లా చూసినప్పుడు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి గారు - విశ్వనాథ సత్యనారాయణకే ఆయన గురువు. దాదాపు తెలుగు దేశంలో కవులందరికీ వాళ్లు గురువులే. కవిత్వంలో అలా అలా ఓలలాడించేశారంతే. వెంకటశాస్త్రి గార్ని ఎవరో అడిగారట. కవిత్వం మీద అయిదు గంటలు మాట్లాడారంట. ఆ మీటింగ్‌కి శ్రీశ్రీ అటెండ్ అయ్యారు. అప్పటికి శ్రీశ్రీ కవిత్వమింకా రాయటం లేదు. ఆయనేమన్నాడంటే ఎందుకిన్ని గొడవలు .. గుర్తుండేదే కవిత్వం అన్నాడట. అంటే యాథాతథంగా వాక్యాలు మనకు గుర్తుండకపోయినా ఒక భావం గుర్తుండాలి.

తర్వాత తెలుగు భాషలో ఎందుకనో గాని, అప్పటికీ ఇప్పటికీ, బహుశా అప్పటి నుండి ఇప్పటికీ కవిత్వానిదే పైచేయి. తర్వాత కథొస్తుంది. కారణాలేవైనాగాని నాటకం, నవల వెనకబడే ఉన్నాయి. కారణమేమిటన్నది వేరే విషయం. కానీ భారతదేశంలో ఉన్నటువంటి ఏ భాషా కవిత్వానికీ తెలుగు కవిత్వం తీసిపోదు. ఇదే మాట అంతో ఇంతో ఎంతో కొంత కథ గురించి కూడా చెప్పవచ్చు. మనకు అప్పట్లో చలం, దీక్షితులు, శ్రీపాద, రావిశాస్త్రి, కారా, కుటుంబరావు, గోపీచంద్ ఉన్నారు. వీళ్లందర్నీ మనం చాలా గర్వంగా చెప్పొచ్చు. అయితే ఈ కథకులు కొన్ని నవలలు కూడా రాశారు. కానీ వీళ్లందర్నీ కథకులుగానే గుర్తిస్తున్నాం. ఇది తెలుగు సాహిత్యం మీద ఒక స్థూల పరిశీలన.

విశ్వనాథ సత్యనారాయణ ఒకసారి ఒక మాటన్నాడు. ప్రపంచంలో ఎప్పుడు, ఏమూల, ఎక్కడ ఒక కొత్తదొస్తే అది ముందు తెలుగు కవిత్వంలోకొస్తుంది. చాలా మంచి అబ్జర్వేషన్ అది. అతని మీద మనకు ఇతర డిఫరెన్సు ఉన్నా తెలుగు సాహిత్యంలో దిగ్గండుడి కిందే లెక్క. ఇది నాకెందుకు గుర్తుందంటే మూడేళ్ల కిందట బెజవాడలో ఉన్నప్పుడు ఓ రోజు ఆంధ్రజ్యోతిలో ఒక వ్యాస మొచ్చింది. తెలుగు కవిత్వం ఆగిపోయిందని రాశాడు. ఆ రాసినతను విశ్వనాథకు శిష్యుడని ఎందుకో నేననుకున్నా. పేరు గుర్తు లేదు. ఇక్కడి నుండే వెంటనే రిప్లై రాసి పంపించా. 'చాలా తప్పిది. ఈయనకు తెలుగు సాహిత్యం ఓనమాలు తెలిసినట్లు లేవు, తెలుగు సాహిత్యం ఆగిపోలా, ఆగిపోదు కూడా. అది అనేక రకాలుగా విస్తరిస్తోంది.' దానికో బ్యాక్‌గ్రౌండ్ ఉంది. విశ్వనాథగారే అన్నట్లు ప్రపంచంలో ఎక్కడ ఒక కొత్తదొచ్చినా అది ముందు తెలుగు కవిత్వంలోకే వస్తుంది. అది మన తెలుగు కవిత్వ విశిష్టత. మీ తెలుగులో ప్రతి రెండో వాడూ ఒక కవి అని దాగూరు గురజాడతో అన్నాడట. విశాఖపట్నంలో దోమలు కూడా సంగీతం పాడతాయని అన్నాడట. మన తెలుగు కవిత్వానికున్నదాన్ని మనమెందుకు తక్కువ చేసుకోవాలి. ఎక్కువే చేసుకుందాం. ఏం పోయింది. ఇన్ని నోళ్లున్నాయి, ఇన్ని కలాలున్నాయి. భాషా సాహిత్యాల మీద ఆ ప్రేమ మనకుంది. విరసం వాళ్లకు ఉంది.

ఒక రకంగా 50 నుండి 60, 62 ఆ ప్రాంతం దాకా శ్రీశ్రీ తెలుగు నేలంతా దున్ని అవతల పడేశాడు. 52లో మహాప్రస్థానం

రూపాయికేశారు. బహుశా కొన్ని లక్షల కాపీలు అమ్ముడయి ఉంటాయి. 62, ఆ తర్వాత తిలక్ వచ్చాడు. అప్పటిదాకా శ్రీశ్రీ వచన కవిత్వమే రాశాడు. కవితా ఓ కవితా వచన కవిత్వమే. కొంప్లెల్ల జనార్దన రావు కోసం వచన కవిత్వమే. దువ్వూరి రామిరెడ్డి గారిలో వచన కవిత్వ ఛాయలున్నప్పటికీ వాటిని పైకి తీసుకొచ్చి పరిపూర్ణత కలిపించాడు. 'దొంగ లంజాకొడుకులసలే మెసిలే ధూర్త లోకంలో..' అని రాయగలిగాడు. ఆ దమ్ముంది అతనిలో. అది కవిత్వంతో అతనికుండే మమేకత. కంటెంట్ మీద అతనికుండే ప్రేమ. రాసే విషయం మీద తనకుండే మమకారం. ఇవన్నీ అతన్నలా రాయగలిగేలా చేశాయి.

నా ఉద్దేశ్యంలో.. నిన్నే చెబుతామనుకున్నాగాని మా పాణికి కోపమొస్తుందని చెప్పలేదు. వచన కవిత్వం రాశి విషయంలో కుందుర్తి ఫస్ట్. విపరీతంగా రాసి పారేశాడు. మాట్లాడితే వచన కవిత్వమే. లెక్కలో వచన కవిత్వమే. అంత పిచ్చి పట్టుకుంది. మంచిదే. నేనేం తప్పు పట్టడం లేదు. కుందుర్తిగారు మనకు ఫ్రెండే. ఆయన రాసిన తెలంగాణ మనకిష్టమే. ఆ తెలంగాణ రాతప్రతి నా దగ్గరుండేది. ఆ తర్వాత వాళ్లబ్బాయికి పంపించానది. వచన కవిత్వంలో కుందర్తి మీద నాకు తక్కువ ప్రేమేమీ లేదు. కానీ వాసి విషయంలో పాణి అన్నట్లు తిలక్‌దే ఫస్ట్. తెలుగు వచన కవిత్వాన్ని బ్రహ్మాండమైన మలుపు తిప్పాడు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఈ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా విరసం లేదు. ఎక్కడి నుండి బయలుదేరావు నువ్వు? ఎక్కడి నుండి బయలుదేరావో తెలిశాక ఎక్కడికెళ్లాలో తెలుస్తుందని కుటుంబరావు ఒక సందర్భంలో అన్నారు. తిలక్ ఉన్రూతలూపాడు 60ల తర్వాత. శ్రీశ్రీ అంటాడు తెలుగు కవితా సతి నొసట నిత్య రస గంగాధర తిలక్ అన్నాడు. నాకు తిలక్ అంటే చాలా చాలా ఇష్టం. దీంట్లో మీకు నాకు కొన్ని చిన్న చిన్న భేదాభిప్రాయాలుండొచ్చుగాని. నాదృష్టిలో ఆధునిక కవిత్వంలో తిలక్‌తో పోటీపడే వచన కవి మాత్రం లేడు. బ్రహ్మాండమైన వచన కవిత్వానికి బ్రహ్మాండమైన గుర్తింపు తెచ్చిన వాడు తిలక్. చాలా చిన్న వయసులో చనిపోయాడు. అభిమన్యుడని పేరుపెట్టారు అందుకనే. చాలా మంది మంచి వచన కవిత్వం రాసినా క్వాలిటీ విషయంలో తిలక్ ఫస్ట్, క్వాంటిటీ విషయంలో కుందుర్తి. నగ్నముని వంటి వారికి కొంత మందికి కుందుర్తి బ్యాక్‌గ్రౌండ్ ఉంది. వచన కవిత్వం రాయడానికి కొంత మంది భయపడి ఊరుకున్నారు. ఛందస్సులో కవిత్వం రాయాలి. ఆ నియమాలకు భయపడి ఊరుకున్నారు. ఆ భయాన్ని పోగొట్టాడు. ఛందస్సు ఏమిటోయ్, కథలు, నవలలు కూడా వచన కవిత్వంలో రాయొచ్చు అన్నంత ఎక్స్‌ట్రీమ్‌కెళ్లాడాయన. అంత పిచ్చి ఆయనకు వచన కవిత్వమంటే. మంచిదే అది.

సర్వేపల్లి రాధాకృష్ణగారు అడిగారట వచన కవిత్వమంటే ఏమిటి అని శ్రీపాద గోపాలకృష్ణ మూర్తిని, పినాకపాణి అని మొన్న చనిపోయాడు వందేళ్లకి. వాళ్ల బ్రదర్స్ అందరూ ఎవరి రంగం వాళ్లదైనా అందరికీ కామన్ ఇంట్రెస్ట్ సాహిత్యం. శ్రీపాద గోపాలకృష్ణ మూర్తి బ్రహ్మాండమైన జవాబిచ్చాడు. కవిత్వం లాగా రాస్తాము. వచనం లాగా చదువుతాము అని. వచన పద్యం అనడం తప్పు. మన నగ్నముని, శివారెడ్డితో కూడా అన్నాను. శివారెడ్డిని కొడతానన్నా వచన పద్యమంటే. వచన కవిత్వమందాం. కామన్ అండర్‌స్టాండింగ్ ఉండాలి. ఆయన చాలా చక్కగా చెప్పాడు. ఆధునిక కవిత్వంలో వచ్చిన మార్పున్నీ వంటబట్టించుకున్నాడు శ్రీపాద గోపాలకృష్ణ మూర్తి. ఆయన భారతిలో వ్యాసాలు రాశారు. తెలుగు సాహిత్యం మీద రాయప్రోలు నుంచి ఎత్తుకొని దిగంబర కవులదాకా వచ్చాడతను. అతి నవ్యుల్లో నవ్యుడు శ్రీశ్రీ అని రాశాడు. కవిత్వం డెవలప్‌మెంటు బ్రహ్మాండంగా పట్టుకున్నాడాయన. దొరికితే దయచేసి ఒకసారి చదవండి.

'రాత్రి' అని ఒక కవితా సంకలనం వచ్చింది. నా ఉద్దేశంలో ఆధునిక తెలుగు కవిత్వానికి, రాబోయే తెలుగు కవిత్వానికి గొప్ప దిక్సూచి రాత్రి. మోహన్ ప్రసాద్ రాశాడందులో. మోహన్ ప్రసాద్ అప్పటికింకా మో కాదు. వరవరరావు అప్పటికి వివి కాదు. నగ్నముని అప్పటికి కేశవరావే. మహాస్వప్న అప్పటికి కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు. రాబోయే దిగంబర కవిత్వానికి చూపుడు వేలు అందులో ఉంది. అద్దేపల్లి రామ్మోహనరావు రాశాడు 'చేతికందిన అందం నోటికందదు, ఈ ప్రపంచకమింతే' అని. ఒక రకమైన ఇండికేషన్. సాహిత్యంలో ఏ వస్తువుండాలి. దానికి ఏ ఎక్స్‌ప్రెషన్ ఉండాలి అని. తెలుగు కవిత్వం ఎప్పుడూ పురిటి నొప్పులు పడుతూనే ఉంటుంది. ఏదో తల్లి కంటూనే ఉంటుంది బిడ్డని. నేను తెలుగు కవిత్వాన్ని బాగా ఫాలో అవుతుంటా. కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు - దిగంబర కవుల్లో ఆయనొక్కడితోనే నాకు నేరుగా పరిచయం లేదు, కాని కరెస్పాండెన్స్ ఉంది- అతను రాశాడు 'హృదయం నశిస్తున్నది. మనస్సు మేల్కొంటున్నది. ఎప్పట్లాగే సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఏ తెలియని దశకో కాలం సాగిపోతున్నది'. ఇండికేషన్ ఇచ్చాడు. 'రాత్రి' కవితా సంకలనమే గొప్ప ఇండికేషన్. ఆ రాత్రి కవితా సంకలనంలో ఇతను రాబోయే దిగంబర కవిత్వానికి హైరోడ్డేసి పారేశాడు. దొరికితే 'రాత్రి' కవితా సంకలనం మీరందరూ కూడా తప్పకుండా చదవండి. అప్పటికి తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ ప్రభావం వందకు రెండొందల శాతం వచ్చేసింది. దాన్నుంచి వచ్చిన వచన కవిత్వాన్నందుకొని కుందుర్తి రాశికెంత సేవ చేశాడో, తిలక్ వాసికంత సేవ చేశాడు. ఈ బ్యాక్‌గ్రౌండ్ మీద నిలబడ్డాడు కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు. ఒక సారి శ్రీశ్రీతో కూడా చర్చ జరిగింది. దిగంబర కవిత్వానికి కర్టన్ రైజర్ అనదగింది ఇది అని. నేనంత క్లోజ్‌గా ఆలోచించలేదు అన్నాడు. లేదండీ ఇలా ఉంది అని నేను చెప్పాను.

'కలియుగం రేడియోగ్రాములో/ ఇరవయ్యో శతాబ్దం రికార్డు మీద పిన్నునై / మానవత రెండు కళ్లూ మూసుకుపోయినప్పుడు/ విచ్చుకుంటున్న మూడో కన్నునై/ చరిత్ర నిద్రాసముద్రం మీద తుఫానున్నై/ వస్తున్నాను దిగంబర కవిని/ రాత్రి ఉదయిస్తున్న రవిని.' -మానిఫెస్టో ఆఫ్ దిగంబర కవిత్వం. అతనే రాశాడు. ఏ మనిషైతే రాత్రి కవితా సంకలనంలో ఇండికేషన్ ఇచ్చాడో బ్రహ్మాండంగా, అతనే రాశాడు దిగంబర కవిత్వానికి మానిఫెస్టో. ఆ పెప్.. కవిత్వం ఏ దిశకి వెళ్లాలి, ఇక్కడి దాకా వచ్చింది ఎటెళ్లాలి అని చెప్పాడతను. అతను రాత్రి కవితా సంకనంలో ఒక ఇండికేషన్ ఇచ్చాడు, దిగంబర కవితా సంకనంలో రుజువు చేసుకున్నాడు. దీన్నుంచే ఆ తర్వాత

సత్యమూర్తి 'ప్రజల్ని సాయుధుల్ని చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి' అన్నాడు. ఒక విధ్వంసం జరుగుతోంది సమాజంలో. ఆ విధ్వంసం జరుగుతున్నపుడు కవులు ఎటుండాలి. ఏది మార్గం? ఆ విధ్వంసాన్ని కళ్లకు కట్టినట్లు చూపించినవాడు మహాస్వప్న. దాన్ని పొలిటిక్లైజ్ చేసి విప్లవీకరించిన కవి సత్యమూర్తి. 'ప్రజల్ని సాయుధుల్ని చేస్తున్న రివల్యూషనరీ నేటి కవి' అని ఎక్కడి నుండి అనగలిగాడు? హృదయం లేకుండా సమాజం జీవిస్తోంది. హృదయం కావాలి మనిషికి అనే దాన్ని ఎక్స్‌టెండ్ చేశాడు. హృదయమున్న వాడు చేసిన పని. అట్లా విప్లవ కవిత్వం ఆకాశం నుండి ఊడిపడలా. వరవరరావు పోయెమ్స్ కూడా ఉన్నాయి రాత్రిలో. మంచి పోయెమ్స్ రాశాడు. ఆధునిక తెలుగు సాహిత్యం మీద అపారమైన అభిమానం ఉండి ఆ సాహిత్యం అనుపానులు గమనిస్తూ తలమునకలుగా ఉన్న నేను అలా రాత్రి కవితా సంకలనం మీద ఈ అబ్జర్వేషన్ చేశాను.

ఇక విరసం వచ్చిన తర్వాత విరసానికి మానిఫెస్టో పోయెమ్ అనదగింది సత్యమూర్తి రాశాడు కదా. 'ప్రజల్ని సాయుధుల్ని చేస్తున్న రివల్యూషనరీ నేటి కవి'. ఈ మాట సత్యమూర్తి అనడానికి కారణం సత్యమూర్తి బుర్రా? కాదు. అప్పుడున్న విప్లవోద్యమం. నక్సల్బరీ, శ్రీకాకుళం, పాణిగ్రాహి... ఇవి లేకుండా ఆయన అనగలిగేవాడు కాదు. పాణిగ్రాహి వచ్చేటప్పటికి తెలుగు సాహిత్యం, కళలు ఎట్లా ఉండేవంటే. కన్నకొడుకు సినిమాలో అక్కినేని నాగేశ్వరరావుగారి డ్రస్సుకు 75వేలు ఖర్చుపెట్టారని ప్రాపగాండా. ఫలానా పాటకు వంద ఇంస్ట్రుమెంట్సు. అదా కళ? కళ కాసుకు దాసోహం చేసింది. సత్యసాయిబాబా పాదాలు నాకింది కళ. ఆ సమయంలో పాణిగ్రాహి బ్రేక్ కొట్టాడు. కళ ప్రయోజనం అది కాదురా అని జముకు మీద వండర్‌ఫుల్ పాటలు పాడాడు. కళ స్వరూపం ఏమిటి? ప్రజకు అంకితం కావాలి కళ. కవిత్వం ప్రజల నాలుక మీదే కాదు, గుండెల్లో గూడు కట్టాలి. నిన్ను ఊదాలి, ఉద్రేకం రగిలించాలి, ఉత్సాహం రేకెత్తించాలి. ఈ పనులు చేసింది ప్రజలు, ప్రజా ఉద్యమాలు. తెలుగు కవిత్వంలో ఘర్షణ ఉంది మొదటి నుండి. తనతో తానే పెనుగులాడింది తెలుగు కవిత్వం. కొట్టి, నరికి, చంపి, నెత్తురు రహదారుల్లో ప్రవహింపజేసింది విప్లవ కవిత్వం. దీనికి బ్యాక్‌గ్రౌండ్ కూడా ఉంది

అసలు సాహిత్యంలో మొదట కవిత్వమే వస్తుంది. ప్రోజ్ తర్వాతొస్తుంది. గొప్ప అని కాదు. ఏ సాహిత్యంలోనైనా ముందు కవిత్వమే వస్తుంది. పాటే వస్తుంది. పాట ఎక్కడి నుండి వస్తుంది? పాటు నుండి పాట వస్తుంది. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదోయ్. పాటుకి పాటకు దగ్గరి సంబంధం ఉంది. 'మహరాజ వినవయ్య మాగాణి నాటేటి మానవుకుండేటి చింత.. మానవుకుండేటి చింత.' మాగాణి నాటుతూ కూలీలు పాడతారీ పాట. 'హైలేసా రోడ్డురోలై సాగరా. నడినెత్తిన సూరీడు నకనకలాడిస్తున్నాడు. కంకర రోడ్లో సగమింకా మిగిల్తున్నది', కొనకళ్ల వెంకటరత్నం పాట. చాటువులు, సామెతలు ..ఇవన్నీ తెలుగు కవిత్వంలో భాగం. తెలుగు కవిత్వానికిదంతా మూలధనం. ఈ మూలధనాన్ని, ఈ ఆరిజిన్‌ని, ఈ తల్లిని, తండ్రిని తెలుగు కవిత్వం ఎప్పుడూ మర్చిపోదు, మర్చిపోకూడదు.

అట్లాగే కేవలం మాటలే కవిత్వం కాదు. భాషంటే కేవలం మాటలు కాదు. వాక్యనిర్మాణం భాష. ఒట్టి మాటలు కాదు, మాట పొందిక కవిత్వం. ఒక ఉదాహరణ ఇవ్వాలంటే, అనిశెట్టి సుబ్బారావని ఒక కవి ఉండేవాడు. శ్రీశ్రీ, అనిశెట్టి, తుమ్మలవెంకట్రామయ్య గారు, అరసం బ్రాక్‌గ్రౌండ్‌లో రమణారెడ్డి గారు ఆ రోజుల్లో కవులే. ఆయన ఒకచోట రాస్తూ 'ప్రతి ఒకడూ శివుడు నేడు' అని ఒక వాక్యం రాశాడు. కవిత్వమే. ఆ తర్వాత ఆరుద్ర ఇంకో చోట రాస్తూ 'ప్రతి నేత్రం శివ నేత్రం' అన్నాడు. రెండూ మాటలే. రెండిట్లో ఏది ఎఫెక్టివ్‌గా ఉంది? శ్రీకృష్ణదేవరాయుల టైంలో అల్లసాని పెద్దననో ఎవరినో ఒక కవిని పద్యం రాయమంటే నాలాంటి కవులకు నీలాంటి యోగం కలదు అని 'స్వర్గధునీ సీకరాలు' అని పద్యం రాశాడు. శ్రీకృష్ణదేవరాయులు కలగజేసుకొని స్వర్గధునీ సీకరాలు కాదు, నాకధునీ సీకరాలు అనమన్నాడు. రెండింటికీ ఎంత తేడా ఉంది? సౌండ్‌లో తేడా ఉంది కదా? ప్రతినేత్రం శివనేత్రం లాగా. పదాల పొందికను మనం చాలా జాగ్రత్తగా వాడుకోవాలి. శివుడికి మూడో కన్ను ఉంటుంది. అది తెరిస్తే ధ్వంసమే. అది మైథాలజీ. మీరు హేతువాదంలో పడి పాతని నెగ్లెక్ట్ చేయకండి. అయితే విమర్శనాత్మకంగా ఉండాలి. కార్ల్ మార్క్స్ అన్నాడు, మైథాలజీ మాస్టర్స్ ది ఫోర్సెస్ ఆఫ్ నేచర్ ఇన్ అండ్ త్రూ ఇమాజినేషన్. ఇట్ హాజ్ గాట్ ఎటర్నల్ ఛార్మ్'. మతం పట్ల వ్యతిరేకత ఉండొచ్చుగాని మైథాలజీ ప్రజల సృష్టి. దాని పట్ల నెగెటివ్ ఔట్‌లుక్ పనికిరాదు. సహదేవుడు చినుక్కు చినుక్కు మధ్య నడుస్తాడు. నిజం కాకపోయినా అదొక ఆనందం కలగజేస్తుంది కదా. క్షీరసాగర మథనం మైథాలజీయే. సాగరం మధిస్తారా ఎవరన్నా? కాని ఆనాడు సైన్సు, ఇండస్ట్రీ లేదు గనక మానవుడు ఒక రకమైన ఊహ చేసుకున్నాడు. మానవ సంస్కృతిలో ఇది భాగం. 'ఇట్ ఫోర్సెస్ ది నేచర్ ఇన్ అండ్ త్రూ ఇమేజినేషన్' అని మావో తన ఏనాన్ ప్రసంగంలో కోట్ చేశాడు. మీరు మతం పట్ల ఎలా ఉన్నా మైథాలజీ పట్ల నెగెటివ్‌గా ఉండొద్దు అన్నాడు. 'హరోం హరోం హర! హర! హర! హర! హర! హరోం హరా!' అంటే ఒక ఎఫెక్టు. 'ఉదయ సూర్యుని సప్తహయములు పరుగుపెట్టె' అంటే సూర్యుడు రథం మీద వెళ్లాడని కాదు. అది నిన్ను థ్రిల్ చేస్తోందక్కడ. ఏ మాటలు మాట్లాడితే హృదయం కదులుతుంది అనేది ముఖ్యం. అందుకని పదాల కూర్పులో ఉంది కవిత్వం. వట్టి పదాలు కవిత్వం కాదు. తెలుగులో ఉన్నది యాభైఆరు అక్షరాలే. యాభైఆరు అక్షరాల్లో ఎవడు రాశాడు? తమిళులకైతే ఇరవయ్యారే. వాళ్ల ప్రపోజల్ (ప్రాచీన భాష), వాళ్ల బాధ వాళ్లది. అది చూసి మనాళ్లు! తెలుగు కవిత్వం ఏ భాషా కవిత్వాన్ని చూసి అసూయపడనక్కర్లేదు. మన కవిత్వాన్ని చూసి ఆళ్లే అసూయపడాలి. తెలుగు భాషలోనే ఆ పట్టు ఉంది. ఆ భాషలో కవి ఎన్ని పలికించాడు! విశ్వనాథ సత్యనారాయణ కిన్నెరసాని పాటలు చాలా బ్రహ్మాండంగా రాశాడు. ఊపిపారేశాడంతే. ఏ కాంటెక్స్ట్‌లో ఏ పదాలు వాడాలి? ఏ రెండు పదాల్ని కలపాలి? స్వర్గధునికీ, నాకధునికీ అర్థం ఒకటే. కాని ఎంత తేడా వచ్చింది? ఇలాంటివి అబ్జర్వ్ చేస్తూ ఎప్పుడూ సానబెడుతూ ఉండాలి.

వచన కవిత్వం దగ్గరికొస్తే ఉద్యమాలు, పోరాటాలు, యుద్ధాలు జరుగుతున్నప్పుడు మామూలుగానే పాట గేర్ అందుకుంటుంది.

దాని కన్నా ముందు సమాజం ఎడ్యుకేట్ అవుతున్నప్పుడు వచన కవిత్వం తప్పదు. వచన కవిత్వంలో స్త్రీవాదం కాని, దళితవాదం కాని, పోస్ట్‌మాడర్నిజం వస్తున్నాయి కాని పాటలో పద్యాల్లో సాధ్యం కాదు. వచన కవిత్వమే వచ్చి తీరాలి. ఎక్స్‌ప్లెయిన్ చేయాలి. ఉదాహరణకు శిఖామణి రాసిన ఒక కవిత. తిరునల్వేలిలో ఒక దళితుడి చేత మలం తినిపించారు. దాన్ని ఆయన పాటగా ఆయన రాయలేడు. తీసుకున్న కంటెంట్ ఏంటి? మానవుడు తోటి మానవుడితో మలం తినిపించాడు. ఆ కవి స్పందన ఎలా ఉంటుంది? తన ఆవేదనని, ఆక్రోశాన్ని, ఆగ్రహాన్ని ఎలా వర్ణిస్తాడు? 'లంజకొడకల్లారా..' అని రాశాడు. కంటెంట్‌ని, కాంటెక్స్ట్ ని, కవిని వదిలిపెట్టి కవిత్వం గురించి మాట్లాడకూడదు. అన్నిటినీ సమాహారంగా చేసి మనం మాట్లాడుకోవాలి. తెలుగు కవిత్వానికి బ్రహ్మాండమైనటువంటి గతి ఉంది. ఒక ప్రవాహం లాగా ఎన్నాళ్లయినా దాని గురించి చెప్పుకోవచ్చు. ప్రజల్ని ఎడ్యుకేట్ చేసేది వచన కవిత్వం మాత్రమే.

కవిత్వం రాయడానికి ఏం కావాలి? అల్లసాని పెద్దన రమణీ ప్రయదూతిక తెచ్చి ఇచ్చు కప్పురబిడడము, ఆత్మకింపైన భోజనము, తాంబూలం, ఉయ్యాల మంచం.. ఇయ్యన్నీ ఉంటే కవిత్వం రాస్తానన్నాడు. ఆడికేంటి? కృష్ణదేవరాయులతోపాటు ఏనుగంబారీ ఎక్కినోడు. అయితే అదా కవిత్వం. కొనకళ్ల వెంకటరత్నం ఏం చెప్పాడు 'హైలేసా, రోడ్డురోలై సాగరా. నడినెత్తిన సూరీడు నకనకలాడిస్తునాడు. కంకర రోడ్లో సగమింకా మిగిలున్నది. లాగరా హైలేసా'. కవిత్వాన్ని కాయకష్టానికి లింక్ చేశాడు. 'కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం,/ జాలరి పగ్గం, సాలెల మగ్గం,/ శరీర కష్టం స్ఫురింపజేసే/ గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,/ సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు -నా వినుతించే/ నా వినుతించే/ నా వినిపించే నవీన గీతికి/ నా విరచించే నవీన రీతికి/ భావం! భాగ్యం! ప్రాణం! ప్రణవం.' -దళితులు వాడే పనిముట్లు ఇవి. రామారావు 'చావు' దళిత కథే. అయితే అప్పుడు దళిత కాన్సెప్ట్ లేదు. ఆయన తప్పు కాదది. అప్పుడు వుమెన్ కాన్సెప్ట్ కూడా లేదు. అయితే 'ఆహా ఆడది. అఘనిశ్రేణి. గరళ ధృణి. తన వేదనలో మన జనయిత్రి' అని శ్రీశ్రీ ఎప్పుడో రాశాడు. చెరబండరాజు 'ఏ కులమబ్బీ మాదేమతమబ్బీ. మట్టిపిసికి ఇటుక జేసి ఇళ్లు కట్టి ఇచ్చినపుడు, డొక్కలెండి కొండ్రలేసి ధాన్యరాశులెత్తినపుడు ఏ కులమబ్బీ మాదేమతమబ్బీ. సన్యాసులై వస్తే క్షవరాలు జేసినపుడు, ఎండలో బండలపై విగ్రహాలు చెక్కినపుడు, ఏ కులమబ్బీ మాదేమతమబ్బీ' అని రాశాడు. 'ఉందర్రా మాలపేటా' అని వంగపండు రాశాడు. గద్దర్ అద్భుతమైన పాటలు రాశాడు. అందుకని దళితుల గురించి రాయలేదు, ఆడవాళ్ల గురించి రాయలేదు అనే పార్షియల్ క్రిటిసిజం చూసి మనం డిఫెన్స్‌లో పడక్కర్లేదు. మనం తెలుగు కవిత్వాన్ని కన్న తల్లిలాగా ప్రేమిస్తాం. కష్టజీవుల హృదయాల్లో గూడుకట్టుకున్న తెలుగుభాషని మనం ప్రేమిస్తాం. అనేక వాదాలొచ్చినా మనం వెనకబడిలేం. నేలమీద నించున్నాం మనం. ప్రజల రక్తంలో రక్తంగా, ఊపిరిలో ఊపిరిగా, దూరిపోతాం. సాహిత్యం ప్రజల గుండెల్లోకి పరకాయ ప్రవేశం చేయాలి. గద్దర్ అలా చేయించాడు. శివసాగర్ అలా చేయించాడు.

చేకూరి రామారావు ఒక మాటన్నాడు. నాకిష్టం లేదు గాని ఈ మాటనాలని, 'తెలుగు వచన కవిత్వాన్ని విరసం రెండు దశాబ్దాల పాటు శాసించి పారేసింది' అని. 70 నుండి 80 వరకు, 80 నుండి 90 వరకు. అయితే 90 నుండి విరసం నీరసించిందనే విమర్శలో పాయింట్ లేదు. కొత్త గాలులొచ్చాయి. దళితుల గాలి. స్త్రీల గాలి. అయితే కారంచేడు సంఘటన జరిగినప్పుడు 'కారంచేడు రైతన్నలు కత్తులు నూరంగ, రామిగాడురికిండు చూడు, చెంచు రామిగాడు చచ్చిండు చూడు' అని పాట రాసింది జననాట్యమండలి కుమారి. తెలుగు కవిత్వానికి ఎప్పటికప్పుడు విప్లవకారులు ఎనార్మస్ జస్టిస్ చేశారు. కాని ఇతర్లు రాసింది చదవరు కదా! అగ్నిశ్వాస సావిత్రి ఎంత మంచి ఫెమినిస్టు పోయెమ్ రాసింది! మూడు లైన్లలో ముప్పై కావ్యాలు రాసిందా అమ్మాయి. వరలక్ష్మి కంటే చిన్నగుండేది. భర్తతో చాలా సఫర్ అయింది. చెరబండరాజంటే ఆమెకు చాలా ఇష్టం. చివరిదాకా మన అభిమానిగానే ఉండేది. ఆమె డెడ్‌బాడీని మేమే విశాఖ కెజీహెచ్‌కు ఇచ్చాం. మొదటి ఫెమినిస్ట్ కవయిత్రి జయప్రభ కాదు. హిస్టారికల్‌గా తప్పది. తెలుగులో మొదటి ఫెమినిస్టు పోయెం రాసింది సావిత్రి. హిస్టరీ వైపు వెళ్లకుండా ఎవరి ఇష్టం ప్రకారం వాళ్లు ఎత్తేయడమేనా? మనం ఆబ్జెక్టివ్‌గా ఉంటాం. రెండు దశాబ్దాల పాటు విరసం శాసించిందంటే మూడో దశాబ్దం అదృశ్యమైందని కాదు. కొత్త గాలులతో విరసానికి ఏకాభిప్రాయమే ఉంది. 92లో రష్యా పతనం, బాబ్రీ విధ్వంసం, మండల్ కమిషన్ వంటివి రాజకీయ వాతావణాన్ని ప్రభావితం చేశాయి. అయితే మనం ప్రజతో ఉంటాం. నేలను అంటిపెట్టుకుని. పాలకవర్గాల కుట్రను బహిర్గతం చేస్తాం. నేలను అంటి పెట్టుకుని ఉంటే హెర్క్యులెస్‌కు బలమొస్తుంది. లేకుంటే రాదు. గ్రీకు మైథాలజీలో కథ. దుర్యోధనుడు కూడా అంతే కదా. వాడి తొడలిరగ్గొట్టి భీముడు చంపేశాడు. అసలు పాండవులు చేయని దుర్మార్గమే లేదు. ఆ కృష్ణుడో పెద్ద మాయగాడు. ఇండియన్ రూలింగ్ క్లాస్‌కు టిపికల్ ప్రతినిధి. వాడు భగవద్గీత బోధిస్తాడు. అది ప్రపంచానికి ఆదర్శం! భవద్గీతంత ఫాసిస్టు బుక్కు ప్రపంచంలో ఎక్కడా ఉండదు. అట్లా పాలక వర్గాల కుట్రల గురించి రాస్తాం. అయితే మన శ్రీశ్రీ 'భారత కురుక్షేత్రంలో సాయుధ విప్లవ బీభత్సుని సారథినై భగవద్గీతా ఝుంఝును ప్రసరిస్తాను' అన్నాడంటే భగవద్గీతకు ప్రాధాన్యత ఇస్తున్నాడని కాదు. 'మంచిగా ఉండడంర్రా అని ఘోషించాను. బతిమాలాను. బామాలాను. నా మాట విన్నారా! అప్పుడు ఆగ్రహం కొరడా చేబూని సాయుధ విప్లవ భీభత్సుని సారథినై భారత కురుక్షేత్రంలో భగవద్గీతా ఝుంఝును ప్రసరిస్తాను కాచుకోండని ఛాలెంజ్ విసిరాడు. పురాణం ఎందుకు వాడాడంటే జనంలో ఉంది కనక. సింబల్ వాడాడు. భగవద్గీతతో మనకు ఆమోదం లేదు. అది ఫాసిజం. శ్రీశ్రీకి భగవద్గీతతో ఆమోదం ఉందని చెప్పే నెగెటివ్ క్రిటిసిజాన్ని మనం ఎదుర్కోవాలి.

సాహిత్య సంఘాలు వస్తువుని నిర్దేశిస్తాయి. దేని మీద రాయాలి కవిత్వం? ఎక్కడి నుండొస్తుంది కవిత్వం? కవిత్వ రూపాన్ని నిర్దేశించేది కంటెంటే. 'హృదయం నశిస్తున్నది. మనస్సు మేల్కొంటున్నది. ఎప్పట్లాగే సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఏ

నివేదిక

'మార్క్సిజం సజీవశాస్త్రం, బలమైన శస్త్రం' 'హిందూమతోన్మాదాన్ని అంగీకరించడమే జాతీయవాదం కాదు'

నెల్లూరులో జూలై 4 విరసం ఆవిర్భవ దినం సందర్భంగా వక్తల ఉద్ఘాటన

జులై 4 సాయంత్రం 5 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో విరసం ఆవిర్భావ దినం సందర్భంగా సదస్సు జరిగింది. విరసం నెల్లూరు యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు పి. కోటయ్య అధ్యక్షత వహించారు. వి.చెంచయ్య సభకు స్వాగతం పలికారు. సి.ఎస్.ఆర్. ప్రసాద్, జి. కళ్యాణరావులు ప్రసంగించారు. ప్రజా కళామండలి కార్యకర్తలు విప్లవ గీతాలాలపించారు. 300 మంది శ్రోతలతో జరిగిన ఈ సభ ఉత్తేజకరంగా సాగింది.

మొదట సి.ఎస్.ఆర్. ప్రసాద్ 'కమ్యూనిస్టు ప్రణాళిక - మార్క్స్ దార్శనికత' అనే అంశంపై మాట్లాడుతూ, మార్క్సిజాన్ని దాని చలనంలో, అభివృద్ధిలో అర్థం చేసుకుంటే తప్ప, సమకాలీన సమాజానికి అన్వయించలేమన్నారు. మార్క్సిజం దానంతటది ఒక లక్ష్యం కాదనీ, అది సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, దాన్ని మార్పు చేసే దిశగా ప్రయాణించడానికీ, ఆ క్రమంలో తలెత్తిన వైరుధ్యాలను పరిష్కరించుకోడానికీ అవసరమైన దృష్టి కోణాన్ని అందించే శాస్త్రం అన్నారు. అందుకే మార్క్సిజం శాస్త్రమే కాదు, శస్త్రం కూడా అన్నారు. రష్యా, చైనా వంటి దేశాలలో విప్లవానంతర వ్యవస్థలు కుప్పకూలిపోవడంతో, దానంతటికీ మార్క్సిజంలో ఉండే ఖాళీలే, లోపాలే కారణమని చాలామంది విమర్శించడం వాస్తవం కాదన్నారు. మార్క్సిస్టు సిద్ధాంతపు లోతునీ, విస్తృతినీ అర్థం చేసుకోకుండా దాన్ని అతి సరళీకరణకు గురిచేసి చూడడం, మార్క్సిజానికి వక్రభాష్యం చెప్పడం అనే రెండు లోపాలను అధిగమిస్తే తప్ప, మార్క్సిజాన్ని సజీవశాస్త్రంగా అర్థం చేసుకోలేమని అన్నారు.

తర్వాత జి. కళ్యాణరావు 'హిందూమతోన్మాదం - వర్తమానం' అనే విషయంపై మాట్లాడుతూ మతోన్మాదాన్ని అంగీకరించడమే జాతీయవాదమైతే అది ఫాసిస్టు చర్య అవుతుందని అన్నారు. విప్లవాలు, ఉద్యమాల పరమావధి మనిషికి మానవత్వాన్ని చేకూర్చడమేనన్నారు. హిందూమతోన్మాద శక్తులను సంఘటితంగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత ఈనాడు ఏర్పడిందన్నారు. హిందూత్వం స్వీకరించనివాడు దేశంలో ఉంటే భారతీయుడు కాదని మతతత్వ శక్తులు పిలుపునివ్వటం పట్ల ఆయన నిరసన వ్యక్తం చేశారు. మనకున్న భారతీయ ఇతిహాసాలు, పౌరాణిక గ్రంథాల్లో ఎక్కడా హిందూ ప్రస్తావన లేదని అంటే, అసలు కుల వ్యవస్థ, హిందూ వ్యవస్థ మూలాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు.

తెలియని దశకో కాలం సాగిపోతున్నది.' అని మనవాడు రాశాడు. ఇంత మంచి కవిత్వం ఎక్కడి నుండి వచ్చింది. వాళ్లందరూ రోజూ కలవడం, కూర్చోవడం సమాజం గురించి మాట్లాడుకోవడం చేసేవాళ్లు. సాటి మనిషిని కలవకపోతే, కలిసి పంచుకోకపోతే, స్పందన లేకపోతే, సమైక్యం లేకపోతే, కావలించుకోకపోతే కవిత్వం ఎలా వస్తుంది? రక్తమాంసాల్లోనుంచి రావాలి కవిత్వం. మట్టిలో నుండి రావాలి. ప్రజల జీవితాల నుండి రావాలి. సంఘర్షణలో నుండి రావాలి. సామాజిక సమైక్యత నుండి రావాలి కవిత్వం. అందుకని సాహిత్య సంఘాలు వస్తు నిర్దేశం చేస్తాయి. వ్యక్తులు చేయలేరాపని. మనం ప్రజతో ఉంటాం. ప్రజా ఉద్యమాలతో ఉంటాం. కొత్త గాలుల్ని ఆహ్వానిస్తాం. మనం ఎక్విప్ అవుతాం.

స్త్రీవాద కవిత్వం దళితవాద కవిత్వం వచ్చిన తర్వాత తెలుగు కవిత్వంలో వచ్చిన మార్పు కూడా చాలా గణనీయమైంది. తెలుగు కవిత్వాన్ని అవి చాలా విశాలం చేశాయి. లేబర్ పెయిన్స్, బహిష్టు బాధలు కవితా వస్తువులవుతాయని మేం అంతక ముందు ఊహించలేదు. స్త్రీవాదం తీసుకొచ్చింది. అట్లాగే దళితవాదం, ముస్లింవాదం, తెలంగాణ... ఎన్నో కొత్త కవితా వస్తువులను, వ్యక్తీకరణలను తీసుకొని వచ్చాయి. విరసం సజీవ విప్లవోద్యమంతో ఉంటుంది గనక, ప్రజలతో ఉంటుంది గనక దృక్పథపరంగా క్రిటికల్‌గా ఉంటూనే వాటి నుండి చాలా స్వీకరించింది. వాటితో మిత్రవైరుధ్యమే ఉంటుంది. మనల్ని విమర్శిస్తారు అంటే, వాళ్లేమంటారంటే 'మీరా లైన్‌లో ఉన్నారు కాబట్టి మిమ్మల్నే అడుగుతాం. ఇంకెవర్నడుతాం'. అలా అన్నారు డైరెక్టుగా. పున్నయ్య కమిషన్ 'దళితుల మీద దౌర్జన్యాలు తెలంగాణలో జరగట్లేదు. కారణమేమంటే అక్కడ పీపుల్స్ వార్ పార్టీ ఉంది కాబట్టి' అని స్పష్టంగా రాసింది. సర్కారు జిల్లాల్లో కూడా దళితులు కమ్యూనిస్టు పార్టీని ఓన్ చేసుకున్నారు. అయితే అవి ఇప్పుడు రంగు మార్చకుండా దిక్కుమార్చిన పార్టీలుగా ఉన్నాయి. నిజమైన కమ్యూనిస్టు పార్టీలు కావవి. ఆ పార్టీల స్వభావం మారింది కనక అవి దళితుల సానుభూతిని కోల్పోయాయి. ఎమ్ఎల్ పార్టీలుగాని, పీపుల్స్ వార్‌గాని, మావోయిస్టు పార్టీ గాని దళితులతోనే ఉంటాయి కనక తప్పకుండా ఓన్ చేసుకుంటారు. ఎవరి గురించి పనిచేస్తున్నాం. ప్రొడక్షన్ క్లాస్ ఏది? కాస్ట్ ఏది? ఈ స్పష్టత మనకుండాలి. అధ్యయనం చేయాలి. ఈ స్పష్టతతోనే రాయాలి. ప్రజలతో మమేకం అవ్వాలి. ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ కవిత్వం -విప్లవ కవులంటే విరసంలో ఉన్నవాళ్లతోపాటు, విరసంతో భావసమైక్యత ఉన్నవాళ్లు- వీళ్లందరిదీ పైచేయిగానే ఉంటుంది. ఉదాహరణకు నిర్భయ మీద విరసం కవులే గొప్ప కవిత్వం రాశారు. దాన్ని సంకలనం చేస్తే బాగుంటుందని నా సూచన. ఈ విప్లవ సంప్రదాయాన్ని, ఈ కవిత్వాన్ని ముందుకు తీసుకెళ్లి సగర్వంగా సమున్నతంగా మన జెండాని ఎగరేద్దాం.

(కా. చలసాని తొలి వర్ధంతి జూలై 25 సందర్భంగా)

అమరజీవి

అడుసుమిల్లి కమల

నాకు తెలిసిన చలసాని ప్రసాదు. మా పెద్ద మామయ్యగారు చలసాని బసవయ్యగారి కుమారుడు. నాకు ముగ్గురు మేనమామలు. పెద్దాయన బసవయ్య గారు, నారాయణమూర్తి గారు (ఉప్పు సత్యాగ్రహం రోజుల్లో కాంగ్రెస్సు ఉద్యమంలో జైలు జీవితాన్ని గడిపారు) మా చిన్న మామయ్య చలసాని జగన్నాథరావుగారు. మొదట కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన కొత్తలోనే మా కుటుంబం నుండి మొదట వెళ్ళింది జగన్నాథరావు మామయ్య. అది మొదలు మా కుటుంబాలన్ని పార్టీ కుటుంబాలయ్యాయి. అప్పటి పోలీసు కాల్పుల్లో మా కుటుంబంలో ముగ్గురు రత్నాలను పోగొట్టుకున్నాం. వాళ్ళు లేని లోటు ఇప్పటికీ కనబడుతుంది. ఇప్పుడు చివరి రత్నాన్ని, ఆణిముత్యాన్ని కూడా పోగొట్టుకున్నాం. ప్రసాదు, నేను ఒకే వయస్సు వారం. మా కుటుంబాలన్నీ పార్టీ కుటుంబాలయినా చివరలో కారణాలు ఏవైనా చాలా మంది ఉద్యోగాల రూపేణా, వ్యాపారాల రూపేణా (ఆర్థిక ఇబ్బందుల కారణంగా) బయటకెళ్ళి బతుకుతున్నారు. కాని మా ప్రసాదు మాత్రం మొదటి నుండి, చివరి వరకు కూడ తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి చివరకు వెళ్ళిపోయాడు. విప్లవ రచయితల సంఘం స్థాపించి దాన్ని దినదినాభివృద్ధి చేసి ప్రపంచమంతా తానంటే ఏమిటో తెలియ చెప్పాడు. ఆ పార్టీకి అవిరామకృషి చేశాడు. అదే అతని జీవితం, అదే శ్వాసగా, చేసుకుని వెళ్ళిపోయాడు. రాజకీయంగా ఎంత ఎదిగినా ఏనాడు బంధు, మిత్రులను వదులుకోలేదు. ఎవరికైనా కష్టంగా ఉన్నా, సుఖంగా ఉన్నా అన్ని సందర్భాలలోను వారికి ఎటువంటి అవసరాలున్నా తన సహాయం కావాలని అడిగితే మాత్రం ఎప్పుడూ కాదు అనేవాడు కాదు. తనకు చేతనయిన, చేయగలిగిన సహాయం చేసేవాడు. తరువాత నిత్యజీవితంలో కూడా ఏనాడు ఆడంబరాలను కోరుకోలేదు. సామాన్య మానవ జీవితాన్నే తాను గడిపాడు. అతి నిరాడంబరంగా జీవించాడు. ఎప్పుడు కూడా ఇంతకంటే కొంచెం మంచి జీవితాన్ని గడుపుదామని అనుకోలేదు. ఎన్ని రాజకీయ పార్టీల నాయకులను చూస్తున్నాను. ఎవరూ కూడ మరీ ఇంత నిరాండబరంగా ఉంటున్నారా? అనిపిస్తుంది. ఆఖరికి బయట కొచ్చినప్పుడైన కనీసం మంచి బట్టలయిన వేసుకుందాం అనుకునేవాడు కాదు. ఎన్ని ఒత్తిడి పనులున్న కనీసం నెల రోజులకొకసారైన కనబడి కాసేపు యోగక్షేమాలు అడిగి తరువాత ఏమిటి కమలా.. మీ మార్క్సిస్టు పార్టీ వారు ఏమంటున్నారని నన్ను ఆటపట్టించేవాడు. అలా కాసేపు కూర్చుని భోజనం చేసి వెళ్ళేవాడు. నా అనారోగ్య కారణంగా నేను 10 సంవత్సరాల నుండి మా అమ్మాయి ఉష దగ్గర (విశాఖ) ఉంటున్నా.. ఇప్పుడు మా అమ్మాయి వాళ్ళు హైదరాబాదులో ఉంటున్నారు. హైదరాబాదు వచ్చినప్పుడల్లా ఏదో ఒక టైములో వచ్చి పలకరించి వెళ్ళేవాడు. అటువంటి రత్నం రాలిపోయిందని టీవీలో విని ఆ వార్తను తట్టుకోలేక పోయాను. మొదట విన్నది మా అమ్మాయి ఉష, అప్పుడు నన్ను పిలిచింది పెద్ద కేక పెట్టి పిలిచింది. టీవీలో అతని ఫొటో.. మరణించాడని వినిపిస్తున్నారు. అసలు వాళ్ళు ఏమి చెబుతున్నారో నాకు సరిగ్గా అర్థం కావటం లేదు. ఎందుకంటే ఆ క్రితం రోజే నాకు ఫోను చేసి చెప్పాడు. నేను ఫలానా తేదీలలో హైదరాబాదు వస్తున్నాను. ఏదో ఒక రోజు మీ ఇంటికొస్తానని మా అమ్మాయికి ఫోను చేసి చెప్పాడు. ఆ వెంటనే ఈ వార్త వినే సరికి తట్టుకోలేక పోయా. నేను ఏమవుతున్నానో నాకే తెలియలేదు. అప్పుడనుకున్న, చివరి రత్నాన్ని, ఆణిముత్యాన్ని కూడ మా కుటుంబం పోగొట్టుకుందని. కాని ఒకటండీ...



ప్రసాదు ఏ ఆశయంతో విప్లవ రచయితల సంఘం స్థాపించాడో, ఎంత కష్టపడి దాన్ని ఈ స్థాయికి తీసుకు రాగలిగాడో అనేది అర్థం చేసుకోవటం మాత్రం చాలా కష్టం. అదే అతని ఆశ, అతని ప్రాణం, అదే అతని జీవిత లక్ష్యం అనుకుని దాన్ని కళ్ళారా చూసుకున్నాడు. అంతకంటె మనిషికి ఇంకేమీ కావాలండి. ప్రపంచం మొత్తం మీద అతని సానుభూతిపరులు ఎక్కడున్నా వాళ్ళ అందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాడు. అదే అతనికి (మా ప్రసాదుకు) మనమిచ్చే ఘన నివాళి.

ప్రసాదూ!

నీవు నీ బంధు, మిత్రుల మనసుల్లో శాశ్వతంగా నిలిచి పోతావయ్యా.

అంతకంటే (ఎవరి విషయంలోనైనా) మనిషికి ఇంకేమి కావాలండీ?

ప్రసాదూ...

తాళాలు లేని ఇళ్ళు, పరీక్షలు లేని చదువులు, పోలీసులు లేని రాజ్యం. ఇవి కావాలనే వాడివి ఎప్పుడు. అది జరగని పని అనేదాన్ని నేను. ఈ విషయం ఎప్పుడూ గుర్తొస్తుందయ్యా. కన్నీటి వీడ్కోలుతో నీ కజిన్ కమల.

చదవాల్సిన నవల నల్లమల

కృష్ణాబాయి

నల్లమల ఉద్యమమంటే పాలమూరు, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్గొండ జిల్లాల పోరాట చరిత్ర.

నల్లమల చెంచుల జీవిత విధానం, మానవ సంబంధాలు స్పష్టంగా అర్థమవుతాయి పి.చంద్ రాసిన ఈ నవల చదివితే. కమ్యూనిస్టులు వచ్చిన తర్వాతే తమ బతుకుల్లో మంచి మార్పులు వొచ్చాయని గ్రహిస్తారు చెంచులు.

"ఏందో బిడ్డ, మీరు కనిపించకుంటే ఏదో పోయినట్టుంటది" అన్న మాటల్లో పార్టీ పట్ల జనానికున్న అభిమానం, నమ్మకం బోధపడతాయి.

దళ నాయకుడు మల్లన్న చెంచు లింగయ్యని "పోయిన సారి నేనిచ్చిన పంచె చిరిగిపోయిందా మళ్ళీ పాతదే కట్టుకున్నావ్?" అని అడుగుతాడు. 'కొత్తపంచె కట్టుకుంటే చిరిగిపోతదని దాచి పెట్టుకున్నాడ'ని లింగయ్య భార్య చెప్తుంది. "అది చిరిగిపోతే మరోటిస్తాగాని, ఇక ఈ చిరుగుల పంచెతో కనిపించకు" అంటాడు. దళ సభ్యులకి చెంచులతో ఉన్న సన్నిహిత సంబంధాలకి ఇదో చిన్న మచ్చుతునక. ప్రజల్ని ప్రేమించే దళాల ఆప్యాయతకు చెంచులు కరిగిపోతారు.



నల్లమల
పి. చంద్
ప్రచురణ : విరసం, ప్రచురణ : 2015,
పేజీలు : 419, వెల : రూ. 225/-

బుడ్డగోచిపెట్టుకుని శతాబ్దాల తరబడి నల్లమల అడవుల్లో బతికే చెంచుల దుర్భర జీవిత చిత్రణ కళ్ళకుకట్టారు రచయిత చంద్. సామాన్య జనం పడుతున్న అవస్థల్ని వివరిస్తూ అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల ఉదాహరణలతో ప్రత్యేక కథనం రాశాడు.

ఒక భూస్వామిని జనం ముందు నిలబెట్టి, వాళ్ళు ఎదుర్కొన్న బాధల్ని రుజువులతో సహా చెప్పిస్తుంది దళం. భూస్వామి తప్పుల్ని అతని చేతే ఒప్పించి, మంచిగా మారకపోతే ఏం జరుగుతుందో వార్నింగ్ ఇస్తారు.

చెంచులకి కాశీ మజిలీ కథల్లాంటివి ఎన్ని ఉన్నాయో సోదాహరణంగా చిత్రించారు.

విప్లవ నాయకుడి సహచరిగానే కాక, ఉద్యమంలో సుదీర్ఘ కాలం పనిచేసిన శాంత పాత్రపరంగా నవల నడిపించారు చంద్.

ఒక విప్లవకారుడి కోసం అతని ఇంటి మీద దాడి చేసిన ఎస్సై "నీ కొడుకు ఎక్కడికి పోయిండు?" అని అడిగితే 'ఏమో తెల్వదు" అంటాడు తండ్రి.

"పోరగాండ్లను కనంగానేకాదు, వాళ్ళని అదుపులో ఉంచుకోవాలి" అంటాడు అధికారి.

"వాడేమైనా చిన్న పిల్లగాడా, అదుపులో ఉంచుకునేటందుకు? వాళ్ల రాత ఎట్టా ఉంటే అట్టా అయితది" అంటాడు తండ్రి నిర్లిప్తంగా.

"బెస్త పాపయ్య కోడలు తుమ్మల్లకి రెంటికి పోతే ఓ పోలీసోడు వెంట పడ్డాడు. ఆ పిల్ల భయపడి పోయి, తీసుకుపోయిన చెంబు ఒదిలేసి ఏడ్చుకుంటూ పరుగునవచ్చింది" అంటూ చిన్న చిన్న సంగతుల్ని కూడా ఒదలకుండా చెప్తారు రచయిత.

ప్రభుత్వంతో విప్లవకారులకు జరిగిన చర్చల దగ్గరనుంచీ ప్రతిదీ గుర్తు చేసి చరిత్రని అక్షరబద్ధం చేశారు రచయిత.

పెనిమిటి పెట్టే హింస భరించలేక విప్లవోద్యమంలోకి వచ్చిన బాజీ అనే యువతి ఎన్‌కౌంటరయ్యింది. మూడు రోజుల తర్వాత శవాన్ని చెట్లకింద పడేశారు. పురుగులు పట్టి శరీరం నీరు కారిపోతోంది. "అమ్మా బాజీ! నీ పక్కన కాసేపు పడుకోనియ్యే" అంటూ తల్లి నేల మీద పడి దొర్లి దొర్లి ఏడ్చిందని నల్లమల ఉద్యమం గురించిన విశేషం రాశాడు ముందుమాటలో పాణి. బాజిలాంటి ఎందరో కామ్రేడ్స్ అమరత్వంతో కన్నీరై తడిసిపోయింది నల్లమల. చూసేవారి పిడికిళ్ళు బిగుసుకుంటాయి. .

పైగా రచయితల సొంత అనుభవం కాదిది. ఇతరుల అనుభవాల్ని, వస్తుగత చరిత్రని ఒంటబట్టించుకుని రాయడం చాలా కష్టం. నేర్పుగా నల్లమల పోరాట చరిత్రని డాక్యుమెంట్ చేయడంలో చంద్ సఫలీకృతుడయారనే నాలాగే మీకు అనిపిస్తుంది ఈ నవల చదివితే.

పాణి ఈ నవలకి రాసిన ముందుమాట ('నల్లమల గాథ') వివరణాత్మకంగానూ, మంచి గోడ చేర్పుగాను నిలిచింది.

రాజకీయాల్లోకి లోతుగా వెళ్ళకుండా, మానవ సంబంధాల్ని తడిమే ప్రయత్నమే నా ఈ పరిచయం.

(ఈ సమీక్షని చలసానికి చూపిద్దామని 25.07.2015 ఉదయం తన దగ్గరికి బయల్దేరాను. ఇంతలో తన మరణవార్త)

వరవరరావు కవిత్వంలో అభివ్యక్తి, వస్తు వైవిధ్యం

బిఎస్ రాములు

1

కవిగా వరవరరావు లక్ష్యం, ధ్యేయం

వరవరరావు ఒక విప్లవకవి. కవిత్వంలో విప్లవాన్ని, విప్లవంలో కవిత్వాన్ని పడుగుపేకల్లా కల నేస్తున్న కవి. కవికి విప్లవం ఒక ఆశయం, ఒక లక్ష్యం, ఒక ధ్యేయం. కవిత్వం అందుకు ఒక ప్రక్రియ. ప్రసంగం కూడా ఒక బలమైన ప్రక్రియగా రూపొందించుకున్న విప్లవకవి. సామాజిక ఆచరణకు, విప్లవానికి, కవిత్వానికి మధ్య సంబంధాన్ని నిరంతరం స్థాపిస్తున్న కవి.

వరవరరావు కవిత్వంలో 'అంతస్సూత్రం' ఐడియాలజీయే. అతని దృక్పథమే అతని కవితావస్తువును, శిల్పాన్ని నిర్దేశించింది. అంటే తనకు తోచిన సిద్ధాంతాలను చెప్పడానికి కవిత్వం రాశాడని కాదు. వర్తమాన సామాజిక పరిణామాలను తన విప్లవ దృక్పథంతో పరిశీలిస్తూ కవిత్వీకరించాడు. తాత్వీకరించాడు. చరిత్రీకరించాడు. మానవీకరించాడు. విప్లవీకరించాడు. అందువల్ల అతని కవిత్వంలో సాంద్రత హెచ్చు. అతని కవిత్వం, శైలి, శిల్పం, వస్తువు సరళంగా, స్పష్టంగా, క్లుప్తంగా అర్థమౌతూనే వుంటుంది. చిక్కు, చిక్కదనం ఎక్కడ వుందంటే తీసుకునే వస్తువులో, దాన్ని విశ్లేషించే దృక్పథంలో, వస్తువుని, శిల్పాన్ని సమన్వయించే తీరులో వుంటుంది. దృక్పథం ఒక చిక్కుముడిగా తెలియనివారికి కనిపించే అవకాశం వుంటుంది. కవిని చదివేముందు కవి దృక్పథాన్ని చదివితే ఈ చిక్కుముడి విడిపోయి స్పష్టత ఏర్పడుతుంది. అప్పుడు కవిత్వం జీవితమంత స్పష్టంగా, ఉద్యమాలంత ఉద్వేగంగా, ఆర్ద్రంగా అర్థమవుతుంది.

ఉదా॥కు 'వాడు దారం తెంపడానికే వచ్చాడు / ఆధారం / వేళ్లల్లోని దారం / జీవధారయై ప్రవహించిన దారం' అనే పంక్తుల్లో అర్థంకాని పదాలు లేవు. భావం కూడా తెలుస్తుంది. కాని అంతస్సూత్రం అనే శీర్షికతో వున్న ఈ కవితలో దృక్పథాన్ని ధ్వనిగా మార్చాడు. అక్షరాల్ని చదువుతుంటే దాని వెనుక వున్న కాగితంలా దృక్పథం నిండా పరుచుకుని వుంటుంది.

వరవరరావు కవితావస్తువు

వరవరరావు కవిత్వంలో జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ, ఆర్థిక సంబంధాలు, వాటి ప్రభావాలు మానవీయ మార్క్సిస్టు విప్లవ దృక్పథంతో కవితావస్తువు విస్తారంగా పరుచుకుని వుంటుంది. ఆయన కవితావస్తువు విస్తారమైనది. ప్రపంచమే తానై పలవరించే కవికి వస్తు విస్తృతి ఎక్కువ. వరవరరావు కవితావస్తువులోనూ, ఈ విస్తృతి ఆకాశమంత ఎత్తులో సాక్షాత్కరిస్తుంది.

ప్రపంచం మొత్తం శ్రామికవర్గ ప్రజల నాయకత్వంలో వారి ప్రభుత్వంలోకి రావాలని కలంపట్టి రాస్తున్న కవి వరవరరావు. అందువల్ల ప్రపంచంలో పాలకవర్గాలకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రజాపోరాటాలన్నీ కవికి కవితావస్తువులే. అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకించే దేశాల పోరాటాల్ని కూడా కవి ప్రపంచ విప్లవంలో భాగంగా పరిశీలిస్తాడు. ప్రపంచ ప్రజల విప్లవాలను ప్రేమిస్తాడు. వాటితో తాదాత్మ్యం చెందుతాడు.

ఉదా॥కు '1981 / మగ్గాల్లోకి విద్యుత్తు ప్రవహించి / చేతులు షాక్‌కొట్టి పడిపోయాయి / కాళ్లకింది నేల రియల్ బ్రోకర్లయినారు / ట్రేడ్‌యూనియన్ లీడర్లు బ్రోకర్లయినారు / వినకపోతే మాఫియాకు బలియినారు / మిల్లులు మూతబడినాయి' అంటూ వాటి క్రమాలను వివరిస్తాడు. అక్కడి చైతన్యాన్ని చిత్రిస్తాడు. చేతివృత్తులు వేళ్ల తెగిన చెట్లవలె కూలిపోయాయని అంటాడు. వాడు చేతుల్ని విరిచేయడానికి వచ్చాడు. అవి ఎలాంటి చేతులు? పనిచేసే చేతులు. అన్నం తినే చేతులు. పసిపిల్లల్ని మృదువుగా స్పృశించే చేతులు. ఎందుకు ఇవన్నీ వాడు చేస్తున్నాడు? మనిషిని మార్కెట్ చేతుల్లో పెట్టడానికి. ఎందుకు అందుకోసం చేతులు విరిచేస్తాడు? వృత్తుల్ని ధ్వంసం చేస్తాడు? ఎందుకంటే మార్కెట్‌కు దాహమే గానీ తీర్చుకోవడానికి చేతులుంటాయా - దిగమింగే కడుపు తప్ప. అందుకని వాడు దారం తెంపుతాడు. చేతుల్ని విరుస్తాడు. విధ్వంసాన్ని సృష్టిస్తాడు. టెర్రరిజాన్ని పెంచి పోషిస్తాడు. మత తత్వాన్ని రెచ్చగొడ్తాడు. ఈ వాడు అనేవాడు ఎవడు? అది సామ్రాజ్యవాదం. ఇలా సామ్రాజ్యవాదం సృష్టించే అనేక పరిణామాలను వాటిమధ్య గల అంతస్సూత్రాన్ని చిత్రిస్తూ ప్రజల బాధలతో, కన్నీళ్లతో, పోరాటాలతో కలిసిపోతాడు. వారిలో ఒకడిగా మారిపోతాడు.

వరవరరావు అభివ్యక్తి

విప్లవ కవిత్వంలో విప్లవం తప్ప కవిత్వం లేదని చాలామంది అనుకుంటారు. వారిది ఎంత దురభిప్రాయమో వరవరరావు రాసిన 'ఉన్నదేదో ఉన్నట్లు', 'అంతస్సూత్రం' కవితా సంపుటాలు చెప్తాయి.

కవిత్వం ఎంత గొప్పగా వుంటే విప్లవీకరణ అంత గొప్పగా వుంటుంది. అందువల్ల ఎవరికన్న గొప్పగా విప్లవకవికే కవిత్వం గొప్పగా ఉండడం, రాయడం అవసరమౌతుంది. మిగతా కవులకు వస్తువు పట్ల స్పందన కలిగిస్తే చాలు. కాని విప్లవ కవిత్వం, స్పందన, కరుణార్ద్రత కలిగించడంతో పాటు పాఠకుల్ని విప్లవాభిమానిగానో, విప్లవకారునిగానో మార్చే కర్తవ్యాలు కూడా నెరవేర్చే అదనపు బాధ్యతను స్వయంగా స్వీకరించింది. కనుక, విప్లవ కవిత్వంలో తెలిసిన దృక్పథమే అని తెలిసినప్పటికీ చదివించగలిగే నేర్పు సాధించినప్పుడే గొప్ప కవిత్వమవుతుంది.

'గాలిపటం తెగినపుడు పటం కోసమే కానీ తెగిపోయిన

మాంజా కోసం వెతకం కదా' అనడంలో కవి ఎన్నో విషయాలు పాఠకుడి ఊహల్లోకి తీసుకువస్తాడు.

విప్లవానికి విప్లవకవికి మధ్య వ్యత్యాసం

విప్లవకవికి, విప్లవకారునికి మధ్య నిర్మాణరూపాల వ్యత్యాసమే తప్ప కర్తవ్యం ఒకటే. విప్లవ కవి కొత్తవారిని విప్లవంలోకి తీసుకురావాలి. విప్లవంలోకి వచ్చినవారిని నిలబెట్టాలి. విప్లవకారులు వారిని విప్లవంలో సమన్వయపరుస్తారు. భావం కవిది, నిర్మాణం విప్లవకారునిది. నిజానికి భావం కూడా ఉద్యమానిదే. కాని కవిత్వంలో కవిదిగా కనపడుతుంది.

ఉదా॥కు యుద్ధం మౌనంగా రాదు. అది ఒక రణగొణధ్వని. జీవరసాన్ని హరించే విపణి. 'అమెరికా ప్రజాస్వామ్యం కన్న నాకు అరబ్‌దేశాల మూర్ఖత్వం ఇష్టమైంది' అనడంలో ఉద్యమం యొక్క భావజాలాన్ని కవిత్వీకరణలో వస్తువును తాత్వీకరించడం చూడవచ్చు.

2

వరవరరావు కవిత్వంలోని అంతస్సూత్రం

వరవరరావు వెలువరించిన ఈ రెండు సంపుటాల కవిత్వంలో 'అంతస్సూత్రం' ఏమిటి? 1.దృక్పథం. 2.సామ్రాజ్యవాద గ్లోబలైజేషన్ వ్యతిరేకత. 3.సమస్త దోపిడి, పీడన, అణిచివేతల వ్యతిరేకత. 4.ఎలుగెత్తే విప్లవకవి. 5.60లో 20 ఏళ్ల ఉత్తేజం, నవయవ్వనం.6.తెలంగాణ భాష, సంస్కృతి, నుడికారం, అభివ్యక్తి.

కవి అంటే ప్రజలపక్షం వహిస్తూ ప్రభుత్వానికి ప్రతిపక్షం

కవి అంటే ప్రభుత్వం పట్ల ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల పక్షం వహించాలి అనే నిర్వచనం ఒకటి వుంది. దాన్ని కాళోజీ లాగే వరవరరావు నూరుపాళ్లు తమ కవితావస్తువులో ప్రాణంలా అంతర్లీనం చేసుకున్నారు. వరవరరావు కవిత్వంలో, వస్తు స్వీకరణలో యువతరం కవులతో పోలిస్తే పదేళ్లు ముందున్నట్టు అన్పిస్తుంది. అనుభవం, అవగాహన, పరిణతి ముందుచూపును కలిగించడంవల్ల ఇది సాధ్యపడింది.

భావంతో ఏకీభావం వుంటే లీనమౌతారు

భావంతో ఏకీభావం ఉన్నపుడు కవిత్వం అద్భుతంగా కనబడుతుంది. అందులో లీనమైపోతారు. ఇది అన్ని కవిత్వాలు చేసే పనే. భావంతో ఏకీభావం లేకపోయినా సహృదయతతో స్పందించేట్టు చేయడమే గొప్ప సాహిత్య లక్షణం. అది మహాకవులకే, మహారచయితలకే సాధ్యం. ఒక ప్రేమ్‌చంద్, ఒక శరత్‌బాబు, ఒక జాషువా, ఒక శ్రీశ్రీ ఈ స్థాయిని సాధించుకున్నారు. వరవరరావు ఈ కోవలోకి వస్తాడు.

ఉదా॥కు 'నేనొక అలసట ఎరుగని బాటసారిని / దేశదిమ్మరిని / ఒడిబట్టుకొని చీకటిరాత్రులు నక్షత్రాలకోసం ఆకాశాన్ని / వెన్నెల కోనల్లో పూలకోసం చెట్లను తీగలను / వేడుకుంటూ తిరుగుతుంటాను' అంటాడు కవి. శరత్‌బాబు కూడా దేశదిమ్మరి. అయితే ఒక క్రమశిక్షణ లేని దేశదిమ్మరి. ప్రేమ్‌చంద్ కూడా అభ్యుదయ రచయితల సంఘ నిర్మాణం కోసం విస్తృతంగా తిరిగాడు. శ్రీశ్రీ కూడా ఒక దేశదిమ్మరిలాగా తిరిగాడు. వరవరరావు ఒక క్రమశిక్షణ కలిగిన సాంస్కృతిక విప్లవ సైనికుడు. అతని దేశదిమ్మరితనం ప్రజలను అధ్యయనం చేయడం కోసం. ప్రజల కోసం పని చేయడం కోసం. ప్రజలను మేల్కొల్పడం కోసం. అందుకే తనను తాను అలసట యెరుగని బాటసారిగా చెప్పుకున్నాడు.

విప్లవ కవిత్వం అందరూ చదవడం ఎందుకు అవసరం?

ఇతని కవిత్వం, కవితావస్తువు సమాజంలో ఒక అంశమే. సమాజాన్ని దాని సమస్త పరిణామాలను, కోణాలను అర్థం చేసుకోవడంలో భాగంగా అందరూ ఈ కవిత్వం చదవడం అవసరం. ఏ కవి అయినా తాను చెప్పాలనుకున్నవాటినే కవితావస్తువులుగా తీసుకోవడం సహజం. ఈ కవి కూడా సమాజంలో తాను ప్రధాన అంశం అనుకున్నవాటిని కవితా వస్తువులుగా తీసుకుని రాశాడు కవి.

ఈ కవిత్వం ఎవరికోసం? విప్లవం కోసం. వివిధ రంగాల్లో విప్లవం కోసం పనిచేస్తున్న శ్రేణుల కోసం. అంతే అయితే ఈ కవిత్వాన్ని ఇతరులు ఎందుకు చదవాలి అనే ప్రశ్న వస్తుంది. ఈ కవిత్వం వారితోపాటు ప్రజలకోసం, పాఠకుల కోసం, విప్లవ అభిమానుల కోసం, విప్లవకారులకోసం, విప్లవ మేధావులకోసం, తన విప్లవ సామాజిక దృక్పథాన్ని ప్రజల్లో అంగీకరింపజేయడంకోసం, అన్నిటికన్నా ముఖ్యంగా సామాజిక పరిణామాలను ఒక తత్వవేత్తగా ఎప్పటికప్పుడు పరిణామాల వెనుక గల సత్యాలను, సామాజిక చలన సూత్రాలను, అసలు చరిత్రను ప్రజలకు తేటతెల్లం చేయడం కోసం. అందువల్ల ఈ కవిత్వం అందరికీ సంబంధించింది. అందరూ చదవవలసింది.

ఒక సామాజిక శాస్త్రవేత్తగా వరవరరావు

వరవరరావులోని ఒక కవి సామాజిక శాస్త్రాల్ని కవిత్వీకరణలో విప్లవానుకూలంగా విశ్లేషిస్తాడు. ఎప్పటికప్పుడు సామాజిక వస్తువును, సమస్యలను, పరిణామాలను తన దృక్పథంలో భాగంగా తాత్వీకరిస్తాడు. తద్వారా వర్తమానాన్ని ఒక తత్వవేత్తగా, సామాజిక శాస్త్రవేత్తగా విశ్లేషించి అందించాడు. సామాజిక దృశ్యాలను, పార్శ్వాలను, సన్నివేశాలను సృష్టించి లేదా సమాజం నుంచే స్వీకరించి ఒక భావం వైపు, ఒక లక్ష్యం వైపు నడిపిస్తాడు.

'చమురు అమ్మి ఆయుధాలు కొనుక్కొమన్నది అమెరికా / ఆయుధాలు కొని తన ప్రజలపై కుర్దులపై / ఇరాన్‌పై యుద్ధాలు చేసి / మళ్ళీ ఆయుధాలు కొనుక్కొమ్మన్నది అమెరికా / వాడకపోతే ఆయుధం తుప్పు పడుతుందన్నది / చాలు చాలయింది / చమురు అమ్మి ఆహారం కొనుక్కుంటానన్నది ఇరాక్ / ఈ ఇంగితం ఒపెక్ దేశాలను కూడగట్టి చెప్పింది' అంటూ ఈ కవితలో ఇరాక్‌పై అమెరికా ఏకపక్ష యుద్ధాన్ని ఎందుకు ప్రకటించిందో అసలు సత్యాన్ని చెప్పాడు. చిన్నపిల్లలకు కూడా అర్థమయ్యేంత సరళంగా చెప్పాడు.

3

వరవరరావు కవిత్వంలో వస్తువైవిధ్యం

వరవరరావు కవితల్లో వస్తువైవిధ్యం చూస్తే ఆశ్చర్యం

అనిపిస్తుంది. ఎన్ని అంశాలమీద రాశాడో, ఎన్ని రకాల సమస్యలమీద, ప్రజలమీద, ప్రజా శ్రేణుల మీద రాశాడో చూస్తే అతనికి సమాజం పట్ల, మొత్తం ప్రజల పట్ల ఉన్న ఆత్మీయ అనుబంధం స్పష్టం అవుతుంది. ఇన్ని విషయాలపై తెలుగులో రాసిన కవులు చాలా తక్కువ. వారిలో వరవరరావు అగ్రగణ్యుడు. మహాకవి అనే పదబంధం పట్ల వరవరరావుకు కొన్ని రిజర్వేషన్స్ ఉన్నాయి. ప్రజాకవి, విప్లవకవి అనే పదబంధాలను ఎక్కువ ఇష్టపడతాడు. ఐనప్పటికీ వరవరరావు మహాకవి కాకుండాపోడు. మహాకవి లక్షణాల కన్న అదనపు యోగ్యతలు ఎన్నో వరవరరావు సామాజిక ఆచరణలో చూడవచ్చు.

వరవరరావు రాసిన కవితావస్తువుల లిస్టు పరిశీలిస్తే దానికదే వస్తువైవిధ్యాన్ని, శిల్పావైవిధ్యాన్ని స్పష్టం చేస్తుంది. అవి 1.పిల్లల గురించి, బిడ్డల శిక్షణ గురించి, ప్రి స్కూలు పనుల గురించి 2.విద్యార్థుల గురించి 3.యువకుల గురించి 4.బాలికల గురించి, స్త్రీల గురించి 5.ఉపాధ్యాయ ఉద్యోగుల గురించి 6.కార్మికుల గురించి, సింగరేణి, బొంబాయి, సూరత్ కార్మికుల గురించి 7.రైతుల గురించి, రైతు కూలీల గురించి 8.మేధావుల గురించి, విద్యావంతుల గురించి 9.కవులు, కళాకారులు, రచయితల గురించి, తెలంగాణ గురించి 10.స్నేహితులు, స్నేహం గురించి, 11.ముస్లింల గురించి, మైనారిటీల గురించి 12.సహచరుల గురించి, అనుచరుల గురించి 13.ఆత్మీయుల గురించి 14.ప్రేమ గురించి 15.హిందూ మత తత్వం గురించి 16.కుల సమస్య గురించి, కుల నిర్మూలన గురించి, కుల వృత్తుల గురించి 17.కుహనా మెరిట్‌వాదాల గురించి 18.కార్మికవర్గ దృక్పథం గురించి 19.పాలకవర్గాలు చేసే 'అభివృద్ధి' గురించి 20.జాతుల సమస్య గురించి 21.భాషా సమస్య గురించి 22.జైలు గురించి, స్కూలు కూడా ఒక జైలే గురించి 23.భార్య, జీవన సహచరుల గురించి, మనవల గురించి 24.ద్వేషం, అసూయ గురించి 25.యుద్ధం గురించి, శాంతి చర్చల గురించి 26.చరిత్ర గురించి, చరిత్ర పరిణామాల గురించి 27.కథల గురించి 28.నదుల గురించి 29.నోస్టాలియా గురించి 30.ప్రకృతి గురించి, పర్యావరణం గురించి 31.భూత దయ గురించి 32. స్వార్థం గురించి, 33.త్యాగం గురించి 34.కవిత్వం గురించి, సాహిత్యం గురించి 35.విజన్ 2020 గురించి 36.రామోజీ ఫిల్మ్ సిటీ గురించి 37.ఎన్నికల గురించి 38.ప్రజాదీవెన, జన్మభూమి గురించి 39.అమరుల గురించి, అమరత్వం గురించి, ఎన్‌కౌంటర్ల గురించి 40.సముద్రం గురించి, మూడు సముద్రాలు కలిసిన కన్యాకుమారి గురించి 41.సరుకుల గురించి, సరుకుల వాహనం గురించి 42.బర్డ్‌ఫ్లూ గురించి 43.సామ్రాజ్యవాదం గురించి, టెర్రరిజం గురించి 44.జమ్మిచెట్టు గురించి, క్రిస్మస్ గురించి 45.సూఫీతత్వం గురించి 46.సూర్యుని గురించి, చంద్రుడు, వెన్నెల, చీకటి గురించి 47.ఆనందాల గురించి 48.విషాదాల గురించి 49.ప్రజల గురించి, గ్రామీణుల గురించి, పట్టణ పేదల గురించి 50.విప్లవించే ప్రజల గురించి 51.వర్తమానం గురించి, రేపటి ఆశ, ఆత్మవిశ్వాసం గురించి 52.ప్రపంచ కార్మికవర్గ అంతిమ విజయం పట్ల అచంచల విశ్వాసం గురించి.

ఈ కవి కవితల్లో శబ్దమాధుర్యం, లయాత్మకత, గంభీరత, లాలన, పదలాలిత్యం, వీరరసం, బీభత్స రసం, కరుణ రసం, ప్రశ్న, జవాబును ప్రశ్నించకుండా వుండే తత్వం కనబడతాయి.

అనేక సన్నివేశాలను సృష్టిస్తాడు. 'జ్ఞాపకాల మునికాళ్లపై నిలబడి వర్తమాన ఏకాంతం నుంచి స్వప్న భవిష్యతులోకి చూస్తూంటే ప్రేమ' అంటాడు. జ్ఞాపకాల మునిగాళ్లపై నిలబడి భవిష్యత్తులోకి తొంగిచూడ్డం ద్వారా కవి భావానికి ఒక సన్నివేశాన్ని సృష్టించాడు.

కావ్యానుశీలన కవి హృదయాన్ని ఆవిష్కరించాలి. కొన్నిసార్లు కవి హృదయావిష్కరణ సాధ్యం కాకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో కనీసం కావ్య వస్తువు, శిల్పం విశిష్టతనైనా ఆవిష్కరించాలి. కొంతమంది కవి హృదయాన్ని ఆవిష్కరించే బదులు తన హృదయాన్ని ఆవిష్కరించి కవిని కనుమరుగు చేస్తారు. లేదా కవిపై స్వారీ చేస్తారు.

4

వర్తమాన చరిత్రకారుడిగా కవి

వరవరరావు కవిత్వంలో కేవలం విప్లవ భావజాలం ఉందనుకోవడం పొరపాటు. అతని కవిత్వంలో పరిశీలిస్తూ పోతే సామాజిక పరిణామాల సమగ్ర స్వరూపం మన కళ్లకు కడుతుంది. ఈ కవి సామాజిక పరిణామాల్లో చారిత్రక వాస్తవంగా ప్రాధాన్యత సంతరించుకునే ఏ సన్నివేశాన్ని, ఏ సంఘటనను కవితావస్తువుగా తీసుకోకుండా వదల్లేదని గమనించినపుడు ఆశ్చర్యం కలుగుతుంది. ఆనందం కలుగుతుంది. నిరంతరం కవిగా జీవించినపుడే ఇది సాధ్యం.

కవి సామాజిక ఆచరణలోని వైవిధ్యం, విస్తరణ

అయితే వరవరరావుకు కవిత్వం ఒక్కటే సర్వస్వం కాదు. ప్రజల కోసం సామాజిక పరివర్తన కోసం ప్రసంగాలు, చర్చలు, పత్రికా ప్రకటనలు, ప్రజల మధ్య వైరుధ్యాల పరిష్కారం, విశాల ప్రజా ఐక్య సంఘటన నిర్మాణం, నిర్బంధాల నుండి జాగ్రత్తలు తీసుకోవడం, కలిసినవారిని కవులుగా, రచయితలుగా ప్రోత్సహించడం, ముందుమాటలు రాయడం, అరెస్టు అయిన విప్లవకారులు, విప్లవ అభిమానులు ఎన్‌కౌంటర్ పేరిట చంపబడకుండా కాపాడ్డంకోసం ఆరాటం, పోరాటం మొదలైన ఎన్నో కార్యక్రమాలతో ఎడతెగని పనుల్లో నిమగ్నమైన కవి. అతని మాటల్లోనే చెప్పాలంటే అతనొక అలసట యెరుగని బాటసారి.

అలాంటి కవి ఇన్ని విషయాలను కవితావస్తువులుగా స్వీకరిస్తే కేవలం కవిత్వమొకటే సామాజిక ఆచరణగా పరిమితమైన కవులు మరెన్ని రెట్లు కవితావస్తువులను స్వీకరించాలో! కాని పని ఎక్కువ ఉన్నప్పుడే ఎక్కువ పనులు చేయడం సాధ్యపడుతుంది. పనులు చేయనివారు, పనిలేనివాళ్లు ఎక్కువ కవిత్వం రాస్తారనుకోవడం పొరపాటు. వాళ్లు లేజీగా మారిపోతుంటారు. పనిలో కాకుండా వాళ్లు లేజీల్లోనే ఆనందాన్ని పొందుతుంటారు. అందువల్ల అలాంటివాళ్లు ఎక్కువ సాహిత్యాన్ని సృష్టించలేరు. ఒక నిబద్ధత, నిమగ్నత, చిత్తశుద్ధి, సుదీర్ఘ లక్ష్యం, ధ్యేయం ఉన్నవారే నిరంతరం సమాజాన్ని దాని సమస్త కోణాలను సాహిత్యంలో నిక్షిప్తం చేస్తారు. అలాంటివారిలో వరవరరావు అగ్రగణ్యులు.

40 ఏళ్ల సామాజిక ఆచరణలో కవి

40 ఏళ్లుగా కవిత్వంలో, సామాజిక జీవితంలో, నిర్బంధంలో, నిత్య జీవితంలో ఎప్పుడూ సాహిత్యంలో సమాజాన్ని నిక్షిప్తం చేస్తూ, సమాజంలో సాహిత్య వస్తువును దర్శిస్తూనే వున్నాడు. విప్లవ రచయితల సంఘం నిర్మాతల్లో ఒకరుగా రచయితలను ఎదిగించే కర్తవ్యం కూడా 35 ఏళ్లుగా నిర్వర్తిస్తున్న వరవరరావు సామాజిక ఆచరణలో ఎవరికైనా ఆదర్శమే. భిన్నాభిప్రాయాలు గల సాహిత్యకారులు కూడా ఆదర్శంగా తీసుకోవాల్సిన మూర్తిమత్వం, వ్యక్తిత్వం వరవరరావుది. వరవరరావు వ్యక్తిత్వం కూడా కవిత్వంలో వ్యక్తం కావడం చూడవచ్చు.

ప్రజలనుండి తెలుసుకుని ప్రజలను చైతన్యవంతం చేసే కవి

ప్రజలనుండి గ్రహించింది ప్రజలకు అందించాలన్న లక్ష్యం, చిత్తశుద్ధి గల కవి ప్రజల మధ్య జీవిస్తుంటాడు. ప్రజలకోసం జీవిస్తుంటాడు. నూతన మానవీయ విలువల ఆవిష్కరణ కోసం, నూతన మానవీయ సంబంధాల సృజన కోసం పనిచేస్తుంటాడు. వాస్తవాలు తర్కం వల్ల కాకుండా వాటి అంతర్లీనంగా వున్న సత్యం వల్ల రుజువైనపుడు ప్రజలు తప్పకుండా స్వీకరిస్తారు. సాహిత్యం ద్వారా ఈ పని చేయడం ద్వారా ప్రజలపై దృక్పథాన్ని రుద్దకుండానే ఒప్పించడం, మెప్పించడం సాధ్యపడుతుంది.

మానవసంబంధాల్లో చరిత్ర నిక్షిప్తంచేసిన కవి

వరవరరావు 'భూమితో మాట్లాడు' వ్యాస సంపుటిలో ఇలా ప్రశ్నిస్తాడు - 'మనకు చరిత్ర ఏది? చరిత్ర నిర్మించేవాళ్లు చరిత్రను అల్లగలరు గానీ రాయలేరు. మనకు వెనుకట పుక్కిటిపురాణం తెలుసు. ఇప్పుడు చరిత్ర రచన తెలుసు. చరిత్రను చేతులతో అల్లుతారని తెలియదు. చెప్పులకు నగిషీలు అల్లినట్లు, వస్త్రాలకు పోగులల్లినట్లు, బుట్టలు, తట్టలు అల్లినట్లు, పూలు అల్లినట్లు చరిత్రను అల్లుతారని తెలియదు. అందుకే మనం జానపదుడు అల్లే పాటను, కవి కట్టే పాటను - కవిత్వంలో, సాహిత్యంలో చేర్చలేదు. చరిత్ర రచనలోకి అల్లికచరిత్ర అక్షరబద్ధం కా`ముందే అది ఎన్నిమార్లు విధ్వంసం చేయబడింది.' అందుకని ప్రజల చరిత్రను తానైనా రికార్డు చేయాలని ఎన్నో కవితలు రాశాడు. అమరులైనవారి స్మృతి కవితల రూపంలో ఎంతో సామాజిక చరిత్ర, పరిణామం రికార్డు చేశాడు.

ఉదా॥కు ఈ కవిత చూద్దాం. మనిషితో పరిచయం ఎలా ఏర్పడిందో చెప్పడం ప్రారంభించి ఎలా కనుమరుగైందో మొత్తం పరిణామాన్ని జీవిత చరిత్రంత స్పష్టంగా కథనీకరించాడు.

'మా ఇంట్లోకి అచ్చంగా ఒక నర్స్‌లాగే వచ్చావు / బిడ్డవూ చెల్లెవూ అక్కవూ స్నేహానివీ అయి / నువు లేకపోతే ఇల్లు చిన్నబోయేలా చేసావు'... 'అభాగ్యజీవుల భాగ్యయుగానికి పిలిచిన / సుత్తీకొడవలి జెండాను / గుండెలకు హత్తుకొని వెళ్ళిపోయావు'... 'ఉసూరుమనే ఒంటరితనాలు ఎక్కువ / పనులు సరే ప్రజాసేవలోని రిస్క్ వల్ల / ఛాలెంజింగ్‌గా వుంటాయి'... 'మనం అయ్యీ కాని జీవితాల్లోని ఏకాంతాలు / ఎవరికీ చెప్పుకోరానివి'... 'నా దాకా రాకుండా నువు చెప్పిన ఎన్ని అనుభవాలు / చరిత్ర నిర్మించే అచారిత్రక వ్యక్తుల / అవ్యక్త కళాఖండాలుగానే కాలగర్భంలో కలిసిపోతాయో'... తిరిగి ఆశావాదంతో ఇలా అంటాడు కవి - 'దహనమవుతున్న స్వప్నాలు / సత్యాలుగా చిగురించే సమయం ఆసన్నమవుతోంది' అని చిత్రించడంలో ఒక సామాజిక చరిత్ర మానవ సంబంధాలలోని అనుబంధాలు రికార్డు చేశాడు.

5

ఒక అనుబంధాల ఆర్ద్ర కవిగా వరవరరావు

వరవరరావులో మరో కవి కూడా వున్నాడు. అతనిలో మానవీయ అనుబంధాల స్పర్శ వుంటుంది. అసలు వాటికోసమే అతడు విప్లవకవిగా మారాడు. ఈ కవి స్నేహంలో, విప్లవ సాహచర్యంలో సామాజిక సంఘటనల్లో కవి మానవీయ స్పర్శతో చలించిపోతాడు. కరిగిపోతాడు. కన్నీరైపోతాడు. కర్తవ్యంతో ఉత్తేజితుడైపోతాడు. నిరాశలోనూ, రేపటి ఆశల గురించి స్వప్నాలను కంటాడు. మనిషిలోని లక్ష్యం, ధ్యేయం తాలూకు ఆత్మవిశ్వాసాన్ని అపూర్వంగా నిలబెడతాడు. ఒక కవి ఒక కవిత్వం ఇంతకన్నా గొప్పగా చేయగలిగే కర్తవ్యం ఏముంటుంది?

మానవసంబంధాల పట్ల ప్రేమ

వరవరరావు తన కవిత్వంలో మానవాళిపట్ల, మానవ సంబంధాల పట్ల, స్త్రీల పట్ల, శ్రామిక కులాల అణిచివేత పట్ల, కుటుంబం పట్ల, వరదలు, కరవులు, హైదరాబాద్ నగరం పట్ల, వృత్తులు కోల్పోవడం పట్ల ఆర్ద్రంగా స్పందిస్తాడు. 'ఆత్మాశ్రయ' కవిత్వంలోనూ కవి ప్రపంచ మానవునికి ప్రతీకగా నిలుస్తాడు.

ప్రపంచం అతని కవితావస్తువు

వరవరరావు కవిత్వంలోని కవితావస్తువు విస్తారమైనది. ప్రపంచం అతని కవితావస్తువు. ప్రాదేశికతతో, స్థానిక, దేశీయ, కుటుంబపరమైన, ఆత్మీయపరమైన అంశాలతోపాటు అంతే ఆర్ద్రతగా కవితావస్తువుగా మార్చుకున్నాడు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పత్తి రైతుల ఆత్మహత్యలు, కుల అణిచివేత, మూఢవిశ్వాసాలు మొదలైనవి కూడా ఈ కవి కవితావస్తువు లయ్యాయి.

కవిలోని ఒక ప్రకృతి ప్రేమికుడు

వరవరరావులో ఒక ప్రకృతి ప్రేమికుడున్నాడు. అలాగే అతడు కలలు కనే హృదయంవున్న కవిగా దర్శనం ఇస్తూనే వుంటాడు. ప్రకృతి వర్ణనను ఈ కవి తన కవితావస్తువులో స్వీకరించే తీరు విశిష్టమైనది. మనిషికి ప్రకృతికి మధ్య వుండే అనుబంధాన్ని సహజాలంకారంతో అనుసంధానిస్తాడు. విప్లవ పరిణామాలతో సమన్వయిస్తాడు.

అభివృద్ధి పేరిట ప్రజల ఇళ్లను కూల్చివేసే తీరు పట్టుకున్న కవి

ప్రభుత్వాలు అభివృద్ధి గురించి ప్రచారం చేస్తుంటాయి. ఈ

అభివృద్ధి ప్రజలదా, సంపన్నులదా, పారిశ్రామిక సరుకుల కోసమా అనేదాన్ని ఈ కవి స్పష్టం చేస్తాడు.

'అభివృద్ధి అనగా ఇళ్ళు కూల్చి రోడ్లు వేయుట' కవితలో 'కాలిబాట అయితే / ఇళ్ళ సందునుంచీ / ఊరి పనిగట్లనుంచీ / పొలంగట్లమీంచి / కంచెపక్కనుంచీ / కాలుచాపినంతదూరం సాగిపోతుంది'... రోడ్లమీద వాహనాలు తిరుగవెను / నేలమీదనే కదా వుండవలెను / అయినచో మనుషులు ఎక్కడ వుండవలెను / ఇళ్ళలో వుండవచ్చునా / రోడ్ల కోసం ఇళ్ళు కూల్చవలెనుగదా / ఇంకెక్కడ వుండవలెను'... 'మరి ఇళ్ళు కూలిన మనుషులేం కావాలి?'... 'మురికి మనుషులంతా / ఆకాశాన్నీ భూమినీ ముట్టడిచేసే / ఉసిళ్ళ పుట్టగా కదిలితే తప్ప / ఉనికి ఎలాగూ లేదు / ఇంక ఊపిరీ మిగలదు' అంటూ మనుషుల కోసం రోడ్లు తప్ప, రోడ్ల కోసం మనుషుల్ని తరిమేసే అమానుషత్వాన్ని ప్రశ్నిస్తాడు. ప్రజలు ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిస్తాడు. ఇది ప్రజల నిజమైన అభివృద్ధి కాదని స్పష్టం చేస్తాడు.

తాగునీరు సాగునీరు గురించి, నదుల గురించి పలవరించిన కవి

ఈ కవి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 35 ఏళ్ళుగా కాళోజీ, దాశరథి రంగాచార్య లాగే కలవరిస్తున్నాడు. ఉద్యమాలు చేయాలని ముందుకు వస్తున్నాడు. ప్రసంగాలు, కవితలు, నినాదాలు ఎన్నో చేశాడు. ఎన్నో వేదికలు ఎక్కాడు. ఇవాళ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఈ స్థాయికి రావడానికి రాళ్లెత్తిన కూలీల్లో ఈ ఒకరు.

అలాంటి ఆచరణలో భాగంగా కవి తెలంగాణ ప్రాంతం ఎండిపోవడానికి నదుల నీరును ఇతర ప్రాంతాలకు మళ్లించడం అని స్పష్టం చేస్తాడు. కరవు, పేదరికం మొదలైనవన్నీ పాలకవర్గాలు కావాలని తెలంగాణలో ఎలా సృష్టిస్తున్నాయో కవి స్పష్టం చేస్తాడు.

'గోదావరి దారి' కవితలో కవి ఇలా అంటాడు - 'అర్ధసత్యాలు కవితావేశంలో / అంచున వున్నవారికి అపూర్వంగానే గోచరిస్తాయి / త్యాగాలు చేయ(లే)ని ఒప్పులకుప్పలకు / తప్పులు భూతద్దంలో కనిపిస్తాయి'

'ప్రతి నీటిచుక్క పంటకాలువల్లోకి / ప్రతి నదీ ప్రాజెక్టుల్లోకి ప్రవహించక పోవచ్చు / పగుళ్ళువారిన నేల మాత్రం ఎక్కడ వున్నది / పాట ఊటలూరుతున్న / ప్రజల గుండెల పొరల్లోనే'... 'శుష్కించినపుడయినా / శ్రుతి మించినపుడయినా / కరువులోనూ వరదలోనూ / గోదావరి / దారిమాత్రం తప్పలేదు' అని తప్పు పాలకవర్గాలదే తప్ప, ప్రకృతిది కాదని స్పష్టం చేస్తాడు.

ప్రకృతిని ప్రేమించే కవి

నేను, వరవరరావు, తదితరులం కలిసి 1985లో విరసం, అఖిలభారత విప్లవ సాంస్కృతిక సమితి, రాడికల్ యువజన సంఘం, రాడికల్ విద్యార్థి సంఘం, అఖిలభారత విప్లవ విద్యార్థి సంఘం, రైతు కూలీ సంఘం మొదలైన ఏడు విప్లవ సంస్థల తరపున అఖిలభారత ప్రజా సమాచార సాంస్కృతిక పర్యటన చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజల పోరాటాలను, కళారూపాలను, ప్రభుత్వ దమనకాండను తెలుపుతూ పర్యటించినపుడు తమిళనాడులో కోయంబత్తూర్‌లో ఉన్నపుడు అక్కడికి కన్యాకుమారి చాలా దగ్గర అని తెలిసి వెళ్దామా అని అడిగాడు.

అప్పటికే తమిళనాడులోని 16 జిల్లాలలో కార్యక్రమాలు నిర్ణయించబడ్డాయి. తుపాన్, వర్షాలు మొదలయ్యాయి. నేను, కార్యక్రమాలు మిస్సవుతాయని కన్యాకుమారి వెళ్లడం వద్దన్నాను. ఎంతో ప్రాధేయపడ్డాడు. కాదన్నాను. చివరకు బి.ఎస్. నీకు కవిహృదయం లేదు, కన్యాకుమారి వద్ద ఒకేచోట సూర్యోదయం, సూర్యాస్తమయం జరుగుతుందట. చూస్తే బావుండేదని బాధపడ్డాడు. మేము వెళుతున్న ఊళ్లల్లో సరిగ్గా ఒక్కరోజు ఆలస్యంగా మావెంటే తుపాను, వర్షాలు పరుగెత్తుకొచ్చాయి. ఆరోజు కన్యాకుమారి వెళ్లివుంటే మొత్తం తమిళనాడు కార్యక్రమాలన్నీ రద్దయి వుండేవి. ఆ తరువాత మళ్లీ ఎప్పుడో కన్యాకుమారిని చూశాడు. కన్యాకుమారి నుండి తీసిన తాత్త్విక అంశం గొప్పది. మానవాళి అంతా ఒకటే అని ఈ సముద్రంలాగే కలిసివున్న మానవాళిని రకరకాల పేర్లతో పిలుచుకోవడం, గీతలు గీసుకోవడం జరుగుతున్నదని ఒక కొత్త అర్థంలో భావుకుడిగా అర్థం చేసుకున్నాడు.

'అగ్రాన నేను నిలబడినపుడు / అన్నివైపులా నీళ్ళు / జల కుతూహల బాలకుణ్ణయి / బొటనవేలిపై ఉత్కంఠ నిలిపి / దిక్కులన్నీ నిక్కి చూసినపుడూ నీళ్ళే'... 'నాభినుంచి నాలుక దాకా / నీలిమంటల నెత్తుటి అలల పాల నురగలయి / చెలియలి కట్టడిలో కరిగే దాక / అలల ఊడలు పట్టుకొని ఊగుతున్నట్లు / నేను భూమి గంధాన్నయి / రసానందాన్ని పంచుతున్నట్లు'... ఇక్కడ మూడు సముద్రాలు కలిసాయట / ఎక్కడనుంచి వచ్చి ఎక్కడ కలిసినట్లు / ఉన్నచోట వుండి కలుసుకున్న నీళ్ళకు / మనం ఎన్నుకున్న పేర్లు తప్ప'... మానవానుబంధాల్ని విడగొట్టే క్రమంలో / మనం గీసుకున్న గీతలు తప్ప'.

ఇలా ఈ కవి ప్రకృతిని వర్ణించే క్రమంలో మానవ సంబంధాలను చిత్రించిన తీరు అపూర్వం. మనుషులంతా ఒక్కటే అనే మాట చెప్పకనే చెప్పాడు.

6

యుద్ధంలో నిలబడ్డ కవికి ఇంట్లో వున్న కవికి తేడా వుంది

యుద్ధంలో ధర్మయుద్ధం అంటూ ఒకటి వుంది. గెరిల్లా యుద్ధం అంటూ మరొకటుంది. తక్కువ బలమున్నపుడు గెరిల్లా యుద్ధంతో పైచేయి సాధించడం కోసం ప్రయత్నిస్తారు. ఔరంగజేబును ఓడించడానికి గెరిల్లా యుద్ధతంత్రంతో శివాజీ ముప్పుతిప్పలు పెట్టాడు. తన మరాట్వాడా రాజ్యాన్ని స్థాపించాడు. అయితే ధర్మయుద్ధం కాకుండా అధర్మయుద్ధం సాగినపుడు కడుపులో చల్ల కదలని వారివలె నిండుగా మాట్లాడడం కుదరదని అంటాడు కవి. వుండాలని ఏడ్చేవారిని ఓదార్చే బదులుగా కవిత్వంలో శిల్పం వుండాలి అంటూ తప్పులు తీయడం కవిని బాధించింది. యుద్ధంలో నిలబడ్డ కవికి, ఇంట్లో వున్న కవికి జీవితంలో, దృక్పథంలో తేడా వుంటుంది. అవి వారి కవిత్వ వస్తువులోనూ, శిల్పంలోనూ ప్రతిఫలిస్తుంది. చక్కని శిల్పంతో సుతారంగా రాయాలని కొందరు

కోరవచ్చు. అలాంటి కవులను సంబోధిస్తూ ఇలా అంటాడు.

ఉన్నదేదో ఉన్నట్లు' కవితలో 'బరిగీసి నిల్చినపుడు / శుభ్రంగా వుండడమూ సాధ్యం కాదు. / నక్సల్బరీ చూసి నిలిచినపుడు / మర్యాదగా చెప్పడమూ సాధ్యం కాదు'... ఆరాటాన్ని పాడినంత తాత్వికంగా / ఆగ్రహాన్ని ట్యూన్ చేయడమూ భావ్యం కాదు... 'గాయాలు కడుగుతున్న చేతులూ / బాణాలు గురి పెడుతున్న చేతులూ / బాణీలు కడుతున్న చేతులూ / తడిసి తడిసి పచ్చి పుండ్లయ్యాయి / ఆచితూచి రక్తం కాయలయ్యాయి / ఆడి పాడి జనం జెండాలయ్యాయి'... శిలలో జీవం పోయడం కానీ / ఉలి పని జీవితాన్ని శిల్పంగా చెక్కడం కాదు'... ఉలికిపడకు ఉక్తి వైచిత్రీ / ఉన్నదేదో ఉన్నట్లు / హృదయానికి హత్తుకునేట్లు చెబ్దా!'

ఎంత గొప్ప మాట! సాహిత్య అలంకార శాస్త్రం శిలలో జీవం పోయడం. కాని జీవితాన్ని శిల్పంగా మార్చడం కాదు అనే మాట ప్రపంచంలోని సాహితీవేత్తలందరికీ వర్తించే మాట. వస్తువుకు జీవం పోయాలి. కాని జీవితాన్ని అందంగా నిర్జీవ శిల్పంగా చెక్కడం కాదు అనేది జీవితమంత సత్యం. ఇది సాహిత్య అలంకార శాస్త్ర తాత్వికతను, అంతిమ సారాంశాన్ని తెలుపుతుంది. విప్లవ సాహిత్య అలంకార శాస్త్రం కూడా ఇదే. విప్లవ చైనా, రష్యా దేశాల్లో వెల్లివిరిసిన సాహిత్య అలంకార శాస్త్రాలన్నీ ఇదే విషయం స్పష్టం చేస్తాయి.

గోర్కీ వాస్తవికత గురించి ఒక మాటంటాడు. వాస్తవాన్ని చిత్రించడంతో పాటు ఆ వాస్తవం ఎలా వుంటే బావుంటుందో కూడా చిత్రించాలంటాడు. అదే సోషలిస్టు వాస్తవికత అన్నాడు. అందువల్ల రచయిత ఎలా వుందో చిత్రించడంతోపాటు ఎలా వుంటే బావుంటుందో తెలిపే ఆదర్శ పాత్రలను, సన్నివేశాలను, సంఘటనలను, స్వభావాలను చిత్రించడం అవసరం. అలాంటి ఎన్నో ఆదర్శవంతమైన పాత్రలను, సన్నివేశాలను, సంఘటనలను ఈ కవి చిత్రించాడు. స్నేహితులను గుర్తు చేసుకున్నప్పుడు, విప్లవకారులు అమరులైనపుడు వారి ఆదర్శవంతమైన మానవ సంబంధాలను, అనుబంధాలను, సన్నివేశాలను కాల్పనికత లేకుండానే అంతకన్నా గొప్పగా చిత్రించడం ఈ కవి తాదాత్మ్యాన్ని తెలుపుతుంది.

'అనుబంధం' కవితలో ఇలా అంటాడు. 'అతడు గొప్పవాడని కాదు / అందగాడా, అదేమో గాని పక్షిరెక్కల వంటి పక్కవెంట్రుకల మధ్య / మెరిసే బట్టతల మీంచి దిగివస్తుందో / గుండెల నుంచి ప్రవహిస్తుందో / తెలంగాణ మీసాల చిరునవ్వు ఒక్కసారి నిను పలకరించిందంటే / తెలంగాణ రానీ ఇంక రాకపోనీ ఆ రూపం నిన్ను వదలదు' అంటూ అతని రూపును మనముందుంచుతాయి. ఆ తర్వాత అతని స్వభావాన్ని ఇలా రూపుకట్టిస్తాడు.

'ఆయన పిల్లలకు చారెడు చదువు / టీచర్లకు పీడితుల పట్ల దోసెడు సానుభూతి చాలనుకున్నాడు / ఇంకేం ప్రాజెక్టు రాదని తెలిసి / కరవు నోళ్లకిన్ని కృష్ణాజలాలను / కావడిమోసి అందించాలనుకున్నాడు'. ఆ తర్వాత అతని గురించి అనుబంధాన్ని, ఆత్మీయతను ఇలా తలపోస్తాడు. 'పాతికేళ్ల పరిచయంలో ఆయన పట్ల / నాకింత అనుబంధం ఏర్పడిందని నాకే తెలియదు' అంటాడు. దూరమైనపుడు అనుబంధాలు గుర్తుకు వస్తాయి. వాటి విలువ తెలుస్తుంది. నీళ్లే కదా అనుకోకు. ఒకరోజు లేకపోతే తెలుస్తుంది వాటి విలువ అంటాడు ఒక కవి. స్నేహాలూ అంతే. నీళ్లంత స్వచ్ఛంగా కలిసిపోతారు. ఒకటౌతారు.

ఇలా కవితలో మనిషి పరిచయం, స్వభావం, ఎదిగిన తీరు, తిరిగిన ప్రాంతం ప్రజల హృదయాల్లో, స్నేహితుల్లో సంపాదించుకున్న స్థానం, అతనితో కవికేర్పడిన అనుబంధం, అతను మరణించిన తీరు ఆ తర్వాత అతనితో గల స్నేహాన్ని గురించి 'ఆ స్నేహం ఇంక ప్రకటించి తీరుతాను' అని అనుబంధాల ఉద్వేగాన్ని స్పష్టం చేస్తాడు. చనిపోయిన విప్లవకారుల జీవిత పరిణామాల ద్వారా రాష్ట్రంలోని కనీసం 35 ఏళ్ల సామాజిక పరిణామాలను ప్రజల జీవితాల్లో వస్తున్న మార్పులను, చైతన్యాన్ని చిత్రించవచ్చు. ఎంతోమంది కథకులు కథలు, నవలల ద్వారా ఈ పరిణామాలను వేల పేజీల్లో చిత్రించేంత వస్తువు మిగిలివుంది. కవి కొంతలో కొంత తన వంతు కర్తవ్యంగా కవితల్లోకి మలిచాడు. అలాంటి కవితల్ని ఆసరా చేసుకుని తిరిగి నవలంత జీవితాన్ని చిత్రించడం అవసరం.

నాస్టాల్జియా అంటే బాల్య జ్ఞాపకాలేనా?

చాలామంది బాల్య జ్ఞాపకాల గురించి, గతం గురించి వలపోస్తుంటారు. ఈ కవికి కూడా ఎంతో నాస్టాలియా వుంది. ఆ నాస్టాలియాలోని మార్దవాన్ని, ఆనందాల్ని ఎవరు ఎత్తుకెళ్లారో కవి ప్రత్యేకత ఇక్కడ స్పష్టమౌతుంది.

'నాస్టాల్జియా' కవితలో 'గుండె పొర పొత్తిళ్ళలో / అనురాగ రక్తశ్వాసతో / పూరేకుల పాపను నేనే కాపాడానని / పొంగిపోతున్న వేళ / కిలకిల నవ్వి / సూర్యరశ్మి నుంచి వీస్తున్న గాలి నుంచి / చూపు తిప్పుకోలేదు పువ్వు'... 'శరీర ప్రవాహంలో కదిలే భావం వలె / సున్నిత తీరాలను తాకినపుడల్లా / బాధను గుర్తుచేస్తూ / బాధలోని ఉదాసీన మాధుర్యాన్ని చవిచూస్తూ / మిగిలేపోతుంది' అంటాడు.

వయసు పెరిగాక తాతలు చిన్నపిల్లల్లా మారిపోతారని అంటారు. మనవలతో ఆడుకోవడంలో తిరిగి కొత్త బాల్యాన్ని పొందుతారు. కొత్త బాల్యం తిరిగి అందరికీ అందుతుందా అని కవి ఆవేదన చెందుతాడు. అయితే ఈ కవిలో మనవడి లాంటి తాతయ్య కూడా వున్నాడు.

'కూల్చడానికే...' కవితలో తాతయ్యలోని మనవడిని గమనించవచ్చు. 'ఇల్లంత ఇరుకు గాదు / పిల్లలుకట్టే బొమ్మరిల్లు / గోడలుండవు గూడులా ఉంటుంది / చెట్టుకు పూగుత్తిలా వేళ్లాడే పిచ్చుకగూడులా'... 'వాగులోనయితే తానొక ప్రకృతి రూపమై / పాదం మీద కడతారు గూడు / నీళ్లొచ్చి విచ్చుకపోతే / ఇసుకలా ప్రవాహమైనందుకు / ఆనందంగా చప్పట్లు కొడతారు / కాగితప్పడవే కానీ కత్తిపడవే కానీ / విచ్చుకపోయినా / పూలు ప్రయాణం చేసే బరువుతో కొట్టుకపోయినా / దిగంతాల కలయిక దగ్గర చేరుతాయని / కేరింతలతో కళ్లు కవిచిప్పలు చేసి చూస్తారు'... అలాగే 'జిద్దుచేస్తే దెబ్బలని పసితనంలోనే తెలిసివచ్చిన వాళ్లు ప్రపంచంలో పిల్లలంతా అంటాడు. ఇలా మనవడితో పాటు జైలులో

వున్న కవి కూడా పసిపిల్లాడైపోతాడు.

అలాగే 'బిడ్డల శిక్షణ' ఎలా జరుగుతుందో వాపోతాడు. పిల్లలు నేటి పౌరలు... వాళ్లను తిట్టవచ్చు కొట్టవచ్చు వాళ్లముందు అబద్ధాలు ఆడవచ్చు'... అంటాడు కవి. ఎందుకట? భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి. ఎలాంటి పౌరులను తయారుచేయడానికి? 'కొందరు అధికారంతో... ఎందరో అణగారి' బతకడానికి అంటాడు. చివరి వాక్యాలతో మొదట చెప్పిన వాచ్యాన్ని వ్యంగ్యంగా మార్చిన క్రమం చూడవచ్చు.

స్కూలు కూడా జైలు వంటిదే అని చాలామంది తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు ఎన్నో విధాలుగా నిరూపించి వున్నారు. ఈ కవి జైలు, స్కూలు రెండూ ఒకటే అని రూపకాలంకారంతో సామాన్యీకరిస్తాడు. ఎందుకు అలా చెప్పాడు? ఎందుకంటే, 'స్కూలయినా జెయిలయినా / స్వేచ్ఛను బంధించడానికే' అంటాడు. 'రెండు చోట్లా మాటలు రానంత కాలమే ముద్దు / రెండుచోట్లా నడక నేర్వనంత దూరమే హద్దు' అనడం ద్వారా కవి సమాజాన్ని, స్కూలును, జైలును మూడూ ఒకటిగానే కన్పించే తీరును కూడా ధ్వనింపజేస్తాడు.

స్కూలు కెళ్తే జైలే కనుక స్కూలు కెళ్లకముందే బాల్యాన్ని హాయిగా ఎలా గడపాలో 'ప్రీ స్కూలు పనులు' కవితలో చెప్తాడు. 'ఎందుకంటే స్కూలుకు వెళ్తే ఈ మీ ఇష్టమైన పనులేవీ / ఇంక మిమ్మల్ని చేయనివ్వరు'. ఎలాంటి పనులు చేయాలి? 'ప్రతి ఉదయం నేస్తాన్ని కలిసేందుకు, ముస్తాబై కదిలాము, ఎవరాపినా ఆగము, ఇదే మాకు ఇష్టము మేఘముగా గర్జిస్తాం, వానల్లా కురుస్తాం, సూర్యునిలా మెరుస్తాం' అన్న మరో కవి కవితని పిల్లలకు మరి మరి గుర్తు చేస్తాడు. బాల్యం ఎలా స్కూలు పేరిట ధ్వంసం చేయబడుతున్నదో కవి అనేక కవితల్లో చిత్రిస్తాడు.

7

ప్రేమ గురించి కూడా విప్లవకవి రాయగలడు

ప్రేమ గురించి కూడా విప్లవకవి రాయగలడు. విప్లవకవికి ఏ వస్తువు నిషిద్ధం కాదు. ప్రతి వస్తువును తన దృక్పథంతో పరిశీలించి, విశ్లేషించి వైరుధ్యాలను, సమస్యలను, పరిష్కారాలను సూచించడం, అందుకు సహకరించడం విప్లవకవి కర్తవ్యం. అందువల్ల విప్లవకవికి ప్రేమ అనేది నిషిద్ధ కవితావస్తువు కాదు.

ప్రేమ గురించి వేల ఏళ్లుగా ఎందరో కవులు ఎన్నో భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రాస్తూనే వున్నారు. అయినా ఎంతో మిగిలిపోతూనే వుంది. జీవితం అంత కొత్తగా ప్రేమ గురించి కూడా స్పందనలు, సంవేదనలు నిరంతరం మనిషిలో పుడుతూ పెరుగుతూ వుండడమే అందుకు కారణం. తానున్న పరిస్థితుల్లో చంద్రుడు ఒకసారి చల్లగానూ, ఒకసారి వేడిగానూ కన్పిస్తాడు. ఈ కవి ప్రేమ గురించి ఎంత చక్కగా చిత్రించాడో చూడండి.

'ప్రేమ ఒక్కటే / నా రక్తంలో ఇంకొక ప్రాణమై / నా ఒంటరితనాన్ని పోగొడుతుంది / చూపయి చిరునవ్వయి నను చుట్టుకుంటుంది / మాటయి పనయి / మనసులో శూన్యాన్ని తోడేస్తుంది'... 'ప్రేమ ఒక జలపాతం కనుక / నాకు ప్రపంచం ఎప్పుడూ / వెలుగు దూకుతున్న సవ్వడిగానూ / నాకు జీవితం ఎప్పుడూ / కాంతులీనుతున్న దృశ్యంగానూ / నామీద నాకే ప్రేమ పొరలుతుంది / నా ప్రభావం మీద నాకు ప్రేమ కలుగుతుంది / నా భావనాప్రపంచమంతా ప్రేమయై / పరవశం చేస్తుంది' అని అంటాడు.

నా ప్రభావం మీద నాకు ప్రేమ కలగడం అంటే ఏమిటి? ఈ భావం అందడానికి కవి ప్రభావం అంటే ఏమిటో తెలియాలి. సామాజిక ఆచరణకు కవితావస్తువులు, శిల్పానికి గల సంబంధం ఇది. ఇది కవికి తన భావాలమీద, సిద్ధాంతాల మీద, సామాజిక ఆచరణ మీద అది సృష్టించిన సామాజిక ప్రభావం మీద గల ప్రేమ. అనగా తనను తాను ప్రేమించుకోవడంతో పాటు తన ప్రభావంతో సామాజిక ఆచరణలోకి వచ్చిన యువకిశోరాలమీద, తన శిష్యుల మీద, అనుచరుల మీద, సహచరుల మీద, సమకాలికుల మీద, ఉండే వాత్సల్యం, ప్రేమ అది. ఏకాంతంలో కలిగే నిరాశలో తాను ఒంటరిని కానని వందల, వేల సమూహంగా విస్తరించి వున్నానని తన వీపును ఆత్మవిశ్వాసంతో తానే ధైర్యంగా ఒప్పుకోవడం.

వైరుధ్యాల వైచిత్రి

కవి పాత కథలను, సామెతలను తన కవితల్లో విస్తృతంగా ఉపయోగించాడు. పాత కథలను కొత్త కథలుగా పునర్నిర్మించాడు. మాయలఫకీరు ప్రాణం చిలకలో వుంది అనే మాట జానపద పిల్లల కథల్లో చాలాసార్లు వస్తూ వుంటుంది. మాయలఫకీరును చంపాలంటే చిలకను చంపకతప్పదు అనేది పాత కథ. దాన్నే మరింత ఆకర్షణీయంగా భూతదయ ఉన్నప్పటికీ తప్పలేదని చెప్పిన తీరు ఆసక్తికరమైనది.

'భూత దయ' కవితలో 'నాకు చిలకంటే ఎంతో ఇష్టం / అందచందాల చిలక / చిలుక పలుకుల చిలక / చెప్పిందల్లా ఒప్పజెప్పే చిలక... కాని ఏం చేసేది / మాయలఫకీరు ప్రాణం / చిలకలో వుందట!' అంటాడు కవి.

8

దేవుడికి మనుషుల సాయం అవసరమా అని ప్రశ్నించే కవి

దేవుళ్ల పేరిట ఆరెస్సెస్, బిజెపి, హిందూత్వ వాదులు బ్రాహ్మణవాద రాజకీయాలను చేస్తున్నారని కవి పలుచోట్ల స్పష్టం చేస్తాడు. 1980 నుండి కవి ఈ విషయంలో తన వ్యతిరేకతను ప్రకటిస్తూనే వున్నాడు. వాళ్ల మొత్తం హిందూ సమాజానికి ప్రతినిధులుగా ఫోజుకొట్టడంలోనే కుట్రవుందని కవి స్పష్టం చేస్తాడు. చరిత్రలో జరిగిపోయిన మత యుద్ధాలను మారిపోయిన జైన, బౌద్ధ, ఆరామాలు, మందిరాలను గుర్తు చేస్తాడు. హిందూ దేవాలయాలుగా మార్చబడిన వాటన్నిటినీ తిరిగి పూర్వస్థితికి తీసుకువస్తారా అని ప్రశ్నిస్తాడు.

'అయోధ్య రామా! సయోధ్యకు రామా?' కవితలో 'రాముడా / నువ్వు దేవునివేమో / సర్వాంతర్యామివేమో / ... మందిరంలోనే కాని / మసీదులో లేవా?... బౌద్ధారామాలు జైనమందిరాలు / హిందూ దేవాలయాలు కాగా లేంది / భైరవుని కొండ / పద్మాక్షమ్మ

గుడిగా కళ్ళ ముందుంది'... నీ నామ స్పర్శతో శిల / ప్రాణాలు బలిగొంటున్నది మాత్రం పచ్చినిజం'.

రామాయణం రాసిన వాల్మీకి కవి వేటగాడి బాణంతో పడిపోయిన పక్షి పట్ల విలపించడంతో బాధపడ్డాడు. దాంతో రామాయణం రాస్తాడు. అంత చిన్న విషయానికి స్పందించి రాసిన రామాయణం యివాళ కోట్లాది హృదయాలను గాయపరుస్తూ, వందలాది మంది హత్యాకాండకు, మతకలహాలకు కారణం ఎలా అయింది అని ప్రశ్నిస్తాడు.

'భరతుని పట్నం' కవితలో కవి రామాయణం రాసిన వాల్మీకిని సంబోధిస్తూ ఇలా అంటాడు - 'కవీ నిషాదుణ్ణయితే పక్షనయినా చంపొద్దన్నావు కానీ / నీ దేవుడు అవతారమెత్తక ముందునుంచీ / చాలించి చాలకాలమయ్యాక కూడ / ఎందర్ని బలిగొంటున్నాడో చూడు'... 'అయోధ్యలో రామ్‌లల్లాను / అక్కడే ఎందుకు పుట్టించావో గానీ / దేవుడై వుంటే అంతటా వెతికేవాళ్ళం / మనిషయినా మనుషుల్లో తిరిగేవాడు / విగ్రహమై కదలలేక / విధ్వంసానికి కళ్ళు మూసుకున్నాడు' అని కవి ప్రకటిస్తాడు.

రాజకీయ అధికార పోరాటరూపాలను స్పష్టంచేసిన కవి

అలాగే మతకలహాల పేరిట జరిగేవన్నీ రాజకీయ అధికార పోరాటాలేనని స్పష్టం చేస్తాడు కవి. అది పాత నగరంలోని కలహాలైనా, సూరత్ కలహాలైనా నాయకుల మధ్య అధికారం కోసం జరిపే నరమేథమైనా మతకలహాల పేరును వాడుకుంటూ రంగు పులుముతారు అని నిలదీస్తాడు కవి. అవే పాలకవర్గాలు ప్రజలమీదికి మాత్రం సైన్యాన్ని పంపిస్తాడు అంటాడు.

'పజిల్' కవితలో 'చెన్నారెడ్డికీ జెన్నారెడ్డికీ చెయిర్ కోసం తగువయితే / అది హిందూ ముస్లిం మతఘర్షణవుతుంది / అది తీర్చడానికి / ఇండో టిబెటన్ బార్డర్ ఫోర్స్ వస్తుంది / నగరంలో ప్రజలమీద తుపాకులెక్కుపెట్టి / ఫ్లాగ్‌మార్చ్ చేస్తుంది / అధికార మార్పిడి జరుగుతుంది / సైన్యం ఆదిలాబాదు అడవుల్లోకి తరలుతుంది'... ఇండియా టిబెట్టు సరిహద్దు / ఉత్తరాన ఎక్కడో లేదు / ఉత్తర తెలంగాణాలోనే వుంది / దండెత్తి వచ్చేది విదేశాలు కాదు దండకారణ్యమే పీపీ!'

కవి నిరంతరం సమాజాన్ని సంబోధిస్తూనే వుండాలి. నిరంతరం చెప్తూనే వుండాలి. ఎలా? శంకరాచార్యున్ని ప్రశ్నించిన ఛండాలాచార్య, నక్కీరుని వలె సత్యాన్ని నిబ్బరంగా ప్రకటిస్తూనే వుండాలి అంటాడు.

'నేను చెప్తూనే ఉంటాను...' కవితలో 'అసురసంధ్య / సముద్రతీరాన నడుస్తూ అలవోకగా / అరచేతులు చూసుకున్నాను / అంటినది నెత్తురు కాజాలదు / సంధ్యార్ణవ రక్తారుణిమ'... నక్కీరుని నవ్వు అలలు అలలుగా వచ్చి / నా అడుగుల్ని తాకింది / కాళ్ళకింది ఇసుక తివాచీ మెత్తగా జారి / గుండె జల్లుమంది'... అట్టడుగు సముద్రం నుండి ఆల్చిప్పల్ని తీస్తున్న జాలరి / తన చెమట ప్రవాహాల్నించి ఈదుతున్నట్లున్నాడు / ఆల్చిప్పల్నించి ముత్యాలను కోస్తున్న మత్స్యకారుడు / తన గుండె కోసి ఆకాశంలో సూర్యుణ్ణి అమరుస్తున్నట్లున్నాడు'.

కవి తెలంగాణ పదాలను, నుడికారాలను కవి ఎంత చక్కగా కవిత్వీకరిస్తాడో ఆశ్చర్యంవేస్తుంది. 'గులేర్ దెబ్బలకు గువ్వలు కూలుతున్న' అనే వ్యక్తీకరణ గ్రామీణ జీవితం బాగా తెలిసినవారికే సాధ్యం. దాన్ని చెప్తూనే రెక్కలు విరిగినా తిరిగి లేచి నిలబడ్డ తీరును తెలిపి ఆత్మవిశ్వాసం కలిగిస్తాడు కవి. 'నేనొక పూలురాలుతున్న చెట్టునై నిలబడ్డాను / గులేర్ దెబ్బలకు గువ్వలు కూలుతున్న కొమ్మనయి' అంటాడు. 'నేనొక రెమ్మవేస్తున్న వసంతాన్నయి తేరుకున్నాను' అంటాడు.

కవి విప్లవంలో భాగంగా కులసమస్యలను పట్టించుకున్న తీరు

ఈ కవి 'భూమితో మాట్లాడు' వ్యాస సంపుటిలో ఇలా అంటాడు - 'ఇంతవరకూ జరిగిన ప్రపంచ విప్లవాల్లో లేని అంశంగా భారతీయ సమాజాల్లో కులసమస్య అదనంగా పరిష్కరింపబడవలసిన వైరుధ్యమని శ్రామికవర్గ రాజకీయాలు గుర్తించాలి. ఇది కుల, వర్గ పోరాటాల చరిత్ర. అస్పృశ్యత, సాంఘిక అసమానత, వెట్టిచాకిరీ, కులవృత్తుల పట్ల చిన్నచూపు వంటి అంశాలను ప్రత్యేకంగా పరిష్కరిస్తూ అందరి సమస్యలను వర్గపోరాటంలో సంలీనం చేసి సంఘటితం చేసి పరిష్కరించే క్రమంలో ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం నిర్వహించబడాలి. కులనిర్మూలనా పోరాటం దోపిడీవర్గాల పీడన నిర్మూలనమయ్యే వర్గపోరాటంలో సంలీనమై సాగాలి.'

"నువు శంకరునివయితే నేను సంగముణ్ణి - ఆల్చిప్ప కోసి ముత్యాలు తీసేవాణ్ణి." 'నీ కులమేది?' అని శంకరుడడిగితే చెప్పాడట నక్కీరుడు. క్రీస్తుకన్నా ముందు సంగమవంశ రాజపాలన కాలంలో "శివుడు మూడో కన్ను తెరచినా నేను చెప్తూనే వుంటాను" అని తమిళ ప్రజాగాథల్లో దేవుణ్ణి ధిక్కరించిన ధీరుడు.

"మే మే రాజుకూ, రాజ్యానికీ పౌరులం కాము, మృత్యుదేవత యమునికి మేం భయపడం" అని ప్రకటించిన మరో ధీరుడు మాణిక్యవాసిగర్.

9

స్నేహం, ఆత్మీయతల గురించి

స్నేహంలో చాలా విషయాలు అంతర్లీనంగా ఉండిపోతాయి. వ్యక్తం చేయని అనుభూతులు, భావాలు ఎన్నో వుంటాయి. కలిసి జీవించే క్రమంలో అవి స్నేహితుల మధ్య కనిపించని బంధాలను, అనుబంధాలను కలనేస్తాయి. కలిసిపనిచేసే క్రమంలో అవి వ్యక్తం కావు. స్నేహంలో ఒక మలుపు వచ్చినప్పుడో, దూరమైనప్పుడో ఏకాంతంలో గుర్తుచేసుకుంటే స్నేహితులు వేసిన ప్రభావం స్నేహం వేసే బంధం అకస్మాత్తుగా అవ్యక్తం నుండి వ్యక్తం అవుతుంది. సమ వయస్కుల పట్లనే ఇలా వున్నప్పుడు యువ స్నేహితుల పట్ల స్నేహంతో పాటు కొనసాగే వాత్సల్యం ప్రేమను కనపడనీయదు. అలిశెట్టి ప్రభాకర్, రియాజ్, పులి అంజయ్య, నల్ల ఆదిరెడ్డి, లింగమూర్తి, మధుసూదనరాజ్ ...

ఇలా ఎందరో తన భావాలతో ప్రభావితులైనవాళ్లు తనముందే అమరులౌతుంటే కన్నతల్లికి తనముందే తన పిల్లలు పోతుంటే

కలిగే బాధ కలుగుతుంది. వరవరరావు విప్లవంలో ఎందరో విప్లవకారులకు కన్నతల్లి, కన్నతండ్రి. అతని బాధ మాటల్లో ఒక శాతం కూడా వ్యక్తమౌతుందా? కాదనే అనుకుంటాను. కొన్ని భావాలను వ్యక్తం చేసే భాష ఇప్పటికీ రూపొందలేదు. బాడీలాంగ్వేజ్ లేకుండా మనిషి భావంతో పాటు, హావభావాలతో నిలువెల్లా కదిలిపోకుండా లిపి, శబ్దం ఒకటే భావాన్ని అందించలేదు. అలాంటి భావాలు అదివరకే ఉన్నవారికి మాత్రమే అర్థమౌతాయి. స్పందిస్తారు.

అందువల్ల కన్నతల్లి కడుపుకోత కన్నతల్లికే తెలుసు అంటారు. వరవరరావు కడుపుకోత వరవరరావు వంటి వారికే తెలుసు. అయినా వ్యక్తం చేయలేని బాధను వ్యక్తం చేయడానికి చేసిన ప్రయత్నాలు ఎన్నో కవితల్లో కనపడతాయి. వాళ్లంతా కళ్లల్లో మెదిలి కళ్లు చెమర్చుతాయి. గుండె బరువెక్కుతుంది. అది అనుభవించినవారికే తెలుసు. అంగట్లో అవ్వా అని ఏడిస్తే ఎవరికి పుట్టినవ్ అని అడిగేవాళ్లు కూడా వుంటారు. నిర్దయ హృదయానికి ఎవరు ఏడిస్తేనేమి? కన్నీరు కారుతుందా? కళ్లు చెమర్చుతాయా? మనిషి చనిపోయినందుకు మనిషైనవారికి దుఃఖం వస్తుంది. బాధ కలుగుతుంది.

10

నిర్దిష్ట వస్తువును తాత్వీకరించిన కవి

ఈ కవి తీసుకున్న వస్తువు ద్వారా కొన్ని కవితలు ఆ యా నిర్దిష్ట అంశాల ఆసరాతో, ఆధారంతో, రూపంతో తాత్వీకరణను, సామాన్యీకరణను, సార్వజనీనతను సాధించిన తీరు రచయితలో అంతర్లీనంగా కొనసాగుతున్న తత్వవేత్తను తెలుపుతుంది. ఆ యా సన్నివేశాలను, సంఘటనలను, తత్వాన్ని, సారాన్ని, స్వభావాన్ని, అంతిమ ఫలితాన్ని తెలుపుతూ చిత్రీకరించే తీరు కవి తాత్విక గాఢతను, జీవితానుభవాల సాంద్రతను తెలుపుతుంది.

ఈ తాత్వీకరణలో మొత్తంగా తత్వశాస్త్ర పరిధిలోకి రావచ్చు, రాకపోవచ్చు. అవి అదివరకే సూత్రీకరించిన, విశదీకరించిన అంశాల విస్తరణ కావచ్చు, అన్వయం కావచ్చు. ఒకానొక అంశంలో స్వయంగా సత్యాన్ని చేరుకుంటూ సూత్రీకరించడం జరుగవచ్చు. ఇవన్నీ ఈ కవి కవిత్వంలో చూడవచ్చు. కొన్ని తాత్వీకరణలు కవిత్వ స్థాయిని మరింత పెంచుకుని సామెతలుగా, నుడికారాలుగా కొనసాగుతుంటాయి.

సామాజిక ఆచరణ, వస్తు శిల్పాల మధ్య సమన్వయం వల్ల పరిణతి

కవి కవిత్వంలో ఇంత పరిణతి కనపడ్డానికి కారణం వస్తురూపాల మధ్య ఐక్యత సాధించడం. ప్రాపంచిక దృక్పథంతో సమస్త వస్తు శిల్పాలను విశ్లేషించగలిగే చలనసూత్రాలను వెలికితీయగలిగే శక్తిసామర్థ్యాలను సాధించుకోవడం మరో కారణం. ఈ రెండు ముఖ్యాంశాలను సాధించలేకపోతే కవిలో, వస్తువులో, దృక్పథంలో, అన్వయంలో, చలనసూత్రాలను వెలికితీయడంలో వెనుకబడితే కవిత్వం విశ్లేషణ కొరవడి నినాదంలాగో, ప్రసంగంలాగో సభల్లో చదివే ఒక మేర కవిత్వంలాగో ఉండిపోతుంది. వాటి మధ్య వైరుధ్యం వస్తే కవి కవిత్వం ఫేడౌట్ అవుతాయి. కవిత్వం వెలసిపోతుంది. రంగు పోయిన బట్టలా, అరిగిపోయిన రికార్డులా కనపడుతుంది. వినపడుతుంది. ఈ కవి కవిత్వానికి ఈ బాల్య దశలన్నీ గడిచివచ్చిన పరిణతి, పరిమళం వస్తు శిల్పాల గాఢత ఎలా అబ్బిందో ఈ సంపుటాలు చదివితే తెలుస్తుంది.

ధ్వనిలో వస్తువు - వస్తువులో ధ్వని

ఈ కవి కొన్ని కవితల్లో చెప్పదలచుకున్నవన్నీ ధ్వనిగా ధ్వనిస్తాడు. ధ్వనిని స్పష్టం చేయడానికి పాఠకుడికి వ్యాఖ్యాత సాయం కావాలి. ఇలాంటి కవితల సార్వకాలీనత, సార్వజనీనత హెచ్చు. పాఠకుడిలో అనేక కొత్త భావాలు రేకెత్తడానికి కూడా స్ఫూర్తినిస్తాయి. ధ్వనిని వాచ్యం చేసి భావాన్ని స్పష్టంగా చెప్తే అర్థం చేసుకోవడానికి మరో మనిషి సాయం అవసరంలేదు. పాఠకుడే అర్థం చేసుకోగలడు.

వస్తువులో రసం

అయితే ధ్వని వాచ్యం అయినపుడు స్పష్టంగా చెప్పదలచుకున్నపుడు రసాన్ని, సెంటిమెంట్స్‌ని, సన్నివేశ చిత్రణను కవితలో కవి పండించవలసి వుంటుంది. వేమన, జాషువా, శ్రీశ్రీ దీన్ని సాధించారు. ఈ కవి కొన్ని కవితల్లో రసస్పష్టితో పాటు ధ్వనిని, ధ్వనితో పాటు రసస్పష్టిని, ఆర్ద్రతను సాధించాడు. అమరవీరుల గురించి, సన్నిహితుల గురించి రాసిన కవితల్లో ఈ శిల్పనైపుణ్యం చూడవచ్చు.

11

జీవితంలో సామాజిక చరిత్రను చిత్రించిన కవి

అలిశెట్టి ప్రభాకర్ 1980 నుండి విరసం సభ్యుడు. కరీంనగర్ జిల్లా విరసం యూనిట్ కన్వీనర్‌గా పనిచేశాడు. అధ్యయనం, అవగాహన లేని నేనెందుకు అని అన్నప్పటికీ అదే వస్తుందిలే అని విరసంలో చేర్పించాను. జీవితంలోని కొన్ని ఆటుపోట్ల వల్ల మనస్సు వికలమై ఆరోగ్యం చెడిపోయింది. 1982లో టీబీ అని తేలింది. సుమారు పదేళ్లపాటు కవిత్వంతోపాటు అతని భార్య భాగ్యంతో పాటు టీబీ కూడా అతనితో సహజీవనం చేసింది. మధ్యలో మందులు వాడకపోవడంవల్ల ఇచ్చే డోసు మరింత పెరిగి ఇంజెక్షన్లతో శరీరమంతా తూట్లు పడిపోయింది. దాన్ని కవి ఎలా అక్షరీకరించాడో చూడండి.

అలిశెట్టి - 'మృత్యువు దాడిచేసిన రాత్రి అక్షరాలకు జీవం పోస్తున్నాడు'... 'రాత్రి గడియారంలో కాలం నిలిచిపోయింది / రక్తం కక్కుకుని ప్రభాకర్ కన్నుమూసాడని / గాలిలో సగం తెగిన నరాల తరంగాల స్వరాలు'... కాలం నిలిచేమీ పోలేదు / నీ శవం దగ్గర కూడా గతమూ వర్తమానమూ ఘర్షణ పడి / నీ ఆశయ నినాదాలతో మేమే ముందుకు సాగాం / సూర్యుడు సంక్రాంతిలోకి పయనించాడు'... ఈ 'సంస్మరణ'లో కవి స్నేహాన్ని, ఆత్మీయతను తేనెలా పిండి పట్టినట్టుగా వుంటుంది ఈ కవిత.

'నీ శరీరమూ మనసూ అంతటా / ఇంక చోటులేకుండా గుచ్చుకున్న సూదుల్ని / నాకు కాలంగా మలచి యిచ్చావా నేస్తం'... అన్నీ మరచిపోతానయ్యా / మళ్ళీ నువు కళ్ళు తెరుస్తానంటే /

రాబోయే చారిత్రక సందర్భాలను ఇలా చూద్దాం

పాణి

కాల స్వభావాన్ని గుర్తించడమే అన్నిటికన్నా ముఖ్యమైన పని. అది రేపటికి, ఎల్లుండికి ఎలా పరిణమించబోతోందో తెలుసుకోవడం మార్క్సిస్టులకు మాత్రమే సాధ్యం. ఎప్పటికప్పుడు కంటికి కనిపించే రూపాల ఆధారంగా మాట్లాడేవాళ్లు, జోస్యాలు చెప్పేవాళ్లూ ఎలాగూ ఉంటారు. సమయానుకూలంగా మాట్లాడేవాళ్లూ, అంతా అయిపోయిందని, ఆనాటి వెలుగు జిలుగులు ఏమయ్యాయని, అన్నీ తప్పులే చేశామని వగచేవాళ్లు సరేసరి.

ఇవాళున్న ప్రత్యేక పరిస్థితుల్లో కూడా ఆశారేఖల వంటి ప్రజా పోరాటాలు, ఉద్యమ నిర్మాణాలు ఉన్నాయి. ఉదాహరణకు దండకారణ్య విప్లవోద్యమం అలాంటిది. ఇదేగాక అనేక ప్రజాస్వామిక ఆకాంక్షలపై తక్షణ ప్రతిస్పందనలు, ఊహించని ప్రజా వెల్లువలు ఎన్నో మన ముందుకు వస్తున్నాయి. ఈ వ్యవస్థ బాగాలేదని, ఇందులో ఇమిడలేమని, ఇంకేదో కావాలని కోరుకుంటున్న శక్తులు చాలా ఉన్నాయి. ఇవన్నీ ఒకే తలానికి చెందకపోవచ్చు. ఇప్పటికిప్పుడు ఇవన్నీ అలాంటి తలానికి చేరుకోకలేకపోవచ్చు. వాటికవిగానైనా ముందుకు సాగలేక మధ్యలోనే ఆగిపోయేవీ ఉండొచ్చు.

ఇలాంటి ప్రత్యేక పరిస్థితిని ఒక దీర్ఘ చారిత్రక అవధిలో గుర్తించడానికి, నిర్దిష్టంగా ఇప్పుడున్న సామాజిక స్థితికి అవసరమైన ఆలోచనలు, అన్వేషణలు, సంవాదాలు జరపడానికి తోడ్పడే అతి ముఖ్యమైన చారిత్రక సందర్భాలు రాబోతున్నాయి. అవి స్ఫూర్తిదాయకమైనవి కూడా. గతంలోకి జారిపోయిన ఆ ప్రజా విజయాలు, ఘటనలు లేదా సందర్భాలు మానవజాతి సుందర భవిష్యత్తు గురించి వర్తమానంలోనూ గొప్ప ఉత్తేజాన్ని అందిస్తాయి. చరిత్ర పొడవునా అవి అలాంటి అద్భుత పాత్ర తప్పక పోషించగలవు. భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోడానికి వాటి స్ఫూర్తేగాక, వాటి నిర్దిష్ట అధ్యయనం ఎంతగానో తోడ్పడుతుంది. అవి...

2016 మే నాటికి చైనా సాంస్కృతిక విప్లవానికి యాభై ఏళ్లు
2017 నవంబర్ నాటికి బోల్షివిక్ విప్లవానికి వందేళ్లు
2017 నాటికి నక్సల్బరీ ఉద్యమానికి 50 ఏళ్లు
2018 నాటికి మార్క్స్ 200 జయంతి
2020 ఏప్రిల్ నాటికి లెనిన్ 150 జయంతి
2020 జులై నాటికి విరసం యాభైఏళ్లు

ఈ వందేళ్లు, నూటాయాభై ఏళ్ల పండగలు ఏమిటని వెటకారాలు పోయే వింత జీవులు కూడా ఉంటారు. బొత్తిగా చరిత్రను ఎలా అర్థం చేసుకోవాలో తెలియనివాళ్ల మేధో రుగ్మత అది. వాళ్ల సంగతి అలా ఉంచితే.. వందేళ్లకు, యాభై ఏళ్లకు, జయంతులకు ఏ ప్రత్యేకతా లేదు. ఈ మాట ఎవరన్నా అంత వరకు సత్యమే. ఇవి కేవలం గుర్తించదగ్గ సందర్భాలు. అంతే. చరిత్రలోని ఒకప్పటి అద్భుత మానవ విజయాలు కాబట్టి కార్మిక వర్గ భవిష్యత్తు కోసం పని చేసే వారు వాటిని తప్పక గుర్తు చేసుకుంటారు. చైనా సాంస్కృతిక విప్లవం, రష్యన్ విప్లవం, చైనా విప్లవం, నక్సల్బరీ ప్రారంభంలాంటి వాటితోపాటు కార్మికవర్గ సిద్ధాంతకర్తలుగా కా. మార్క్స్ 200 జయంతి, కా. లెనిన్ నూట యాభైవ జయంతి కూడా అలాంటివే. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మరింత బలంగా ప్రచారం చేయడానికి వీటిని కూడా సందర్భంగా తీసుకొని పని చేయాలి.

ఈ సందర్భాలను కార్మిక వర్గ ప్రేమికులు గొప్పగా తలపోసుకుంటారు. స్ఫూర్తిదాయకమైన ఆ విజయాలను ప్రపంచ పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం ఎంత మూసి వేసినా వాటి వెలుగుబావుటాలను ఎత్తిపడుతూనే ఉంటారు. ఈ పని చేస్తూనే మొత్తంగా ఇలాంటి చారిత్రక సందర్భాల గురించి మనం మూడు ప్రాతిపదికలపై ఆలోచించాలి.

1. ఏ సామాజిక, రాజకీయార్థిక పరిస్థితుల్లో నిలబడి వాటి గురించి మాట్లాడుకుంటున్నాం?
2. ఎలాంటి సమాజాల్లో, ఏ చారిత్రక పరిస్థితుల్లో ఆ విప్లవాలు జరిగాయి?
3. ఇప్పుడు వాటిని ఎలా అర్థం చేసుకోవాలి?

పైన చెప్పిన చారిత్రక సందర్భాలను ఇలా చర్చ చేయడం వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది.

భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం విప్లవ శక్తులకు ఒక వింత సవాల్‌గా మారింది. అది చాలా సంక్లిష్టంగా తయారైంది. దాని నుంచి యాభై ఏళ్ల కింద విప్లవశక్తులు బయటికి వచ్చిన రోజుల్లో పార్లమెంట్ పందుల దొడ్డి, సొలెగూడు అనే ప్రతీకలు వాడారు. ఒక రాడికల్ రప్చర్ జరగడానికి ఆ భావనలు, వైఖరులు గొప్పగా

అరాచకత్వం మాని ఆరోగ్యం చూసుకుంటానంటే'... 'అది మరణశాసనం రాసిన మరుక్షణం నుంచీ / మీరు ఒక్క స్వప్నాన్నీ నిదుర పోనివ్వలేదు / ఒక్క సంఘర్షణనీ చల్లబడనివ్వలేదు / ఒక్క క్షణాన్నీ వృధా కానివ్వలేదు'... 'శత్రువు నీమీద దాడిచేయడానికి వచ్చిన రాత్రి / మండుతున్న నీ గుండెల్లో / నీ అస్థిపంజరాన్ని ఆయుధంగా మలుస్తున్నావని / తెలిసి కలిగిన ఆనందాశ్రువులే ఇవి.' ఇక్కడ శత్రువు అని ఉద్దేశించిన అర్థం ఎన్ని రకాలుగానైనా ఊహించుకోవచ్చు. ఈ కవితలో శత్రువు అనే పదం ఒక ధ్వని. తెలిసినవారికి తెలిసినంత ఊహించుకోవచ్చు.

(మిగతా వచ్చే సంచికలో..)

ఉపయోగపడ్డాయి. కానీ ఈ యాభై ఏళ్లలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వచ్చిన మార్పులను విశ్లేషించడానికి ఆ ప్రతీకలు మాత్రమే సరిపోవు. ముఖ్యంగా రష్యా, చైనా విప్లవాల గురించి మాట్లాడుకోబోతున్న ఈ తరుణంలో మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎలా పని చేస్తున్నదో తప్పక ఆలోచించాల్సి ఉంటుంది. ఆ దేశాల విప్లవ పార్టీల, ప్రజల అనుభవాల్లో లేని ఒక ప్రత్యేక పరిస్థితి ఇది. సోవియట్ విప్లవ కాలంనాటి డ్యూమాకంటే (అదెంత దుర్మార్గంగా నడిచిందో మనకు తెలుసు), నక్సల్బరీ కాలం నాటి భారత పార్లమెంటరీ విధానాని కంటే చాలా భిన్నంగా ఇవాళ పార్లమెంటరీ విధానం నడుస్తున్నది. సారాంశంలో బూటకపు ప్రజాస్వామ్యమనే సూత్రీకరణ రుజువు అవుతున్నది. అయితే దాని పని విధానంలో మార్పులు వచ్చాయి. దేశమంతా హిందూ ఫాసిజం ఎంతగా పెరిగిపోయిందో గత రెండేళ్లుగా చూస్తున్నాం. ఈ సమస్య చాలా కాలం నుంచే ఉన్నా ఈ రెండేళ్లలో మరింత తీవ్రమైంది. హిందూ ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావడంతో పార్లమెంటరీ విధానంలో మరింత సంక్లిష్టత పెరిగిపోయింది. నక్సల్బరీ ప్రారంభ రోజుల్లో కంటే భిన్నమైన కొత్త దోపిడీ సంబంధాలు, కొత్త దోపిడీ రూపాలు ముందుకు వచ్చాయి. పార్లమెంటరీ రాజకీయాలపట్ల అప్పట్లో ప్రజల విసుగు కనిపించేది. ఇక దాని వల్ల ఏమీ కాదని, విప్లవం చేయక తప్పదనే స్థూల వైఖరి సమాజంలో బలంగా ఉండేది. లేదా ఇప్పటితో పోల్చుకుంటే ఎక్కువగా ఉండేది. ఈ యాభై ఏళ్లలో ఈ వైఖరి బలహీనపడింది. వాస్తవానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అప్పటికంటే సారాంశంలో చాలా హీనంగా తయారైంది. నానాటికీ మరింత దుర్మార్గంగా తయారవుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చుట్టూ ప్రజలు సమీకృతం కావడమనే అతి ముఖ్యమైన పరిణామం జరిపోయింది. దీన్నంతా పాలకవర్గాల కుట్ర అని, ప్రజలను భ్రమల్లో ముంచడమని కూడా అనుకోవచ్చు. అదీ కొంచెం నిజమే. అయితే ఇంకా చాలా ఉంది.

ఇలాంటి బాదరబందీ లేని, ఇలా లేని సామాజిక, చారిత్రక స్థితిగతుల్లో అప్పటి ఆధిపత్య శక్తులతో తలపడి బోల్షివిక్ విప్లవం, చైనా విప్లవమనే అద్భుత విజయాలను కార్మికవర్గం సాధించింది. ఇప్పుడు మనమున్న ఈ ప్రత్యేక పరిస్థితుల్లో మనం ఆనాటి విజయాల స్ఫూర్తిని ఎత్తిపట్టి విప్లవ పథంలో ముందుకు పోవాల్సి ఉన్నది.

ఈ స్పష్టత లేకపోతే రష్యా, చైనా విప్లవాల గురించి అయినా, నక్సల్బరీ గురించి అయినా మాట్లాడటం ఆనవాయితీ అనిపించుకొనే ప్రమాదం ఉంటుంది. విప్లవకారులు గత చరిత్రకు సంబంధించిన ఇలాంటి విజయాలను పదే పదే గానం చేయవలసిందే. అయితే అందేదో ఆనవాయితీగా జరుగుతున్నదని పొరబాటున కూడా అనిపించకూడదు. దాని వల్ల ఇలాంటి గత చారిత్రక ఘటనల గురించి మాట్లాడటం ద్వారా మనం పొందాల్సిన ప్రయోజనం అరగొరగా మిగిలిపోతుంది. పైన చెప్పిన చారిత్రక సందర్భాలు గత శతాబ్దిలోని, లేదా దాని పూర్వ రంగంలోని విప్లవ వెల్లువలకు సంబంధించిన ఘట్టాలు. ఆ చరిత్రతో పోల్చితే పూర్తి భిన్నమైన ప్రపంచంలో నిలబడి మనం వాటి గురించి మాట్లాడబోతున్నాం. దీన్ని ఎంతగా గుర్తిస్తే అంతగా పైన చెప్పిన స్పష్టత వస్తుంది. అప్పుడు మాత్రమే అర్థవంతమైన అవగాహనతో వాటిని విశ్లేషించగలం. ప్రపంచ కార్మిక వర్గ విప్లవాల చరిత్రలో ఇవాళ మనం నిలబడి ఉన్న దశను గుర్తించడం వల్లే అంతక ముందటి దశకు సంబంధించిన ఈ విజయాల గురించి వర్తమాన అవసరాలు తీర్చేలా మాట్లాడగలం. ఈ పనికి ప్రచారం, విశ్లేషణ(పైన చెప్పిన గుర్తింపుతో) అనే పద్ధతులు ఉంటాయి. ఈ లక్ష్యం పట్ల స్పష్టత అవసరం.

* * *

మార్క్సిజానికి, వర్గపోరాటం, సోషలిజం గురించిన చర్చ, ప్రభావ ఆవరణ గత శతాబ్దంతో పోల్చితే ఇప్పుడు అలా లేదు. ఈ పరిస్థితుల్లో మనం పైన చెప్పుకున్న చారిత్రక సందర్భాలను ప్రచారం చేయవలసి ఉన్నది. ఆధునిక చరిత్రలో మనిషి సాధించిన ప్రగతిదాయకమైన అభివృద్ధినంతా పెట్టుబడిదారీ విధానం తన ఖాతాలో వేసుకుంది. ఆ దయ్యం వాటా దానికి ఇచ్చేస్తూనే దానితో ఘర్షణ పడే క్రమంలో కార్మికవర్గమే అసలు సిసలైన ప్రగతిని సాధించిందని మనం చెప్పాలి. ఆ కార్మిక వర్గ ఉద్యమాల నుంచి పుట్టి, సోషలిజమనే కలను నిజం చేయడానికి కార్మిక వర్గ సిద్ధాంతంగా మార్క్సిజం ముందుకు వచ్చిందని, వర్గాలు ఉన్నంత వరకు(సోషలిజంలో కూడా వర్గాలు ఉంటాయని, వర్గపోరాటం తప్పనిసరనే మావో అవగాహనతో గత సోషలిస్టు నిర్మాణ ప్రయత్నాల్లోని వర్గ సంఘర్షణను, ఆ తర్వాత తలెత్తిన వర్గ సామరస్య ధోరణిని కూడా వివరించవచ్చు. ఆ రెండు దశల్లో అక్కడ ఏం జరిగిందో, ఎందుకు అలా జరిగిందో చెప్పవచ్చు) మార్క్సిజమే శాస్త్రీయ సిద్ధాంతమని చెప్పడానికి ఇది మంచి సందర్భం. మార్క్స్ తర్వాత వచ్చిన ఇతర సిద్ధాంతాలు కూడా సమాజాన్ని, చరిత్రను ఏదో ఒక మేరకు విశ్లేషించేవేగాని, ఆయన కోరుకున్నట్లు చరిత్రను మార్చే పనికి దారి చూపేవి కావు (మార్పు అంటే విప్లవకర మార్పు. బూర్జువా మార్పుల కోసం చాలా సిద్ధాంతాలు ఉపయోగపడతాయి). అప్పటికీ ఇప్పటికీ మార్క్సిజం వల్లే మార్పును శాస్త్రీయంగా పరిశీలించగలమని, ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టులే దాన్ని ఆచరణలో పెడుతున్నారని చెప్పాలి. సారాంశంలో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని, సోషలిజాన్ని ప్రచారం చేయడానికి ఇది మంచి అవకాశం. అయితే ఆ పని ఎలా చేయాలనేదే ముఖ్యమైన ప్రశ్న. ఆ విప్లవం జరిగిన తీరు, అందులోని వర్గపోరాట తీక్షణత, అపారంగా ప్రజల త్యాగాలు, ఆ సమాజాన్ని కొత్త పునాది మీద పునర్నిర్మించడానికి ప్రయత్నించిన తీరు మొదలైనవన్నీ మళ్లీ మళ్లీ చెప్పవలసిందే. నిజానికి అదే ఒక ప్రధాన కర్తవ్యం. అయితే అది మాత్రమే సరిపోదు. ఆ విప్లవం, సోషలిస్టు ప్రయత్నాలు భౌతికంగా చరిత్రలో కలిసి పోయాక అవి ఎదుర్కొన్న ప్రశ్నలు, ఆరోపణలు, విమర్శలు, దాడులను గుర్తించి సరి కొత్తగా ఆనాడు జరిగిన ప్రయత్నాలను ఎలా పునర్దర్శించాలి? అనేది కూడా అంతే ప్రధానమవుతుంది.

బోల్షివిక్ విప్లవం-సోషలిజంపై వచ్చిన ప్రశ్నలు, సందేహాలు, చర్చలు అన్నీ శత్రువుల దుష్ప్రచారంగా, కుట్రగా కొట్టేయడానికి

లేదు. నిస్సందేహంగా అలాంటివే చాలా చాలా ఎక్కువ. వాటన్నిటికీ అక్కడి సోషలిజమే ఆనాడు సమాధానాలు చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది మార్క్సిస్టులు చెప్పారు. లెనిన్, స్టాలిన్‌ల వారసత్వాన్ని ప్రకటించుకొనే వారందరూ గతంలో వలె ఆ దుష్ప్రచారాలపై అదే దృఢమైన వైఖరి ఇప్పటికీ ప్రదర్శిస్తాం. సామ్రాజ్యవాదం సోషలిస్టు శిబిరాన్ని దెబ్బతీయడానికి ఎన్ని కుట్రలు పన్నిందో, ఎంత జుగుప్సాకరమైన, విషపూరితమైన ప్రచారం చేసి అవే నిజం అని నమ్మించేందుకు పడరానిపాట్లు పడిందో మళ్లీ సోదాహరణంగా ఈ సందర్భంలో కూడా చెప్పాల్సిందే.

దీని కోసం బోల్షివిక్ విప్లవం ఎలాంటి సమాజంలో జరిగింది? విప్లవ కార్యక్రమం ఎలా రూపొంది అమలైంది? సోషలిస్టు నిర్మాణ ప్రయత్నాలు ఎలాంటి ప్రత్యేక పరిస్థితుల్లో జరిగాయి? రివిజనిజం తలెత్తాక ఏం జరిగింది? అనే నాలుగు దశలుగా బోల్షివిక్ విప్లవ చరిత్రను పునఃపరిశీలించాలి. ఒక వ్యవసాయక, బలహీనమైన పెట్టుబడిదారీ దేశంలో విప్లవం జరిగి, సోషలిజం నిర్మించే ప్రయత్నంలో అక్కడ ఎదురైన సవాళ్లు, ఇబ్బందులు, ప్రత్యేకతలు ఏమిటో మనం గుర్తించవచ్చు. వాటిని వెలికి తీసి ఆ సోషలిజం లక్షణాలను విశ్లేషించాల్సి ఉంటుంది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో వచ్చిన మార్పులు, దాని మీద పెత్తనం చేస్తున్న సామ్రాజ్యవాదంలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకొని ఆ విప్లవాలను, సోషలిజాలను విశ్లేషించి భవిష్యత్ సోషలిజానికి అవి అందించే స్ఫూర్తిని ఎత్తిపట్టాలి. అంటే ఇరవైవ శతాబ్దంలోని విప్లవాలు, సోషలిస్టు నిర్మాణ ప్రయత్నాలు సజీవంగా మన కళ్లెదుట ఉనికిలో ఉన్న కాలంలో చేసిన వాదనకు.. అవి అనేక విజయాలు సాధించి చరిత్రలో కలిసిపోయాక వాటి గురించిన ప్రస్తుత వాదనకు ఒక ముఖ్యమైన తేదా ఉంటుంది. ఈ తేడాను గుర్తించేలా మన విశ్లేషణ ఉండాలి.

దీని వల్ల జరిగే మేలు ఏమంటే .. ఆ సోషలిస్టు ప్రయత్నాలు ఆర్థాంతరంగా వెనక్కి వెళ్లిపోవడానికి శత్రువుల దాడులు, స్వీయాత్మక శక్తుల పరిమితులతోపాటు అసలు ఏ సమాజాల్లో ఆ విప్లవాలు జరిగి సోషలిస్టు ప్రయత్నాలు జరిగాయి? ఏ చారిత్రక పరిస్థితుల్లో జరిగాయి? అందువల్లనే ఆ సోషలిస్టు నిర్మాణ క్రమాల్లో కొన్ని సమస్యలు ఎలా ముందుకు వచ్చాయి? అనే కోణంలో మన విశ్లేషణ సాగితే సోషలిజం పట్ల ఆసక్తి పెంచగలం. ముఖ్యంగా ఈ తరానికి సోషలిజం అంటే తెలియకపోగా, దాని పట్ల విముఖతను పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం పెంచాయి. విప్లవం, సోషలిజం అవుట్ డేటెడ్ అనే దుర్మార్గమైన ప్రచారం చేసింది. కొంచెం మెత్తగా మాట్లాడేవాళ్లయితే అవన్నీ ఆ రోజుల్లో సాధ్యమయ్యాయి గాని ఇప్పుడయ్యేవి కావని అంటారు. సోషలిజాన్ని నియంతృత్వమనే వాదన దగ్గరి నుంచి ఇక్కడి దాకా రకరకాల కారణాల వల్ల తప్పుడు అభిప్రాయాలు ఉన్నాయి. పైగా వాటి గురించి మాట్లాడితేనే రొడ్డకొట్టుడనే వెటకారం కూడా వింటుంటాం. సారాంశంలో ఇప్పుడు నడుస్తున్న విప్లవోద్యమాలతో నేరుగా సంబంధంలో ఉన్న వాళ్లను మినహాయిస్తే ఎంతో కొంత ప్రజాస్వామికంగా ఆలోచించే వాళ్ల మీద కూడా ఇలాంటి దురభిప్రాయాల ప్రభావం ఉన్నది. దీని వల్ల ఇప్పుడు సోషలిజం గురించిన ఆలోచనాధార బలహీనంగానే ఉన్నదని అంగీకరించాలి. ఇప్పుడు నడుస్తున్న విప్లవోద్యమాలను సమర్థించే ప్రజాస్వామికవాదుల్లో కొందరైనా పాలకవర్గ దుర్మార్గ విధానాల మీద విసుగుతో మావోయిస్టు ఉద్యమాన్ని ప్రజానుకూలమైందని భావిస్తున్నారేగాని.. దాని ఆశయమైన కార్మికవర్గ రాజ్య స్థాపన అనే విషయంపట్ల ఎంత అవగాహన ఉన్నదో, ఎంత ఏకీభావం ఉన్నదో చెప్పడం కష్టమే. అందుకే గట్టిగా వర్గపోరాటమని, సోషలిజమని అనకుండా అందులోని మానవీయ విలువల గురించి మాత్రమే మాట్లాడుతుంటారు. ఇదీ చాలా విలువైనదే, అవసరమైనదే. మానవీయత లోపించడానికి పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం కారణమని బలంగా చెప్పాలి. చరిత్రగతిని మార్చాలనే మౌలిక విషయం చర్చకు రాకుండా, దానికి వర్గపోరాటమే చోదకమనే సంగతిని ముందుకు తేకుండా, అది సాయుధంగా సాగుతుందనే విషయంలో ఏకీభావం లేకుండా మాట్లాడటం వల్ల అసలు సంగతి తెర వెనుకే ఉండిపోతుంది.

సోషలిజమంటే ఏమిటో తెలియని విముఖత దగ్గరి నుంచి ఉద్దేశపూర్వక వ్యతిరేకతల దాకా ఇన్ని స్థాయిల్లో అభిప్రాయలున్నాయని చెప్పడానికే ఇదంతా. 'గత సోషలిజాలు కూలిపోయాయి కాబట్టి ఇంక మళ్లీ అలాంటి ప్రయత్నాలు ఎందుకు?' అని ఎవరు ఏ కోణంలో అన్నా.. గట్టిగా తిప్పికొట్టి రాబోయే సోషలిజాలు ఎలా ఉండబోతాయో శాస్త్రీయ అవగాహన ఇవ్వడానికి కూడా ఎలాంటి సమాజాల్లో, ఎలాంటి చారిత్రక ప్రత్యేకతల్లో ఆ విప్లవాలు, సోషలిస్టు ప్రయత్నాలు జరిగాయో చెప్పాలి. అందు వల్లనే వాటికి ఉన్న ప్రత్యేకతలు ఏమిటో వివరించాలి. ఇలాంటి చర్చ ద్వారా రాబోయే విప్లవాలు, సోషలిస్టు ప్రయత్నాలు అంతర్, బహిర్ కారణాల వల్ల వెనక్కి పోకుండా గత అనుభవాల నుంచి వర్గపోరాటాన్ని సుదీర్ఘ క్రమం నడపగలమనే నమ్మకం కల్పించాల్సి ఉంది. ఈపని ఇప్పటి దాకా ఏమీ జరగలేదని ఎందుకు అనుకోవాలి? ఈ సందర్భంలో ఇంకాస్త ఎక్కువ చేయాలి. అలాంటి నొక్కు ఎక్కువ ఇవ్వాలి. ఇలా ఎన్నో విషయాలు చర్చించవచ్చు. ఈ వ్యాసం కేవలం ఇలాంటి విషయాల ప్రస్తావనకే పరిమితం.

* * *

ఒక్క బోల్షివిక్ విప్లవం గురించేగాక చైనా విప్లవం, చైనా సాంస్కృతిక విప్లవం, నక్సల్బరీ యాభై ఏళ్లు వంటి సందర్భాలను కూడా ఒక్కోదాన్ని ప్రత్యేకంగా ఎలా చూడాలో ఒక పద్ధతి రూపొందించుకుంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఏ సమాజాల్లో అవి ఎలా జరిగాయి? వాటి ప్రత్యేకతలేమిటి? ఇప్పుడున్న పరిస్థితుల్లో విప్లవం కోసం కృషి చేసేవాళ్లు వాటిని ఎలా అర్థం చేసుకోవాలి? అనే స్థూల చట్రం నుంచి ఆలోచించవచ్చు. ఆయా సందర్భాలను సెలబ్రేట్ చేసుకోవడం, వాటి నుంచి వర్గపోరాట స్ఫూర్తిని మరింతగా జ్వలింపజేసుకోవడం అత్యవసరం. దానికీ పైన చెప్పిన దానికీ పోటీ పెట్టాల్సిన పని లేదు. రెండూ అవసరమే. దేని అవసరం దానిది. అయితే ఈ పని ఏ ఒక్కరో చేయగలరని అనుకోవడం పొరబాటు.

బ్రెగ్జిట్‌తో తీవ్రం కానున్న ఈయూ సంక్షోభం

ఎ. నర్సింహా రెడ్డి

బ్రిటన్‌లో అందరూ ఊహించినట్లే జరిగింది. బ్రెగ్జిట్ బాంబు పేలింది. ఆరు దశాబ్దాలలో ఎదురుకాని సమస్య ఇది. 28 దేశాల యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి నిష్క్రమణే తమ అభీష్టమని 51.9 శాతం బ్రిటిష్ ప్రజలు జూన్ 23న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం)లో తేల్చి చెప్పారు. ఈయూలో కొనసాగాలని భావించినవారు 48.1 శాతం మాత్రమే ఉన్నారు. ఈయూలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న బ్రిటన్ ఈయూ నుంచి తప్పుకోనున్నది. గ్రేట్ బ్రిటన్ (ఇంగ్లండ్, వేల్స్, స్కాట్‌లాండ్, ఉత్తర ఐర్లాండ్, జీబ్రాల్టర్ సముహర్) లోని 382 కేంద్రాల్లో అభిప్రాయ సేకరణ జరిగింది. లండన్, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్‌లు ఈయూతో ఉండాలనే అభిప్రాయాన్ని తెలుపగా ఉత్తర, మధ్య ఇంగ్లాండ్, మెజారిటీ ఇంగ్లీష్ కౌంటీలు మాత్రం బ్రెగ్జిట్‌కే తమ మద్దతును తెలిపాయి.

ఈయూ నుంచి వైదొలగితే ప్రపంచం తలకిందులై పోతుందని, బ్రెగ్జిట్ వల్ల బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ మాంద్యానికి గురవుతుందనీ, వాణిజ్యం తగ్గిపోతుందనీ, వీటి వల్ల తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని బ్రిటిష్ కార్పొరేట్ మీడియా, పాలక వర్గాలు, కార్పొరేట్ సంస్థలు, బడా బ్యాంకులు, ఎగువ మధ్య తరగతి వర్గాలు ప్రచారం చేశాయి. కానీ ప్రజలు వీటిని పట్టించుకోలేదు. ప్రధాని డేవిడ్ కామెరాన్ బ్రెగ్జిట్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపు నిచ్చినా, "ప్రయాణించే విమానం నుంచి దూకాలని ప్రయత్నించడం, మళ్లీ ఎక్కడం అసాధ్యం... ఈయూ నుంచి ఒక్కసారి వైదొలగితే అపార నష్టం వాటిల్లుతుందని" కామెరాన్ ప్రజలను హెచ్చరించినా, మరో విడత సంస్కరణల ద్వారా తాను బ్రిటష్ సార్వభౌమత్వాన్ని పరిరక్షిస్తానని, ఐరోపా కూటమి నుండి బ్రిటన్‌కు వస్తున్న వలసలను నిరోధించి ప్రజల ప్రయోజనాలను కాపాడతానని భరోసా ఇచ్చిన ఆయన మాటలను ప్రజలు నమ్మలేదు.

కామెరాన్ ప్రతిపాదించిన సంస్కరణలన్నీ పూర్తి డొల్లేనని, బ్రిటన్‌ను బ్రస్సెల్స్‌లోని ఐరోపా కూటమి దయాదాక్షిణ్యాలకు వదిలివేశారని ప్రజలు భావించారు. దీనికి తోడు ఉత్తరాఫ్రికా, పశ్చిమాసియా, ఐరోపా దేశాలనుండి బ్రిటన్‌కు వెల్లువెత్తుతున్న వలసలను నిరోధించటంలో కామెరాన్ సర్కారు ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈయూ సభ్య దేశాల్లోని కార్మికులు స్వేచ్ఛగా ఇతర సభ్య దేశాల్లో ఎక్కడైనా పని చేయవచ్చు అన్న నిబంధన బ్రిటన్ కార్మికులకు గుది బండగా మారింది. బ్రిటన్‌కు వలస వచ్చిన వారితో ఆహారం, హౌసింగ్, మార్కెట్, ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ ఉద్యోగావకాశాల వంటి వాటిలో దేశ ప్రజలు అవకాశాలు గణనీయంగా తగ్గిపోవటంతో ఈయూ నుంచి నిష్క్రమించాలన్న వాదన సాధారణ శ్రామిక పేద వర్గాల్లో ఊపందుకుంది. బ్రిటన్ విడిపోయేందుకు ఓటేస్తే లిస్బన్ ఒప్పందంలోని ఆర్టికల్ 50ని ప్రయోగిస్తానని ప్రచారం చేసిన ప్రధాని

ఇదేదో ఈ తరం వాళ్ల సమస్య కాదు. ఇప్పుడు పోరాట క్షేత్రంలో ఉన్న నిర్మాణాల సమస్య మాత్రమే కాదు. అంతర్జాతీయంగానే వచ్చిన అనేక మార్పుల వల్ల ఆలోచనా ప్రపంచం సహితం మార్పులకు గురైంది. గత విప్లవాలతో పోల్చితే అనేక కొత్త సవాళ్ల మధ్య 21వ శతాబ్దంలో విప్లవాలు జరగాల్సి ఉన్నది. ముఖ్యంగా సాంఘిక ఆవరణ గత విప్లవాల కంటే ఇప్పుడు నడుస్తున్న విప్లవోద్యమాల ముందు చాలా విశాలంగా పరుచుకొని ఉన్నది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని సిద్ధాంత కృషి చేయవలసి ఉన్నది. మౌలికంగా ప్రజా ఉద్యమాల నుంచే దీనికి పరిష్కారం దొరుకుతుందనే మాట వాస్తవమే అయినా ఆ రంగంలో ప్రత్యేక కృషి కూడా చేయాల్సి ఉన్నది. అయితే మన సంప్రదాయంలో అనేక కారణాల వల్ల వాద వివాదాలే ఎక్కువ. అవి ఖండన మండనల రూపంలో సాగుతూ ఉంటాయి. ఒక తలంలో వాటి అవసరాన్ని ఎందుకు కాదనాలిగాని, పైన చెప్పిన తరహా పనికి కలిసి అన్వేషించడం అవసరం. మనకు ఈ అలవాటు తక్కువ. ఇలాంటి ఉద్యమ దృష్టితో ఈ నాలుగైదేళ్లలో వచ్చే చారిత్రక సందర్భాలను గుర్తించి, ఒక అవసరమైన చర్చ చేయగలితే ఆలోచనారంగం శక్తి పుంజుకుంటుంది. దీని కోసం మార్క్సిజం, వర్గపోరాటం, నూతన ప్రజాస్వామ్యం, సోషలిజం అనే స్థూల ఆమోద చట్రంలో నిలబడి ఈ అన్వేషణ సాగించడం సాధ్యమే. అప్పుడు గత విషయాలను తిరిగి చెప్పడంలా కాకుండా భిన్నంగా, కొత్తగా చేసే అవకాశాన్ని మనంతకు మనం సిద్ధం చేసుకున్నట్లవుతుంది. ఈ విషయంలో ఇప్పటి దాకా మనకున్న అప్రోచ్‌లో ఏమైనా మార్పులు అవసరమైతే చేసుకోగలిగితే ఎక్కువ మేలు జరుగుతుంది. 'భిన్నంగా, కొత్తగా' అంటే మార్క్సిస్టు లెనినిస్టు మావోయిస్టు సిద్ధాంత చట్రానికి బయటికి పోవడమని అనుకోనవసరం లేదు. అనుమానించనవసరం లేదు. భయపడనవసరం లేదు. వాస్తవానికి మన ముందున్న సవాళ్లను అర్థం చేసుకోగల ఆవరణ మార్క్సిస్టు లేదా మావోయిస్టు సిద్ధాంత చట్రంలో ఎంతో ఉన్నది. మార్క్సిస్టులుగా మనం చేయాల్సిందల్లా దాన్ని వాడుకోవడమే. గత చరిత్రలోని వర్గపోరాటాలకు, సోషలిస్టు నిర్మాణ ప్రయత్నాలకు అసలైన వారసులుగా మనం ఈ కృషి చేయాలి.

కామెరూన్ ఫలితాల అనంతరం ప్రధాని పదవికి అక్టోబర్‌లోగా రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు.

ఈయూ నిర్ణయాల పేరుతో కెమెరాన్ ప్రభుత్వం బ్రిటన్‌లో ప్రవేశపెట్టిన నయా - ఉదారవాద ఆర్థిక విధానాలు కార్మికుల జీతాలకు కోత పెట్టింది. సంక్షేమ కార్యక్రమాలను నీరుగార్చింది. పని భారం పెంచింది. నిరుద్యోగం, పేదరికం కట్టలు తెంచుకుంది. జర్మనీ నేతృత్వంలో యూరోపియన్ యూనియన్ సూపర్ పార్లమెంటులా వ్యవహరించి బ్రిటిష్ ప్రజల అభిప్రాయాలకు విలువ లేకుండా చేసింది. కార్పొరేట్లకు సూపర్ లాభాలు వచ్చే విధానాలు అమలు చేస్తూ మరో వైపు సామాన్య ప్రజలపై భారాలు మోపింది. అందుకే పాలక వర్గాల ప్రచారాన్ని పట్టించుకోకుండా ఈయూ పెనుభారాన్ని బ్రిటిష్ ప్రజలు వదిలించుకోవాలనుకున్నారు. దీంతో ఈయూతో 43 ఏళ్ల బ్రిటన్ బంధం తెగిపోయింది. బ్రెగ్జిట్ ఆర్థిక ప్రభావమే కాదు రాజకీయ ప్రభావం కూడా, రానున్న కాలంలో యూరప్ మీద, మొత్తం ప్రపంచం మీద పడనుంది.

ఆర్థిక సంక్షోభ బాధితులు, బలహీనమైన ఆర్థిక పరిస్థితిలో తక్షణ ప్రభావం పడేవాళ్లంతా బ్రిటన్-ఎగ్జిట్‌కు అనుకూలంగా ఓటు వేశారు. భారీ స్థాయిలో వలన కార్మికులున్న గ్రామీణ ప్రాంత ప్రజలు, నగరాల్లోని నిరుపేదలు, పూర్వ పారిశ్రామిక వాడల్లోని స్థానికులంతా యూరోపియన్ యూనియన్‌ను వ్యతిరేకించారు. బ్రిటన్ ప్రజాగణంలో ఉన్న ఈ చీలిక... అమెరికాలోనూ ఉంది. అన్ని దేశాల్లోనూ ఉంది. బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ, ఈయూ వ్యతిరేక కార్మిక సంఘాలు, ఇండియన్ వర్కర్స్ అసోసియేషన్, బంగ్లాదేశీ వర్కర్స్ కౌన్సిల్ ఆఫ్ బ్రిటన్, స్కాటిష్ లెఫ్ట్ లీవ్, సోషలిస్టు వర్కర్స్ పార్టీ, జెర్మీ కార్బిన్ వంటి లేబర్ పార్టీ నాయకులు బ్రెగ్జిట్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. యూకే ఇండిపెండెన్స్ పార్టీ లీడర్ నిగెల్ ఫారేజ్ దీనిని బ్రిటన్ స్వతంత్ర దినంగా అభివర్ణించారు. ఇది సామాన్యుల విజయం అనీ, చరిత్రలో జూన్ 23 నిలిచిపోతుందని ఆయన అన్నారు. యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగబోయే తొలి దేశంగా బ్రిటన్ నిలవబోతోంది. అయితే ఇప్పటికిప్పుడే బ్రిటన్ ఈయూ నుంచి తప్పుకున్నట్లు కాదు. ఈ ప్రక్రియకు కనీసం రెండేళ్లయినా పడుతుంది.

బ్రిటన్‌లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ చూడటానికిది ఈయూలో ఉండటమూ, బయటికి రావడమూ అన్న అంశంపై జరిగిన హోరాహోరీ పోరుగా మాత్రమే కనబడుతున్నా... సారాంశంలో అంతకు మించిన వైరుధ్యాలు ఎన్నో ఇందులో దాగున్నాయి. అవి రాగలకాలంలో బ్రిటన్‌లో ఎలాంటి విపత్తులను సృష్టించగలవో ఎవరూ నిర్దిష్టంగా చెప్పలేరు. ఈయూ నుంచి బ్రిటిష్ నిష్క్రమణ (బ్రెగ్జిట్) వార్తతో ప్రపంచమంతటా ప్రకంపణలు వ్యాపించాయి. అమెరికా నుండి జపాన్ వరకు స్టాక్ మార్కెట్లు కుప్పకులాయి. అనేక కరెన్సీలు నేల చూపులు చూశాయి. బ్రిటిష్ పౌండ్ 30 ఏళ్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. ఇప్పటికే ఊగిసలాడుతున్న ఆర్థిక వ్యవస్థలు కుదుపుకు లోనయ్యాయి. పెట్టుబడిదారులకు ఆర్థిక వ్యవస్థలపైనా, కరెన్సీల పైనా భయం పట్టుకున్నందున బంగారం వైపుకు మళ్లారు. అందువల్లనే ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు అమాంతం పెరిగాయి. బ్రెగ్జిట్ ప్రభావం భారత్‌ను కూడా తాకింది.

బ్రెగ్జిట్ ఫలితంగా ఈక్విటీ, కరెన్సీ, కామొడిటీ మార్కెట్లు విలవిలలాడాయి. ఈపరిణామం వల్ల ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది మదుపరుల ఆశలు ఆవిరయ్యాయి. బ్రెగ్జిట్ కారణంగా దాదాపు 2.1 ట్రిలియన్ డాలర్లు (రూ. 142 కోట్ల కోట్లు) సంపద హరించుకు పోయినట్లు ప్రపంచవ్యాప్తంగా వెలుబడ్డ నివేదికలు తెలుపుతున్నాయి. పరోక్ష నష్టాలు ఇంతకు రెట్టింపు స్థాయిలోనే ఉంటాయని అంచనా. ఇప్పటివరకు ప్రపంచ చరిత్రలో ఇదే అతి పెద్ద ఆర్థిక సంక్షోభమని విదేశీ మీడియా విశ్లేషిస్తోంది. అమెరికా, కార్పొరేట్ మీడియా మొదటి నుంచి బ్రెగ్జిట్‌ను వ్యతిరేకిస్తున్నాయి. బ్రెగ్జిట్ ప్రభావం వల్ల రానున్న రోజుల్లో తీవ్ర ప్రభావముంటుందన్న ఆపోహల మధ్య ప్రపంచ మార్కెట్లో భారీగా అమ్మకాలు నమోదు అయ్యాయి. ఎక్కువ మంది మదుపరులు అనిశ్చిత పెట్టుబడులైన ఈక్విటీ, బాండ్లు అమ్ముకున్నారు. ప్రపంచ ఆర్థిక మాంద్యం నాటి చీకటి రోజుల్లో కూడ మార్కెట్లు ఇంతటి గడ్డు పరిస్థితిని ఎదుర్కొలేదు. బడా పెట్టుబడిదారులు, కంపెనీల గుత్తాధిపత్యానికి పెద్దపీట వేసే యూరోపియన్ యూనియన్ (ఈయూ) అస్తిత్వానికి పెద్ద దెబ్బ తగిలింది. దాని భవితవ్యమూ ప్రశ్నార్థకం కానుంది. బ్రెగ్జిట్ పరిణామాలతో ప్రపంచ ఆర్థిక వృద్ధిరేట్ మరింత మందగించే పరిస్థితులు ఎదురు కావచ్చునంటున్నారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల అమలు వలన అభివృద్ధి చెందిన దేశాల్లో కూడ పేదరికం, నిరుద్యోగం, అసమానతలు పెరిగాయి. ఆయా దేశాల ప్రభుత్వాలపై నిరసనలు ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలలో కార్మిక ఉద్యమాలు బలం పుంజుకుంటున్నాయి. వీటిలో భాగమే అమెరికాలో 'ఆక్కుపై వాల్‌స్ట్రీట్' ఉద్యమం. సామ్రాజ్యవాద కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ, ప్రజల హక్కులను అణచివేస్తున్నారు. ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించడానికి మితవాద వర్గాలు నిరుద్యోగానికి, పేదరికానికి కారణంగా ఉగ్రవాదం, వలసలు సాకుగా చూపుతూ జాతి విద్వేషాలు రెచ్చగొడూతూ పబ్బం గడుపుతున్నారు. ఇవాళ ప్రజలను విభజించడానికి ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త స్వీయ, అతి జాతీయ, స్వాభిమాన గొంతుకలను మితవాద పాలక వర్గాలు ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా మేం వేరు, మా జాతివేరు, మా పరిస్థితి వేరు అనే భావన బలపడింది. ఎక్కడి నుంచో వచ్చారు, మాపై పెత్తనం చేస్తున్నారు అనే నయా జాతీయవాదం పురుడు పోసుకుంది. స్థానికులు, స్థానికేతరులు సమస్య రాజుకుంటోంది. ఇప్పుడు యూరప్ అంతటా ప్రాంతీయ, నయా జాతీయవాద, మితవాద పార్టీలకు బలం పెరుగుతోంది.

బ్రెగ్జిట్ ఫలితం తర్వాత నెదర్లాండు, డెన్మార్క్, స్వీడన్, అమెరికాలో టెక్సాస్, బ్రిటన్‌లోనే స్కాట్లాండ్‌లు తాము ఎందుకు విడిపోకూడదని ప్రశ్నిస్తున్నాయి. తాము ఉన్నస్థితిలోనే ఉండగా... కొత్తగా వచ్చినవారు, స్థానికుల్లో కొందరు సంపన్నులు కావడాన్ని స్థానికులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ భావనలు అధిపత్యానికి

వ్యతిరేకంగా, స్వేచ్ఛ కొరకు అన్నట్లుగా రూపంలో కన్పిస్తాయి. సారంలో చూస్తే ప్రపంచవ్యాప్తంగా మితవాదులు, ఛాందసవాదులు ప్రజలను రెచ్చగొట్టి ఇటీవలి సంవత్సరాల్లో బలపడుతున్న జాడలు కనబడుతున్నాయి. అమెరికాలో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్‌లో నేషనల్ ఫ్రంట్ నాయకురాలు లీ పెన్, నెదర్లాండ్స్‌లో పార్టీ ఫర్ ఫ్రీడం నాయకుడు గీర్ట్ వైల్డర్స్, ఇటలీలో నార్తర్న్ లీగ్ నేత మేటియో సాల్విని వంటి మితవాదులు కల్పిత జాతీయవాదాన్ని నూరిపోస్తున్నారు. మన దేశం, మన ఉద్యోగాలు, మన జాతి అనే నినాదాలిస్తున్నారు.

ఇవాళ యూరప్‌కు గుదిబండగా మారిన శరణార్థుల సమస్య, అక్కడక్కడ చోటుచేసుకుంటున్న ఉగ్రవాద ఘటనలు ఇందుకు మూల కారణాలని వస్తున్న విశ్లేషణల్లో అర్ధ సత్యం మాత్రమే ఉంది. అవి తక్షణ కారణం అయితే కావొచ్చుగానీ అంతకుమించి దశాబ్దాలుగా అమలవుతున్న ప్రపంచీకరణ విధానాల్లో ఇందుకు సంబంధించిన బీజాలున్నాయి. ప్రపంచీకరణ తళుకుబెళుకులు చూసి మూర్ఛిల్లి దాన్ని పెట్టుబడిదారీ విధాన విజయంగా అభివర్ణించినవారు ఆ విధానాలు పెంచుతూ పోతున్న అసమానతలను విస్మరించారు. ఈయూ, ఐఎంఎఫ్ కలిసి గ్రీసుపై రుద్దిన ఆర్థిక సంస్కరణలు ఆ దేశ కార్మికుల రక్తమాంసాలను ఎలా పిండి పిప్పిచేస్తున్నాయో, దానికి వ్యతిరేకంగా అక్కడి కార్మికులు ప్రతినిత్యం ఎంతటి వీరోచిత పోరాటాలు చేస్తున్నారో చూస్తూనే ఉన్నాం.

రెండో ప్రపంచ యుద్ధానంతరం యూరప్ దేశాలను ఏకం చేయడానికి సుదీర్ఘకాలం సాగిన చర్చోపచర్చలు 1958లో యూరోపియన్ ఎకనామిక్ కమ్యూనిటీ(ఈఈసీ)కి జన్మనిస్తే ఆ తర్వాత అది యూరోపియన్ యూనియన్ (ఈయూ) గా రూపుదిద్దుకోవడం 1973లో సాధ్యపడింది. 90వ దశకం మొదట్లో తూర్పు యూరప్ దేశాల్లో సోషలిస్టు రాజ్యాల పతనం దీనికి తోడైంది. పర్యవసానంగా ఈయూలో కొత్త దేశాలు చేరుతూ వచ్చాయి. ప్రజలకు అదొక గొప్ప ఆదర్శంగా కనిపించింది. కాలక్రమంలో ఉక్కు సంకెల బిగుసుకోవడం ప్రారంభమైంది. యూరోపియన్ కమీషన్ (ఈసీ), యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఈసీబీ), ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) ఈ మూడింటికీ కలిపి యూరోపియన్ ట్రాయికా (త్రికూటమి) అని పేరు. ఈయూ దేశాల ఆర్థిక, ద్రవ్య విధానాలన్నీ ఈసీబీ నిర్దేశిస్తుంది. ఈయూ నిర్ణయాలను, ఒప్పందాలను సభ్య దేశాల మెడలు వంచి అమలు చేసే కార్యానిర్వాహక సంస్థ ఈసీ. గ్రీసు, ఐర్లండ్, పోర్చుగల్ మొదలైన యూరప్ దేశాలనే కాదు, అనేక మూడవ ప్రపంచ దేశాలను దివాలా తీయించడంలో ఐఎంఎఫ్‌ది ప్రధాన పాత్ర. ఈ గ్రహ కూటమి వెనుక ఉండే అదృశ్య శక్తి కార్పొరేట్ సంస్థలు, వీటి ముందు ఏ దేశమూ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడ్డది.

నిజానికి 1973లో బ్రిటన్... యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీలో మొదట సభ్యత్వం పొందినప్పుడు అదొక వాణిజ్య కూటమి మాత్రమే. కానీ తరువాత రాజకీయ రూపం సంతరించుకున్నది. క్రమంగా బ్రిటన్ తన ప్రజాస్వామ్య స్వభావాన్ని కోల్పోయింది. ఐరాసను ధిక్కరించి ఇరాక్‌పై దాడిచేసిన తీరు, లిబియాపై దాడికి ఐరాస తీర్మానాన్ని వక్రీకరించిన వైనంతో దాని ఆధిపత్య స్వభావం వెల్లడైంది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు, యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు వల్ల బ్రిటన్ సార్వభౌమత్వానికి ముప్పు ఏర్పడ్డదనే భావన ప్రజల్లో తలెత్తింది. తమ సమస్యలను తమ ప్రజాప్రతినిధులు పరిష్కరించలేని నిస్సహాయుత వారికి అర్థమైంది. తాము స్వాతంత్ర్యం కోల్పోయామని వారు గుర్తించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కన్సర్వేటివ్ పార్టీ నేత, ప్రధాని కామెరూన్... తాము గెలిస్తే ఈయూలో బ్రిటన్ కొనసాగడంపై ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని ప్రకటించారు. ఆ మాట ప్రకారం ఇప్పుడు రిఫరెండం నిర్వహించారు.దానిని తిరిగి సాధించుకోవాలనే నిర్ణయాన్ని రిఫరెండం ద్వారా ప్రకటించారు. బ్రెగ్జిట్‌కు ప్రజాభిప్రాయం సానుకూలంగా ఉండడంతో ఇప్పుడు తలపట్టుకున్నారు.

ఉద్దీపన పథకాల పేరిట ఈయూ నిర్దేశిత విధానాల పట్ల వ్యతిరేకత, శరణార్థుల వెల్లువ వంటి పరిణామాల నేపథ్యంలో 'బ్రెగ్జిట్' డిమాండ్ ముందుకు వచ్చింది. మితవాద శక్తులు సైతం దీనిని ఆహ్వానించాయి. బ్రిటన్ ప్రభావం ఈయూలోని ఇతర సభ్య దేశాలపై కూడా ఉండొచ్చునని అనుమానిస్తున్నారు. ఫ్రాన్స్, నెదర్లాండ్స్, స్పెయిన్, గ్రీస్‌లు ఇదే బాట పట్టొచ్చనే అనుమానాలు యూరోపియన్ యూనియన్‌ను పీడిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పరిణామాన్ని ప్రపంచవ్యాప్తంగా పలువురు పలు రకాలుగా విశ్లేషిస్తున్నారు.ఈయూ ద్రవ్య విధానాలు, వాటిని నడిపే ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు పన్నిన ఆర్థిక, రాజకీయ, సైనిక వ్యూహాల గురించి బ్రిటన్ ప్రజలు, కార్మికులు, మేధావులు గుర్తించారు. అందుకే పాలకవర్గ పార్టీలు ఈయూతో అనుబంధానికి పట్టుపట్టిన ప్రజలు వారంతా ఏకమై వ్యతిరేకించారు. అమెరికా అధ్యక్షుడి హెచ్చరికలు, బెదిరింపులనూ బేఖాతరు చేశారు. బ్రెగ్జిట్ బాటలోనే ఇప్పుడు డెన్మార్క్(డెగ్జిట్), ఇటలీ(ఇగ్జిట్), ఆస్ట్రేలియా(ఆగ్జిట్)లు త్వరలో ఈయూ నుంచి బయటకు రానున్నాయనే ప్రచారం ఊపందుకొంది. అదే జరిగితే ఈయూ ఉనికే కాలగర్భంలో కలిసిపోతుందనడంలో సందేహం లేదు.

బ్రెగ్జిట్‌కు అనుకూల తీర్పు వచ్చిన నేపథ్యంలో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ) నుంచి టెక్సాస్ స్టేట్ విడిపోయే అంశం 'టెగ్జిట్' (టెక్సాస్ ఎగ్జిట్) తెరపైకి వచ్చింది. బ్రెగ్జిట్ అనుకూల వర్గాలు ఉపయోగించిన ప్రచార సూత్రాలను తాము కూడా పాటించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. బ్రిటన్‌లో మాదిరిగా టెక్సాస్‌లో కూడా అమెరికాతో కలిసి ఉండాలా? విడిపోవాలా? అనే అంశంపై ప్రజాభిప్రాయం సేకరించాలని కొందరు కోరుతున్నారు. బ్రిటన్ టెక్సాస్‌కు రోల్ మోడల్‌గా నిలిచింది. మెక్సికో నుంచి స్వాతంత్ర్యం పొందిన టెక్సాస్ 1836 సంవత్సరం నుంచి 1845 వరకు స్వతంత్ర దేశంగా ఉండేది. 1845లో 28వ రాష్ట్రంగా యూఎస్ఏలో చేరింది. అమెరికాలో టెక్సాస్ చేరిక కూడా ఆ రోజుల్లో పెను సంచలనానికి దారి తీసింది. 1846లో మెక్సికో, అమెరికాల మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధం రెండేండ్ల పాటు కొనసాగింది.

అయితే, నాడు టెక్సాస్ వార్షికాదాయం 1.6 ట్రిలియన్ డాలర్లు (రూ. ఒక కోటి పది లక్షల కోట్ల కోట్లు) ఉండేదని, ప్రపంచంలో తొలి పది పెద్ద దేశాల జాబితాలో టెక్సాస్‌కు చోటుండేదని టెక్సాస్ నేషనలిస్ట్ ఉద్యమనేత డేనియల్ మిల్లర్ పేర్కొన్నారు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పరిచిన 'నాటో' సైనిక కూటమితో పాలు పంచుకోవడం, ఇరాక్, లిబియా, సిరియాలో దురాక్రమణ యుద్ధాలలో అమెరికాతో పాటు బ్రిటన్ పాల్గొనడం ద్వారా అబాసుపాలవడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడింది. ఫలితంగా ప్రభుత్వ పథకాల్లో భారీ కోతలు వల్ల ఉపాధికి రక్షణ లేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికా దేశాల నుండి వలసలు పెరిగాయి. ఈ స్థితికి బ్రిటన్ సామ్రాజ్యవాద యుద్ధమే కారణమని ప్రజలు గుర్తించారు. మరోవైపు ఈయూ నిబంధనలు బ్రిటన్ చేతులు కట్టేసినమాట వాస్తవం. అవసరాలకు అనుగుణంగా అనేక చట్టాలను మార్చుకోవడం సాధ్యం కాలేదు. ఇది దేశంపై తీవ్ర ప్రభావం చూపుతూ, నిరుద్యోగితను పెంచుతున్నదనీ, దేశంలోకి వలసలు భారీగా పెరిగిపోవడానికి కూడా ఈయూతో అనుబంధమే ప్రధాన కారణ మన్నది బ్రెగ్జిట్ అనుకూలుర వాదన. గనులు, ఇతర ప్రకృతి వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం, వ్యవసాయ సబ్సిడీ, చేపలు పట్టే తీర ప్రాంతాలను ఈయూ నిర్ణయించడం, వలస కూలీలను అనుమతించడం- ఇట్లా ఏ నిర్ణయమైనా బ్రిటన్ ప్రజల అభిమతంతో నిమిత్తం లేకుండా ఈయూ పార్లమెంటులో జరుగుతున్నది. దీంతో ఈయూలో ఉండటం వల్ల తమకు స్వేచ్ఛ లేకుండా పోయిందనే భావన ప్రజల్లో బలంగా వేళ్లూనుకొంది.

బ్రిటన్ ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర సంక్షోభంలో ఉన్నా, ఈయూ గుత్తాధిపత్యాన్ని కొనసాగించేందుకు, కార్మిక హక్కులను మరింతగా హరించే విధంగా ట్రాన్స్ అట్లాంటిక్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పార్ట్‌నర్‌షిప్ (టిటిఐపి) వంటి ఒప్పందాలను తీసుకొస్తోంది. ఈయూ పేరుతో ఈ ఒప్పందాన్ని ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఆగ్నేయ, తూర్పు యూరప్ దేశాలపై రుద్దాలనీ, ఈయూలోని బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ బ్యాంకులు లాభాలు పోగేసుకునే కుట్ర పన్నాయి. ఈ విధానాలను అధికార ప్రతిపక్షాలు (కన్సర్వేటివ్, లేబర్ పార్టీలు) స్వాగతించాయి. కార్మికులు ఎక్కడైనా పనిచేసుకొనే స్వేచ్ఛ వల్ల నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని చెబుతూ వలస కార్మికుల శ్రమను యథేచ్ఛగా దోచుకొంటున్నాయి. ఈ ఒప్పందాలు, విధానాల వల్ల సభ్యదేశాలుగా గ్రీస్ నుంచి సైప్రస్ దాకా ఎలా చితికిపోయిందీ మనందరికి తెలిసిందే.

బ్రెగ్జిట్ ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై ఎట్లా ఉంటుందనే చర్చ కూడా సాగుతోంది. ఫలితాలు వెలువడుతుండగా ఒక దశలో సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకు పడిపోయింది. బ్రిటన్‌తో సహా ఈయూ భారత్‌కు అతి పెద్ద వ్యాపార భాగస్వామి. భారత్ 48 బిలియన్ డాలర్ల మేర వస్తువులు ఎగుమతి చేస్తుండగా, 65 బిలియన్ల మేర దిగుమతి చేసుకుంటున్నది. యూకే వీడిపోవడం వల్ల ఆ దేశంలో ఆర్థిక ఒడిదొడుకులు కలిగినా, ఈయూలో మాంద్యం తలెత్తినా ఆ ప్రభావం భారత్‌పై ఉంటుంది. ఐటీ ఎగుమతులపై కూడా ఈ ప్రభావం ఉండవచ్చు. బ్రిటన్‌లో నలభై లక్షలమంది భారతీయ సంతతి వారు అనేక రంగాల్లో స్థిరపడ్డారు. ఏటా వేలాది మంది అక్కడకు వేర్వేరు అవకాశాల రీత్యా వలసపోతున్నారు. బ్రెగ్జిట్ అనంతర బ్రిటన్‌లో రూపొందించే నిబంధనలు భారతీయులకు అవకాశాలు పెంచుతాయా, లేక తలుపులు మూసుకుపోతాయా అన్నది ప్రస్తుతానికి స్పష్టతలేని విషయం.

ఈయూ నుంచి విడిపోవాలన్న బ్రిటన్ నిర్ణయం నేపథ్యంలో బెర్లిన్‌లో ఈయూ వ్యవస్థాపక దేశాల ఆర్థిక మంత్రులు జూన్ 25న భేటీ అయ్యారు. ఈ భేటీలో జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్, బెల్జియం, లక్సెంబర్గ్ దేశాల ఆర్థికమంత్రులు పాల్గొన్నారు. బ్రిటన్ కొత్త ప్రధాని వీలైనంత త్వరగా బాధ్యతలు తీసుకుని... మిగిలిన ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని ఫ్రాన్స్ సూచించింది. కూటమి నుంచి తప్పుకునేందుకు సంక్లిష్ట విధానాలను వీలైనంత సరళతరం చేసి... తొందరగా బ్రిటన్ వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవటంపై ఈ సమావేశంలో చర్చించారు. "మన ఊహలకందనిదేదో జరుగుతోంది. మనమంతా అప్రమత్తం కావాలి. ఈయూ తన పంథాను మార్చుకోవాలి. లేకుంటే ఈయూ విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది'' అని ఇటలీ ఆర్థికమంత్రి పీర్ కార్లో వ్యాఖ్యానించారు. అదే సమయంలో ఈయూ దేశాల్లో అభివృద్ధి మందగించడంతో అసమానతలు పెరిగిపోతున్నాయని పీర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈయూ చేతుల్లో నుంచి యూరోపియన్ దేశాలను చేజారనివ్వమని జర్మనీ స్పష్టం చేసింది. కాగా, ఈయూ నుంచి విడిపోవాలన్న బ్రిటన్ నిర్ణయం కొత్త శకానికి నాందీ పలుకుతుందని టర్కీ వ్యాఖ్యానించింది.

బ్రెగ్జిట్ రెఫరెండం ఫలితం... పాలక ప్రతిపక్షాల మధ్య తగాదా కాదు. ఇది పేద, ఉన్నత వర్గాల మధ్య విభజన రేఖను స్పష్టంగా సూచిస్తోంది. ప్రభుత్వ ఆర్థిక ఫలాలు పేదలకు చేరకపోవడం కారణంగానే మెజారిటీ ప్రజలు ఈయూ నుంచి విడిపోవడానికే మొగ్గుచూపారు. దీంతో బిత్తరబోయిన బ్రిటన్ సంపన్న వర్గాలు కొన్ని సాంకేతిక కారణాలు చూపుతూ మరోసారి బ్రెగ్జిట్ రెఫరెండం పెట్టాలనే డిమాండ్ తీసుకొచ్చారు. మీడియా తన వంతు పాత్ర తాను చేస్తూనే ఉంది. మరోవైపు ఈ మేరకు పార్లమెంటరీ వెబ్‌సైట్‌లో ఒక పిటీషన్‌ను ఉంచారు. దీని రూపకర్త విలియం అలీవర్ హీలే. దీనికి మద్దతుగా ముప్పై లక్షల పైగా ప్రజలు సంతకాలు చేశారు. వీరి వాదన ప్రకారం "మొత్తం ఓటర్లలో రెఫరెండం ఓటింగ్ 75 శాతానికన్నా తక్కువగా ఉన్నా... ఓటింగ్‌లో 60 శాతానికికన్నా తక్కువగా పోలైన ఓట్లు ఉన్నా, ఈయూ మాన్యువల్ నిబంధన ప్రకారం మళ్లీ రెఫరెండం నిర్వహించాలన్న నిబంధనను బ్రిటన్ ప్రభుత్వం అమలుచేయాలి'' అని డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్ పార్లమెంటరీ నిబంధనల ప్రకారం ఒక లక్ష సంతకాలను మించిన పిటీషన్ వస్తే పార్లమెంట్ చర్చించవలసి ఉంటుంది. మరోవైపు దేశ ప్రజల అభిప్రాయానికి భిన్నంగా ఈయూలో కలిసి ఉండాలన్న లండన్ వాసులు... ఇంగ్లాండ్ నుంచి లండన్‌కు స్వాతంత్ర్యం ప్రకటించాలని లండన్ మేయర్ సాధిక్ ఖాన్‌ను కోరుతూ మరో ఆన్‌లైన్ పిటీషన్‌ను రూపొందించారు. దీనిపైనా వేల సంఖ్యలో ప్రజలు సంతకాలు చేశారు.

కృష్ణా జల వివాదంలో న్యాయానికి చోటు లేదా?

పాణి

గత నెల చివరి వారం కేంద్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రెండూ అన్యాయంగా వాదించాయి. ఇరు పక్షాలు పరస్పరం చాలా తెలివిగా ప్రత్యారోపణలు, స్వీయ సమర్థనలూ చేసుకున్నాయి. కానీ వాటిలో న్యాయం లేదు. కేంద్రం ఏర్పాటు చేయబోయే కమిటీలో గొప్ప నిపుణులు ఉండవచ్చేమోగాని వాళ్లయినా న్యాయబద్ధంగా ఆలోచిస్తారా? అప్పుడైనా రెండు ప్రభుత్వాలు న్యాయ వైఖరితో పంపకాలకు సిద్ధమవుతాయా? అని సందేహించాల్సిందే. ఈలోగా రెండు రాష్ట్రాల ప్రజలు తమ ప్రభుత్వాలు తమ మంచి కోసమే ఈ వాదనలు చేస్తున్నాయని అనుకుంటే చాలా నష్టం జరిగిపోతుంది. ఎందుకంటే ఇలాంటి వాదనల్లో ప్రభుత్వాలు తమ ప్రజల్ని పక్క రాష్ట్ర ప్రజలపై ఉసిగొల్పడం అనే వ్యూహం పాటిస్తాయి. ఇదేదో ఆరోపణ కాదు. ఢిల్లీలో రెండు రాష్ట్రాల నీటి పారుదల మంత్రులు అచ్చంగా అలాగే వ్యవహరించారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నందు వల్ల ఇప్పటి ఒప్పందాలు తాత్కాలికమే అయినా.. ఇవే అసలు ఒప్పందాలుగా మారే ప్రమాదం ఉండొచ్చు. లేదా వాటిని ఈ తాత్కాలిక ఒప్పందాలు ప్రభావితం చేయొచ్చు. ఈ భయం రెండు ప్రభుత్వాలకూ ఉన్నందు వల్లనే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వచ్చాక బోర్డు పరిధిని నోటిఫై చేయాలా? ముందే చేయాలా? అనే విషయంలో రెండు ప్రభుత్వాలు తాము కోరుకుంటున్న నీటి వాటాల కోసం వాదిస్తున్నాయి.

ఇంకో ముఖ్యమైన నష్టం ఏమంటే క్రిష్ణా పరివాహకంలో ఇంత వరకు నీటి వాటాల్లో అన్యాయానికి గురైన ప్రాంతాల ఊసే ఈ సమావేశాల్లో రాలేదు. అందువల్ల ఈ వాదనలు ఎంత అప్రజాస్వామికమైనవో లోతైన చర్చ జరగాలి.

నాగార్జునసాగర్ నిర్వహణ హక్కు తమకే కావాలని డెల్టా నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమ(ఆయన ఆంధ్రప్రదేశ్ మంత్రిగా ఏనాడూ వ్యవహరించ లేదు. ఈ సమావేశాల్లో స్పష్టంగా ఆయన డెల్టా ప్రయోజనాల చుట్టూ వాదన నడిపారు) ఎందుకు పట్టుపట్టారు? ఈ ఏడాది గుంటూరు కాలువ ద్వారా నాలుగైదు టీఎంసిల నీరు కోస్తాకు అందలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వం తమకు తాగు నీళ్లు కూడా ఇవ్వడం లేదని అల్లరి చేశారు. శ్రీశైలం డ్యాంలో కనీసంగా నీళ్లు లేకపోయినా, పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు అందక రాయలసీమకు తాగునీరు, సాగు అందక అల్లాడిపోతున్నా తమకు తాగు నీరు లేదని ప్రభుత్వం దగ్గర చెప్పుకొని ఉన్న కాసినీ కిందికి తీసకపోయే అలవాటున్న కోస్తా పాలకులకు సాగర్ నుంచి ఓ గ్లాసు నీళ్లు తక్కువైనా(నిజానికి తాగు నీటికి సరిపడ నీళ్లు ఆ

ప్రపంచవ్యాప్తంగా రెండో ప్రపంచ యుద్ధం తరువాత (1945) పాత వ్యవస్థలు కూలిపోయి వలస పాలన స్థానంలో ఆధునిక రాజ్యాలు అవతరించాయి . 1990 దశకం నుండి ప్రపంచీకరణ పేరుతో తిరోగమనం మొదలైంది. ఫలితంగా దేశాల స్వాతంత్ర్యమూ, ప్రజల హక్కులూ హరించుకపోయాయనే భావన ఏర్పడ్డది. ప్రపంచీకరణ అంటే దేశ సరిహద్దులు లేని స్వేచ్ఛా వాణిజ్యమేనని ప్రజలు భావించే పరిస్థితి వచ్చింది. పేదలకు, కార్మికులకు రక్షణగా ఉండే చట్టాలన్నీ రద్దయి, కార్పొరేట్ సంస్థలకు సర్వాధికారాలు కట్టబెట్టడం జరుగుతుంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ఒత్తిడుల వల్ల కార్పొరేట్ సంస్థలు బలోపేతమవుతుంటే ప్రజా ప్రభుత్వాలు దివాలా తీస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ, ప్రజల సంక్షేమ పథకాలను పొదుపు పేరిట రద్దు చేయడాన్ని యూరప్ దేశాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్రెగ్జిట్ నిర్ణయం పట్ల అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక సంస్థలు ఆందోళన పడటానికి కారణం ఈ ప్రపంచీకరణ వ్యతిరేక పోకడలే.

అన్ని దేశాల్లోనూ స్వల్ప సంఖ్యాకులైన కార్పొరేట్ దిగ్గజాల చేతుల్లో సంపదంతా కేంద్రీకృతమవుతున్నదన్న వాస్తవాన్ని పాలకులు దాచడానికి ప్రయత్నించారు. కింది వర్గాల బాగోగుల్ని, సంక్షేమాన్ని పట్టించుకోని విధానాలు అసంతృప్తికీ... చివరకు తిరుగుబాటుకు దారితీస్తాయని గ్రహించలేకపోయారు. పాశ్చాత్య దేశాల్లో చాలచోట్ల కార్మికుల వేతనాలు 2008 తర్వాత స్తంభించి పోయాయని, ఉపాధి కల్పన అంతంతమాత్రమేనని గుర్తిస్తే ప్రపంచీకరణ అభివృద్ధి నమూనా సామాన్య పౌరుల జీవితాలను ఎంతగా దిగజార్చిందో అర్థమవుతుంది. అమెరికాలో బెర్నీ శాండర్స్ వంటివారు సంక్షేమ పథకాలను ప్రతిపాదించి, సహజ వనరులపై కార్పొరేట్ దిగ్గజాల ఆధిపత్యాన్ని తొలగించడమే సమాజం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమని సూచించారు. ఇందుకు భిన్నంగా మితవాదులు దేశ సరిహద్దుల్ని మూసేయడం, ముస్లింలను వెళ్లగొట్టడం, జాతి ఔన్నత్యం పేరుతో జాతీయ దురహంకారాన్ని ప్రోత్సహించడమే అన్ని సమస్యలకూ పరిష్కారమార్గాలుగా చెబుతున్నారు. ఉగ్రవాద భూతాన్ని చూపి విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. నిజానికి నిజమైన ప్రజా విముక్తి పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోసే వర్గ పోరాటం ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ప్రస్తుత దోపిడీ పీడనల వ్యవస్థకు సోషలిజమే నిజమైన పరిష్కారం కాగలదు.

ప్రాంతానికి లేకపోవడం అనే సమస్యే లేదు), ఒక రోజు విడుదల ఆలస్యమైనా నానాయాగీ చేయడం అలవాటు. 2015లో శ్రీశైలం డ్యాంలో 30 టీఎంసీలు మాత్రమే ఉంటే కూడా తాగు నీటి కోసమని కిందికి తీసుకపోయారు. అప్పుడు సాగర్‌లో పుష్కలంగానే నీళ్లు ఉన్నాయి.

ఈ అలవాటు ఉన్నందు వల్ల హైదరాబాదుకు మంచినీళ్లు, సాగర్ ఎడమ కాలువ కింద తెలంగాణ ప్రాంత రైతులకు సాగు నీళ్లు కావాలి కదా? అనే విశాలమైన ఆలోచన వాళ్లు చేయలేరు. అందుకే దేవినేని ఉమ డెల్టా ప్రయోజన వాదం మాత్రమే చేశారు. అంత కంటే ప్రజాస్వామికంగా ఆంధ్రప్రదేశ్‌లోని కరువు పీడిత ప్రాంతాల ప్రయోజనాలను పట్టించుకోకపోవడానికి మూలం ఈ డెల్టా వాదం.

సాగర్ మీద ఏపీ ప్రభుత్వానికి హక్కులు ఇవ్వమని తెలంగాణ వాదించడంలో సాంకేతిక కోణం ఏమోగాని డెల్టా వాళ్ల పెత్తనం కిందికి సాగర్ నిర్వహణ వెళితే తమకు నీళ్లు ఇవ్వరని తెలంగాణ వాళ్లు అనుమానించడంలో తప్పేమీ లేదు. ఇలాంటి విద్రోహ చరిత్ర డెల్టా పాలకులకు తగినంత ఉన్నది. ఇంత కాలం కర్ణాటకను, తెలంగాణను, రాయలసీమను ఎప్పటికప్పుడు ఏదో పద్ధతిలో అన్యాయం చేస్తూ వచ్చినందు వల్ల తెలంగాణ వాళ్లు అనుమానించే అవకాశం ఉంది.

ఏ రకంగా చూసుకున్నా.. దేవినేని ఉమ కంటే హరీష్‌రావు కొంచెం మెరుగ్గా ఆలోచించాలి కదా అని ఎవరైనా ఆశిస్తారేమో. కానీ అలాంటి తేడా ఏమీ లేదని ఆయనే నిరూపించుకున్నారు. పోతిరెడ్డిపాడు నుంచి కేసీ కెనాల్‌కు, ఎస్సార్బీసీకి ఇష్టం వచ్చినన్ని నీళ్లు తీసుకుంటున్నారని హరీష్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన జీవో 69ని అడ్డంపెట్టుకొని శ్రీశైలంలో 834 అడుగుల నీరు ఉన్నా కిందికి నీళ్లు తీసుకొని పోతోంటే నికర జలాలు ఉన్న కేసీకి, ఎస్సార్బీసీకి కూడా నీళ్లు అందడం లేదని, ప్రతి ఏటా ఆయకట్టు ఎండిపోతోందని, ఇక మిగతా ప్రాజెక్టులకు దిక్కేలేదని ఆయనకు తెలియదనుకోవాలా? న్యాయ దృష్టి లేని దుర్మార్గ వాదన ఇది.

విచిత్రం ఏమంటే గత ఏడాది జూన్ 18, 19 తేదీల్లో జరిగిన కృష్ణా బోర్డు సమావేశాల్లో రెండు ప్రభుత్వాలు కుమ్మక్కై, శ్రీశైలంలో 790 అడుగుల నీరు ఉన్నా నీరు తీసుకుందామని ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిత్యం కీచులాడుకునే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడికి వచ్చే సరికి తెలంగాణ భాషలో చెప్పాలంటే అలాయ్‌బలాయ్ తీసుకొని ఒప్పందానికి వచ్చాయి. న్యాయా న్యాయాల గురించి, సూత్రబద్ధ వైఖరి గురించి ఢిల్లీ ఎగిరిపోయేలా అరిచిన హరీష్ రావుకు.. 841 అడుగుల ఎత్తులో ఉన్న పోతిరెడ్డిపాడు నుంచి కేసీకి, ఎస్సీర్బీసీకి చట్టం కేటాయించిన నీళ్లయినా ఎలా వస్తాయని అప్పుడు అనిపించలేదు. డెల్టా ప్రభుత్వం నుంచి రాయలసీమ వాళ్లు ఆశించేందుకు ఏమీ లేదు. న్యాయం గురించి మాట్లాడటం కూసు విద్యగా అలవాటు చేసుకున్న తెలంగాణ పాలకవర్గాలకు కనీసం ఇక్కడేదో అన్యాయం జరుగుతున్నట్టుందే అని ఎందుకు అనిపించలేదు?

దీనికి పరాకాష్టగా పట్టిసీమ నుంచి కృష్ణా బేసిన్‌లోకి వచ్చే 80 టీఎంసీల్లో మహారాష్ట్రకు 11, కర్ణాటకకు 24 టీఎంసీలు పోను మిగతా 45 ఉమ్మడి ఏపీకి వస్తాయి. ఈ నీళ్లన్నీ తమకే కావాలని తెలంగాణ డిమాండ్ చేస్తున్నది. వాస్తవానికి ఈ 45 టీఎంసీల్లో దామాషా ప్రకారం 19 టీఎంసీలు... లేదా సగానికి సగం 22 టీఎంసీలు తెలంగాణకు వస్తాయి. కానీ తెలంగాణ ప్రభుత్వం లెక్కల గారడీ చేసి 90 టీఎంసీలు కావాలని వాదిస్తోంది.

ఈ మొత్తం వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం డెల్టా వర్సెస్ తెలంగాణ అనే పద్ధతిలోనే వాదన చేస్తోంది. తెలంగాణ వ్యతిరేక వాదన తప్ప ఏపీలో రాయలసీమ కూడా ఉన్నదని నోటి మాటగా కూడా అనడం లేదు. గోదావరి నీళ్లు కృష్ణా బేసిన్‌లో పడితే సాగర్‌కు పైన ఉన్న ప్రాంతాలకు ఆ మిగులు నీళ్లు ఇవ్వాలని బచావత్ అవార్డు చెప్పినమాట నిజమేగాని, పైన అంటే తెలంగాణ అని కాదు, రాయలసీమకు అని ఒకే ఒక్కసారి దేవినేని ఉమ అన్నారు. అంతకు మించి ఆయన మొత్తం వాదనలో రాయలసీమకు కూడా కృష్ణా నీళ్లు ఇవ్వాలి కదా, ఇంత కాలం అన్యాయం జరిగింది.. ఇప్పటికైనా న్యాయమైన పంపకాలు జరగాలి కదా అనే ఆలోచనే లేదు. గతంలో ఎలాగైతే అనంతపురం, మహబూబ్‌నగర్ లాంటి కరువు ప్రాంతాల నీటి అవసరాలు చూపి నీళ్లు ఎక్కువగా తీసుకొని డెల్టాకు పారించినట్లే ఇప్పుడూ తెలంగాణ వాదనను(అది అప్రజాస్వామిక మైందే కావచ్చు) ఓడించడానికి సాగర్‌కు పైన రాయలసీమ ఉన్నదని, ఆ ప్రాంతం వాళ్లకూ నీళ్లు ఇవ్వాలని నోటి మాటగా ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి అన్నారు. అందుకే ఆయన్ను డెల్టా నీటిపాదుదల మంత్రి అనేది.

ఆయన మంత్రి అయ్యాక కర్నూలు జిల్లాకు వచ్చి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను, బనకచర్ల క్రాస్‌ను చూసి రాయలసీమకు ఇన్ని నీళ్లా అని అన్నాడని పత్రికల్లోనే వచ్చింది. ఏపీ రాష్ట్ర మంత్రే ఇలా ఉన్నాక ఇక తెలంగాణ మంత్రిని ఏం అంటాం?

కృష్ణా జలాల్లో రాయలసీమకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీబాగ్ ఒప్పందంలో రాసుకున్నారు. కానీ కోస్తా పాలకులు ఆ రోజు నుంచి నిన్న మొన్నటి ఢిల్లీ సమావేశాల దాకా సీమ అవసరాలకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదు. డెల్టా తాగునీటి అవసరాలకు కృష్ణా యాజమాన్య బోర్డు 6 టీఎంసీలు ఇస్తే సాగర్ నుంచి తెలంగాణ ప్రభుత్వం 4 టీఎంసీలే ఇచ్చిందనే వాదనే దేవినేని ఉమకు సరిపోయింది.

ఈ సందర్భంలో అయినా పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టుల నుంచి వచ్చే నీళ్లలో సగమో, దామాషా ప్రకారమో తెలంగాణకు ఇచ్చేసి మిగతా నీళ్లు రాయలసీమకు ఇస్తామని అనడానికి నోరు రాలేదు. పట్టిసీమ నుంచి పుంగనూరు, పలమనేరు దాకా నీళ్లు ఇస్తామని అసెంబ్లీలో చంద్రబాబు చెప్పాడు కాబట్టి ఆమేరకు పైన చెప్పిన మిగులు నీరు గాలేరు నగరికి, హంద్రీ నీవాకు నికర జలాలుగా ఇవ్వడానికి చట్టబద్ధత కల్పించడానికి కేంద్రం ముందు

ప్రతిపాదన పెట్టలేదు. ఆ మోతాదు నీటిని శ్రీశైలం నుంచి సాగర్‌కు వదలాల్సిన అవసరం లేదని, దీనికి ఆటంకంగా ఉన్న జీవో 69ను కూడా తీసేస్తామని ఆయన నోటి వెంట రాలేదు. ఆ నీటిలో న్యాయంగా తెలంగాణకు వెళ్లాల్సిన సగం కూడా ఇవ్వకుండా మొత్తం డెల్టాకు వాడుకోవాలనే దుగ్ధ తప్ప మరేమీ లేదు. దీనికి యథావిధిగా రాయలసీమను అడ్డం పెట్టుకోవడం ఆ ప్రాంతంపట్ల ఏపీ ప్రభుత్వానికి ప్రేమ ఏమీ లేదు. ఉంటే కేంద్ర జల వనరుల శాఖ ముందు ఏపీ వాదన ఇంత ఏకపక్షంగా, అప్రజాస్వామికంగా ఉండేదే కాదు.

ఆయన డెల్టా వాదం ఎక్కడి దాకా పోయిందంటే... అవతలి నుంచి పట్టిసీమ నీళ్లు తమకే ఇవ్వాలని తెలంగాణ అడగడంతో... భీమాకు ఇవ్వాల్సిన 20 టీఎంసీలు కూడా ఇవ్వం అని ఏపీ అడ్డం తిరిగింది. క్రిష్ణా డెల్టా ఆధునికీకరణ, నదిలోకి చేరే పునరుత్పత్తి నీరు మొదలైన వాటి ద్వారా వచ్చే నికర జాలాల్లో 20 టీఎంసీలు భీమాకు, 9 టీఎంసీలు పులిచింతలకు, 11 టీఎంసీలు ఎస్సార్బీసీకి కేటాయించారు. 45 టీఎంసీల సామర్థ్యంతో డెల్టా స్థిరీకరణ కోసం కట్టుకున్న పులిచింతల వల్ల దుర్భిక్ష పల్నాడుకు, నల్గొండకు ముంపు తప్ప ఆయకట్టు ఏమీ రాలేదు. అందరూ వ్యతిరేకిస్తున్నా పులిచింతల కట్టుకొని.. ఆ ఒప్పందంలో ఒక అంశమైన భీమా కేటాయింపులు ఇవ్వమని ఇప్పుడు అడ్డం తిరుగుతున్నారు. వాళ్లు పట్టిసీమ మొత్తం నీళ్లు మాకే కావాలని అడగడం, వీళ్లు ఎప్పుడో జరిగిన పంపకాలను ఉల్లంఘిస్తూ భీమా ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వం అనడం చూస్తే ఈ రెండు ప్రభుత్వాలు తమకు రాజరిక సంప్రదాయంలో అధికారం వచ్చిందని అనుకుంటున్నాయేగాని, ప్రజాస్వామ్యంలో ఉన్నామని అనుకోవడం లేదు. ఇది ఒకరకమైన బరితెగింపు వాదన. ఇందులో రెండు ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి.

వాస్తవానికి పట్టిసీమ నుంచి ఏపీకి వచ్చే 22 టీఎంసీలు రాయలసీమకు రావాలి. వీటితోపాటు 9 టీఎంసీల ఆవిరి జలాల కింద కట్టిన పులిచింతలలో మిగతా 36 టీఎంసీలు ఉంటాయి. ఈ ప్రకారం అది ఒకటిన్నర సార్లు నిండే అవకాశం ఉన్నదనే అంచనాతో 54 టీఎంసీలుగా లెక్క తేల్చారు. ఈ నీరు డెల్టా స్థిరీకరణ కోసమే. ఎగువ ప్రాంతాల్లో రిజర్వాయర్లు లేకపోవడం, అక్కడి వాళ్లు ఇంత కాలం గట్టిగా అడగకపోవడం వల్ల డెల్టా స్థిరీకరణకు పులిచింతల కట్టుకొని ఆ నీటిపై హక్కు సంపాదించుకున్నారు. అల్మట్టి ఎత్తు పెంచడం మొదలు పెట్టిన రోజుల్లో దాని వల్ల నీటి ప్రవాహం తగ్గిపోతే డెల్టా మూడో పంటకు తగినన్ని నీళ్లు సకాలంలో అందవేమో అనే అనుమానంతో ముందు చూపుతో పులిచింతల కట్టుకున్నారు.

తరతరాలుగా రాయలసీమకు నీళ్లు అందకుండా, ప్రాజెక్టులు కట్టకుండా చేసి, జీవో 69 తెచ్చి సాగర్ ఎగువన సకల అన్యాయాలకు పాల్పడ్డందు వల్ల పులిచింతలలోకి వెళ్తున్న 54 టీఎంసీలు రాయలసీమకు చెందాలి. తెలంగాణకు న్యాయంగా, హక్కుగా ఇవ్వాల్సిన నీళ్లు ఇచ్చేసి.. పట్టిసీమ నుంచి ఏపీ వాటాగా వచ్చే 22 టీఎంసీలు రాయలసీమకు ఇవ్వాలి. ముఖ్యంగా గాలేరు నగరి, హంద్రీ నీవాకు వీటిని నికర జలాలుగా కేటాయించాలి. నీటి పంపకాల్లో న్యాయ దృష్టి ప్రదర్శించడం అంటే ఇదే. గతంలో డెల్టా వాళ్లు ఎగువ ప్రాంతాలకు చేసిన అన్యాయాలకు ఇది కనీస ఊరట. కేంద్రం రెండు రాష్ట్రాల జల వివాదాల పరిష్కారానికి ఏర్పాటు చేసిన కమిటీ అయినా, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అయినా ఇలా ఆలోచిస్తేనే నీటి పంపిణీలో న్యాయం జరిగినట్లవుతుంది. ☆

(63వ పేజీ తరువాత...)

వాదించలేదు. చివరికి 1900లో ఏర్పడిన లేబర్ పార్టీ కూడా ఈ నినాదాన్నే అందుకుంది. అయినప్పటికీ, పార్టీ 1947లో కమ్యూనిస్ట్ మేనిఫెస్టో పునర్ముద్రించి అందరికీ పంచింది. కనీసం అలా మార్క్స్, ఎంగెల్స్ పట్ల తమ కృతజ్ఞత చాటుకున్నారు వాళ్ళు. అయినా, తరువాతి తరం లేబర్ పార్టీ నాయకులు 'మార్క్సిజానికి కాలం చెల్లింది' అన్న హెరాల్డ్ విల్సన్ అభిప్రాయంతో ఏకీభవించారు.

మార్క్స్ మాతృదేశం జర్మనీలో మార్క్సిస్టు భావజాలమే ఎస్‌డిపి (రాజకీయ పార్టీ) కి మూల సిద్ధాంతంగా మారింది. అయితే, అక్కడ విప్లవవాదులు, రివిజనిస్టు వర్గాల మధ్య పోరాటం చాలా కాలం కొనసాగింది. మార్క్స్ శిష్యుడు కార్ల్ కౌట్స్కీని అనుసరించిన విప్లవవాదులు దాస్‌కాపిటల్‌లోని సైద్ధాంతిక దృక్పథాన్ని బలపర్చారు. ఇతర్లు (ఎడువార్డ్ బెర్న్‌స్టైన్ వగైరా) సార్వత్రిక ఓటు హక్కు, అధిక ఆదాయ వర్గాలకు ఎక్కువ పన్ను వంటి తక్షణ డిమాండ్లను తమ కార్యక్రమంలో పెట్టారు. బెర్న్‌స్టైన్ కొంతకాలం ఇంగ్లండులో గడిపాడు. రోసా లక్సెంబర్గ్ "ఇతడు లోకాన్ని ఇంగ్లిషు కళ్ళద్దాలతో చూస్తాడు" అంది.

తరువాతి రోజుల్లో విలువ సిద్ధాంతం గురించి మార్క్స్‌తో విభేదించాడు బెర్న్‌స్టైన్. తొలి రోజుల్లో ఎస్‌డిపి విప్లవ కార్మిక ఉద్యమమని చెప్పుకున్నా, క్రమంగా అది మరో పార్లమెంటరీ పార్టీగా మారిపోయింది.

అంటే స్వంతదేశంలో మార్క్స్‌కు పెద్దగా ఆదరణ లభించలేదు. ఇంగ్లండు అతణ్ణి విస్మరించింది. కాని అనూహ్యంగా రష్యా (దాస్ కాపిటల్‌లో దీని ప్రస్తావన కూడా ఉండదు) లో భూకంపం సృష్టించింది. ఆ పుస్తకం అక్కడి రాడికల్స్ అందర్నీ ఆకర్షిస్తుందని తెలిసి చివరి రోజుల్లో రష్యాలో విప్లవం వచ్చే అవకాశం లేకపోలేదను కున్నాడు మార్క్స్.

దాస్‌కాపిటల్ రష్యన్ అనువాదకుడు నికోలాయ్ డేనియల్సన్ నరోద్నిక్ ఉద్యమ నాయకుడు కూడా. పెట్టుబడిదారీ దశకు చేరుకోకుండానే, రష్యాలో భూస్వామ్య విధానం నుండి సోషలిస్టు దశకు చేరుకోవచ్చునని నమ్మితారు వీళ్ళు. పెట్టుబడిదారీ అమానుషత్వాన్ని గురించి మార్క్స్ రాసింది చదివి ఆర్థిక పరిణామంలో ఈ దశ (పెట్టుబడిదారీ విధానం) రాకూడదని కోరుకున్నారు. ☆

రోహిత్ ఆశయ సాధనకు ఏం చేయాలి?
డా.జిలుకర శ్రీనివాస్ వ్యాసానికి జవాబు

పి. వరవరరావు, జి.కళ్యాణరావు, సి.ఎస్.ఆర్.ప్రసాద్,
వి.చెంచయ్య, వరలక్ష్మి, విరసం కార్యవర్గం

రోహిత్ వేముల ఆశయ సాధనకు ఏం చేయాలి? అని డా.జిలుకర శ్రీనివాస్ బహుజన కెరటాలు-జనవరి-ఫిబ్రవరి 2016 (రోహిత్ వేముల ప్రత్యేక సంచిక) వ్యాసంలో ఎక్కువభాగం ఏ రాజకీయ పార్టీ గానీ, ప్రజా సంఘం గానీ, విద్యార్థి సంఘం గానీ ఏమీ చేయలేదనేదే రాసారు. ఒక లక్ష్యాన్ని సాధించడానికి ముఖ్యంగా రోహిత్ వేముల వంటి అసాధారణ యువ మేధావి స్వీయ త్యాగానికి ఆయన స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి ఎంతో చేయాల్సి ఉందనే అసంతృప్తి, అసహనం, తపన, ఆకాంక్షల నుంచి అట్లా రాయడాన్ని అర్థం చేసుకోవచ్చు. కాని ఆ సందర్భంలో సిపిఐ మావోయిస్టుపై, విరసం పైన, విరసం సభ్యులు డా.సి.కాశీంపైన, వరవరరావులపైన చేసిన ఆరోపణలపై, వ్యాఖ్యలపై స్పందించడానికి మాత్రమే ఇది రాస్తున్నాము.

డా.జిలుకర శ్రీనివాస్ దృష్టికి రాకపోవచ్చు గానీ మార్చ్ నెలలోనే సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ 'దేశంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు జరిగిపోతున్నాయి. రోహిత్ వేముల (హెచ్‌సియు) ఆత్మహత్య కన్హయకుమార్ (జెఎన్‌యు) తదితరుల మీద రాజద్రోహం కేసు, అరెస్టులు, కాశీం మీద రాజద్రోహం కేసులు బనాయింపులు-ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దాడి తీవ్రత కొనసాగుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. హెచ్‌సియు తాజా ఉదాహరణ. వీటికి వ్యతిరేకంగా దేశంలో, రాష్ట్రంలో ప్రజా ఆందోళనలను మలచడానికి విప్లవ శక్తులు ఎక్కడికక్కడ కృషిచేయువలసిన కర్తవ్యం మనముందుంది.'

అని తన శ్రేణులకు, విప్లవాభిమానులకు పిలుపునిచ్చింది. ఈ ప్రకటన నాటికి మార్చ్ 22 హెచ్‌సియులోని అప్పారావు దౌర్జన్యపూరిత పునరాగమనం జరుగలేదు గానీ ఆ విషయాలను కూడా గణనలోకి తీసుకొని సిపిఐ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటన మీడియాకు పంపాడు. అందులో 'రోహిత్ వేముల ఆత్మహత్య మూలాలను ఛేదించండి. గాట్స్ ఒప్పందాన్ని వ్యతిరేకించండి' అని విద్యార్థులకు పిలుపునిస్తూ రోహిత్ వేముల డిసెంబర్ 18, 2015న వైస్‌చాన్సలర్‌కు రాసిన లేఖను, తన తాత్విక దృక్పథాన్ని వివరించే ఫేస్‌బుక్ రచనను పేర్కొంటూ-రోహిత్ వేముల ఆత్మహత్యకు, దళిత, ఆదివాసీ, ముస్లిం మైనారిటీలపై దాడికి సామ్రాజ్యవాద-దళారీ బ్రాహ్మణీయ భూస్వామ్య రాజకీయార్థిక విధానాలు పునాదిలో, సాంస్కృతిక, విద్యా విధానాలు ఉపరితలంలో ఎట్లా దోహదం చేస్తున్నాయో వివరించడానికే విద్యారంగాన్ని కాషాయీకరించే ప్రైవేటీకరించే నైరోబీ గాట్స్ ఒప్పందం నుంచి భారత్ బయటికి రావాలని పిలుపు ఇచ్చాడు. (17వ తేదీ సాక్షి దినపత్రికలో వచ్చిన ప్రకటన చూసి ఉంటారు.)

(దేశంలో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు జరిగి పోతున్నాయి. రోహిత్ వేముల(హెచ్‌సియు) ఆత్మహత్య కన్హయ, ఉమర్(జెఎన్‌యు) తదితరుల మీద రాజద్రోహ కేసు, అరెస్టులు కాశీం మీద రాజద్రోహ కేసులు బనాయింపులు, ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దాడి తీవ్రత కొనసాగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా దేశంలో ప్రజల నిరసన రోజురోజు కూ పెరుగుతున్నది. విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలు పెరుగుతున్నాయి. హెచ్‌సియు తాజా ఉదాహరణ. వీటికి వ్యతిరేకంగా దేశంలో, రాష్ట్రంలో ప్రజా ఆందోళనలను పెంచడానికి విప్లవ శక్తులు ఎక్కడికక్కడ కృషి చేయవలసిన కర్తవ్యం మన ముందు ఉంది.)

ఈ ప్రకటనలో తెలంగాణ ప్రభుత్వం నాలుగు వేల ప్రభుత్వ పాఠశాలలను (ముఖ్యంగా ఉర్దూ మీడియం పాఠశాలలను) మూసివేస్తూ 250 నమూనా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించే పథకంలోని కుట్రను ఎండగట్టండి అని అన్నాడు.

డా.జిలుకర శ్రీనివాస్‌కు రోహిత్ వేముల ఆత్మహత్యకు ముందు, వెనుక దళిత, బడుగు వర్గాల, ముస్లిం మైనారిటీల, ఆదివాసుల పోరాటాలు-రాజ్యం అణచివేత, హింస, అగ్రవర్ణాల దాడులను సామ్రాజ్యవాద-దళారీ బ్రాహ్మణీయ భూస్వామ్య దాడులుగా చూడడం రుచించకపోవచ్చు. వర్గ దృష్టితో చూడడం ఇష్టం లేకపోవచ్చు. దీనిని గ్రీన్‌హంట్ ఆపరేషన్-మూడవ దశ ప్రజల మీద యుద్ధంగా చూడడాన్ని ఆయన అంగీకరించకపోవచ్చు. రాజ్య స్వభావం గురించే ఆయనకు మౌలిక విభేదం ఉండవచ్చు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ తెలంగాణ ప్రభుత్వం మావోయిస్టు పార్టీపై చేస్తున్న దాడులు, గాలింపు చర్యలు, పోలీసు కాల్పులు, ఎన్‌కౌంటర్ హత్యలు ఆయన దృష్టికి రావడం లేదా? ఆయన చూడదల్చుకోలేదా? ఆదిలాబాదు జిల్లాలో మావోయిస్టుల కోసం గ్రేహౌండ్స్ గాలింపు చర్యల్లో భాగంగా నాలుగుసార్లు కాల్పులు జరిపారు. ఖమ్మం జిల్లాలో చెర్ల మండలంలో నర్సింగరావు అనే ఆదివాసీ 'ఎన్‌కౌంటర్'లో అమరుడయ్యాడు. వికారుద్దీన్ అతని సహచరులది అత్యంత హేయమైన జుడీషియల్ మర్డర్ అని మావోయిస్టు పార్టీ పలుమార్లు ప్రకటించింది. అది కేంద్రంలో బిజెపికి చేరువయ్యే చర్య అని పేర్కొన్నది. అవన్నీ అలా వుంచి ప్రత్యేక తెలంగాణ పోరాటం నుంచి, విద్యార్థి రంగం నుంచి వచ్చి మావోయిస్టు పార్టీలో చేరిన వివేక్, శృతి, సాగర్, సృజన, యూసుఫ్‌బీలను తెలంగాణ గ్రేహౌండ్స్ బీజాపూర్(జూన్), మొద్దుగుట్ట(సెప్టెంబర్, వరంగల్) 2015లో, మార్చ్(బొట్టెంతోగు, ఖమ్మం సరిహద్దు) ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడాన్ని జిలుకర

శ్రీనివాస్ ఎట్లా చూస్తాడు? తెలంగాణ ప్రభుత్వం మావోయిస్టు పార్టీపై, దాని అనుబంధ సంఘాలనే పేరుతో ఆర్ఎస్‌యు వంటి ప్రజా సంఘాలపై, చివరకు ఆర్డిఎఫ్‌ను నిషేధించడాన్ని కూడా ఎట్లా అర్థం చేసుకుంటాడు? నిషేధాన్ని కొనసాగించడమే కాదు మావోయిస్టు పార్టీ ఏర్పడి 10 సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య వేదిక సభ, ర్యాలీ ఏర్పాటు చేస్తే ఏడు వందలమందిని అరెస్టు చేసి రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా హాలు మీటింగును కూడా రద్దు చేయడాన్ని శ్రీనివాస్ ఎట్లా చూస్తాడు?

ఇవన్నీ ఎందుకు ప్రస్తావించామంటే మోకాటికీ బట్టతలకు ముడివేసిన చందంగా కాశీం మీద తెలంగాణ ప్రభుత్వం రాజద్రోహనేరం కేసుపెట్టడం కెసిఆర్, మావోయిస్టు పార్టీ, వామపక్ష పార్టీలు సంఘాలు, ఎంఆర్‌పిఎస్ వంటివి కూడబలుక్కొని అగ్రవర్ణాలను కాపాడడానికి, రోహిత్ వేముల ఆత్మహత్యానంతర ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికేనని సిద్ధాంతీకరించాడు. ఇది ఆయనకే సాధ్యమైన కుతర్కం జడవాదం. దళిత, బహుజనులకు వామపక్ష విప్లవ శక్తులకు మధ్యన అపోహలు, అనుమానాలు రేకెత్తించి చీల్చడానికి తప్ప ఇది ఎందుకూ కొరగానిది. నిజానికిది కెసిఆర్ వంటి వారికే సారాంశంలో ఉపయోగపడే వాదన.

డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అగ్రవర్ణ స్వభావాన్ని గానీ, రాజ్య స్వభావాన్ని గానీ అర్థం చేసుకోలేకపోతున్నాడనుకోవాలి. ఆయనకు డా.సి.కాశీంపై సబ్జెక్టివ్ వ్యతిరేకత ఉన్నట్లు ఉన్నది. లేకుంటే ఆయన డా.సి.కాశీంను కేంద్రం చేసుకొని మావోయిస్టు పార్టీపై దాడిచేయడు. డా.సి.కాశీంపై వరంగల్‌లో పోటా కేసు పెట్టేనాటికి ఆయన తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ విద్యార్థి నాయకుడు. అప్పటికే పోటా చట్టాన్ని ఎత్తివేసే సమీక్ష జరుగుతున్నది. ఆ తర్వాత పోటాను రద్దుచేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1967 అమెండ్‌మెంట్‌లో భాగంగా యుఎపిఎలో చేర్చారు. ఇపుడు డా.సి.కాశీంపై విశ్వవిద్యాలయ అధ్యాపకుడుగా కూడా యుఎపిఎ కింద చాలా కేసులున్నాయి. అయితే ఎందుకు అరెస్టు చేయలేదు? ఇటువంటి అనుమానాలు, అపోహలు కలగడానికే అరెస్టు చేయలేదు. 1986లో రాంనగర్ కుట్రకేసు టాడా కింద పెట్టినపుడు, నల్లా ఆదిరెడ్డి మొదలైన వారితో పాటు కె.జి.సత్యమూర్తి, గద్దర్‌ల మీద కూడా పెట్టారు. 1990లో వాళ్లు అజ్ఞాతం నుంచి బయటికి వచ్చాక వాళ్లను అరెస్టు చేయలేదు. 2005లో కర్ణాటక రాయలసీమ సరిహద్దులో సిఆర్‌పిఎఫ్ జవాన్లను చంపి ఆయుధాలు ఎత్తుకపోయిన కేసులో గద్దర్‌ను, వరవరరావును ముద్దాయిలుగా చూపారు(ఎ-9, ఎ-10) రాయలసీమ నుంచి కొండయ్య మొదలైన ఎందరినో అరెస్టుచేసి ఏడేళ్లు బెయిలు రాకుండా జైల్లో పెట్టారు. గద్దర్‌ను, వరవరరావు ఇద్దరూ బయట రోజూ సభల్లో తిరుగుతున్నా అరెస్టు చేయలేదు. 2005-6లో వరవరరావు జైల్లో ఉన్నప్పుడు ఈ కేసులో వారంటు పంపితే కొండయ్య మొదలైన వారికి న్యాయ సహాయం లభించడం సాధ్యమవుతుందని ఆశించినా వారెంటు పంపలేదు. డా.కాశీంపై కేసు పెట్టడం అక్రమమని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదు వందల మంది రచయితలు, మేధావులు, ప్రజాసంఘాలు, దళిత, బహుజన సంఘాలు అందరూ ముక్త కంఠంతో ఆ కేసు ఎత్తి వేయాలని డిమాండు చేస్తుంటే ఆ కేసు పెట్టడం రోహిత్ వేముల న్యాయపోరాటాన్ని పక్కదారి పట్టించే కుట్ర అనడం-అది కూడా కెసిఆర్ మావోయిస్టు పార్టీ కలిసి అగ్రవర్ణాలను కాపాడడానికి(రోహిత్ వేముల న్యాయపోరాట ఉద్యమం నుంచి) చేసిన కుట్ర అనడం డా.జిలుకర శ్రీనివాస్‌కే చెల్లింది.

ముస్లింమైనారిటీల మీద ప్రేమ అక్బరుద్దీన్ మీద ప్రేమ అయితే ఎట్లా? అక్బరుద్దీన్‌ను ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లోనూ పెట్టగలదు. ఎంఐఎంతో పొత్తు పెట్టుకొని లేదా అవగాహన కొచ్చి నగర ఎన్నికలు గెలవగలదు. అసెంబ్లీలో అధికార పక్షం ఆమోదించే ప్రతిపక్షంగా అనుమతించగలదు.

డా.సి.కాశీం ఆంధ్ర సారస్వత పరిషత్తు(ఇపుడు తెలంగాణ సారస్వత పరిషత్తు)ప్రాచ్య కళాశాలలో పదేళ్లు ఎంఏకు పాఠాలు చెప్పాడు. ప్రిన్సిపాల్‌గా చేసాడు. బహుశా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ లెక్చరర్ పోస్టుకు అప్లై చేసిన వాళ్లలో ఆయనకొక్కనికే అసిస్టెంట్ ప్రొఫెసర్ కాదు గదా అసోసియేట్ ప్రొఫెసర్ అయ్యే అర్హతలు కూడా ఉన్నాయి. ఎబివిపి, కొందరు ఆర్ఎస్ఎస్ ప్రొఫెసర్లు డా.సి.కాశీంను ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యోగంలోకి ప్రవేశించకుండా ఎన్నో రకాల అడ్డంకులు సృష్టించారు. విరసం భావజాలం ఉందనే నెపంతో విసి మీద ఒత్తిడి తెచ్చి కాశీం ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేసారు. అయినా కాశీంకు ఉండే అర్హతల వలన పక్కన పెట్టలేక అనివార్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యోగానికి ఎంపిక చేసారు. ఆ విషయాలను డాక్టర్ జిలుకర శ్రీనివాస్ ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతున్నాడు. ఇందులో సబ్జెక్టివ్ ఈర్ష్య ఎంత ఇమిడి ఉందో ఆయన విరసం కార్యవర్గ సభ్యుడన్న సైద్ధాంతిక విభేదమూ అంతే ఉంది.

ఇంక విరసం కార్యవర్గ సభ్యుడుగా నాయకుడుగా డా.సి.కాశీం రోహిత్ వేముల ఆత్మహత్య సందర్భమే కాదు. ప్రతి సందర్భంలోనూ, హెచ్‌సియు పూర్వ విద్యార్థిగానూ, తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్(టిఎస్ఎఫ్) స్థాపకుడిగానూ, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారునిగానూ మొత్తంగా దళిత, బడుగు, మైనారిటీ, పీడిత వర్గాలపై దాడిలో భాగంగా అగ్రవర్ణాల, రాజ్య దాడిని ప్రతిఘటించే ప్రతి పోరాటానికి అగ్రభాగాన ఉన్నాడు. రోహిత్ వేముల ఆత్మహత్య కన్న ముందు జనవరి 15వ తేదీన హెచ్‌సియుకు, వెలివాడ శిబిరానికి వెళ్లిన ప్రజాసంఘాల నిజనిర్ధారణ కమిటీలో ఆయన ఉన్నాడు. రోహిత్ వేములతో మాట్లాడాడు. ఆయన అసంతృప్తిని, తపనను కాశీం అర్థం చేసుకున్నాడు. ఆయన మీద కేసు పెట్టడానికన్న ముందే ఎన్నో ఉద్యమాల్లో ఆయన ముందు భాగాన ఉన్నాడు. అదే విషయాన్ని జనవరి 21 తనపై కేసు పెట్టాక 'నిషిద్ధ మానవుల' జాబితాలో తనను రాజ్యం రోహిత్ వేముల సరసన చేర్చడాన్ని ప్రస్తావించాడు. ఒక నిషిద్ధ మానవునిగా నిషిద్ధ మానవుడు రోహిత్ వేములకు జరగాల్సిన న్యాయం కోసం నినదించాడు. రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోగానే హెచ్‌సియు 'వెలివాడ'కు వెళ్లిన ప్రజాసంఘాల బృందం(కెఎన్‌పిఎస్ దుడ్డు ప్రభాకర్, పికెఎం కోటి, పిడిఎం రాజా, దళిత ఉద్యమ నాయకుడు శ్రీహరి)తో పాటు వరవరరావు వెళ్లి విరసం, ఆర్డిఎఫ్‌ల తరపుననే కాదు మావోయిస్టు పార్టీ తరపున కూడా హెచ్‌సియు జెఏసి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. కా.వివి రోహిత్ వేములది 'వ్యవస్థీకృత హత్య' అన్నాడు.

ఈ స్మృతి-మనుస్మృతి-స్మృతి ఇరానీ కూడాను అన్నాడు. దత్తాత్రేయ లేఖ ఎమ్మెల్సీ రామచంద్రరావు రచన అన్నాడు. రోహిత్ వేముల నీలాకాశంపై ఎర్రసూర్యుణ్ణి చూడాలనుకున్నాడన్నాడు. అయితే విద్యార్థి జెఎసి ఏ పోరాట రూపం తీసుకుంటే ఆ పోరాటానికి మా మద్దతు ఉంటుంది 'రోహిత్ యాక్టు' కావాలన్నా, మరే డిమాండ్ అయినా విద్యార్థులు, జెఎసి ఆకాంక్షగా, పోరాట రూపంగా మా మద్దతు ఉంటుందన్నాడు. మాకు రోల్‌మాడల్ హెచ్‌సియులో విస్ఫోటనం, దళిత మానిఫెస్టో, డిఎస్‌యు, వాటిని సునీత ఆత్మహత్య సందర్భంగా కామ్రేడ్ ఎర్రోళ్ల వీరాస్వామి నాయకత్వంలో జరిగిన పోరాటాలు కావచ్చు. అవి మా ప్రసంగాల్లో, రచనల్లో వివరించవచ్చు.

కాని విరసం, ఆర్‌డిఎఫ్, మావోయిస్టు పార్టీ-ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన గమ్యం-గమనం నిర్దేశించుకుంటూనే పార్లమెంటులో బిల్లుపెట్టాలని మిలిటెంట్ ఉద్యమాలను ప్రోత్సహించినట్లుగానే జెఎసి చేపట్టిన ప్రతి పోరాట రూపాన్ని బలపరుస్తూనే వాటిని మిలిటెంటుగా మార్చే ప్రయత్నం చేసింది. అందుకే హెచ్‌సియు జెఎసితో ఉన్న విరసం సభ్యుడు రీసర్చ్ స్కాలర్ ఉదయ్‌భానుపై తెరాస ప్రభుత్వానికి అంతకన్నెర్ర. హెచ్‌సియులో విద్యార్థి ఉద్యమ నాయకుడుగా విద్యార్థుల మిలిటెంట్ పోరాటాలలోనే కాదు, ఇటుక బట్టీ కార్మికుల పోరాటాల్లో కూడా పాల్గొని పోలీసు కేసులు, చిత్రహింసలకు గురయిన విరసం కవి, నాటక ప్రయోక్త, వక్త, ప్రతిభా శాలి ఉదయ్‌భానుపై, మరో రీసర్చ్‌స్కాలర్ భాస్కర్‌పై, మహిళా విద్యార్థులపై, ప్రొఫెసర్లపై పోలీసులు చేసిన దాడి, హింస గురించి డా. జిలుకర శ్రీనివాస్ ఏమంటాడు? ప్రత్యేకించి మార్చ్ 22న క్యాంపస్‌లో నీళ్లు, విద్యుత్తు, మెస్‌లు బంద్ చేసినపుడు వంట వండుకునే ప్రయత్నం చేసిన విద్యార్థులపై విరుచుకపడిన పోలీసులు భాస్కర్‌ను చిత్రహింసలు పెట్టి విసిరేసిన తీరు, ఉదయ్‌భానును వ్యాన్‌లో వేసుకొని తీసుకెళ్లి శరీరమూ, తలా- ఏ అవయవమూ వదలకుండా చిత్రహింసలు పెట్టి శవాకారం చేసి తీసుకొచ్చి క్యాంపస్‌లో వదిలేసిపోతూ 'నిన్ను చంపితీరుతామని' ఎస్‌ఐ చేసిన హెచ్చరిక గురించి డా.జిలుకర శ్రీనివాస్ ఏమంటాడో గానీ విరసం కవి గనుక ఉదయ్‌భాను 'నేనింకా బతికే ఉన్నాను' అని రాజ్యానికి జవాబు ఇస్తాడు. డా.సి.కాశీంపై కేసు పెట్టారు గానీ అరెస్టు చేయలేదు గదా? అని ప్రశ్నించే డా.జిలుకర శ్రీనివాస్ 'ఉదయ్‌భానును చిత్రహింసలు పెట్టారు, చంపుతానన్నారు గానీ, చంపలేదు కదా?' అని అంటాడా? కామ్రేడ్ వీరాస్వామి వలెనో, వివేక్, శృతి, సాగర్, సృజన, యూసుఫ్‌బీ, రమేశ్ వలెనో 'ఎన్‌కౌంటర్' అయితే తప్ప అది కుట్రగా డా.జిలుకర శ్రీనివాస్‌కు కనిపించక పోవచ్చు.

రోహిత్‌కు న్యాయం జరగటం కోసం జరిగిన అన్నిరకాల పోరాట రూపాలలో విరసం భాగమయ్యింది. విరసం సభ్యుడు ఉదయ్‌భాను హెచ్‌సియులో జరిగిన పోరాటంలో ఆద్యంతం పాల్గొన్నాడు. విరసం రోహిత్ వేముల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో రెండు, విజయవాడలో బహిరంగసభలు నిర్వహించింది. రోహిత్ మీద విరసం సభ్యులు రాసిన రచనలతో 'వెలివాడే తొలిపొద్దై' సంకలనం తెచ్చింది. అందరి 'షో'లు ముగిశాక ఇప్పటికీ కులనిర్మూలన పోరాట సమితి నాయకత్వంలో ఏర్పడి పనిచేస్తున్న రోహిత్ వేముల న్యాయ పోరాట కమిటీలో విరసం భాగస్వామిగా ఉండి పనిచేస్తున్నది.

కాశీం, ఆయన పనిచేసే విరసం కాశీంపై పెట్టిన కుట్ర, రాజద్రోహం కేసును విడిగా చూడడం లేదు. రోహిత్ వేముల, ఆయన ఆత్మహత్య చుట్టూ నిర్మాణమవుతున్న దళిత, ఆదివాసీ, ముస్లిం మైనారిటీ, ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులపై దాడిలో భాగంగానే చూస్తున్నాయి. జెఎన్‌యులో కన్హయ్యకుమార్, ఉమర్‌ఖాలిద్, అనిర్బన్‌ల నాయకత్వంలోని జెఎన్‌యు విద్యార్థి సంఘం వామపక్ష, విప్లవ విద్యార్థి సంఘాలు, కశ్మీరీ మొదలు జాతుల విముక్తి పోరాటాలపై దాడిగానే చూస్తున్నాయి. ఈ దాడుల నుంచి, ఈ ప్రతిఘటన నుంచి మేము హెచ్‌సియులో కె.వై. రత్నాన్ని, తథాగత్‌ను విడిగా చూడనట్లే ఢిల్లీ యూనివర్సిటీ నుంచి జి.ఎన్. సాయిబాబాను, ప్రొఫెసర్ ఎస్.ఆర్. గిలానీని విడిగా చూడడం లేదు. డాక్టర్ సి.కాశీంపై రాజద్రోహ నేరం మొదలు, జి.ఎన్. సాయిబాబా జైలు నిర్బంధం, ఆయనను ఉద్యోగంలోకి తీసుకోవద్దని ఎబివిపి ఎదురుదాడి, అన్నిటి నేపథ్యం ఒకటే. మేము రోహిత్ వేముల నుంచి కాశీం, ఉదయ్‌భానులది కొనసాగింపు అనుకుంటున్నాం గానీ-దృష్టి మళ్లించడం అనుకోలేదు. తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అది కావచ్చు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం అది కావచ్చు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతిని ఘనంగా జరిపి 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పుతామని శంకుస్థాపన చేయడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం రోహిత్ వేముల న్యాయ పోరాటం నుంచి దళితుల దృష్టి మళ్లించాలని ప్రయత్నం చేయవచ్చు. అటువంటి కుట్ర, పథకం ఇక ముందు కూడా రచించవచ్చు. ప్రభుత్వమే పూనుకొని వర్గీకరణ కోసం ఒక పెద్ద సభ ఏర్పాటు చేసి, అందులో మంత్రులు పాల్గొని శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రం దగ్గరికి పోతామని ప్రకటించి ఉద్యమంపై నీళ్లు చల్లనూవచ్చు. కాని డా.జిలుకర శ్రీనివాస్ అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే డా.సి.కాశీంపై రాజద్రోహ నేరం కేసుపెట్టగానే విరసం గానీ, మావోయిస్టు పార్టీ గానీ ఆ మాట కొస్తే ఈ రెండింటితోనూ సంబంధం ఉన్నా, లేని ఉస్మానియా, తదితర విశ్వవిద్యాలయ విద్యార్థులు గానీ రోహిత్ వేముల గురించి ఆలోచించడం మానేయలేదు. డాక్టర్ జిలుకర శ్రీనివాస్ అర్థం చేసుకోగలిగితే, అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే మావోయిస్టు పార్టీ చరిత్రను గతం వర్తమానంతో నిలబడి భవిష్యత్తుతో నిరంతరం జరిపే సంభాషణగా, సంఘర్షణగా చూస్తుంది. అట్లాగే ప్రత్యేక అంశంలో ఉన్న విశ్వజనీనతను, విశ్వజనీనమయిన అంశాలలో ఇమిడి ఉన్న ప్రత్యేక అంశంగా గుర్తిస్తుంది. రోహిత్ వేముల ఆత్మహత్య జరుగగానే సునీత ఆత్మహత్యను, పదిమంది దళిత విద్యార్థుల రస్టికేషన్‌ను, ఇఫ్లూలో కశ్మీర్ విద్యార్థి లాకప్ హత్య వంటి ఆత్మహత్యను ఎన్నింటినో గుర్తుచేసుకున్నది. ఈ అన్నింటినీ సామ్రాజ్యవాద-దళారీ బ్రాహ్మణీయ భూస్వామ్య-రాజ్యా-హిందూత్వ దాడులుగా భావిస్తున్నది. ప్రతిఘటనను ఆదివాసీ, దళిత, ముస్లిం మైనారిటీ, రైతాంగ, కార్మిక, విద్యార్థి బహుళ ప్రజా ప్రతిఘటనా పోరాటాలుగా చూస్తున్నది. ఒక్క మాటలో గ్రీన్‌హంట్ ఆపరేషన్ మూడవ దశ దాడి పేరిట ప్రజల మీది యుద్ధంగా చూస్తుంది. ప్రత్యేకించి విద్యార్థులనయితే ఎర్రోళ్ల వీరాస్వామి ఆదర్శంతో పోరాడవలసిందిగా పిలుపునిస్తుంది.

మార్క్స్ పెట్టుబడి - రచనా క్రమం

ఫ్రాన్సిస్ వీన్

అనువాదం: ముక్తవరం పార్థసారథి

(10)

(గత సంచిక తరువాయి...)

దాస్‌కాపిటల్ అచ్చయిన శతాబ్దం తర్వాత బ్రిటిష్ ప్రైమ్మినిస్టర్ హెరాల్డ్ విల్సన్ ఈ పుస్తకం చదవడం తనవల్ల కాలేదని గర్వంగా ప్రకటించుకున్నాడు. "ఒకటి రెండు పేజీలు చదివానో లేదో, రెండు లైన్ల టెక్స్టు, ఒక పేజీ ఫుట్ నోటుంది. ఇది అన్యాయం కదా!" ఇది పచ్చి అబద్ధం. ఫుట్‌నోట్స్ ఉన్న మాట నిజమే గాని ఆయన చెప్పినంత దారుణంగా ఏమీ లేవు. అయితే, ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటుంది. హెరాల్డ్ విల్సన్ ఒక్కడే కాదు చాలా మంది ఈ పుస్తకం చదవటానికి సందేహిస్తారు. జటిలంగా ఉంది,అర్థం కాదు అంటారు.

పాఠకుల స్పందన ఇలా ఉంటుందని ఊహించారు మార్క్స్. పుస్తకానికి రాసిన ముందు మాటలో, "మొదటి అధ్యాయంలో ముఖ్యంగా సరుకుల విశ్లేషణ చాలా మందికి కొరుకుడు పడదు. విలువ గురించి నేను వీలైనంత సరళంగా రాయటానికే ప్రయత్నించాను. విలువ రూపం (వాల్యూ ఫామ్) సులభంగా చదవవచ్చు. మానవ మస్తిష్కం రెండు వేల సంవత్సరాలుగా ఈ విషయాల గురించి కూలంకషంగా తెలుసుకోవటానికి ప్రయత్నిస్తూనే ఉంది. అందువల్ల 'సరుకుల విశ్లేషణ' తప్ప పుస్తకమంతా జటిలంగా ఉందనటం భావ్యం కాదు. అయితే, కొత్త విషయాలను చదివి అర్థం చేసుకోవాలనే కోరికా, స్వంతంగా ఆలోచించ గలిగిన శక్తీ పాఠకులకుండాలి" అంటాడు.

కాని ఎంగెల్స్ కూడా మార్క్స్ చేసిన ఈ వాదనను

అంగీకరించినట్టు లేదు. పుస్తకం కంపోజింగ్ దశలో ఉన్నప్పుడు, సైద్ధాంతిక వాదనలను విడగొట్టి, వేర్వేరు శీర్షికలు పెట్టకపోవటం పెద్ద పొరపాటన్నాడు. "ఇలా చెయ్యడం వల్ల అది స్కూల్ టెక్స్టుబుక్ లాగ కనిపిస్తే కనిపిస్తుంది గాని, పాఠకులకు సులభంగా అర్థమవుతుంది. పాఠకులు (పండితులు కూడా) ఇప్పుడు ఈ రకంగా (నీలాగ) ఆలోచించటం మానేసారు. వాళ్ళకు వీలైనంత సులభంగా చెప్పటానికే మనం ప్రయత్నించాలి". తన మిత్రుని సలహాను పాటించి, ప్రూఫులు దిద్దేటప్పుడు మార్క్స్ కొన్ని చిన్న చిన్న మార్పులు చేసాడు. అయితే దానివల్ల పఠనా సౌలభ్యం ఏమీ పెరగలేదు. చివరి ప్రూఫ్ చూసి "పుస్తకం ఇలాగే వదిలేస్తావా!" అంటూ ఆందోళన వ్యక్తపరిచాడు ఎంగెల్స్. "రెండవ అధ్యాయంలో నాలుగు వందల పేజీలున్నాయి- దాన్ని కేవలం రెండు సెక్షన్లుగా విభజించావు. పైగా ఉదాహరణలు మరీ ఎక్కువైపోయాయి. ఇవి పాఠకుల ఆలోచనలకు అడ్డు తగుల్తాయి. ఉదాహరణ తర్వాత చెప్పదలచుకున్న విషయాన్ని సంక్షిప్త పరచడంలో మళ్ళీ చెప్పలేదు. చివరికి పాఠకుడు ఈ ఉదాహరణలు, వాదనల పద్మవ్యూహం నుండి బయటపడే అవకాశమే లేకుండా చేసావు. ఈ ధోరణి విసిగెత్తిస్తుంది. గందరగోళంలో పడేస్తుంది"

పుస్తకాన్ని ఇష్టపడిన వాళ్ళకు కూడా తొలి అధ్యాయాలు చదవడం ఒక పరీక్షే. "మీ శ్రీమతి గార్ని మొదట "The working day, Co-operation, Division of labour and Machinery" ఆ తర్వాత 'Primitive Accumilation' చదవమని చెప్పండి. అవి అర్థం చేసుకోవటం చాలా సులభం" అంటూ హానోవర్‌లో ఉన్న తన మిత్రుడు లుడ్విగ్ కూగెల్‌మాన్‌కు రాసాడు మార్క్స్. ప్రముఖ బ్రిటిష్ సోషలిస్ట్ (రచయిత) విలియం మారిస్ "ఇందులోని చారిత్రక సమాజాన్ని బాగా ఎంజాయ్ చేసాను. కాని ఆర్థిక విషయాలే కొరుకుడు పడలేదు. మొత్తం మీద నాకు ఇది గొప్పగా ఉపయోగపడిందనటంలో సందేహం లేదు" (ఈయన గ్రంథాలయంలో ఉన్న దాస్‌కాపిటల్ మొదటి సంపుటం 1989 వేలంలో 50,000/- డాలర్లకు అమ్ముడుపోయింది)

'దాస్‌కాపిటల్'కు తొలిరోజుల్లో పెద్దగా ప్రాచుర్యం లభించక పోవటానికి కారణం ఇది సులభంగా అర్థం కాకపోవటమే తప్ప విషయం పట్ల ఉన్న రాజకీయ, సైద్ధాంతిక వ్యతిరేకత కాదు. "పుస్తకం గురించి ఎవరూ ఎందుకు మాట్లాడటం లేదో ఊహించలేక పోతున్నాను. ఎందుకంత నిరాదరణకు గురవుతున్నది?" అంటూ అసహనం ప్రదర్శించాడు మార్క్స్. పుస్తకాన్ని ఘాటుగా విమర్శిస్తూ, విమర్శలు/సమీక్షలు రాసి జర్మన్ పత్రికల్లో ప్రచురించాడు ఎంగెల్స్. తన మిత్రుల్ని కూడా ఇలాగే చెయ్యమని అర్థించాడు. (కనీసం

ఇలాగన్నా పాఠకుల్లో కొంత ఆసక్తి పెరుగుతుంది. అమ్మకాలు మెరుగుపడతాయి. జనాన్ని ఆకర్షిస్తుంది. అని ఆయన ఉద్దేశం)

"సమర్థిస్తూనో, విమర్శిస్తూనో పుస్తకం గురించి చర్చలు జరగాలి" అని రాసాడు కూగెల్‌మాన్‌కు. పాపం వీలైనంత సహాయం చేసాడాయన. రెండు హానోవర్ పత్రికల్లో వ్యాసాలు ప్రచురించాడు. కాని, పుస్తకం ఆయనకే అర్థం కాలేదు గనక, పాఠకులు అవి చదివి కొత్త విషయాలేమీ తెలుసుకోలేదు. "ఈ కూగెల్‌మాన్ ది వట్టి మట్టిబుర్ర" అంటూ రుసరుసలాడాడు ఎంగెల్స్.

1000 ప్రతులమ్ముడు పోవటానికి నాలుగేళ్ళు పట్టింది. పుస్తకం రెండవ ముద్రణకు (1872) రాసిన ముందుమాటలో "జర్మన్ కార్మిక వర్గం దీని వల్ల లాభపడితే అదే నాకు సరైన ప్రతిఫలం" అని మార్క్స్ ఎంతగా ఆశించినా, వాళ్ళు దాన్ని ఆచరించిన దాఖలాలు లేవు. కాకపోతే, జర్మన్ సోషలిస్టు జెసెఫ్ డీట్స్‌గెన్ అక్కడి పత్రికల్లో రాసిన వ్యాసాలతో వాళ్ళు దాస్‌కాపిటల్ లోని ముఖ్యాంశాలు తెలుసుకున్నారు.

"ఇంత దారుణ, దయనీయ పరిస్థితుల్లో రాసిన పుస్తకం మరొకటుందని అనుకోను. ఇది రాయటానికి ఎన్ని త్యాగాలు చేయ్యవలసి వచ్చిందో, ఎన్ని కష్టాలు అనుభవించావో తెలుసుకుంటే, బహుశా కార్మికులు దీని పట్ల మరింత ఆసక్తి కనబరుస్తారనుకుంటాను" అని రాసింది జెన్నీ మార్క్స్. అది నిజమే. కాని ఇంత పెద్ద ఇంత జటిలమైన పుస్తకాన్ని వాళ్లు ఎలా చదవగలరు? పైగా, అందులోని విషయం గురించి వాళ్ళకు కనీస పరిజ్ఞానం కూడా లేదు. "జర్మనులకు పొలిటికల్ ఎకానమీ అంటే ఏమిటో తెలియదు" అన్నాడు మార్క్స్.

అయితే, అన్ని దేశాల్లోనూ పరిస్థితి ఇంత నిరాశాజనకంగా లేదు.

1868 జనవరిలో పుస్తకం అచ్చయిన రెండు నెలల తర్వాత, లండన్ సాటర్‌డే రివ్యూ దీన్ని 'ఇటీవలి జర్మన్ ప్రచురణలు' లో ప్రముఖంగా ప్రచురించింది. "రచయిత అభిప్రాయాలు ఎంత ప్రమాదకరమైన వయినప్పటికీ, అతని వాదనను తప్పుబట్టలేం. అతని రచనా ప్రతిభకు జోహార్లు. పొలిటికల్ ఎకానమీ వంటి విసుగెత్తించే విషయాన్ని కూడా ఆసక్తికరంగా రాయగలిగాడు. అయితే ఐదు నెలల తరువాత కాంటెంపరరీ రివ్యూ మాత్రం మనిషి మౌలిక అవసారాలు- ఆకలి దప్పుల గురించి కూడా శాస్త్రీయంగా విశ్లేషించాడు" అని శ్లాఘించింది.

1872లో దాస్‌కాపిటల్ రష్యన్ అనువాదం వెలుగు చూసింది. "ఇందులోని విషయాలేవీ రష్యాకు వర్తించవు. అందువల్ల ప్రమాదకరం కాదు" అనే కారణాలతో జార్ గారి సెన్సార్లు దీన్ని అడ్డుకోలేదు. (పుస్తకం మీద రచయిత బొమ్మ మాత్రం ఉండకూడదన్నారు. ఇది వ్యక్తి పూజకు దారి తీస్తుందని వాళ్ళ భయం) "దీన్ని చదవగలిగిన వాళ్ళు కొద్దిమంది. అర్థం చేసుకోగలిగిన వాళ్ళను వేళ్ళ మీద లెక్కించవచ్చు". కాని ఏడాదిలోగా మూడు వేల ప్రతులమ్ముడు పోయాయి. పశ్చిమ (పెట్టుబడి) దేశాలలో ఈ పుస్తకం దొరకటమే కష్టమైంది గాని, పెట్టుబడిదారీ పూర్వ దశలో ఉన్న రష్యాలో మాత్రం ఆదరణ బాగా పెరిగింది. పత్రికలో సానుకూల సమీక్షలు వచ్చాయి. సెయింట్ పీటర్స్‌బర్గ్ జర్నల్ "జలపాతం వంటి రచయిత శైలి. ఈయన ఇతర జర్మన్ పండితుల్లాంటివాడు కాడు. పుస్తకం విసుగెత్తించదు. అర్థం కానిదేమీ లేదు. హాయిగా చదివిస్తుంది" అనటం చూసి తెగ సంతోషపడ్డాడు మార్క్స్.

అయితే, ఫ్రెంచి అనువాదం కొంత ఇబ్బందికరంగా మారింది. జర్మన్ ప్రచురణ తర్వాత, వెంటనే 1867లో అనువాదం ప్రారంభమయినప్పటికీ ఆ తర్వాత నాలుగేళ్ళలో ఐదుగురు అనువాదకులు ప్రయత్నించారు గాని పని ముందుకు సాగలేదు. చివరికి, ఒక స్కూల్ టీచర్ జోసెఫ్ రాయ్ చేస్తే తనకు అభ్యంతరం లేదన్నాడు మార్క్స్. అయినప్పటికీ, తొలి అధ్యాయాలు చదివి, 'ఇది మరీ ముక్కస్య ముక్కానువాదం లాగుంది'అని చాలా మట్టుకు స్వయంగా తిరగరాసాడు. చివరికి, పత్రికలో సీరియల్‌గా వెయ్యటానికి నిశ్చయించారు. (ఇలా చెయ్యటం వల్ల ఎక్కువ మంది చదువుతారు) 1875 మే నెలలో సీరియల్ ప్రారంభమైంది.

ఇంగ్లండులో, తొలి రోజుల్లో ఆశాజనకంగానే కనిపించినా, తరువాత దాని గురించి మాట్లాడుకోవటమే మానేసారు. "మార్క్స్ చాలా కాలంగా ఇక్కడే స్థిరపడ్డాడు గాని జనానికి అతడి గురించి ఎక్కువగా తెలియదు. తెలిసిన వాళ్ళు కూడా అతణ్ణి తిట్టడానికి చూపిన ఉత్సాహం, ఆయన పుస్తకం చదవటానికి ప్రదర్శించరు" అన్నాడు సర్ జాన్ మెక్‌డొనాల్డ్. 1875 నాటి ఫోర్ట్‌నైట్లీ రివ్యూలో "మట్టిబుర్రలు" గా ఉండటం బ్రిటిష్ వాళ్ళ జన్మహక్కు" అన్నాడు మార్క్స్. అది సత్యదూరం కాదేమో! మార్క్స్ జీవితకాలంలో దాస్‌కాపిటల్ ఇంగ్లిషు అనువాదం ప్రచురించబడలేదు. మాక్మిలన్ అండ్ కంపెనీ (ప్రచురణ సంస్థ) వాళ్ళు "దాస్‌కాపిటల్ అనువాదం ఇంగ్లిషులో తేవటానికి మేం సిద్ధంగా లేము" అని ఎంగెల్స్ కోరికను తిరస్కరించారు. ఎలాగైనా చదవాలనుకున్న బ్రిటిష్ పాఠకులు జర్మన్, రష్యన్, ఫ్రెంచి ప్రచురణల మీద ఆధారపడక తప్పలేదు. ఒక రాడికల్ ఇంగ్లిష్ జర్నలిస్ట్ పీటర్‌ఫాక్స్ జర్మన్ దాస్‌కాపిటల్ ను బహుమతిగా స్వీకరించి, "ఇదో తెల్ల ఏనుగు. ఏం చేసుకోను?" అన్నాడు.

"ఇక ఇవి ఇంగ్లిషులోకి అనువాదమయ్యే అవకాశమే లేదా? శ్రామికుల కోసం రాసిన పుస్తకాన్ని ఇంగ్లిషు వాళ్ళు చదవకూడదా? మావంటి యువ సోషలిస్టులు చదివే పుస్తకాలన్నీ పెట్టుబడి విధానానికి అనుకూలమైనవే. బహుశా, దాస్‌కాపిటల్ ఈ దేశంలో ప్రచురించబడక పోవడానికి ఇదో కారణం అయి ఉంటుంది. సోషలిస్టు దృష్టి కోణం నుండి రాయబడిన ఈ పుస్తకం మాకు అందుబాటులోకి వస్తే ఈ దేశంలో పెట్టుబడిదారీ విధానానికి సమాధి కట్టటానికి పని ప్రారంభమవుతుంది" అని మార్క్స్ తో తన ఆవేదనను, ఆగ్రహాన్ని పంచుకున్నాడు రాబర్ట్ బానర్ అనబడే స్కాట్స్‌మాన్ (కార్మికుడు)

ఎవరికి అత్యవసరమో వాళ్ళు ఈ పుస్తకాన్ని చదవలేరు. అర్థం చేసుకోలేరు. విద్యావంతులు, పండితులు దీన్ని చదవగలరు కాని వాళ్ళకు దీని అవసరం లేదు.

"ఇటీవల మనం ముఖ్యంగా ఇంగ్లండులో (ఎవరికీ గాయాలు

కాకుండా) యుద్ధం చేసినట్టు నటించటం అలవాటు చేసుకున్నాం. కాని మార్క్స్ తన పుస్తకంలో ప్రత్యర్థుల్ని చీల్చి చెండాడాడు. సహజంగానే ఈయన మర్యాదస్తులకు సింహస్వప్నమైనాడు. పెట్టుబడిని, పెట్టుబడిదారీ వ్యవస్థనూ ఇంత ఘాటుగా అభిశంసించిన వాడు మరొకడు లేడు" అన్నాడు ఇంగ్లిష్ సోషలిస్ట్ హెన్రీ హిండ్‌మాన్.

ఇతర సోషలిస్టుల వంటి వాడు కాదు హిండ్‌మాన్. పుస్తకం ఫ్రెంచ్ అనువాదం చదివి రచయితను పొగడ్తలలో ముంచెత్తాడు. మార్క్స్ ఆయనకు ఆతిథ్యమివ్వక తప్పలేదు. అయితే, సమావేశం జరిగినప్పుడు "నేర్చుకోవటానికి వచ్చా" నన్న హిండ్‌మాన్ కేవలం తను మాత్రమే నాన్‌స్టాప్‌గా మాట్లాడాడు. ఆ తర్వాత, "ఈ వాగుడుకాయ, వదరుబోతు" వస్తున్నాడంటేనే హడలిపోయాడు మార్క్స్. చివరికి 1881లో హిండ్‌మాన్ నిజస్వరూపం బయటపడింది. తను ప్రచురించిన సోషలిస్ట్ మేనిఫెస్టో "ఇంగ్లండ్ ఫర్ ఆల్" లో మార్క్స్ పేరును ఉదహరించకుండా, ఆయన అనుమతి లేకుండా దాస్‌కాపిటల్ లోని రెండు అధ్యాయాలను కాపీ కొట్టాక, ముందుమాటలో "నా పుస్తకంలోని రెండు మూడు అధ్యాయాలలో ఒక గొప్ప రచయిత అభిప్రాయాలను పొందుపర్చాను. ఆయన రచనలు త్వరలోనే నా దేశ ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నాను" అని మాత్రం రాసాడు. ముఖ్యంగా దాస్‌కాపిటల్ పేరైనా ఉటంకించకపోవడం మార్క్స్‌కు బాగా కోపం తెప్పించింది. తన పేరు దాచిపెట్టి గ్రంథ చౌర్యం చేస్తాడా! "ఇంగ్లిష్ వాళ్ళకు సోషలిజమంటే గిట్టదు. విదేశీ రచయితల నుండి నేర్చుకోవటానికి ఇష్టపడరు" అని తనను తాను సమర్థించుకున్నాడు హిండ్‌మాన్. కాని తన మేనిఫెస్టో 86వ పేజీలో సోషలిస్టు స్వప్నం గురించి ప్రస్తావించాడాయన. అది చదివిన పాఠకులు విదేశీ రచయిత ఎవరో తెలుసుకోలేరా? ఇవన్నీ కుంటి సాకులు. అతడు చేసింది దొంగతనం. పైగా తప్పుగా ఉదహరించాడు. కనీసం వాక్యాలు యథాతథంగా కాపీ కొట్టనైనా లేదు.

అలా మార్క్స్‌కు ఇంగ్లీషు శిష్యులు ఒక్కొక్కరే దూరమయ్యారు. ఇక, ఎవరితోనూ, ఎలాంటి పరిచయాలూ పెట్టుకోకూడదనుకున్నాడు. ఒక రాడికల్ ఎర్నెస్ట్ బెల్‌ఫోర్ట్ బాక్స్ 1879లో మేధావుల కోసం మాడర్న్ థాట్ అనబడే మాస పత్రిక ప్రారంభించి, సమకాలీన తత్వవేత్తలు, మహానుభావుల గురించి వ్యాసాలు ప్రచురించాడు. ఆ క్రమంలో షోపెన్‌హవర్, వాగ్నర్ వగైరాల తర్వాత 1881లో కార్ల్‌మార్క్స్ గురించి కూడా రాసాడు. హెగెల్ తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసిన బాక్స్, గతితార్కికత గురించి మంచి అవగాహన ఏర్పరచుకున్నాడు. "ఖగోళ శాస్త్రంలో కోపర్నికస్ ఆవిష్కరణలు, మెకానిక్స్‌లో గురుత్వాకర్షణ సిద్ధాంతం వంటిది దాస్‌కాపిటల్" అని తన వ్యాసంలో పేర్కొన్నాడు. మార్క్స్ సంతోషించి "ఈ తరం మేధావులు కొత్త ఆలోచనల్ని స్వాగతిస్తున్నారు" అన్నాడు.

ఎన్ని లోపాలున్నా, బ్రిటన్‌లో మార్క్సిజంను ప్రచారం చెయ్యటానికి అందరి కన్నా ఎక్కువ కృషి చేసాడు హిండ్‌మాన్. చివరిదాకా మార్క్స్ శిష్యుణ్ణనే చెప్పుకున్నాడు. తన ఉపాన్యాసాల్లో, వ్యాసాల్లో మార్క్స్‌నే విరివిగా ఉదహరించాడు. 1883లో ప్రచురించిన తన 'హిస్టారికల్ బేసిక్స్ ఆఫ్ సోషలిజం' లో తనవి మార్క్సిస్టు అభిప్రాయాలే అని అంగీకరించాడు. సోషల్ డెమోక్రాటిక్ ఫెడరేషన్ పేరుతో ఒక మార్క్సిస్టు రాజకీయ పార్టీని స్థాపించాడు. బాక్స్, విలియం మాలిస్, వాల్టర్ క్రేన్, మార్క్స్ కూతురు ఎలినార్, ఆమె సహచరుడు ఎడ్వర్డ్ ఆవెలింగ్‌లు అందులో సభ్యులు. ఫెడరేషన్ సమావేశాల్లో దాస్‌కాపిటల్ గురించి ఎక్కువగా మాట్లాడడం వల్ల 1883లో యువ రచయిత జార్జి బెర్నార్డ్‌షా బ్రిటిష్ మ్యూజియం రీడింగ్ రూంలో కూర్చుని దాస్‌కాపిటల్ ఫ్రెంచి అనువాదం క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. ఆ తర్వాత "మార్క్స్‌ను చదవటం నా జీవితాన్ని మలుపు తిప్పింది. కళ్ళ ముందు ఒక కొత్త సత్యం ఆవిష్కృతమైంది. చరిత్ర, సంస్కృతి గురించి నా కళ్ళు తెరిపించాడు మార్క్స్. నా జీవిత లక్ష్యాన్ని నిర్దేశించాడు" అని రాసుకున్నాడు. "ఒక పుస్తకం సాధించగలిగిన అంతిమ లక్ష్యాన్ని సాధించింది దాస్‌కాపిటల్. దాన్ని చదివిన వాళ్ళ జీవితాలను సమూలంగా మార్చివేసింది" అన్నాడు.

తర్వాతి రోజుల్లో కూడా షాకు అదే అత్యంత ఇష్టమైన గ్రంథం. అరవై ఏళ్ళ తర్వాత రాసిన 'ఎవ్రిబడీస్ పొలిటికల్ వాట్ ఈజ్ వాట్' లో తొలి పేజీలోనే ఇలా రాసాడు.

"పందొమ్మిదవ శతాబ్దంలో, దుమ్ముకొట్టుకుపోయిన మన ఫాక్టరీ ఇన్స్పెక్టర్ల రిపోర్టు (బ్లూబుక్స్) ల్లో దాసిన వికృత వాస్తవికతను పెట్టుబడిదారీ అమానుషత్వాన్ని మార్క్స్ మనకు చూపించే దాకా మన నిరాశావాదం, వ్యవస్థ పట్ల అపనమ్మకం మనలో ఇంత అలజడి, అశాంతి రేకెత్తించలేదు. 'అదనపు విలువ' కోసం పెట్టుబడిదారీ విధానం ఎంతటి నేరం చెయ్యటానికీ వెనుకాడదు. ఈ వ్యవస్థకు దయ, జాలి, కరుణ అంటే ఏమిటో తెలియవు. భ్రూణ హత్యల నుండి, సామూహిక హత్యాకాండల దాకా ఏదైనా చెయ్యగలరు. తెల్లనల్ల బానిస విధానం ఏదైనా దానికి నిషిద్ధం కాదు. ఒక షిల్లింగ్ శాతం లాభం పెరుగుతుందంటే ఎంతకైనా తెగిస్తుంది. లాభాల మూటల్లోంచి చిల్లర నాణాలు వెదజల్లి తన దాతృత్వాన్ని ప్రదర్శిస్తుంది. మార్క్స్ ముందర కూడా ఈ విషయాలను గురించిన ప్రస్తావనలున్నాయి. బైబిల్ (ఎక్లెజియాస్టిస్) లలో, షేక్స్‌పియర్ కింగ్‌లియర్, టిమన్ ఆఫ్ ఏథెన్స్, కోరియాలానస్‌లలో దురాశ గురించీ, దుష్టుల గురించీ రాసారు. కాని మార్క్స్ అధికారిక సమాచారంతో వీటిని నిరూపించాడు. ఈ వ్యవస్థ మారాలి. మరో ప్రపంచం రావాలి అనే నినాదం కమ్యూనిజం, సోషలిజం స్వప్నాలకు ప్రేరణ. చివరికి ఇప్పుడు 1841లో కన్సర్వేటివ్‌లు, చర్చి అధికార్లు కూడా ఇదే మంత్రం జపిస్తున్నారు"

అయితే ఫేబియన్ సొసైటీలో తన సహచరులకు ఈ అభిప్రాయాలు చేరవేయ లేకపోయాడు షా. (1884లో ఫేబియన్ సొసైటీలో చేరాడు షా) తన మిత్రుడు ఎచ్.జి.వెల్స్‌కు మార్క్స్ ఏ మాత్రం నచ్చలేదు. ఆ సొసైటీ సిద్ధాంతకర్త సిడ్నీవెబ్, వర్గ పోరాటం, విప్లవం బదులు సార్వత్రిక ఓటు హక్కు సోషలిస్టుల లక్ష్యమన్నాడు. ఆర్థిక వ్యవస్థ, కార్మిక సంక్షేమానికి పని చెయ్యాలని కూడా

(మిగతా 57వ పేజీలో...)

ప్రస్తుతం మా వద్ద అందుబాటులో ఉన్న విరసం, ఇతర ప్రచురణలు, వాటి ధరలు

కథ, నవల, కవిత్వం, సాహిత్య విమర్శ

1.	కొడవటిగంటి కుటుంబరావు - 7 (నవలలు)	250-00
2.	కొడవటిగంటి కుటుంబరావు - 8 (నవలలు)	250-00
3.	కొడవటిగంటి కుటుంబరావు - 9 (నవలలు, కథలు నాటికలు)	250-00
4.	కొడవటిగంటి కుటుంబరావు - 11 (చరిత్ర వ్యాసాలు)	150-00
5.	కొడవటిగంటి కుటుంబరావు - 12 (రాజకీయ వ్యాసాలు)	400-00
6.	కొడవటిగంటి కుటుంబరావు - 13 (సంస్కృతి వ్యాసాలు)	300-00
7.	కొడవటిగంటి కుటుంబరావు - 14 (సినిమా వ్యాసాలు-1)	300-00
8.	కొడవటిగంటి కుటుంబరావు - 15 (సినిమా వ్యాసాలు-2)	250-00
9.	కొడవటిగంటి కుటుంబరావు - 16 ఎ (సాహిత్య వ్యాసాలు-1)	300-00
10.	కొడవటిగంటి కుటుంబరావు - 16 బి (సాహిత్య వ్యాసాలు-2)	300-00
11.	కొడవటిగంటి కుటుంబరావు - 17 (తాత్విక వ్యాసాలు)	150-00
12.	కొడవటిగంటి కుటుంబరావు - 18 (లేఖలు)	125-00
13.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మొదటి భాగం)	300-00
14.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (రెండవ భాగం)	250-00
15.	కె.వి.ఆర్. సాహిత్య వ్యాసాలు (మూడవ భాగం)	250-00
16.	కె.వి.ఆర్. సామాజిక వ్యాసాలు (నాల్గవ భాగం)	300-00
17.	కె.వి.ఆర్. మహోదయం	200-00
18.	వసంతగీతం (అల్లం రాజయ్య)	250-00
19.	కొమురం భీం (అల్లం రాజయ్య)	150-00
20.	సృష్టికర్తలు (అల్లం రాజయ్య)	150-00
21.	సాహిత్య సమాలోచన (కృష్ణాబాయి)	300-00
22.	భావవిప్లవకారుడు కొకు	80-00
23.	కొకు సమకాలీనత - విశ్లేషణా వ్యాసాలు	50-00
24.	అక్షరతుణీరం (కె.వి.ఆర్. సాహిత్య విమర్శ వ్యాసాలు)	20-00
25.	సుబ్బారావు పాణిగ్రాహి కవిత్వం, పాటలు	25-00
26.	అంతస్స్రోతం (వరవరరావు కవిత్వం)	40-00
27.	బీజభూమి (వరవరరావు కవిత్వం)	100-00
28.	గుమ్మెటమోత (పాణి నవల)	100-00
29.	కలిసి పాడాల్సిన గీతమొక్కటే (పాణి కవిత్వం)	10-00
30.	చలసాని ప్రసాద్ రచనలు	100-00
31.	దండకారణ్య కథలు (2005-2012)	125-00
32.	తెలుగు భాష - కొన్ని సంగతులు (వి.చెంచయ్య)	15-00
33.	సామాజికం (వి. చెంచయ్య)	30-00
34.	సాహిత్యధోరణులు - విప్లవ దృక్పథం	30-00
35.	కథల పంట-3	120-00
36.	కదిలే కథ	80-00
37.	తీత్వాల్ కుక్క మరికొన్ని కథలు (సాదత్ హసన్ మంటో)	60-00
38.	జాజిపూల పరిమళం (షహీదా కథలు)	150-00
39.	ఒక మాట, ఒక సంభాషణ (షహీదా కవిత్వం)	75-00
40.	సామాన్యుల సాహసం (నిత్య, మైనా, సుజాత కథలు)	60-00
41.	ఫాల్గుణ (పద్మకుమారి నవలిక)	30-00
42.	లాల్‌బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం (ఎన్కె దీర్ఘ కవిత)	25-00
43.	తెహెల్కా అద్దంలో సర్కారు బింబం మరికొంత కవిత్వం (బాసిత్)	100-00
44.	ఆఖరి బిడ్డ (బాసిత్ నాటిక)	10-00
45.	కిటికీ పిట్ట (పి. మోహన్ కవిత్వం)	10-00
46.	మంజీరా మూడ్స్ (మంజీరా కవిత్వం)	25-00
47.	కవితా ఝుంకార్ (విరసం కవితా సంకలనం)	75-00
48.	ఎర్రనక్షత్రం (చైనా నవల)	50-00
49.	నెగడు (కథలు) (నల్లూరి రుక్మిణి)	90-00
50.	పరామర్శ (నల్లూరి రుక్మిణి)	80-00
51.	ఒంట్రిమట్టి (నవల)	170-00
52.	Wake of Telangana? - A docu-drama by Basith	10-00
53.	యంత్రాల మధ్య	35-00
54.	అక్షర కిరణం (కె.వి.ఆర్.)	50-00
55.	డావిన్సి (మోహన్)	150-00
56.	మార్క్సిస్టు సాహిత్య విమర్శ (డా. శ్రీనివాస్)	100-00
57.	అగ్నిశిఖ	80-00
58.	కార్మిక వర్గ పుత్రుడు	70-00
59.	బలహీనుడి బలం	25-00
60.	పాలమూరు వలస బతుకు చిత్రాలు - గీతాంజలి	150-00
61.	ఏది నేరం?! (హజారీబాగ్ జైలు గాథలు) - బి. అనూరాధ	75-00
62.	వెలుగు రవ్వల జడి (ఆలూరి భుజంగరావు)	70-00
63.	అరణ్య పర్వం (ఆలూరి భుజంగరావు)	120-00
64.	ప్రజలు అజేయులు (ఆలూరి భుజంగరావు)	25-00
65.	నైనా (ఆలూరి భుజంగరావు)	50-00
66.	గమ్యం దిశగా గమనం (ఆలూరి భుజంగరావు)	30-00
67.	దిక్కు మొక్కు లేని జనం (ఆలూరి భుజంగరావు)	30-00
68.	సాహిత్య వ్యాసాలు (చలసాని ప్రసాద్)	100-00
69.	కలం యోధుడు చెరబండరాజు (వి. చెంచయ్య)	20-00
70.	ఫాలింగ్ (నల్లూరి రిక్మిణి కథ)	20-00
71.	దండకారణ్య కథలు (2013-2015)	70-00
72.	లొంగిన ప్రతిసారీ (కిరణ్ కవిత్వం)	50-00
73.	చిగురించే పాదం (మేడక యుగంధరరావు కవిత్వం)	40-00
74.	అమర శ్రుతి (వరంగల్ యూనిట్ కవిత్వం)	25-00
75.	మందిపాట ఒరవడిలో (సిటీయూనిట్ కవిత్వం)	40-00
76.	కాశీం కవిత్వం	140-00
77.	తెలంగాణ సాహిత్య వ్యాసాలు (కాశీం)	140-00
78.	కవిత్వంతో ముఖాముఖి (ఎన్.వేణుగోపాల్)	120-00
79.	వెలివాడె తొలిపొద్దై	70-00
80.	విప్లవ స్వాప్నికుడు కా. రవూఫ్	50-00
81.	దండకారణ్య కథలు (2013-2015)	70-00
82.	నల్లమల (పి.చంద్)	225-00

83. అబూజ్‌మడ్ (పాణి) 50-00
84. మేమున్నాం (పాలమూరు అధ్యయన వేదిక) 60-00
85. నదీ బాల్యం (రివేరా) 30-00
86. ఏప్రిల్ పండు (రివేరా) 30-00
87. పిల్లనగ్రోవి తుఫాన్ (డి. ఉదయభాను) 20-00
88. ఒక ఆకుపచ్చని కల (కెనరి) 40-00
89. లక్ష్మింపేట (విరసం) 25-00
90. వివేచన (వి. చెంచయ్య) 50-00
91. సుబ్బారావు పాణిగ్రాహి (విరసం) 25-00
92. కలిసి పాడాల్సి గీతం ఒక్కటే (పినాకపాణి) 10-00
93. అవ్వచెప్పిన తొవ్వ (శాఖమూరి రవి) 10-00
94. పోస్టుమార్టం రిపోర్టు (వడ్డెబోయిన శ్రీనివాస్) 10-00
95. విప్లవ సాహిత్య విమర్శ (విరసం) 25-00
96. ఎదురగ్గి (నవల) కనుంపల్లి రాజారాం 100-00
97. ముడిమనిషి (అరుణతార కథలు 1) 30-00
98. చేపలు (అరుణతార కథలు 2) 30-00
99. కథ అడ్డం తిరిగింది (అరుణతార కథలు 3) 30-00
100. కో...బలి (అరుణతార కథలు 4) 30-00
101. అడవిలోని వెన్నెల (అరుణతార కథలు 5) 30-00
102. నెలవు (అరుణతార కథలు 6) 30-00
103. ఒక వీరుడు మరణిస్తే (అరుణతార కథలు 7) 30-00
104. బదిలీ (అరుణతార కథలు 8) 30-00
105. అరణ్య పర్వం (అరుణతార కథలు 9) 30-00
106. పద్మ (అరుణతార కథలు 10) 30-00
107. విప్లవంలో మాతృత్వం (అరుణతార కథలు 11) 30-00
108. కొండపందికొక్కు (అరుణతార కథలు 12) 30-00
109. ఓడిపోయిన కథలు (అరుణతార కథలు 13) 30-00
110. దాడి (అరుణతార కథలు 14) 30-00
111. తుఫాను (అరుణతార కథలు 15) 30-00
112. కొండవాగు (అరుణతార కథలు 16) 30-00

సంస్కృతి, చరిత్ర, రాజకీయార్థిక, సైద్ధాంతిక రచనలు

1. సామ్రాజ్యవాద సంస్కృతి (జేమ్స్ పెట్రాస్ వ్యాసాలు) 125-00
2. మావో రచనలు - 1 220-00
3. మావో రచనలు - 2 220-00
4. రివిజనిజం (మావో) 75-00
5. మార్క్సిజం, లెనినిజం, మావోయిజం 170-00
6. మార్క్సిస్టు తత్వశాస్త్రం 80-00
7. చారుమజుందార్ 8 డాక్యుమెంట్లు 50-00
8. మంద్రస్థాయి యుద్ధం 100-00
9. విద్యార్థి యువజనోద్యమాలు (లెనిన్) 30-00
10. రాజకీయ కృషి - మన కృషి అంతటికీ జీవనాడి (చైనా విప్లవోద్యమన పత్రిక హాంకీ వ్యాసాలు) 35-00
11. నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర) 180-00
12. జగిత్యాల జంగల్‌మహల్ (1) 75-00
13. జగిత్యాల జంగల్‌మహల్ (2) 100-00
14. స్టోలిపిన్ అభివృద్ధి నిరోధక కాలంలో 15-00
15. అంతర్జాతీయ విప్లవోద్యమాల్లోని ఆటుపోట్లు 60-00
16. భారతదేశంలో ఉత్పత్తి విధానం - ఉత్పత్తి సంబంధాలు 20-00
17. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయోత్పత్తి సంబంధాలు 30-00
18. నేటి రాయలసీమ 100-00
19. గతాన్ని సమీక్షించుకుందాం 50-00
20. చూటే ఏరిన రచనలు 125-00
21. మావో సే టుంగ్ 80-00
22. గెరిల్లా యుద్ధం 60-00
23. చైనా ప్రజా విముక్తి సైన్యం 40-00
24. భూమి సంస్కృతి నాగరికత 15-00
25. స్త్రీవాద ఉద్యమం (అనురాధ గాంధీ) 25-00
26. కొత్త చూపు (ఆర్.ఎస్. రావు) 120-00
27. అభివృద్ధిని ఇలా చూద్దాం (ముదునూరి భారతి) 80-00
28. In Search of Method (Mudunuri Bharati) 200-00
29. On Education (Mudunuri Bharati) 180-00
30. Crisis and Development in Marxian Frame Work (Mudunuri Bharati) 80-00
31. Individual, Sub-Groups, Groups and Freedom (Mudunuri Bharati) 75-00
32. Methodology of Social Enquiry (Mudunuri Bharati) 150-00
33 Fifty Years of Andhra Pradesh 1956-2006 300-00
34. జనతన సర్కార్ కావాలి మేక్ ఇన్ ఇండియా కాదు 15-00
35. విద్యార్థి ఉద్యమాల్లో విప్లవ దిద్దుబాటు 30-00
36. జాతుల సమస్య రిజర్వేషన్లు కార్మిక వర్గ దృక్పథం 25-00
37. తత్వశాస్త్రం మాయాజాలం కాదు 20-00
38. వైరుధ్యాలు 20-00
39. చైనా తాత్విక రంగాన మూడు ప్రధాన పోరాటాలు 1949-64 20-00
40. జనాతన రాజ్యం (పాణి) 300-00
41. మార్క్సిస్టు మహోపాధ్యాయుల జీవన రేఖలు 20-00
42. దండకారణ్య సాంస్కృతికోద్యమ చరిత్ర (పునర్ముద్రణ) 100-00
43. సీమ గొంతుక వినండి (అరుణ్ వ్యాసాలు) 70-00
44. ఈలం విముక్తి పోరులో మహిళలు 50-00
45. సామ్రాజ్యవాద దోపిడి మండలాలు (రత్నమాల) 50-00
46. డిటెన్యూ డైరీ (కె.వి.ఆర్.) 170-00
47. సమగ్ర తెలంగాణ (సంపాదకులు - ఎన్. వేణుగోపాల్) 295-00
48. విప్లవ పథంలో వరంగల్ విద్యార్థి ఉద్యమం (విరసం) 40-00
49. వామపక్ష కమ్యూనిజం-ఒక బాలారిష్టం (ఎన్.వి.ఎస్. నాగభూషణ్) 30-00
50. ఐక్య సంఘటన (దిక్సూచి) 35-00
51. బాలగోపాల్ తాత్విక గందరగోళం (సమీర్) 50-00

వర్తమాన సమాజం, ప్రజా ఉద్యమాలు

1. ముజఫర్‌నగర్ మరో మానని గాయం 20-00
2. ఆకాస ఉద్యమ అమరులు 10-00
3. దండకారణ్యంలో గ్రీన్‌హంట్ 60-00
4. ఉద్యమ ఆకాశంలో సగం 15-00
5. తూర్పు మధ్య భారతంలో విస్థాపన-ప్రజా ప్రతిఘటన 20-00
6. జనతన జైత్రయాత్ర 20-00
7. ఫిలిప్పినో ఉద్యమం 15-00
8. ఖైదీల సైరన్ 60-00
9. విముక్తిబాటలో నారాయణపట్నా 50-00
10. అంతర్యుద్ధంలో ఆదివాసులు 30-00
11. నిత్య జీవితంలో సోషలిజం (భూసారం శివన్న) 100-00
12. ఆకుల భూమయ్య రచనలు 40-00
13. అమలు కానీ హామీల చరిత్ర (శశికళ) 100-00
14. ది ఫ్లేమ్స్ ఆఫ్ నారాయణ పట్నా 60-00
15. దాక్షిణ్య వాదం నుంచి దండకారణ్యం దాకా (రత్నమాల) 200-00
16. నూతన సంభాషణ (రత్నమాల) 80-00
17. జర్నలిజం ప్రొఫెషన్ (రత్నమాల) 50-00
18. సాహిత్య ధోరణులు విప్లవ ధోరణులు 30-00
19. ప్రాణహిత (అల్లం నారాయణ) 150-00
20. గ్రీన్‌హంట్ ఉత్పాదాలు (విరసం) 25-00
21. ఆకాసంలో సగం పా. సగం మహిళ విముక్తి (విరసం) 35-00
22. లాంగ్ మార్చ్ (తెలంగాణ జర్నలిస్టులు) 100-00
23. పచ్చని బతుకులపై నిప్పులు కురుస్తున్న రాజ్యం (బిడి దమయంతి)15-00
24. కృష్ణానది నీళ్ళు (ఎం. రాఘవచారి) 20-00
25. మండుతున్న గాయాలు (బిడి దమయంతి) 40-00
26. సముద్రంలో సంభాషణ (పి. వరలక్ష్మి) 20-00

స్మృతి సాహిత్యం

1. ఖాన్‌దాదా (ఎం.టి.ఖాన్ స్మృతి) 10-00
2. ఆదర్శజీవులు అమరులు 30-00
3. గంటి ప్రసాదం రచనలు 25-00
4. సూర్యుడు మరణించడు 60-00
5. చిరునవ్వు సితార 80-00
6. గెరిల్లా డైరీ 10-00
7. మన్యం వెలుగులు 15-00
8. అక్షర కిరణం 20-00
9. అడవి పుత్రుడు మంగన్న 10-00
10. గజ్జెల సరోజ 15-00
11. మహిత 10-00
12. కోటి జ్ఞాపకాలు 50-00
13. అమరుల యాదిలో 50-00
14. అమరుల జీవిత చరిత్ర 30-00
15. వెగుచుక్కల వెలుతురులో 10-00
16. లంకపల్లి అమరులకు విప్లవ జోహార్లు 10-00
17. శారద స్మృతి శకలాలు 30-00
18. దండకారణ్యంలో చలసాని ప్రసాద్ 10-00
19. సాహసయోధురాలు (గజ్జెల సరోజ రచనలు) 40-00
20. అమరుడు కామ్రేడ్ సంజయ్ 10-00
21. రైజింగ్ సన్ (సూర్యం స్మృతి) 20-00
22. అజ్ఞాత విప్లవ యోధుడు కొండన్న (దిక్సూచి) 50-00
23. పువ్వర్తి అమరులు (దిక్సూచి) 20-00
24. చిరునవ్వు సితార (విరసం) 70-00
25. కా॥ సహస గెరిల్లా యోధుడు మాసా (దిక్సూచి) 50-00
26. కె. దాసారావు కనకచారి (దిక్సూచి) 10-00

డివిడిలు

1. అరుణతార సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక (1977-2013) 125-00

మా ప్రచురణలు లభించే పుస్తక కేంద్రాలు :

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్‌లోనూ లభిస్తాయి. ఫోన్ : 040-24652387

నవ తెలంగాణ, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాదు-500020. ఫోన్ : 040-27608107, 9490099373

అనేక బుక్ స్టాల్, 30-5-26/1, కోకా చలపతిరావు స్ట్రీట్, ఏలూరు రోడ్, విజయవాడ-520002. ఫోన్ : 8977493465

మరిన్ని వివరాలకు సంప్రదించండి : డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార ఎడిటర్,
ఫోన్ : 99891 89250 (ఉదయం 9 లోపు సాయంత్రం 8 తరువాత మాత్రమే)
ఈమెయిల్ : arunatara1977@gmail.com
పుస్తకాల ధరకు సరిపడా డబ్బులతో పాటు, పోస్టింగ్ ఖర్చులను జతచేసి
ఎం.ఓ. లేక డిడి ద్వారా పంపి పుస్తకాలను పొందవచ్చు.
ఆన్‌లైన్‌లో డి.వి.రామక్రిష్ణారావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లాలాగూడ బ్రాంచ్, హైదరాబాద్,
ఎకౌంట్ నెం. 10243583773, ఐఎఫ్ఎస్‌సి కోడ్ : ఎస్.బి.ఐ.ఎన్.0007112కి చెల్లించి పుస్తకాలను పొందవచ్చు.

-: స్వీకారం :-



కృష్ణానదినీళ్ళు
మహబూబ్‌నగర్ విషాదగాథ
"పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మెలికలు, సవాళ్ళు"

ఎం. రాఘవాచారి

ప్రచురణ :
పాలమూరు అధ్యయన వేదిక

వెల : రు. 20/-

పేజీలు : 56



గ్రీన్‌హంట్ ఆపరేషన్
(ప్రజలపై యుద్ధం)

వికల్ప్

ప్రచురణ :
శ్రామికవర్గ ప్రచురణలు

పేజీలు : 32



ఆరిద్ర పువ్వు
వీరాస్వామి రచనలు

ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం

వెల : రు. 70/-

పేజీలు : 160

Feminizing the Labour Relations

M. Vanamala

Publisher
LG Publisher
Distrubutors

Rs. 595

Pages : 208



తెలంగాణార్థం
రెండేళ్ల తెలంగాణ పరిణామాలు

ఎన్. వేణుగోపాల్

ప్రచురణ :
స్వేచ్ఛా సాహితి

వెల : రు. 150/-

పేజీలు : 286



డాక్టర్ కేశవరెడ్డి...
(ఓ జర్నలిస్టు డైరీ)

యాటకర్ల మల్లేష్

ప్రచురణ :
ఉదయ్ పబ్లికేషన్స్

వెల : రు. 50/-

పేజీలు : 72



పండు వెన్నెల
నవతరంతో యువతరం

సంపాదకులు:
మల్లీశ్వరి, కె.పద్మ, నిశాంత్

ప్రచురణ :
సంస్కృతి పబ్లికేషన్స్

వెల : రు. 100/-

పేజీలు : 89



గవాయి
(తెలంగాణ సామాజిక, రాజకీయ వ్యాసాలు)

అపునూరి సమ్మయ్య

ప్రచురణ :
జనసాహితి,
హుజూరాబాద్

వెల : రు. 225/-

పేజీలు : 308



చార్వాకుడు

రామకృష్ణ

ప్రచురణ :
చార్వాకాశ్రమ,
నిడమర్రు

వెల : రు. 50/-

పేజీలు : 96



శ్రావణ మేఘాలు
కవితా సంపుటి

రంగు గోవర్ధన్

ప్రచురణ :
రంగు ప్రచురణలు

వెల : రు. 100/-

పేజీలు : 104



దీపకూటమి

అనంతు

ప్రచురణ :
ప్రేమలేఖ

వెల : రు. 200/-

పేజీలు : 96



నది పలికిన వాక్యం
కవిత్వం

విలాసాగరం రవీందర్

ప్రచురణ :
సాహితీ సోపతి

వెల : రు. 100/-

పేజీలు : 146



తుఫాను
అరుణతార కథలు
(1991-92)
సంకలనం - 15

ప్రచురణ :
చరిత

వెల : రు. 30/-

పేజీలు : 96



కొండవాగు
అరుణతార కథలు
(1992-93)
సంకలనం - 16

ప్రచురణ :
చరిత

వెల : రు. 30/-

పేజీలు : 96



విప్లవోద్యమ నిర్మాణ సమస్యలు
కా. డి.వి. రచనలు - 11

కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు

ప్రచురణ :
పోరునేల ప్రచురణలు

వెల : రు. 200/-

పేజీలు : 423

KLVA101M189

ARUNATARA RNI Regn.No.21152/72 Published on 25/7/2016 July, 2016 Vol. : 44 Issue : 6 Hyderabad

A Literary and Cultural Telugu Monthly Journal of Viplava Rachayitala Sangham (VIRASAM - Revolutionary Writers' Association)

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గం మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది, విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్టుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జిలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

డి.వి. రామక్రిష్ణారావు, అరుణతార సంపాదకుడు
పి. వరలక్ష్మి, విరసం కార్యదర్శి
వరవరరావు, టి. కృష్ణాబాయి, సిఎస్ఆర్ ప్రసాద్, జి. కళ్యాణరావు, వి. చెంచయ్య,
అల్లం రాజయ్య, ఎం. రత్నమాల, సి. కాశీం, పాణి

విరాళాలు ఆన్‌లైన్‌లో పంపడానికి వివరాలు :
డి.వి. రామక్రిష్ణారావు, అకౌంట్ నెం. 10243583773, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బి.ఐ.)
ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ నెం. ఎస్.బి.ఐ.ఎన్.0007112, లాలాగుడ, సికింద్రాబాద్.
ఎం.ఓ.లు, డ్రాఫ్టులు, చెక్‌లు డి.వి. రామక్రిష్ణారావు పేరిట ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా, మౌలాలి, హైదరాబాద్ - 500 040 చిరునామాకు పంపగలరు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DUVVURI VENKATA RAMAKRISHNA RAO, PRINTED AT CHARITA IMPRESSIONS, DOOR NO: 1-9-1126/B, AZAMABAD, HYDERABAD – 500020, TELANGANA STATE, PUBLISHED AT 12-15-963, MANIKESWARNAGAR, OSMANIA UNIVERSITY CAMPUS, TARANAKA, HYDERABAD – 500007, TELANGANA STATE, EDITOR: DUVVURI VENKATA RAMAKRISHNA RAO.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M189
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Reezma
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Naveeda
పరీక్ష చేసినది	sireesha
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
సంస్థ	